
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+4 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 201



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





తెలుగు తెరపై ఎందరో నటీమణులు తమదైన ముద్ర వేశారు. అటువంటి వారిలో **ఇంద్రజ** ఒకరు. యమలీల మూవీతో ఎంట్రీ ఇచ్చి తనదైన నటనతో ఆకట్టుకున్నారు. తెలుగుతోపాటు తమిళ, కన్నడ, మలయాళ సినిమాల్లో నటించి ప్రేక్షకలోకానికి మంచి వినోదాన్ని పంచారు. పెళ్లయ్యాక కొంత విరామం తీసుకుని ఇప్పుడు రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టారు. టీవీ షోస్‌తోపాటు సపోర్టింగ్ కేరక్టర్లు చేస్తూ తనదైన శైలిలో దూసుకు పోతున్నారు. అచ్చం తెలుగింటి ఆడపడుచులా కట్టూబొట్టుతో ఆకట్టుకునే ఇంద్రజ టాలీవుడ్‌లో ఎవరితోనూ షేర్ చేసుకోని అంశాలను **సాక్షి @ నవశక్తి**లో పంచుకున్నారు. విజయదశమి సందర్భంగా ఈ ప్రత్యేక ఇంటర్వ్యూని చివరి ఎపిసోడ్‌లో చూసేద్దాం. https://youtu.be/k_PX5qEAX2U

ఇంద్రజ ఇంటర్వ్యూ హైలైట్స్

- జీవితం దేవుడి స్క్రిప్టే అయినా... కొన్ని ఛాయిసెస్ మాత్రం ఉంటాయి. వాటిని ఎలా సద్వినియోగం చేసుకున్నామనేదే ముఖ్యం.
- నిజమైన భక్తుడికి మతాలు, మనుషులతో సంబంధం లేదు.
- ఎంత గొప్పగా పెళ్లి చేసుకుంటున్నామన్నది ముఖ్యం కాదు. ఎంత కాలం కలిసి ఉంటామన్నదే ముఖ్యం.
- మనసులు కలవకుండా మతాలను కలపడం వల్ల లాభం లేదు.
- అంతర్గతంగా సున్నితమైన మహిళలే బయట గట్టిగా ఉండగలుగుతారు.



పాట పల్లకీ ఎక్కి

‘తెలంగాణలో పుట్టి... పూల పల్లకి ఎక్కి లోకమంతా తిరిగే..వటే’ అంటూ బతుకమ్మను కీర్తిస్తూ మంగ్లీ పాడారు. ఆ పాటతో ప్రపంచవ్యాప్తంగా ఆమె కీర్తి సాధించారు. బతుకమ్మ సంబరాల్లో ఈ పాట వినిపించకుండా ఉండదు. బతుకమ్మ అంటే ‘తంగేడు’ పువ్వు ప్రత్యేకం. బతుకమ్మ పాటల్లో మంగ్లీ పాడిన పాటలు ప్రత్యేకం. నవరాత్రి సందర్భంగా తాను పాడిన తొలి బతుకమ్మ పాట గురించి, ఇతర విశేషాలను గాయని మంగ్లీ ‘సాక్షి’తో ఈ విధంగా పంచుకున్నారు.

‘‘బతుకమ్మ పండగ అంటే మంగ్లీ పాటలు ఉండాల్సిందే అన్నట్లుగా నన్ను అభిమానిస్తున్నారు. ఇది నాకు చాలా సంతోషం కలిగిస్తోంది. అమెరికా, ఆస్ట్రేలియా... ఇలా ప్రపంచంలో ఎక్కడెక్కడ తెలుగు వాళ్లు ఉన్నారో అక్కడ బతుకమ్మ పండగ అంటే నా పాట వినపడుతోంది.


మంగ్లీ

‘ఆ సింగిడిలో రంగులనే దూసి
తెచ్చి దూసి తెచ్చి...
తెల్ల చంద్రుడిలో వెన్నెలలే
తీసుకొచ్చి...
పచ్చి తంగెడుతో గుమ్మాడీ పూలు
చేర్చి...
బంగారు బతుకమ్మను ఇంటిలో పేర్చి...’ అంటూ నేను పాడిన బతుకమ్మ పాటలో ‘తెలంగాణలో పుట్టి... పూల పల్లకి ఎక్కి లోక మంతా తిరిగే..వటే’ అని కూడా ఉంటుంది. అలా నా ఈ ఫస్ట్ పాట నన్ను శ్రోతలకు ఎంత దగ్గర చేసిందంటే ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఈ పాట పాడమని అడుగుతుంటారు. నా లైఫ్‌లో బతుకమ్మ అంటేనే చాలా ప్రత్యేకం. నా కెరీర్‌లోనే ప్రాథమిక గీతంగా మారిపోయింది ‘బతుకమ్మ’.

విదేశాల్లో బతుకమ్మ ఆడాను

నేను విదేశాల్లోని తెలుగువారితో కలిసి బతుకమ్మ పండగ చేసుకున్నాను. బతుకమ్మ ఆడాను... పాడాను... వాళ్లతోనూ ఆడించాను. మంగ్లీ పాట ఎప్పుడు వస్తుందంటూ వాళ్లు ఎదురు చూడటం నాకో మంచి అనుభూతి. నా తెలంగాణ ప్రజలు నన్ను ఎంతో గొప్పగా ఓన్ చేసుకున్నారు. అది నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను నేను.

ఇది సందర్భం కాకపోయినా చెబుతు న్నాను... నేను హనుమంతుణ్ణి బాగా పూజిస్తాను. ఆయన గుడి కట్టించాను. నేను కట్టించాలనుకున్నాను.... ఆయన కట్టించు కున్నాడు. గుడి లేకుండా నేను ఆయన్ను చూడలేకపోయాను. నా సంకల్పం నెరవేర్చు తండ్రీ అనుకు న్నాను... నెరవేర్చాడు. నేను చేసిన ప్రోగ్రామ్స్ ద్వారా వచ్చిన డబ్బుతో కట్టించాను. ఆయన ఆజ్ఞ లేనిదే అది జరుగుతుందా? ఇది అద్భుత మైన అవకాశమే కదా.

రెండూ ప్రకృతి పండగలే...

మేం తీజ్ పండగ చేసుకుంటాం. బతుకమ్మ పండగ కూడా అలానే. తీజ్ పండగకు మేం మొలకలను పూజిస్తాం. బతుకమ్మను పూలతో పూజిస్తాం. మొలకలు, పువ్వులు... రెండూ చెట్ల నుంచే వస్తాయి కాబట్టి రెండూ ప్రకృతి పండగలే. అందుకే బతుకమ్మ పాట పాడే తొలి అవకాశం వచ్చినప్పుడు నాకు చాలా ఆనందంగా అనిపించింది. ‘తెలంగాణలో పుట్టి... పూల పల్లకి ఎక్కి లోకమంతా తిరిగే..వటే’ అంటూ మిట్టపల్లి సురేందర్ అన్న అద్భుతంగా రాయడం, నేను పాడటం, బొబ్బిలి సురేష్ మ్యూజిక్ చేయడం అన్నీ బాగా కుదిరాయి. పాటలు అందరూ బాగా పాడతారు... బాగా రాస్తారు... బాగా మ్యూజిక్ చేస్తారు. కానీ ఆ పాటను ఎంత బాగా చూపించామన్నది చాలా ముఖ్యం. దామోదర్ రెడ్డి తన డైరెక్షన్‌తో ఈ పాటను బాగా చూపించాడు. అన్నీ బాగా కుదరడంతో ఈ పాట జనాల్లోకి వెళ్లింది.

ప్రతి ఇల్లూ ఆమెకు నిలయమే

నేను దేవుణ్ణి బాగా నమ్ముతాను. దేవుడు లేనిదే మనం లేము. ప్రతి ఒక్క దేవుడికి గుడి ఉంటుంది కానీ బతుకమ్మకు మాత్రం గుడి ఉండదు. మిట్టపల్లె సురేందర్ అన్న ‘పచ్చి పాల వెన్నెలా...’ పాటలో ఈ విషయాన్ని ఎంత గొప్పగా వర్ణించాడంటే... ఆ పాటలో ఆమెకి ఉన్నన్ని గుళ్లు ఏ దేవుడికీ ఉండవని రాశాడు. గుడి లేని ఆ దైవానికి ప్రతి ఒక్క ఇల్లూ నిలయమే. ప్రతి ఇంట్లో ఆమెను పూజిస్తారు కదా. ప్రతి ఇంట్లోనూ ఆమెను తయారు చేస్తారు. ఏ దేవతనూ తయారు చేసి పూజ చేయరు. కానీ గౌరమ్మను తయారు చేసి మరీ పూజిస్తారు. అందుకే ప్రతి ఒక్క ఇల్లూ ఆమెకు గుడే.


మంగ్లీ

సంబరాలన్నీ జనాలతోనే...

నేను బతుకమ్మను తొలిసారి తయారు చేసింది 2013లో. ఒక చానెల్ కోసం చేశాను. అప్పట్నుంచి ప్రతి సంవత్సరం తయారు చేస్తున్నాను. మా ఇంట్లో బతుకమ్మ పండగను జరుపుకుంటాం. అయితే తొమ్మిది రోజులు అమ్మవారి అలంకారం వంటివి చేసే వీలుండదు. నేనెక్కువగా బయటి జనా లతో పండగ చేసుకుంటా. నా బతుకమ్మ సంబరాలు మొత్తం జనాలతోనో అయి పోతాయి. ఇది కూడా అదృష్టమే.

పూలనే దేవుడిలా పూజిస్తాం

మనం ప్రతి దేవుణ్ణి పూలతో పూజిస్తాం. కానీ పూలనే దేవుడిలా పూజించి, కొబ్బరికాయ కొట్టి, అగరుబత్తులు వెలిగించడం అనేది బతుకమ్మకే జరుగుతుంది. ఈ పండగలో ఉన్న గొప్పతనం ఏంటంటే మగవాళ్లంతా ముందుండి తమ ఇంటి ఆడ వాళ్లను దగ్గరుండి ఆడమని... పాడమని ప్రోత్సహిస్తుంటారు. తెలంగాణలో మహిళల్ని గౌరవించినంతగా ఇంకెక్కడా గౌరవించరు. అమ్మని అయినా బిడ్డల్ని అయినా ఎంతో గౌరవంగా చూస్తారు. ముందుండి నడిపిస్తారు. అంత గొప్ప కల్చర్ తెలంగాణాది. ఉన్నోళ్లు... లేనోళ్లు... మంచి చీరలు కట్టుకుని పండగ చేసు కుంటారు’’ అంటూ మా ఇంట్లో అమ్మకి, ఇంకా అందరికీ కొత్త బట్టలు కొంటాను. ఆనందంగా పండగ జరుపు కుంటాం అన్నారు మంగ్లీ.

– డి.జి. భవాని

వార్డ్‌రోబ్

దసరా ధారణ

తెలుగింటి సంప్రదాయం డ్రెస్సింగ్ లో కనిపించాలి. స్టైల్ లో ఏ మాత్రం తగ్గకూడదు వెస్టర్న్ వేర్ అనిపించకూడదు సౌకర్యం లో బెస్ట్ చాయిస్ అవ్వాలి... పండగ హంగులు ఔరా అనిపించాలి. ఇండియన్ వేర్ నే డిఫరెంట్ గా ధరించాలి. దసరా వేడుకలో మరింత స్టైలిష్‌గా కనువిందు చేసే మోడ్రన్ హంగులివి.



శారీ గౌన్

కుట్టిన చీరలు, ధోతీ చీరలు, ప్యాంట్ తరహా చీరలు, కేప్ స్టైల్ డ్రేప్స్... వంటి వినూత్న పద్ధతులు ప్రాచుర్యం పొందుతున్నాయి. ఎన్నో విభిన్న డిజైన్లలో ఆకట్టుకుంటున్న శారీ గౌన్, షరారా శారీ ధరిస్తే చాలా స్టైలిష్‌గా, తేలికగా, రోజంతా సౌకర్యవంతంగా హుషా రుగా ఉంచుతుంది.

ఎంబ్రాయిడరీ బ్లేజర్

బ్లేజర్లు కార్పొరేట్ రంగానికి మాత్రమే పరిమితం అనుకుం టారు చాలామంది. కానీ, ఎంబ్రాయిడరీ బ్లేజర్‌ను డ్రేప్డ్ స్కర్ట్ లేదా ధోతీ ప్యాంట్‌తో స్టైల్ చేయచ్చు. నడుము భాగాన్ని బెల్ట్‌తో అలం కరిస్తే ఈ డ్రెస్ బెస్ట్ మార్కులు కొట్టేస్తుంది.



గవ్వల కుర్తీ

ధోతీ ప్యాంట్, డ్రేప్డ్ స్కర్ట్ లకు గవ్వలు, అద్దాలతో ఎంబ్రాయిడరీ చేసిన కేప్ లేదా షార్ట్ కుర్తీతో స్టైల్ చేయచ్చు. ఫ్లోరల్ ఎంబ్రాయిడరీ ప్యాటర్న్ ఉన్న లెహెంగా లేదా పలాజో సెట్ కూడా పండగ కళను తెప్పిస్తుంది.



సౌకర్యంగా!

సల్వార్ కమీజ్ అయితే ప్రకాశవంత మైన రంగులు ఉన్నవి ఎంచుకోవాలి. పిల్లలతో సరిపోలే దుస్తులను ధరిం చడం వల్ల ఒకే కుటుంబ రూపాన్ని సృష్టించవచ్చు. పండగ కళ రావాలనే ఆలోచనతో పిల్లలకు గాడీ ఎంబ్రా యిడరీ దుస్తులు వేయకూడదు. వారి డ్రెస్సులు సౌకర్యంగా ఉండాలి. ఆభరణాలు మేనికి గుచ్చుకోకుండా ఉండేవి ఎంచుకోవాలి. భారీ ఆభరణాలను ఉప యోగించే బదులు బ్యాంగిల్స్, జూకాలు తక్కువ బరువున్న యాక్సెసరీస్‌ను ఉపయోగించాలి.

రతన్ టాటాకు నివాళి

నాయనమ్మే ప్రేరణ

రతన్ టాటా మన దేశం గర్వించదగ్గ పారి శ్రామికవేత్త. పారిశ్రామిక విజయాలలోనే కాదు, వదాన్యతలోనూ ఆయన ఎందరికో స్ఫూర్తి ప్రదాత. అంతటి రతన్ టాటాకు స్ఫూర్తినిచ్చిన వ్యక్తి ఒకరు ఉన్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక మహిళ ఉంటుందనే నానుడి రతన్ టాటా విషయం లోనూ నిజమే! చిన్ననాటి నుంచి రతన్ టాటాకు స్ఫూర్తి ఆయన నాయనమ్మే! రతన్ టాటా నాయనమ్మ నవాజ్‌బాయి టాటా సన్స్ కంపెనీకి మొదటి మహిళా డైరెక్టర్. టాటా ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా కూడా ఆమె సేవ లందించారు.



నాయనమ్మ నవాజ్‌బాయితో రతన్ టాటా

రతన్ టాటాకు పదేళ్ల వయసు ఉన్న ప్పుడే ఆయన తల్లిదండ్రులు విడాకులు పొంది విడిపోయారు. అలాంటి గడ్డు పరిస్థి తుల్లో రతన్ టాటా, ఆయన తమ్ముడు జిమ్మీ టాటాల బాధ్యతను నాయ నమ్మ నవాజ్‌బాయి చేపట్టారు. వారిద్దరినీ అల్లారుముద్దుగా పెంచారు. సాటి మనుషులతో మెలగాల్సిన తీరును, జీవితంలో పాటించాల్సిన విలువ లను నేర్పించారు. తన జీవితాన్ని తీర్చిదిద్దిన నాయనమ్మే తనకు స్ఫూర్తి ప్రదాత అని, తాను సాధించిన విజయాల ఘనత ఆమెకే చెందు తుందని రతన్ టాటా ‘హ్యూమన్స్ ఆఫ్ బాంబే’ ఇంటర్వ్యూలో స్వయంగా చెప్పారు. నాయనమ్మ పెంపకంలో పెరగకపోయి ఉంటే, తాను ఇంతటివాణ్ణి కాగలిగేవాణ్ణి కాదని రతన్ టాటా తరచుగా చెబుతుండేవారు.

ఇక్కడ చదువు పూర్తయ్యాక ఉన్నతవిద్య కోసం రతన్ టాటా అమెరికా వెళ్లారు. కార్నెల్ యూనివర్సిటీ నుంచి ఆర్కిటెక్చర్, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత లాస్ ఏంజెలిస్‌లోని ఒక ఆర్కిటెక్చర్ సంస్థలో ఉద్యోగంలో చేరారు. అక్కడే స్థిరపడిపోవాల నుకున్న దశలో నాయనమ్మ నవాజ్‌బాయి అనారోగ్యానికి లోనయ్యారు. స్వదేశానికి తిరిగి వచ్చేయమని ఆమె కోరడంతో రతన్ టాటా అమెరికా జీవితానికి స్వస్తిచెప్పి, బాంబేకు వచ్చేసి, టాటా సంస్థల బాధ్యతల్లో పాలుపంచుకో వడం మొదలుపెట్టారు.

నాలుగుసార్లు ప్రేమలో పడినా

రతన్ టాటా పారిశ్రామికవేత్తగా ఘనవిజయాలు సాధించినా, అవి వాహితుడిగానే మిగిలిపోయారు. ఆయన తన జీవితంలో నలుగురు మహిళలతో ప్రేమలో పడ్డారు. కొన్నిసార్లు దాదాపు పెళ్లి వరకు వెళ్లినా, పెళ్లి మాత్రం చేసుకోకుం డానే మిగిలిపోయారు. ఈ సంగతిని రతన్ టాటా స్వయంగా వెల్లడిం చారు.


రతన్ టాటా – సిమీ గరేవాల్

దాదాపు పుష్కరం కిందటి ‘హ్యూమన్స్ ఆఫ్ బాంబే’ ఇంట ర్వ్యూలో రతన్ టాటా తన అంత రంగికమైన సంగతులను ప్రస్తావిం చారు. ‘నాలుగుసార్లు ప్రేమలో పడ్డాను. కొన్నిసార్లు దాదాపు పెళ్లి వరకు వెళ్లాను. పరిస్థితుల ప్రభావంతో పెళ్లి మాత్రం జరగలేదు. పెళ్లి చేసుకోవలసిన పనుల్లో తీరికలేకుండా మునిగిపోవడం సహా అనేక కారణాల వల్ల పెళ్లి చేసుకో లేకపోయాను’ అని చెప్పారు. లాస్ ఏంజెలెస్‌లో ఉన్నప్పుడే తొలిసారి ఒక అమ్మాయితో ప్రేమలో పడ్డానని, కొన్ని పరిస్థితుల వల్ల భారత్‌కు తిరిగి వచ్చే యాల్సి వచ్చిందని తెలిపారు.

సిమీ గరేవాల్‌తో ప్రేమాయణం

బాలీవుడ్ నటి సిమీ గరేవాల్‌తో రతన్ టాటా ప్రేమాయణం గురించి చాలా కథ నాలే వెలువడ్డాయి. సిమీ గరేవాల్ ఒక టీవీ చానెల్ కోసం నిర్వహించిన ‘రెండెజ్‌వూస్ విత్ సిమీ గరేవాల్’ కార్యక్రమంలో ఒకసారి రతన్ టాటాను కూడా ఇంటర్వ్యూ చేశారు. ఆమె కూడా తన ఇంటర్వ్యూలో ‘ఎందుకు పెళ్లి చేసుకోకుండా ఉండిపోయారు?’ అని రతన్ టాటాను అడిగారు. ఇదిలా ఉంటే, సిమీ గరేవాల్ వేరే ఇంటర్వ్యూలో రతన్ టాటాతో కొంతకాలం తానే డేటింగ్ చేసి నట్లు చెప్పారు. తాను సినిమాల్లో బిజీగా ఉంటున్నా, ఇద్దరమూ తరచు కలు సుకునేవాళ్లమని తెలిపారు. రతన్ టాటా మరణం పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ‘నువ్వు వెళ్లిపోయావని అంటున్నారు. నువ్వు లేని లోటును భరించడం చాలా కష్టం.. వీడ్కోలు మిత్రుడా!’ అని గురువారం ఉదయం సిమీ గరేవాల్ ఒక పోస్ట్ పెట్టారు.

దసరా సరదాలు

ప్యారీ మనవరాలు... పూరీ ముచ్చట్లు

‘‘నానమ్మా... అనవసరంగా స్ట్రెస్సు పెంచుకోకు. తగ్గే మార్గం చెబుతా విను గ్రానీ డ్యూడ్’’ అంది నా కూతురు.

‘‘ఏం చెబుతావో ఏమో... ఈమధ్య అంతా సైన్సు మాట్లాడుతున్నావ్. స్ట్రెస్సు ఈజ్ డైరెక్ట్‌లీ ప్రపోర్షన్ టు పిండిపైన ఉండే అప్పడాల కర్ర అండ్ ఇన్వర్స్‌లీ ప్రపోర్షన్ టు కిందనుండే రౌండు పీట అండ్ బీటా టీటా అల్ఫా ఒమెగా అంటూ అదేదో అంటుంటావ్. నా పాట్లేవో నన్ను పడనీ మనవరాల్ డ్యూడ్’’ అంది మా అమ్మ.

•••

మా అమ్మకూ ఈమధ్యే బీటెక్‌లో చేరిన నా కూతురికీ మధ్య భలే ఫ్రెండ్షిప్. ఒకరంటే ఒకరికి ఇష్టం. ఇద్దరిమధ్యా ‘షోలే’ వీరూ, జైయంత చనువు.

టైము దొరికినప్పుడల్లా ఇప్పటి సినిమాల్ని ఓటీటీలో మా అమ్మకు చూపిస్తూంటే, మా అమ్మ అప్పటి సినిమాల్ని టీవీలో నా బిడ్డకు చూపిస్తూ యమా టైంపాస్ చేసేస్తుంటారు ఇద్దరూ! ఈ వైభోగానికి తోడు సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీ, లోకల్ టాక్సెస్ ఎక్స్ట్రాల్లాగా నానమ్మా, మనవరాళ్లిద్దరి మధ్యా ఎక్స్‌ట్రా వాదులాటలూ, కీచులాటలూ, గొడవలూ... ఆ తర్వాత ఎదుటాళ్లను గెలిపించి తామోడిపోడానికి పోటీలూ, పేచీలు!

ఫరెగ్జాంపుల్... ‘‘హే యూ ఓల్డ్ లేడీ... చూస్తుండగానే అన్నపూర్ణవు కాస్తా నిర్మలమ్మ అయిపోతున్నావు నువ్వు’’ అంటూ నా కూతురంటే...

‘‘మీ అమ్మ మాత్రం అవ్వడం లేదా... రమ్యకృష్ణ లాంటిది కాస్తా వదినమ్మ వేషాల సుధాలాగా’’ అంటుంది మా అమ్మ.

ఇదెలా ఉంటుందంటే హీరోని పొడవలేని విలన్ అనుచరుడు కాస్తా చివరకు సెకండ్ హీరోయిన్‌ని పొడిచేసి నంత చిత్రంగా. ఇలా ఎందుకంటే... తన మనవరాళ్నేమీ అనలేకా... అందమైన హీరోయిన్‌లతోనే గాక... ఇంకెవ్వరి తోనూ పోల్చలేక! ఆ కూతురితో పోల్చదగ్గది మరొక రుండరూ... ఉండకూడదనే అత్యాశకొద్దీ!!



•••


అసలీ సంభాషణకు కారణం... దసరా సెలవలు కదా. అమ్మమ్మ గారి ఇంటికంటూ మా అక్కవాళ్ల పిల్లలు మా ఇంటికి రావడమూ... పండక్కి మా అమ్మను కొన్ని కోర్కెలు కోరడమూనూ. మనవరాళ్లు కదా! వాళ్ల వరాలు తీర్చకుండా ఎలా ఉంటుంది మా అమ్మ. అవేమిటంటే... మా పిల్లలకేమో చిట్టిగారెల్లో మటన్ కూర కావాలట. అక్క పిల్లలేమో ‘గారెలు మేం మామూలుగానే తినేస్తాం. మటన్‌లో పూరీలు ముంచుకుతింటాం. కాబట్టి ఎక్స్‌ట్రాగా పూరీలు చేయమంటు’ న్నారు.

దాంతో రెండూ చేసే పనిలో బోల్డంత ఒత్తిడికి లోనవుతోంది మా అమ్మ. ఆమెను అనునయిస్తూ స్ట్రెస్సును తగ్గించే పనిలో ఉంది నా బిడ్డ.

•••

‘‘అయినా... పూరీలు టైముకు ప్రిపేర్ అవ్వాలంటే... అసలెంతో కొంత స్ట్రెస్ ఉండాల్సిందేలే నానమ్మా’’ అంది నా కూతురు.

‘‘అదేందోగానీ ‘పిల్లా... ఈ స్ట్రెస్సొచ్చిన ప్పుడల్లా నా కిడ్నీల్లో హార్ట్ ఎటాక్ వచ్చినట్టుంటుంది బ్రో. ఈ ఒత్తిడి అనేది ఉంది చూశావూ... మొదట ‘అగ్నిపర్వతం’ ‘ఈగాలిలో...’ పాటలోలాగా కృష్ణ పాస్ పోర్టు ఫొటోంత సైజులో ఉంటుందా! కాసేపటికే విజయశాంతి పట్టుకున్న సూపర్‌స్టార్ కటౌటంతగా పెరుగుతుంది. అబ్బో... అలా పెరిగినప్పుడు నాకెంత దాహం వేస్తుంటుందో తెలుసా పిల్లా? ‘దేవత’లో శోభన్‌బాబు, శ్రీదేవీ పాటలోని అన్ని బిందెల్లోకీ ఎల్లువొచ్చిన గోదారి నీళ్లన్నీ తాగీ తాగీ ఇంకా తాగుతున్నా ఇంకా దాహ మేస్తున్నట్టే అనిపిస్తుంటది’’



‘‘నీకెందుకు నానమ్మా. నీ నర్వస్‌నెస్‌ను ‘రోబో–2’లో పావురమ్మీద స్వారీ చేసే రజినీకాంత్ సైజుకు తగ్గిస్తా’’

‘‘ఓహో... భైరవద్వీపం ‘నరుడా ఓ నరుడా’ పాటలో మరుగుజ్జుల సైజుకా?’’ అంటూ తన పాత సినిమా ఎగ్జాంపుల్‌కు వెళ్తానే... ‘‘అయినా పెద్ద చెప్పొచ్చావ్ గానీ... స్ట్రెస్సుంటే వంట వీజీగా ఎలా అవుతుందే అమ్మాయ్?’’ అడిగింది.

‘‘నా ఇంజనీరింగ్ మ్యాథ్స్‌లా కాకుండా మీ పాత సినిమాల భాషలోనే చెబుతా విను. కొద్దిగా స్ట్రెస్సుంటే... అప్పట్లో మీ ఓల్డుమూవీసులో పొగరుమోతు హీరోయిన్ని ఒక్క టీజింగుసాంగుతోనే హీరో లొంగదీసినంత వీజీగా చేసేగలవు పూరీలన్నీ’’ అంటూ మా అమ్మకు తన ఉపదేశాన్ని మొదలుపెట్టింది నా కూతురు.

•••

‘‘అన్నట్టు నానమ్మా... ఈ స్ట్రెస్సూతో హెల్త్ సమ స్యలూ అవీ వస్తాయని దాన్ని ఆడిపోసుకుంటుంటారు గానీ... ఒక్క వంటే కాదు. ఏ పనైనా హాయిగా జరిగిపోవా లంటే కాస్త ప్రెషరో, గిషరో వర్కవుట్ అవుతూ ఉండాలి. అదెంతుండాలంటే... కడాయిలో పూరీని పొంగించ డానికీ, కుక్కరులోని రైసును ఉడికిం చడానికీ ఎంత కావాలో... పని సజావుగా జరగడానికి అంతే స్ట్రెస్సుండాలి’’



‘‘ఎందుకే పాపం ఒత్తిడితో ఆ పూరీల్ని అంతలా పొంగించడం? ఎంత పొంగినా చివరకు పూరీకి బొక్కెట్టే కదా తింటారు. విజిల్లతో ఎంతగా మిడిసిపడ్డా ఆవిరి పోయాకే కదా కుక్కర్లోంచి అన్నాన్ని దించుతారు!’’

‘‘నువ్వన్నది కరెక్టేగానీ నానమ్మా... ఎలాగూ తొక్క వలిచే తింటాంగదా అని తొడిమ ఊడిన అరటిపండు తినగలమా? ’ అలాగే పొంగని పూరీతో పానీ పూరీ చేయ గలమా చెప్పు. పొంగినదానికీ, పొంగ నిదానికీ టేస్టులో ఏమాత్రం తేడా లేక పోయినప్పటికీ పొంగినదాన్నే కదా ప్లేట్లో వేసుకోబుద్ధవుతుంది! అలా పూరీ లోకి చేరి పొంగేలా చేయడమే గాలి గొప్ప. అండ్... వంటలో ఆయొక్క ఐడియల్ ఒత్తిడి ఎంతుండాలంటే... పూరీపొరను చీల్చకూడదూ – అన్నాన్ని మాడ్చకూడదు. సమ్‌ఝే నానమ్మా డ్యూడ్?!’’

‘‘నువ్వు ఎన్నైనా చెప్పవే... ఒత్తిడిలో పని జరగదు గాక జరగదు. పైగా నువ్వంటే ఇంకా డిస్టబెన్సు. కాబట్టి.... రాకమ్మా మనవరాలా రాకమ్మా.... నీ కోవేలా కాలేజీ... కిచేనెందుకూ నీకూ కొలువై ఉండేందుకూ...’’

‘‘నేనేమీ రాన్లేగానీ... నువ్వనుకునేది కరెక్ట్ కాదు. ఒత్తిడి ఎంతుండాలంటే... భోజనం విషయానికి వస్తే అన్నం మాడి ఆకలితో మనల్ని మాడ్చకూడదు... ఆబగా ఓ ముద్ద ఎక్కువ తినేస్తే ఒంటిని జ్వరంతో కాల్చకూడదు. తలనొప్పి రానీకుండా చూసే కాఫీ అనే అమృతానికీ... అమృతాంజనా నికీ సరిగ్గా మధ్యన గీత గీసేంత ఒడుపు కలిగి ఉండటమే ఐడియల్ ఒత్తిడి. దాన్ని నువ్వు స్ట్రెస్సనూ, ప్రెషరను. ఆ నర్వస్‌నెస్సులో ఓ వైబ్రేషనుంది. ఓ ఎమోషనుంటది. అది ఉండి తీరాలి నానమ్మా. కాబట్టి చపాతీలా చతికిల పడకు. పూరీలా పొంగనీ ఉత్సాహం నీలో’’

‘‘అమ్మో అమ్మో... పైకి చూడ్డానికి పూరీలోని పైపొరలా సాఫ్ట్‌గా కనిపిస్తదిగానీ... కిందిపొరలా భయంకరమైన టఫ్‌రా నీ కూతురూ. ప్రతి జనరేషన్‌లోనూ ఓ కొత్త థాట్‌ను ముందుకు తీస్కెళ్లడానికి అప్పుడప్పుడూ వంటగదిలోకి ఒకతొస్తుంది. ఆ పిల్లనే అప్పడాలకర్ర బేరర్ అంటార్రా’’ అపురూపంగా మనవరాల్ని చూసుకుంటూ నాతో అబ్బురంగా అంది మా అమ్మ.

– యాసీన్



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+4 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 201

శుక్రవారం 11-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20+4 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 201
శుక్రవారం 11-10-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



● టెక్...టాక్



రెడ్ మ్యాజిక్ టైటాన్ 16 ప్రో

రిజల్యూషన్: 2,560×1,600 పిక్సెల్స్
బరువు: 2.4 కేజీ;
రిఫ్రెష్‌రేట్: 240 హెచ్‌జడ్
వోఎస్: విండోస్ 11 హోమ్

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్10 ప్లస్



డిస్‌ప్లే: 12.4 అంగుళాలు
మెమరీ: 12జీబి ర్యామ్/256జీబి/512 జీబి స్టోరేజ్
కెమెరా: 13 ఎంపీ మెయిన్/ 8 ఎంపీ అల్ట్రా వైడ్/ 12 ఎంపీ ఫ్రంట్
బ్యాటరీ: 10,900 ఎంఏహెచ్



ల్యాప్‌టాప్ మౌంట్ మ్యాగ్-సేఫ్ ఫోన్

బ్రాండ్: ఇన్ఎవిట్
కలర్: బ్లాక్; స్పెషల్ ఫీచర్స్: ఆర్మ్
మౌంటింగ్ టైప్: టేబుల్ మౌంట్
బరువు: 100 గ్రా.
ప్రొడక్ట్ డైమెన్షన్స్: 13×5.6×0.5 సీఎం

మొబైల్ అండ్ ట్యాబ్‌లెట్ హోల్డర్



బ్రాండ్: అమెజాన్ బేసిక్స్
కలర్: బ్లాక్
ఫామ్ ఫ్యాక్టర్: టేబుల్ స్టాండ్
360 డిగ్రీ రొటేషన్ ఫీచర్
కంపాటబుల్ ఫోన్ మోడల్స్: ఆల్ ఫోన్స్

ఇంగ్లీష్ ఇడియమ్స్



ఎక్స్‌టెండ్ ది ఆలివ్ బ్రాంచ్

గొడవలు లేదా విభేదాలకు స్వస్తి పలకడానికి సుముఖతకు వ్యక్తం చేయడానికి, స్నేహపూర్వక హస్తాన్ని అందించి సామరస్యం దిశగా అడుగులు వేసేటప్పుడు వాడే మాట...ఎక్స్‌టెండ్ ది ఆలివ్ బ్రాంచ్.

ఉదా: డూరింగ్ నెగోషియన్స్, ఈచ్ సైడ్ టూక్ టర్న్స్ ఎక్స్‌టెండింగ్ ది ఆలివ్ బ్రాంచ్ టు ట్రై అండ్ రీచ్ ఏ కాంప్రమైజ్.

వానిష్ ఇన్ టు ది ఏయిర్

'ఒక్కసారిగా మాయమయ్యాడు' 'ఫైల్స్ ఉన్నట్టుండి మాయం అయ్యాయి'... ఇలా చెప్పే సందర్భంలో వాడే మాట... వానిష్ ఇన్ టు ది ఏయిర్.

ఉదా: మై కీస్ సీమ్ టు హ్యావ్ వానిష్‌డ్ ఇన్‌టు తిన్ ఏయిర్. ఐ హ్యావ్ సెర్చ్‌డ్ ఎవ్రీవేర్ అండ్ కాంట్ ఫైండ్ దెమ్.

ఇన్‌స్పిరేషన్

రుక్మిణి వారియర్



ఆరో తరగతి ఫెయిలైన అమ్మాయికి 'ఐఏఎస్' కలలు ఉంటాయా? 'సాధ్యం కాదు' అనుకున్నదాన్ని 'సాధ్యం' చేయవచ్చా? ఈ రెండు ప్రశ్నలకు జవాబు చెప్పే పేరు....రుక్మిణి రియర్. ఆరో తరగతి ఫెయిలైన రుక్మిణి తొలి ప్రయత్నంలోనే యూపీఎస్‌సీలో రెండో ర్యాంకు సాధించింది. ప్రస్తుతం రాజస్థాన్‌లోని జైపూర్ మున్సిపల్ కమిషనర్‌గా 'ఆఫీసర్ అంటే ఇలా ఉండాలి' అనుకునేలా పనిచేస్తోంది...

స్కూల్ రోజుల్లో రుక్మిణి బ్రైట్ స్టూడెంట్ కాదు. రుక్మిణి ఆరో తరగతి ఫెయిల్ కావడం ఎవరికీ పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అయితే ఆ ఫెయిల్యూరే తనను సక్సెస్‌కు దగ్గర చేసింది.

'ఫెయిల్యూర్ అంటే మొదలైన భయం ఎలాగైనా సక్సెస్ కావాలనే పట్టుదలను పెంచింది' అంటుంది రుక్మిణి. అమృత్‌సర్‌లోని 'గురునానక్ యూనివర్శిటీ'లో సోషల్ సైన్స్‌లో డిగ్రీ చేసిన రుక్మిణి ముంబైలోని 'టాటా ఇనిస్టిట్యూట్'లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఆ తరువాత ముంబై, మైసూర్‌లలో కొన్ని స్వచ్ఛందసంస్థలలో పనిచేసింది. స్వచ్ఛంద సంస్థల్లో పనిచేస్తున్న క్రమంలో అంకితభావం, వృత్తినిబద్ధత ఉన్న ఎంతో మంది ఐఏఎస్ అధికారుల గురించి విన్నది. వారి గురించి విన్నప్పుడల్లా 'ఐఏఎస్' వైపు మనసు మళ్లేది. చివరికది అది తన కలగా మారింది. 'ఒక ప్రయత్నం చేసి చూద్దాం' అని రంగం లోకి దిగింది. కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండానే తొలి ప్రయత్నంలోనే యూపీఎస్‌సీలో ఆల్ ఇండియా ర్యాంక్ 2 సాధించింది. 'ఆరోతరగతి ఫెయిలైన అమ్మాయి ఐఏఎస్ సాధించింది'... రుక్మిణి గురించి ఇలాంటి వార్తలు వైరల్ అయ్యాయి. చాలామంది విద్యార్థులు ఆమెను కలుసుకొని మాట్లాడి సలహాలు తీసుకునేవారు.

కట్ చేస్తే...

ఇప్పుడు రుక్మిణి రియర్ రాజస్థాన్‌లోని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ కమిషనర్.

యూపీఎస్‌సీలో సెకండ్ ర్యాంక్‌తో ఎలా వార్తల్లో నిలిచిందో మున్సిపల్ కమిషనర్‌గా కూడా ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. దీనికి కారణం అక్రమార్కుల పాలిట ఆమె సింహస్వప్నం కావడమే. డిసెంబర్‌లో జరగబోయే 'రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'ను దృష్టిలో పెట్టుకొని విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. విమానాశ్రయం నుండి 22 గోదాముల వరకు ప్రధాన రోడ్లను పరిశీలిస్తూ వెళ్లింది.

నగర పరిశుభ్రత, సుందరీకరణ గురించి స్థానికులతో మాట్లాడింది. సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలని, పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఫ్లైవోవర్‌లు మరింత ఆకర్షణీయంగా కనిపించడానికి పెయింటింగ్, లైటింగ్‌ల కోసం సూచనలు ఇచ్చింది.

గోడలకు పెయింటింగ్ వేయడం నుంచి పబ్లిక్ టాయిలెట్లు, చెత్త కుండీలు శుభ్రం చేయడం వరకు ప్రతి పని దగ్గర ఉండి చేయిస్తుంది. నగర సుందరీకరణతో పాటు ఆక్రమణలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

'రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్' ద్వారా జైపూర్‌ను గ్లోబల్ సిటీగా ప్రదర్శించడానికి అవకాశం ఉంటుంది. దీని కోసం జైపూర్ అద్భుతంగా కనిపించకపోయినా... పరిశుభ్రంగా, ఆక్రమణలు లేకుండా కనిపించాలి. ఇది అనుకున్నంత సులువైన పనేమీ కాదు. ఎందుకంటే సమ్మిట్‌కు ఎన్నో నెలలు లేదు. అయినా సరే వెనక్కి తగ్గకుండా కష్టపడుతూ ప్రజల నుంచి శభాష్ అనిపించుకుంటోంది రుక్మిణి.

'పని చెయ్యకపోయినా ఫరవా లేదు. చేస్తే మాత్రం శ్రద్ధగా, భక్తిగా చేయాలి' అని అమ్మ అంటుండేది. ఆ మాటలే రుక్మిణి రియర్‌కు వేదవాక్కు.

ఏఐ ఏరియా



మెటా వారి మూవీ జెన్

'మూవీ జెన్' అనే కొత్త ఏఐ మోడల్‌ను రూపొందిస్తున్నట్లు టెక్ దిగ్గజం 'మెటా' ప్రకటించింది. ఇది ప్రాంప్ట్‌లకు స్పందనగా రియలిస్టిక్ వీడియో, ఆడియో క్లిప్‌లను జనరేట్ చేయగలదు. ఓపెన్ ఏఐ, ఎలెవన్ ల్యాబ్స్‌లాంటి ఏఐ వీడియో టూల్స్‌కు ఇది గట్టి పోటీ ఇవ్వగలదని పరిశీలకులు భావిస్తున్నారు. ఓపెన్ ఏఐ తన వీడియో మోడల్ 'సోరా'ను ప్రపంచానికి పరిచయం చేసింది. ఓపెన్ ఏఐ షేర్ చేసిన డెమోలు ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టించాయి.

'సోరా' ఇంకా అందుబాటులోకి రానప్పటికీ దాని హైపర్ రియలిస్టిక్ ఫుటేజ్ హాలీవుడ్ స్థాయిలో కనిపించింది. ఈ నేపథ్యంలో 'మూవీ జెన్' గురించిన సమాచారం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది టెక్స్ట్ ఇన్‌పుట్స్ సహాయంతో వీడియోలను జనరేట్ చేస్తుంది. ఫుటేజ్, స్టిల్ ఇమేజ్‌లను ఎడిట్ చేయగలదు. వీడియోకు జోడించే ఆడియో కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా జనరేట్ చేయబడుతుందని, విజువల్‌కు సింక్ అవుతుందని సమాచారం. వివిధ యాస్పెక్ట్ రేషియోలలో వీడియోలను రూపొందించడంతో పాటు వీడియోలకు నిర్దిష్ట సవరణలు చేయగలదు. యూజర్ అందించిన చిత్రాలను ఉపయోగించి పర్సనలైజ్ కంటెంట్‌ను సృష్టించగలదు. టెక్నికల్‌గా చూస్తే...'మూవీ జెన్' అనేది వీడియో జనరేషన్ కోసం 30 బిలియన్ పారామీటర్ మోడల్, ఆడియో కోసం 13 బిలియన్ పారామీటర్ మోడల్‌ను ఉపయోగిస్తుంది. మెటా మాటల్లో చెప్పాలంటే 'మూవీ జెన్' అనేది అధునాతన ఏఐ వీడియో సృష్టి సాధనం.

● గేమింగ్



ఆయుధాల దండోర

మన దేశంలోని ప్రముఖ గేమింగ్ స్టూడియోలలో ఒకటైన 'అగ్రేమింగ్' తన బ్యాటిల్ రాయల్ గేమ్ 'ఇండస్' లాంచ్ తేదీని ప్రకటించింది. ఈ నెల16 నుంచి గేమ్ సందడి మొదలు కానుంది. ఈ గేమ్ గూగుల్ ప్లేస్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్ ద్వారా ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ గేమ్‌లోని హీరో లక్ష్యం 'కాస్మియం' అని పిలవబడే అరుదైన వనరును సేకరించడం, తన ప్రత్యర్థి ప్రోత్రాన్‌ను ఎదుర్కోవడం.

'డోన్ట్ వేస్ట్ టైమ్...ఫినిష్ హిమ్' అంటూ వచ్చిన గేమ్ ట్రైలర్ ఆకట్టుకుంది. 'ఇండస్ ద్వారా మన భారతీయ సంస్కృతి, సంప్రదాయలలోని ప్రత్యేకమైన పాత్రలు, ఆయుధాలను ప్లేయర్స్ ముందుకు తీసుకువస్తున్నాం. బీటా దశలో ప్లేయర్స్ నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌తో గేమ్‌ను మరింత మెరుగు పరిచాం' అంటున్నాడు 'సూపర్‌గేమింగ్' సీయివో రోబీజాన్.

ప్లాట్‌ఫామ్స్: పీసి, మొబైల్, కన్సోల్; **జానర్:** బ్యాటిల్ రాయల్ గేమ్

మ్యూజిక్ వరల్డ్

ధీ ధీ తారా



'సౌత్ ఇండియన్ మ్యూజిక్ అంటే నాకు చాలా ఆసక్తి. పాటలు వింటాను. మ్యూజిక్ వీడియోలు చూస్తుంటాను' అంటున్న కొరియన్ ఆర్టిస్ట్ ఔర సింగర్-సాంగ్ రైటర్ శిరీష భాగవతులతో కలిసి 'ధీ ధీ తారా' (కుట్టనాడన్ డ్రీమ్స్) ఆలపించాడు. గత సంవత్సరం చివరిలో బిగ్‌బాస్ సీజన్ 17లో వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్‌గా కనిపించాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఝలక్ దిఖ్లా సీజన్ 11లో కూడా కనిపించాడు. ఈ క్రమంలో ఇండియన్ మ్యూజిక్‌పై లవ్ పెంచుకున్నాడు.'ఛలో' 'రోకో'లాంటి పదాలు పలుకుతున్న ఔర హిందీ నేర్చుకోవాలనుకుంటున్నాడు.

'ఔరా ఉచ్చారణ చాలా భిన్నంగా ఉంటుంది. దీని కోసం ఐదు వారల పాటు పనిచేశాడు. అతడి అంకితభావం నాకు ఎంతగానో నచ్చింది' అంటున్న శిరీష ఔరాను మన దేశంలోని ఇంటిపేరుగా అభివర్ణించింది. 'మార్నింగ్ నూన్ ఈవెనింగ్' 'బ్లూ ఓషియన్' 'ఫైర్‌వర్క్'....ఇలాంటి ఎన్నో సింగిల్స్‌తో పేరు తెచ్చుకున్న ఔరా 2014లో బాయ్ బ్యాండ్ ఎఎతో కెరీర్ ప్రారంభించాడు.

సినిమా

నాలుగు దశాబ్దాలు వెనక్కి...



● రాజ్ తరుణ్, సందీప్

రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా నటిస్తున్న యాక్షన్ చిత్రం 'రామ్ భజరంగ్'. సిమ్రత్ కౌర్, సత్నా టైటస్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయ్యింది. దసరా నవరాత్రుల సందర్భంగా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఈ చిత్రంలో రాజ్ తరుణ్, సందీప్ డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారు. ఎందుకంటే దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం సాగే కథలో ఇద్దరూ నటిస్తున్నారు. ''1980 నేపథ్యంలో సాగే ఈ సినిమా మంచి ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ఛాయా దేవి, మనసా రాధాకృష్ణన్, రాజా రవీంద్ర, రవిశంకర్, షఫీ, శివరామరాజు వెంకట్, 'సత్యం' రాజేశ్, ధనరాజ్, 'రచ్చ' రవి, ఐశ్వర్య ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: మణిశర్మ, కెమెరా: అజయ్ విన్సెంట్.



● అజిత్

సంక్రాంతి బరిలోనే...

అజిత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ స్పెయిన్‌లోని మ్యాడ్రిడ్‌లో జరుగుతోంది. ఈ లాంగ్ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్, సాంగ్ చిత్రీకరణలను కూడా ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో సునీల్, ప్రసన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారని, హీరోయిన్ శ్రీలీల మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతికి విడుదల కానుంది. అయితే ఈ సినిమాకన్నా ముందే అజిత్ హీరోగా కమిటైన 'విడాముయర్చి' చిత్రం సంక్రాంతికి విడుదలతుందని, 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వచ్చే వేసవిలో రిలీజ్ కానుందనే ప్రచారం తెరపైకి వచ్చింది. కానీ తాజాగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతికే రిలీజ్ అవుతుందని వెల్లడించి, అజిత్ కొత్త లుక్‌ను యూనిట్ రిలీజ్ చేసింది. దీంతో 'విడాముయర్చి' చిత్రం వచ్చే వేసవిలో రిలీజ్ అవుతుందని ఊహించవచ్చు.

పవర్‌ఫుల్ ఝాన్సీ



● లక్ష్మీ రాయ్

లక్ష్మీ రాయ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. గురు ప్రసాద్ దర్శకత్వం వహించారు. తమిళ, కన్నడ భాషల్లో ఆల్రెడీ విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకాదరణ దక్కిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమా తెలుగు హక్కులను ప్రతాని రామకృష్ణ గౌడ్ సొంతం చేసుకున్నారు. ''ప్రేమ, యాక్షన్ అంశాలతో రూపొందిన సినిమా ఇది. మూడు వేరియేషన్స్ ఉన్న పాత్రలో లక్ష్మీ రాయ్ అద్భుతంగా నటించారు. డ్రగ్స్ సప్లై చేస్తూ కాలేజీ అమ్మాయిల జీవితాలతో ఆడుకునే ఓ ముఠా ఆటను అడ్డుకునే పవర్‌ఫుల్ ఝాన్సీ పాత్రలో లక్ష్మీ రాయ్ నటించారు. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన 8 ఫైట్స్ లక్ష్మీ రాయ్ కెరీర్లో మైలు రాయిగా నిలిచిపోతాయి. త్వరలోనే ట్రైలర్‌ను రిలీజ్ చేసి, సినిమాను నవంబరులో రిలీజ్ చేస్తాం'' అని ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు.

మహాకాళి

ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో



● మహాకాళి పోస్టర్

దర్శక-నిర్మాత-కథారచయిత ప్రశాంత్ వర్మ నేతృత్వంలోని 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్' నుంచి రానున్న కొత్త చిత్రానికి 'మహాకాళి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ సినిమాను నిర్మించనున్నారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ, స్క్రీన్‌ప్లేతో దర్శకురాలు పూజా అపర్ణ కొల్లూరు ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా గురువారం 'మహాకాళి' సినిమాను ప్రకటించి, ఈ సినిమా పోస్టర్, గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ''భారతదేశం నుంచి వస్తున్న ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో ఫిల్మ్ 'మహాకాళి'. మా యూనివర్స్‌లో మోస్ట్ ఫిరోషియస్ సూపర్ హీరో మూవీ. బెంగాల్ నేపథ్యంలో అక్కడి సంస్కృతి, సంప్రదాయాలతో ఈ సినిమా ఉంటుంది. భారతీయ మహిళల వైవిధ్యాన్ని, వారి అచంచలమైన స్ఫూర్తిని సెలబ్రేట్ చేసుకునేలా ఈ చిత్రం ఉంటుంది. సాధికారత, విశ్వాసం, అద్భుతమైన ప్రయాణం వంటి అంశాలను ప్రతిబింబిస్తుంది. కాళీ దేవి ఉగ్రరూపం, దయగల స్వభావం ఈ సినిమాలో కనిపిస్తాయి. ఈ సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణులను త్వరలో వెల్లడిస్తాం. భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లోనూ రిలీజ్ చేస్తాం. ఐమాక్స్ 3డీ వెర్షన్ రిలీజ్ కూడా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: స్మరణ్ సాయి.

కామెడీ డ్రామా షురూ



● రానా, టీనా శ్రావ్య, తిరువీర్

తిరువీర్ హీరోగా నటించనున్న కొత్త చిత్రానికి 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' అనే టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో టీనా శ్రావ్య హీరోయిన్‌గా నటించనున్నారు. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో సందీప్ అగరం, అష్మితా రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి సందీప్ అగరం కెమెరా స్విచ్చాన్ చేయగా హీరో-నిర్మాత రానా దగ్గుబాటి క్లాప్ ఇచ్చారు. రాహుల్ శ్రీనివాస్ గౌరవ దర్శకత్వం వహించారు. నవంబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు రాహుల్ మాట్లాడుతూ– ''కామెడీ డ్రామాగా ఈ సినిమా ఉంటుంది. నవంబరు 7న వైజాగ్, ఎస్. కోట లొకేషన్స్‌లో ఈ మూవీ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు. ''ఓ కొత్త పాయింట్‌తో రాహుల్ ఈ సినిమా కథను చెప్పనున్నారు'' అని పేర్కొన్నారు నిర్మాతలు సందీప్ – అష్మిత. రోహన్ రాయ్, నరేంద్ర ఇతర కీలక పాత్రల్లో నటించనున్న ఈ చిత్రానికి సంగీతం: కల్యాణ్ నాయక్.

పాంచ్ పటాకా



● మహేశ్ రెడ్డి, రామ్ నందా

తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి హెచ్ఎస్ క్యూబ్ ప్రొడక్షన్ అనే నూతన నిర్మాణ సంస్థ ఎంట్రీ ఇచ్చింది. ఎంట్రీ ఇవ్వడమే పాంచ్ పటాకాలా ఐదు సినిమాలు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎస్ క్యూబ్ ప్రొడక్షన్ లోగో, మోషన్ పోస్టర్‌ను ప్రముఖ వ్యాపారవేత్త మహేశ్ రెడ్డి లాంచ్ చేశారు. హిమ నందా గజా సమర్పణలో రామ్ నందా దర్శక, నిర్మాతగా హెచ్ఎస్ క్యూబ్ ప్రొడక్షన్‌లో వరుసగా ఐదు చిత్రాలు రానున్నాయి. ఈ ప్రొడక్షన్ లాంచ్ కార్యక్రమంలో రామ్ నందా మాట్లాడుతూ– ''రియల్ ఎస్టేట్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చాను. 2002 నుంచి సినిమా రంగంలో ఉన్నాను. నా కుటుంబం మొత్తాన్ని సూచించేలా హెచ్ఎస్ క్యూబ్ లోగోని నేనే రూపొందించాను. ప్రస్తుతం మా ప్రొడక్షన్ నుంచి ఐదు చిత్రాలు (ప్రేమలు- పెళ్లిళ్లు, మనసు, ఎల్ఎస్ఎల్ఎమ్, గతి, రామున్ని నేనే- రావణున్ని నేనే) రానున్నాయి. అన్ని చిత్రాల కథలు సిద్ధంగా ఉన్నాయి. ఐదు సినిమాలు ఒకేసారి చేసేంత డబ్బు లేదు. ఒక సినిమా తర్వాత ఇంకోటి చేస్తాను. 'ప్రేమలు-పెళ్లిళ్లు'ని ముందుగా సెట్స్ మీదకు తీసుకొస్తాను. ఇందులో కొత్తవారు నటిస్తారు'' అన్నారు.

ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్



● నేహా, రాహుల్

'రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్'. అశోక్ రెడ్డి కడదూరి దర్శకత్వం వహిస్తున్నారు. 'డియర్ మేఘ, 'భాగ్ సాలే' వంటి వైవిధ్యమైన సినిమాలు నిర్మించిన వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్‌పై అర్జున్ దాస్యన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ని హీరో-నిర్మాత రానా దగ్గుబాటి విడుదల చేసి, 'టైటిల్ ఆసక్తిగా ఉంది... సినిమా సక్సెస్ అవ్వాలి'' అని ఆకాంక్షించారు. ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా అశోక్ రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. నూతన దర్శకుడైనా అనుభవం ఉన్నవాడిలా తీర్చిదిద్దుతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. అజయ్ ఘోష్, మురళీధర్ గౌడ్, గెటప్ శ్రీను, రచ్చ రవి, రవి వర్మ, గంగవ్వ, జయశ్రీ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి కెమెరా: కార్తీక్ కొప్పెర, సంగీతం: సురేష్ బొబ్బిలి.

ఓటీటీ ఇది చూడొచ్చు

బిడ్డ కోసం పోరాడిన ఓ కన్నతల్లి కథ

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'కిడ్నాప్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



● 'కిడ్నాప్' పోస్టర్

ప్రపంచంలో తల్లి ప్రేమకు సాటి ఏదీ లేదని అంటారు. తన బిడ్డకు ఆపద వస్తే తన ప్రాణాన్ని పణంగా పెట్టైనా పోరాడే తత్వం తల్లిది అన్న విషయాన్ని సూటిగా చూపించిన ఆంగ్ల చిత్రం 'కిడ్నాప్'. 2017లో లూయి ప్రీటో దర్శకత్వంలో విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలందుకుంది. హాలీవుడ్ ప్రముఖ కథానాయిక హేలీ బెర్రీ ప్రధాన పాత్రలో నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ (ఇంగ్లిష్), లయన్స్ గేట్ (తెలుగు వెర్షన్) ఓటీటీల్లో స్ట్రీమ్ అవుతోంది. తల్లిగా ఆమె నటన ఈ సినిమా మొత్తానికే హైలైట్. కథాంశానికొస్తే... కార్లా డైసన్ ఓ సింగిల్ మదర్. తన ఆరేళ్ల కొడుకు ఫ్రాంకీని కార్నివాల్‌కు తీసుకువెళ్ళడంతో 'కిడ్నాప్' సినిమా మొదలవుతుంది. కార్నివాల్‌లో అనుకోకుండా పార్కింగ్ లాట్ నుండి తన కొడుకును ఎవరో ఎత్తుకెళ్లడం చూస్తుంది కార్లా. ఇక అక్కడి నుండి ఆ కిడ్నాపర్ల వెంటపడి తన కొడుకును ఎలా కాపాడుకుంటుంది అన్నదే మిగతా కథ. ఈ సినిమా స్క్రీన్‌ప్లే దాదాపు రోడ్డు మార్గానే నడుస్తుంది. అమెరికా రోడ్లలో పరిమితికి మించి వేగంగా కొంతమంది కార్లు నడుపుతూ ఉంటారు. అంతకు మించి వేగంగా ఈ కథ స్క్రీన్‌ప్లే ఉంటుంది. కుర్చీలో కూర్చున్న ప్రేక్షకులు ఈ సినిమా మొదలయ్యాక శుభం కార్డు పడే వరకు లేవరు. సినిమాను అంత ఆసక్తికరంగా దర్శకుడు లూయీ రూపొందించారనడంలో అతిశయోక్తి లేదు. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తీశారు. ప్రఖ్యాత సంస్థ అయిన ఎఫ్‌బీఐ ఇచ్చిన అంచనాల మేరకు అమెరికాలో ఏటా 8 లక్షలకు పైబడి ప్రతి 40 సెకన్లకు ఓ బిడ్డ కనిపించకుండాపోతున్న పరిస్థితి ఉంది. మనందరినీ మనకి తెలిసీ తెలియకుండా నిరంతరం కాపాడే అమ్మ ఆ విజయదుర్గ. ఆ తల్లి తత్వంతో తీసిన ఈ సినిమా నిజంగా అద్భుతం. విజయదశమి పండగ సమయంలో థ్రిల్లర్ జోనర్ ఇష్టపడే వాళ్లకి ఇదో మంచి చాయిస్.

– ఇంటూరు హరికృష్ణ


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 201

శుక్రవారం 11-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇంగ్లండ్ 823/7 డిక్లేర్డ్

టెస్టుల్లో నాలుగో అత్యధిక స్కోరు.. బ్రూక్ 'ట్రిపుల్'... రూట్ డబుల్ సెంచరీ - 13లో



రాఫెల్ నాదల్ వీడ్కోలు

వచ్చే నెలలో టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పనున్న స్పెయిన్ దిగ్గజం - 13లో



ఆప్‌ను ఎదుర్కోలేకే: అతిశి

ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించలేక పోయినందుకు బీజేపీ ఫ్రస్టేషన్‌లో ఉందని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశి వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో▶



మన స్నేహం బహు కీలకం

ప్రస్తుత తరుణంలో 'భారత్–ఆసియాన్' మధ్య స్నేహ సంబంధాలు, పరస్పర సహకారం కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు.


- వివరాలు 6లో▶



... విచారణ జరిపించాలి

'హరియాణా' ఓట్ల లెక్కింపులో అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో ఉన్నతస్థాయి విచారణకు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది.

- వివరాలు 6లో▶



సింగరేణికి 'భూగర్భ' శోకం

భూగర్భ గనులు సింగరేణికి గుదిబండగా మారాయి. ఈ గనులతో సంస్థ గత ఐదేళ్లలో రూ.13,093 కోట్ల నష్టాలను మూటగట్టుకుంది.

- వివరాలు 2లో▶



ద.కొరియా రచయిత్రికి సాహిత్య నోబెల్

వచన కవిత్వం రాసిన హాన్ కాంగ్‌కు ప్రకటించిన నోబెల్ కమిటీ

దక్షిణ కొరియా రచయిత్రి హాన్‌కాంగ్‌కు సాహిత్య నోబెల్ దక్కింది. చరిత్రలోని గాయాలను, మానవ జీవితంలోని దుర్బలత్వాన్ని అద్భుతమైన వచన కవిత్వం ద్వారా కాంగ్ ఆవిష్కరించారని నోబెల్ కమిటీ ప్రశంసించింది. సాహిత్య నోబెల్‌కు ఎంపికవడం ద్వారా ఈ అవార్డ్‌ను గెల్చుకున్న తొలి ఆసియన్ మహిళగా, రెండో దక్షిణకొరియా వ్యక్తిగా కాంగ్ చరిత్ర సృష్టించారు. ఆమె తొలి నవల 'బ్లాక్‌డీర్' 1998లో మార్కెట్లోకి వచ్చింది. మాంసాహారం మానేసి శాకాహారిగా మారుదామని ఒక మహిళ తీసుకున్న కఠిన నిర్ణయం కారణంగా జీవితంలో ఆమెకు ఎదురైన అనుభవాల సమాహారంగా వచ్చిన 'ది వెజిటేరియన్'కు బుకర్‌ప్రైజ్ లభించింది.

- వివరాలు 6లో



అధికారిక లాంఛనాలతో రతన్‌టాటా పార్థివదేహాన్ని ముంబైలోని వర్లీ శ్మశానవాటికకు తరలిస్తున్న దృశ్యం

అల్విదా.. భారత రతన్

పారిశ్రామిక దిగ్గజానికి భరతజాతి ఘన వీడ్కోలు

- శ్రద్ధాంజలి ఘటించిన వివిధ రంగాల ప్రముఖులు, వేలాది మంది ప్రజలు, అభిమానులు, ఉద్యోగులు
- అంతిమయాత్ర దారిపొడవునా వాహనం వెంట నడిచిన అభిమానులు
- అధికారిక లాంఛనాలతో ముగిసిన రతన్ టాటా అంత్యక్రియలు
- పార్సీల సంప్రదాయానికి భిన్నంగా విద్యుత్ దహనవాటికలో నిర్వహణ

ముంబై: పారిశ్రామిక దిగ్గజం, దాతృత్వ శిఖరం, టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటాకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వేలాది మంది అభిమానులు అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు. ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో బుధవారం రాత్రి తుది శ్వాస విడిచిన రతన్ టాటా అంత్యక్రియలు గురువారం ముంబైలోని వర్లీ శ్మశానవాటికలో మహారాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో పూర్తయ్యాయి. రతన్ టాటా పార్సీ అయినప్పటికీ సంప్రదాయానికి భిన్నంగా విద్యుత్ దహనవాటికలో ఆయన అంత్యక్రియలు జరిగాయి.

తరలివచ్చిన అభిమానగణం

అంతకుముందు.. ముంబైలోని కొలాబాలో ఉన్న రతన్ టాటా స్వగృహానికి ప్రముఖులు భారీగా

మిగతా 2వ పేజీలో ▶

30 వేల కోట్ల నుంచి లక్షల కోట్లకు!

- టాటా మహా సామ్రాజ్య జైత్రయాత్ర
- పరుగులు తీయించిన రతన్ టాటా
- రతన్ సాహసోపేత నిర్ణయాలతో ఆకాశమే హద్దుగా ఎదిగిన గ్రూప్ 13లో

వారసుడెవరు?

రతన్‌టాటా అస్తమయంతో సర్వత్రా ఆసక్తి 13లో

9 మంది ఏఐఎస్‌లు ఏపీకే!

ఏపీ కేడర్‌కు ఏడుగురు ఐఏఎస్, ఇద్దరు ఐపీఎస్‌లు

- తెలంగాణ నుంచి ఏపీకి ఐదుగురు ఐఏఎస్‌లు.. ఏపీలోనే కొనసాగనున్న ఇద్దరు ఐఏఎస్‌లు
- తెలంగాణ నుంచి ఏపీకి ఐపీఎస్‌లు అంజనీకుమార్, అభిలాష్ బిష్త్
- ఏపీ నుంచి తెలంగాణ కేడర్‌కు మరో ముగ్గురు ఐఏఎస్‌లు
- ఏపీ, తెలంగాణ మధ్య ఏఐఎస్ అధికారుల తుది కేటాయింపులపై డీవోపీటీ కీలక నిర్ణయం
- ప్రస్తుత రాష్ట్ర కేడర్ నుంచి ఈ అధికారులను తక్షణమే రిలీవ్ చేస్తున్నట్లు ప్రకటన
- ఈ నెల 16లోగా పొరుగు రాష్ట్రంలో రిపోర్టు చేయాలని ఆదేశం


ఆమ్రపాలి


వాకాటి కరుణ


రోనాల్డ్ రోస్


వాణీ ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య అఖిల భారత సర్వీసుల (ఏఐఎస్) అధికారుల తుది కేటాయింపుల విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తమను ఏపీ కేడర్‌కు బదులుగా తెలంగాణ కేడర్‌కు కేటాయించాలన్న ఏడుగురు ఐఏఎస్, ఇద్దరు ఐపీఎస్ అధికారుల విజ్ఞప్తులను తిరస్కరించింది. వారిలో ఇద్దరు ఐఏఎస్ అధికారులు ప్రస్తుతం ఏపీలోనే పనిచేస్తుండగా మిగిలిన ఐదుగురు తెలంగాణలో పనిచేస్తున్నారు. అదేవిధంగా తమను తెలంగాణ కేడర్‌కు బదులు ఏపీ కేడర్‌కు కేటాయించాలన్న మరో ముగ్గురు ఐఏఎస్ అధికారుల విజ్ఞప్తులనూ తిరస్కరించింది. తక్షణమే వారిని ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్ర కేడర్ నుంచి రిలీవ్ చేయడంతోపాటు ఈ నెల 16లోగా పొరుగు రాష్ట్రంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ(డీవోపీటీ) వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఈ ఉత్తర్వులను అమలు చేయాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన ఐఏఎస్ అధికారులు షంషేర్ సింగ్ రావత్, జి.అనంతరాము ప్రస్తుతం ఆ రాష్ట్రంలోనే పనిచేస్తూ తమను తెలంగాణకు కేటాయించాలని విజ్ఞప్తి చేయగా ఆ విజ్ఞప్తిని కేంద్రం తిరస్కరించి వారిద్దరినీ ఏపీలోనే కొనసాగాలని ఆదేశించింది. మిగిలిన వారంతా ప్రస్తుతం తాము పనిచేస్తున్న రాష్ట్రాన్ని వదిలేసి పొరుగు రాష్ట్రానికి వెళ్లకతప్పని

మిగతా 9వ పేజీలో ▶

హనుమకొండ పద్మాక్షి ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



'సద్దుల' సంబురం

హరివిల్లు విరిసినట్టు.. 'విరి'జల్లు కురిసినట్టు.. నేలంతా పూలవనమైంది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో మహిళలు ఆడిపాడారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

ఇదం జగత్




బాహ్య ప్రపంచంతో ఎలాగూ సంబంధాలు లేవు! దేశం చుట్టూ సరిహద్దును కూడా మూసేద్దాం సార్!

ఒకటే చట్టం... ఒకటే మాడ్యూల్

రాష్ట్రంలోని 124 చట్టాలను కలిపి రెవెన్యూ కోడ్ అమలు

- ఇప్పటికే సిద్ధమవుతున్న ముసాయిదా.. త్వరలోనే ప్రభుత్వ పరిశీలనకు..
- ప్రస్తుతం ఉన్న 20కిపైగా కాలంచెల్లిన రెవెన్యూ చట్టాలను రద్దు చేసే అవకాశం

- వివరాలు 9లో



ఉద్యోగులకు మెరుగైన హెల్త్ స్కీం తెస్తాం



- ట్రస్ట్ లేదా బీమా సంస్థలతో ఈహెచ్‌ఎస్‌కు కసరత్తు చేస్తున్నాం
- డిజిటల్ ఫ్యామిలీ కార్డులతో అన్ని పథకాలు, సేవలు
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

8లో

గురుకుల భవనాలకు నేడు శంకుస్థాపన

- రాష్ట్రవ్యాప్తంగా 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో భూమిపూజ
- కొందుర్గులో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి

8లో




రతన్ టాటా పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా




అంత్యక్రియలకు హాజరైన టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్, రతన్ టాటా సోదరుడు జిమ్మీ టాటా, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, నీతా అంబానీ

అల్విదా.. భారత రతన్

మొదటి పేజీ తరువాయి

తరలివచ్చారు. ఆయన పార్థివదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తర్వాత అధికారిక లాంఛనాల్లో భాగంగా ఆయన భౌతికకాయంపై జాతీయ జెండాను ఉంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఇరువైపులా పోలీసులు వెంటరాగా దక్షిణ ముంబైలో ఉన్న నేషనల్ సెంటర్ ఫర్ పర్ఫామింగ్ ఆర్ట్స్ (ఎన్‌సీపీఏ) మైదానానికి తీసుకొచ్చారు. దారి పొడవునా ఆయన అభిమానులు వాహనం వెంట నడిచారు. పోలీసు బ్యాండ్ ప్రత్యేక ట్యూన్‌ను వాయించింది. ఎన్‌సీపీఏ మైదానంలో మధ్యాహ్నం దాకా ప్రముఖుల సందర్శనార్థం ఉంచారు. అనంతరం అక్కడి నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని వర్లీలో ఉన్న మున్సిపల్ శ్మశానవాటికకు అంతిమయాత్ర కొనసాగింది. దారిపొడవునా జనం పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్మశానవాటికకు తరలించాక అక్కడ ముంబై పోలీసులు టాటాకు గౌరవసూచికగా గన్ సెల్యూట్ చేశారు.


రతన్ టాటా పార్థివదేహం

తరలివచ్చిన ప్రముఖులు

వర్లీ శ్మశానవాటికలో సవతి తల్లి సోదరుడు నోయల్ టాటా, టాటాల కుటుంబ సభ్యులు సహా సినీ, పారిశ్రామిక, సామాజిక, క్రీడా, రాజకీయ ప్రముఖులు, సెలబ్రిటీలు, స్థానికులు, టాటా గ్రూప్ సంస్థల ఉద్యోగులు, పోలీసు ఉన్నతాధికారులు, ఎన్‌సీపీఏ విద్యార్థులు, అంత్యక్రియలకు హాజరయ్యారు. టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, కేంద్ర మంత్రులు అమిత్ షా, పియూశ్ గోయల్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవిస్, మాజీ సీఎం సుశీల్‌కుమార్ షిండే, ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్‌పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలే, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన చీఫ్ రాజ్‌ఠాక్రే, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా, ఆర్థికరంగ దిగ్గజం దీపక్ పరేక్, భారత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్, ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం, ఏపీ సీఎం చంద్రబాబు, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, సూపర్‌స్టార్ అమిర్‌ఖాన్, కిరణ్ రావ్, దర్శకుడు మధు భండార్కర్, నటుడు రాజ్‌పాల్ యాదవ్, తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు. రతన్ టాటాకు నివాళిగా గురువారం మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాలు సంతాప దినంగా పాటించాయి. ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను అవనతం చేశాయి.

పాత సంప్రదాయానికి భిన్నంగా..

టాటాలు జొరాస్ట్రియన్ మతంలోని పార్శీ వర్గానికి చెందిన వాళ్లు. సాధారణంగా పార్శీల అంత్యక్రియల తర్వాత పార్థివదేహాన్ని దహనం, ఖననం చేయరు. రాబందులకు ఆహారంగా ఒక కొండ శిఖరంపై వదిలేస్తారు. ప్రకృతి వరప్రసాదంగా శరీరంతో భువి మీదకు వచ్చిన మనిషి తిరిగి స్వర్గస్తులైనప్పుడు ఆ శరీరాన్ని మళ్లీ ప్రకృతికే విడిచిపెట్టాలని జొరాస్ట్రియన్లు విశ్వసిస్తారు. దహనం చేసి గాలిని, ఖననం చేసి నేల, నీటిని కలుషితం చేయడాన్ని వాళ్లు పాపంగా భావిస్తారు. టవర్ ఆఫ్ సైలెన్స్‌గా పిలిచే ప్రాంతంలో పార్థివదేహాన్ని వదిలేస్తారు. అక్కడ రాబందులు శరీరాన్ని ఆహారంగా తీసుకుంటాయి. అయితే కాలక్రమంలో రాబందుల సంఖ్య తగ్గిపోవడంతో కొందరు ఆధునిక పార్శీలు ఈ ప్రాచీన సంప్రదాయం నుంచి 'ఎలక్ట్రిక్ దహనం' విధానానికి మళ్లారు. టాటా గ్రూప్ మాజీ చైర్మన్, షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ వారసుడు, పార్శీ అయిన సైరస్ మిస్త్రీ అంత్యక్రియలు సైతం 'టవర్ ఆఫ్ సైలెన్స్'కు బదులు 2022లో వర్లీలోని అదే ఎలక్ట్రిక్ దహనవాటికలో జరిగాయి. గురువారం రతన్ టాటా అంత్యక్రియలను సైతం అలాగే పూర్తిచేసినట్లు అక్కడి క్రతువుకు సాయపడిన మతాధికారుల్లో ఒకరైన పెరీ కంబట్ట వెల్లడించారు. అయితే మరో మూడు రోజులపాటు రతన్ టాటా ఇంట్లో పార్శి సంప్రదాయ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

రతన్ టాటా నిత్య చైతన్య స్ఫూర్తి

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సంతాపం



సాక్షి, అమరావతి: ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం, టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా మృతిపట్ల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు. టాటా కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. 'రతన్ టాటాజీని కోల్పోయినందుకు చాలా బాధపడుతున్నా. ఆయన గొప్ప దార్శనికుడు. గొప్ప మానవతావాది. నిత్య చైతన్య స్ఫూర్తి. రతన్ టాటా చిత్తశుద్ధి, నాయకత్వం మనకే కాదు... భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుంది'అని 'ఎక్స్'లో వైఎస్ జగన్ తన ఖాతాలో పోస్టు చేశారు.


రతన్ టాటా పార్థివదేహాన్ని తీసుకెళ్తున్న వాహనం


రతన్ టాటాకు కడసారి వీడ్కోలు పలికేందుకు ముంబైలోని ఎన్‌సీపీఏ కేంద్రం వెలుపల నిరీక్షిస్తున్న ప్రజలు



పూరీ బీచ్‌లో రతన్ టాటాకు సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ నివాళి


రతన్ టాటా పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

ఒక టాటా.. ఒక గోవా!



అంతిమయాత్రలో రతన్ టాటా పెంపుడు శునకం

ముంబై: రతన్ టాటా అంత్యక్రియల వద్ద గంభీరమైన వాతావరణంలో అక్కడికి పరుగెత్తుకొచ్చిన ఒక శునకం రతన్ పార్థివదేహాన్ని చూసి మౌనంగా ఉండిపోయింది. తన నేస్తం, యజమాని ఇక లేరని తెల్సి మౌనంగా రోదించింది. అక్కడే ఉంటూ ఆయన భౌతికకాయం నుంచి దూరం జరగబోనని భీష్మించుకుని అక్కడే ఉండిపోయింది. ఒకప్పుడు వీధి కుక్కగా పెరిగి తదనంతరకాలంలో రతన్‌టాటాకు మంచి నేస్తంగా మారిన 'గోవా' శునకం అది. ఒకప్పుడు ఎలాంటి ఆదరణ లేక గాయపడి గోవాలో ఒంటరిగా తిరుగుతున్న చిన్న కుక్క పిల్ల అది. పదేళ్ల క్రితం రతన్ గోవాకు వెళ్లినపుడు ఇది ఆయన కంట పడింది. జంతు ప్రేమికుడైన రతన్ వెంటనే దానిని చేరదీశారు. దాని బాగోగులు చూసుకున్నారు. టాటా గ్రూప్ కేంద్రకార్యాలయం బాంబే హౌస్‌కూ రతన్‌తో పాటు ఇది కూడా వస్తుండేది. 2020లో బాంబేహౌస్ శునకాలతో కలిసి దీపావళి వేడుకలు అంటూ రతన్ పెట్టిన ఇన్‌స్టాగ్రామ్ ఫొటోల్లో టిటో, టాంగో శునకాలతోపాటు గోవా కూడా ఉంది. గురువారం ఎన్‌సీపీఏ ప్రాంగణంలో రతన్ భౌతికకాయం వద్దకు దీనిని తీసుకొచ్చారు. ''రతన్‌కు ఇది అత్యంత ఆప్తమైన నేస్తం. ఆయన అలా శాశ్వత నిద్రలోకి వెళ్లాక ఇది ఉదయం నుంచి ఇంతవరకు ఏమీ తినలేదు'' అని దాని సంరక్షకుడు చెప్పారు. '' రతన్ టాటాకు శునకాలంటే ప్రేమ. తాజ్‌మహల్ హోటల్ కావొచ్చు, బాంబే హౌస్ కావచ్చు, టాటా సంస్థల ప్రాంగణాల్లో మనకు ఒకప్పటి వీధి శునకాలే మనకు మంచి నేస్తాలుగా స్వాగతం పలుకుతాయి'' అని మహారాష్ట్ర నవని ర్మాణ్ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రే గుర్తుచేసుకున్నారు. 2018లో బ్రిటన్ యువరాజు ఛార్లెస్ నుంచి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ తీసుకునేందుకు వెళ్లాల్సి ఉంది. సరిగ్గా అప్పుడు ఆయన పెంపుడు శునకం ఒకటి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఈ స్థితిలో వీటిని ఇలా వదిలేసి వెళ్లబోనని అవార్డ్ కార్యక్రమాన్ని టాటా రద్దుచేసుకున్నారని ఆయన స్నేహితుడు సుహేల్ సేఠ్ చెప్పారు. రతన్‌కు జంతువుల పట్ల ప్రేమ వారి పూర్వీకుల నుంచి వచ్చిందని చెప్తారు. బాంబే హౌస్‌లో వీధి శునకాల కోసం ప్రత్యేకంగా సంరక్షణా కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. టాటాల చాలా ఆఫీసుల్లో కుక్కల కోసం ప్రత్యేకంగా ఆహారం, తాగునీరు, బొమ్మలు, ఆట స్థలం ఉండటం విశేషం.

భూముల విలువల సవరణ ఎప్పుడో?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని భూములు, ఆస్తులకు సంబంధించి ప్రభుత్వ విలువల సవరణ ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందన్న విషయంలో స్పష్టత రావడం లేదు. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది ఆగస్టు 1 నుంచే సవరించిన విలువలు అమల్లోకి రావాల్సి ఉన్నప్పటికీ పారదర్శకత పేరుతో థర్డ్ పార్టీ ఏజెన్సీకి ఈ బాధ్యతలు అప్పగించడంతో జాప్యం జరుగుతోంది. ఈ ఏజెన్సీ నివేదిక ఇంకా ప్రభుత్వం చేతికి రాలేదని తెలుస్తోంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాత్రం నవంబర్ నెలలోనే సవరించిన విలువలను అమల్లోకి తేవాలనే యోచనలో ఉన్నా.. థర్డ్ పార్టీ నివేదిక ఎప్పుడు వస్తుందన్న దానిపైనే సాధ్యాసాధ్యాలు ఆధారపడి ఉన్నాయని చెపుతున్నారు. మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికలు జరగాల్సి ఉన్నందున



భూముల ధరలు పెంచడం వల్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశముందన్న అంచనాల నేపథ్యంలో ఆ ఎన్నికలు పూర్తయ్యేవరకు భూముల విలువల సవరణ అమల్లోకి రాదనే వాదన కూడా వినిపిస్తోంది.

నాలుగు నెలల క్రితం..

వాస్తవానికి, భూముల విలువల సవరణ కార్యక్రమాన్ని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఈ ఏడాది జూన్ 14వ తేదీన ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేక షెడ్యూల్‌ను విడుదల చేసింది. దాని ప్రకారం ఆగస్టు 1వ తేదీ నుంచి సవరించిన విలువలు అందుబాటులోకి రావాల్సి ఉంది. షెడ్యూల్ మేరకు రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు తమ కసరత్తు పూర్తి చేశాయి. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను బట్టి భూముల విలువలను సవరిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. అయితే, ఈ ప్రతిపాదనల మేరకు విలువలు సవరించకుండా, ఇతర రాష్ట్రాల్లో జరిగిన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం థర్డ్‌పార్టీకి ఈ కసరత్తు బాధ్యతలను అప్పగించింది. ఇప్పుడు ఆ థర్డ్ పార్టీ కసరత్తు ఎంత వరకు వచ్చిందన్నది అంతుపట్టడం లేదని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలే చెబుతున్నాయి. అసలు ఎప్పుడు నివేదిక ఇస్తుందన్న దానిపై స్పష్టత రావడం లేదని, నివేదిక వచ్చిన తర్వాత కూడా మరోమారు అధికారికంగా ప్రతిపాదనలు చేసి కమిటీల ఆమోదానికి సమయం తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో విలువల సవరణ ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందన్న దానిపై తామేమీ చెప్పలేమని ఆ వర్గాలు అంటున్నాయి.

ఆగస్టు 1 నుంచే అమల్లోకి రావాల్సిన ప్రక్రియ వాయిదా

- ఇంకా ప్రభుత్వం చేతికి అందని థర్డ్ పార్టీ నివేదిక
- స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు వాయిదా పడే అవకాశం

రతన్‌టాటా గొప్ప మానవతావాది

ఆయన మరణం దేశానికే తీరని లోటు: సీఎం రేవంత్



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ పారిశ్రామిక వేత్త, గొప్ప మానవతావాది రతన్ టాటా మరణం పట్ల ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని, వారి నిష్క్రమణ పారిశ్రామిక రంగానికే కాకుండా యావత్ దేశానికి తీరని లోటు అని సీఎం పేర్కొన్నారు. టాటా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎనలేని సేవలు అందించారని, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు.

స్ఫూర్తిదాయకంగా నిలిచారు: హరియాణా గవర్నర్ దత్తాత్రేయ



రతన్‌టాటా ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారని, సమాజసేవ పట్ల అంకితభావం ఎంతోమందికి మేలు చేసిందని హరియాణా గవర్నర్ దత్తాత్రేయ తెలిపారు. పనిపట్ల వారి నిబద్ధత, నిజాయితీతో అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు గడించారని, విద్య, ఆరోగ్య సంరక్షణ, పారిశుధ్యం, జంతు సంక్షేమం వంటి రంగాల్లో వారి దాతృత్వం మరవలేనిదన్నారు.

ఆర్థిక ప్రగతికి మానవత్వం అద్దిన పారిశ్రామికవేత్త: కేసీఆర్



ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన అరుదైన పారిశ్రామికవేత్త రతన్‌టాటా అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కొనియాడారు. అభివృద్ధి ఫలాలు కింది స్థాయికి చేరుకోవాలనే సామాజిక, ఆర్థిక తాత్వికతను సొంతం చేసుకున్న పారిశ్రామికవేత్త రతన్‌టాటా అని నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రగతిని ఆయన అభినందించడాన్ని స్మరించుకున్నారు.

అమూల్యమైన రత్నం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కొన్ని తరాలకు స్ఫూర్తి నింపిన ఓ అమూల్యమైన 'రత్నాన్ని'భారతదేశం కోల్పోయిందని రతన్‌టాటా మృతిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నివాళి అర్పించారు. వారి నిరాడంబరమైన జీవితం, సమాజాభివృద్ధి దిశగా చేసిన ప్రయాణం.. భవిష్యత్ తరాలకు కూడా స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయని చెప్పారు.

- దేశానికి కష్టం వచ్చిన ప్రతీసారి టాటా గ్రూప్ అధినేతగా రతన్ టాటా వందల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వానికి విరాళంగా అందజేసి అండగా నిలిచారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి గుర్తు చేశారు.
- సేవా కార్యక్రమాలకు రతన్ టాటా పెట్టింది పేరని, ఆయన మృతితో అన్ని రంగాల్లో ప్రకాశించే అరుదైన రత్నాన్ని భారతదేశం కోల్పోయిందని మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు.
- టాటా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా టాటా చేసిన సేవలు చిరస్మరణీయమని, దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు.
- ప్రతి భారతీయ కుటుంబం కారును సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో నానో ఆలోచనతో రతన్ టాటా రావడం ఎప్పటికీ మరువలేనిదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

సింగరేణికి 'భూగర్భ' శోకం

సాక్షి, హైదరాబాద్: భూగర్భ గనులు సింగరేణి సంస్థకు గుదిబండగా మారాయి. ఈ గనులతో సంస్థ గత ఐదేళ్లలో రికార్డుస్థాయిలో రూ.13,093 కోట్ల నష్టాలను మూటగట్టుకుంది. ఈ గనుల్లో టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.10,394 ఖర్చు అవుతుండగా, అమ్మకం ద్వారా రూ.4854 మాత్రమే ఆదాయం వస్తోంది. భూగర్భ గనుల్లో 2019–20లో 86.65 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగగా, 2023–24లో 59 లక్షల టన్నులకు తగ్గిపోవడం సంస్థను మరింత కుంగదీస్తోంది. మరోవైపు టన్ను బొగ్గు ఉత్పత్తి వ్యయం 2019–20లో రూ.5413 ఉండగా, 2024–25 నాటికి రూ.10,394కు పెరిగింది. అందులో రూ.7901 ఉద్యోగుల జీతభత్యాల వ్యయమే ఉండటం గమనార్హం. ఇదే కాలంలో అమ్మకం ధర టన్నుకు రూ.3135 నుంచి రూ.4854కు మాత్రమే పెరగడంతో ఏటేటా నష్టాల శాతం పెరిగిపోతోంది. ఉపరితల గనులు, బ్యాంకు డిపాజిట్ల వడ్డీలు, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంతో వస్తున్న లాభాలతో భూగర్భ గనుల నష్టాలను పూడ్చుకొని సంస్థ నికర లాభాలను సాధిస్తోంది. డిప్యూటీ సీఎంభట్టి విక్రమార్క ఆదేశాలతో దసరా పండుగ సందర్భంగా సింగరేణివ్యాప్తంగా 40వేల మంది కార్మికులకు గత రెండు రోజులుగా సామూహిక విందు భోజనం ఏర్పాటు చేసి వారికీ ఈ విషయాలను అధికారులు వివరిస్తున్నారు.

ఐదేళ్లలో రూ.13,093 కోట్ల నష్టం

అండర్ మైన్స్‌లో ఉత్పత్తి అయ్యే టన్ను బొగ్గుకు ఖర్చు రూ.10,394..
విక్రయిస్తే వచ్చేది రూ.4854 మాత్రమే
మరోవైపు భూగర్భ గనుల్లో గణనీయంగా తగ్గిన ఉత్పాదకత.. పెరిగిన వ్యయం
కార్మికులు, యంత్రాల పనిగంటలు పెంచితేనే నష్టాల నుంచి గట్టెక్కే అవకాశం
దసరా సందర్భంగా కార్మికులకు వివరిస్తున్న సింగరేణి యాజమాన్యం


ఉజ్వల సింగరేణి–కార్మికుల పాత్ర....


'ఉజ్వల సింగరేణి–కార్మికుల పాత్ర'అనే అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితి, మార్కెట్‌లో తక్కువ ధరకు బొగ్గు అమ్ముతున్న ఇతర కంపెనీలతో ఎదుర్కొంటున్న సవాళ్లు, సింగరేణిలో ఉత్పత్తి ఖర్చును తగ్గించాల్సిన అవసరం, యంత్రాలను సమర్థంగా వినియోగించాల్సిన బాధ్యత, డ్యూటీ సమయం సద్వినియోగం అనే అంశాలపై గణాంకాలతో సహా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి గనిలో వివరిస్తున్నారు. సింగరేణి బొగ్గుధర... కోల్ ఇండియా, ఇతర ప్రైవేట్ కంపెనీల కన్నా ఎక్కువగా ఉండడంతో వినియోగదారులు దూరమయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

- మొత్తం 22 భూగర్భ గనులుండగా, 16 గనుల్లో ఎస్‌డీఎల్ యంత్రాలతో ఉత్పత్తి జరుగుతోంది. భూగర్భ గనుల ఉత్పత్తిలో 50 శాతానికి పైగా ఈ 16 గనుల్లోనే ఉంటోంది. భూగర్భ గనుల ఉద్యోగుల్లో 75 శాతం అనగా, 17,286 మంది ఈ గనుల్లోనే పనిచేస్తున్నారు. ఎస్‌డీఎల్ యంత్రాల పనిని రోజుకు 2 గంటలు పెంచితే 30 టన్నుల ఉత్పత్తి పెరిగి మొత్తం రోజువారీ ఉత్పత్తి 132 టన్నులకు చేరుతుంది. దీంతో నెలకు రూ.104 కోట్ల నష్టాలు తగ్గుతాయి.
- 2008–09లో భూగర్భ గనుల్లో అత్యధికంగా రోజుకు 142 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా, 2023–24లో 102 టన్నులకు తగ్గింది. కార్మికుల పనిగంటలూ 8.5 నుంచి 6.7కి పడిపోయాయి. ఈ రెండు గంటల ఉత్పత్తిని మళ్లీ పెంచితే రోజుకి 30 టన్నుల ఉత్పత్తి అదనంగా జరిగి మొత్తం రోజువారీ ఉత్పత్తి 132 టన్నులకు పెరుగుతుంది. ఉత్పత్తి కనీసం 20శాతం పెరిగినా నెలకు రూ.155 కోట్ల నష్టాలు తగ్గుతాయి.
- వెస్టర్న్ కోల్డ్ ఫీల్డ్ లిమిటెడ్(డబ్ల్యూసీఎల్), మహానది కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్(ఎంసీఎల్) విక్రయిస్తున్న బొగ్గు ధరలతో పోల్చితే సింగరేణి బొగ్గు ధరలు రెండింతలు అధికంగా ఉన్నాయి. ఉదాహరణకు టన్ను గ్రేడ్–5 బొగ్గును సింగరేణి రూ.5,685కు విక్రయిస్తుండగా, డబ్ల్యూసీఎల్, ఎంసీఎల్ సంస్థలు కేవలం రూ.2,970కే విక్రయిస్తున్నాయి.
- రాబోయే ఏళ్లలో సింగరేణి సంస్థ కొత్తగా ఒక భూగర్భ గని, 6 భూ ఉపరితల గనులను ప్రారంభించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. వాటి నుంచి ఏటా 21.9 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీకే, జీడీకే 10, జేకే(రొంపేడు), గోలేటి, ఎంవీకే, పీవీఎస్ఆర్(వెంకటాపూర్) అనే ఉపరితల గనులతో పాటు కేటీకే ఓసీ–2 అనే భూగర్భ గని ఇందులో ఉంది. ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో ఈ ఏడాది నుంచే ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉంది.




BASICS
#basicsonme
BASICS RE IMAGINED
AUTUMN / WINTER 2024
FESTIVAL GIFTS ON EVERY PURCHASE*
AVAILABLE AT 130+ EXCLUSIVE STORES AND AT ALL LEADING OUTLETS ACROSS INDIA
For franchise enquiries contact Mr. Om Rajesh on 99418 05000
For trade enquiries contact Mr. KV Kannan on 98406 17000
Shop online : www.basicslife.com
Youtube.com/@BasicsLife
Instagram.com/basicslife
Facebook.com/BasicsLifeIndia
ONLINE PARTNERS


TATA ఉత్పాదన
For marriages crafted by you
TANISHQ
PRESENTS
RIVAĀH
WEDDING JEWELLERY
20%
వరకు తగ్గింపు*
మీ పాత బంగారంపై
100%*
FLAT ₹4,000 INSTANT DISCOUNT* SBI card
*Min. Trxn.: ₹80,000; Max Discount: ₹4000 per card.
Validity: 11 Oct - 13 Oct 2024. T&C Apply.
గోల్డ్ రేట్ ప్రొటెక్షన్ –
To locate your nearest store and know more on 8147349242.
or Download our App *Conditions apply. For T&C visit our website.


Hero
GIFT
Grand Indian Festival of Trust
రాజీ పడేది లేదు,
కేవలం HF Deluxe
పండుగ ఎక్స్-షోరూమ్ ధర**
₹85200 ₹82700
(₹2500$ క్యాష్ డిస్కౌంట్‌తో సహా)
అద్భుతమైన మైలేజ్
XSENS FI
సాటిలేని శక్తి
కర్బ్ వెయిట్ 112 కేజీలు
బలమైన శక్తి
5.9 kW
USB ఛార్జర్
తక్కువ
మెయింటెనెన్స్ ఖర్చు
తక్కువ డౌన్ పేమెంట్ ₹1999^
వడ్డీ రేటు 5.99%^
ఎంపిక చేసిన కార్డ్‌లపై ₹5000~ వరకు క్యాష్‌బ్యాక్
Toll Free Number:
1800 266 0018
INDIA'S FIRST 5 YEAR WARRANTY *Conditions apply
$ADDITIONAL CASH DISCOUNT AVAILABLE ON
Flipkart
amazon
~INSTANT CASHBACK AVAILABLE ON
HDFC BANK
pine labs PAY LATER
Special offers for CSD/CPC/Corporate employees. Reach us at: institutionalsales@heromotocorp.com
Hero MotoCorp Ltd. Regd. Office: The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj Phase - II, New Delhi - 110070, India. | CIN: L35911DL1984PLC017354 | For further information, contact your nearest Hero MotoCorp authorised outlet or CALL TOLL-FREE 1800 266 0018 or visit us on www.heromotocorp.com. Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding a two-wheeler. *Offer is for a limited period or till stock lasts. Offer amount may vary for model/variant and states. For more details, please visit your nearest authorised Hero outlet. Available at select dealerships. **Festive on-road price of HF Deluxe in Hyderabad, it is inclusive of applicable offers on respective models. On-road price includes Ex-showroom, Insurance and Registration charges. For more details, please visit your nearest authorised Hero outlet. ~The 5% cashback upto ₹5000/- is applicable on minimum transaction of ₹40,000, subject to the credit card company's, T&Cs. ^Finance offer is at the sole discretion of the Financier, subject to its respective T&Cs. Available at select dealerships. $Flipkart and Amazon offers are subject to the sole discretion & T&Cs of respective organisations.
AUTHORISED DEALERS – Hyderabad: Geetha Hero, Suchitra: Ph: 9289923134. Tadubund Ph: 9515408055. Sri Lakshmi Hero, Malakpet: Ph: 9289922155. Saroornagar: Ph: 9246223479, Vanasthalipuram: 9246223423. Bhanu Hero, Erragadda: Ph: 9289922148. Kukatpally: Ph: 9392525886. Miyapur: 9392525885. Phoenix Hero, Habsiguda: Ph: 9289922515. Ramanthapur: Ph: 9246394475. Nagole: Ph: 9246394476. Kushaiguda: Ph: 9246824193. Dealwel Hero, Nampally: Ph: 9289922827. Asifnagar: Ph: 7013367531. Narsingi: Ph: 8712314565, Bibinagar: 7993119099, Attapur: 7995852452. Sri Venkanna Hero, Patancheru: Ph: 9289922150. Serilingampally: Ph: 9640515185. Sowjanya Hero, Bahadurpura: Ph: 9289923133. Phoenix Hero, Hi-tech City: Ph: 9289922759. Hafeezpet: Ph: 7799017976. TolliChowki: Ph: 7799960345. Chandanagar: Ph: 9100189997. Krishna Sai Hero, Malkajgiri: Ph: 9289922972. Lakshmi Hero, Somajiguda: Ph: 9289922147. Venkateshwara Hero, Narayanguda: Ph: 9289922145, 7799884320, Pragnapur: 8886642271. Prudhvi Hero, Sangareddy Ph: 9821697396 Associate Dealer: MEDAK: PH:93468 48532. CHINTAL: PH: 9246562269. HAYATNAGAR: PH:92465 55683. IBRAHIMPATNAM: PH:9703394833. KPHB: PH:9246566605. MEDCHAL: PH:9949881116. SEETHAFALMANDI: PH:9848868671. SHAMSHABAD: PH:7893812758. TURKAYAMZAL: PH:9014250111. ZAHEERABAD: PH:9440953602. BALAPUR: PH: 7396284446 KOTHUR: PH:9989680055. SHADNAGAR:PH:9849408227. MANIKONDA: 9453912345 MALLAPUR: 9849362062 SANTOSHNAGAR:9885307031 Also Available at: CHEGUNTA: PH:8019134280. DUBBAK: PH:9866863089. JOGIPET: PH:9849417030. NARAYANKHED: PH:8019134280. NARSAPUR: PH:9701685551. RAMAYAMPET: PH:9912475028. SADASIVPET: PH:9395383939. VANTIMAMIDI: PH:7659084449. ALWAL: PH:8019011555. BACHUPALLY: PH:9505268989. CHEVELLA: PH:9550024062. GACHIBOWLI: PH:7799238866. GHATKESAR: PH:9866825296. JAGDEVPUR: PH:9346072111. KANDUKUR X ROAD: PH:9290874477. KATTEDAN: PH:8790467659. KUKNURPALLE: PH:9912433300. KULKACHERLA: PH:9866594434. MAJIDPUR: PH:9440249174. MALL: PH:7729991772. MEDIPALLY: PH: 9951128704. MOINABAD: PH:9966492929. NAGARAM: PH: 9391043316. PARIGI: PH:9603773334. SHANKERPALLY: Vaishno Motors- PH:9849095545. TANDUR: PH:9701942955. THUKKUGUDA: PH:9014250111. THUMKUNTA: PH:9440028414. VIKARABAD: PH:9966213333.
FCB INTERFACE/6878/OCT2024/TEL

> సత్కార్యాలు చేసేవారు – వారు పురుషులైనా, స్త్రీలైనా– విశ్వసించి ఉంటే, ఇలాంటివారు తప్పకుండా స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి ఖర్జూరపు విత్తనంపై ఉండే గాటుకు సమానంగా కూడా అన్యాయం జరగదు.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 11 అక్టోబర్ 2024

అక్షరాలా భారత రత్నమే!

నిదానంగా కదులుతూ... ముక్కుసూటిగా మాట్లాడుతూ... విలువలను ఎత్తిపడుతూ కూడా అన్యులకు అసాధ్యమైన సమున్నత శిఖరాలను చేరుకోవచ్చని ఆరు దశాబ్దాల తన ఆచరణతో దేశానికి చాటిచెప్పిన దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా బుధవారం రాత్రి కన్నుమూశారు. ఆయన అక్షరాలా రత్నం. సార్థక నామధేయుడు. చెదరని వినమ్రత, సడలని దృఢ సంకల్పం, లక్ష్యసాధనకు ఎంత దూరమైనా వెళ్లే లక్షణం... విశాల టాటా సామ్రాజ్యంలో ఆయనను విలక్షణ వ్యక్తిగా నిల బెట్టాయి. కనుకనే మూడు దశాబ్దాల పాటు ఆ సామ్రాజ్యానికి ఆయన అక్షరాలా చక్రవర్తిగానే వ్యవహరించారు. నిజమే... ఆయన 1962లో సాధారణ ఉద్యోగిగా చేరిననాటికే దేశంలో అదొక అత్యున్నత శ్రేణి సంస్థ కావొచ్చుగాక. పైగా సంస్థ సారథులకు ఆయన అతి దగ్గరివాడు, బంధు వర్గంలో ఒకడు కూడా! కానీ ఆయన ఎదుగుదలకు తోడ్పడినవి అవి కాదు. ఆయన అంకితభావం, దీక్షాదక్షతలు, నిరంతర తపన ఆయనను అంచెలంచెలుగా పైపైకి చేర్చాయి.

పేరుకు ఒక సంఘటిత సంస్థే అయినా, అప్పటికే లక్షలమంది సిబ్బందికి చల్లని నీడనిచ్చే కల్పవృక్షంగా పేరుతెచ్చుకున్నా... టాటాల సామ్రాజ్యం విభిన్న సంస్థల సమాహారం మాత్రమే! అందులో సమష్టితత్వం, దిశ, దశా నిర్దేశించే ఉమ్మడి తాత్విక భూమిక శూన్యం. జమ్‌షెడ్జీ టాటా, జేఆర్‌డీ టాటా వంటివారు నేతృత్వం వహించిన ఆ సంస్థలో నాయకత్వ స్థానం దక్కాలంటే అడుగడుగునా అవరోధాలు తప్పలేదు. నెత్తురు చిందకపోవచ్చు... గాయాల జాడ లేకపోవచ్చు, కానీ రోమన్ సామ్రాజ్యకాలం నాటి కలోసియంలను తలపించే బోర్డు రూంలో తన ఆలోచనలనూ, తన భావనలనూ బలంగా వినిపించి ప్రత్యర్థుల వాదనలను పూర్వపక్షం చేయటం మాటలు కాదు. తన ప్రతి పలుకూ, ప్రతి వివరణా నిశితంగా గమనించే, ప్రశ్నించే ఆ బోర్డు రూంలో గెలవటం సాధారణం కానే కాదు. కానీ రతన్ అవన్నీ అవలీలగా చేయగలిగారు. నిష్క్రమిస్తున్న చైర్మన్ జేఆర్‌డీ టాటా ఆశీర్వాదం పుష్కలంగా ఉన్నా అప్పటికే భిన్న సంస్థలకు సారథులైనవారు సామాన్యులు కాదు. అప్పటికింకా టిస్కోగానే ఉన్న టాటా స్టీల్‌కు రూసీ మోదీ సారథి. పారిశ్రామిక రంగంలో ఆయన మోత మోగిస్తున్నాడు. జమ్‌షెడ్‌పూర్‌లో కొలువుదీరిన ఆ సంస్థకాయన మకుటం లేని మహారాజు. అజిత్ కేర్కర్ ఇండియన్ హోటల్స్‌లో తనదైన ముద్ర వేసుకున్నాడు. దర్బారీ సేఠ్ టాటా కెమికల్స్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. వీళ్లెవరూ రతన్ టాటాను సీరియస్‌గా తీసుకోలేదు. అతన్ని అవలీలగా అధిగమించవచ్చనుకున్నారు. రతన్ తన పేరులో చివరున్న రెండక్షరాల పుణ్యమా అని ఇంత దూరం వచ్చాడు తప్ప 'సరుకు' లేదనుకున్నారు. ఆయన రాకపై ఆలోచించటం సమయాన్ని వృథా చేసుకోవడమే అనుకున్నారు. కానీ రతన్ పరిశీలనాశక్తి అమోఘ మైనది, అనితర సాధ్యమైనది. ఈ మహాసామ్రాజ్యంలో ఏం జరుగుతున్నదో, లోపాలేమిటో అచిర కాలంలోనే పసిగట్టాడు.

తళుకుబెళుకులకు తక్కువేం లేదు. మదుపుపరులకు ఎప్పటికప్పుడు లాభాల పంటా పండు తోంది. కానీ అట్టడుగున అవాంఛనీయమైన పోకడలు కనబడుతున్నాయి. వాటిని చక్కదిద్దితే సంస్థను మరిన్ని రెట్లు పెంచి ఘనతరమైనదిగా తీర్చిదిద్దటం అసాధ్యమేమీ కాదని ఆయన నిర్ణయిం చుకున్నాడు. 1991 నాటికే దేశంలో అడుగుపెట్టిన ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో పాత పద్ధతిలోనే టిస్కోను కొనసాగిస్తే త్వరలోనే అది గ్రూపు చేజారటం ఖాయమన్న నిర్ణయానికొచ్చాడు. జేఆర్‌డీ మంచితనమో, గమనించలేని తత్వమో గానీ... టాటా స్టీల్‌లో అప్పటికి టాటాలకున్న ప్రమోటర్ వాటా కేవలం అయిదు శాతం మాత్రమే. ఇదే కొనసాగితే ఏదోనాటికి అది ఎవరి చేతుల్లోకైనా పోవచ్చని రతన్ గ్రహించారు. అదొక్కటే కాదు... గ్రూపు సంస్థల్లో ఏ ఒక్కటీ చేజారకుండా ప్రమోటర్ వాటాను గణనీయంగా పెంచారు. సొంత సంస్థలను పదిలపరచుకోవటమే కాదు, ఖం డాంతర ఆంగ్లో–డచ్ స్టీల్ సంస్థ కోరస్‌ను వశపరుచుకున్నారు. ఒకప్పుడు తనకు అవరోధంగా నిలిచిన అమెరికన్ దిగ్గజ సంస్థ ఫోర్డ్ నుంచి జాగ్వార్ ల్యాండ్‌రోవర్‌ను టాటాల తీరానికి చేర్చారు.

వర్తమానంలో పారిశ్రామికవేత్తల ఎదుగుదల ఎలా సాధ్యమవుతున్నదో బాహాటంగానే కనబడుతోంది. కానీ రతన్ టాటా ఇందుకు భిన్నం. టాటా సంస్థలపై మచ్చపడకుండా, వక్రమార్గాల జోలికిపోకుండా నిదానంగా తన ప్రస్థానం సాగించారు. ఆయన పట్టిందల్లా బంగారమేనని చెప్పడానికి లేదు. కోరస్ టేకోవర్ అయినా, నానో కారు ఉత్పత్తి ఉబలాటమైనా, టాటా గ్రూప్ సంస్థల చైర్మన్‌గా సైరస్ మిస్త్రీ ఆగమన, నిష్క్రమణల్లో అయినా రతన్ వైఫల్యాలు స్పష్టంగా కనబడతాయి. అందుకాయన విమర్శలను ఎదుర్కొనక తప్పలేదు. అలాగే టాటా స్టీల్‌ను దాదాపు 1,200 కోట్ల డాలర్ల విలువైన సంస్థగా తీర్చిదిద్దినప్పుడూ, దేశీయ విద్యుత్ ఆధారిత వాహన రంగంలో టాటా మోటార్స్‌ను మార్కెట్ లీడర్‌గా ముందుకు ఉరికించినప్పుడూ ఆయన గర్వం తలకెక్కించుకోలేదు. ఇవాళ్టి రోజున బహుళజాతి సంస్థల సమాహారంగా ఖండాంతరాల్లో వెలుగు లీనుతున్న టాటా గ్రూప్ నిరుటి రెవెన్యూ 16,500 కోట్ల డాలర్లు. ఆయన వ్యక్తిగత ఆదాయమే కొన్ని వందల కోట్లు. అయినా చివరి వరకూ అతి సాధారణ జీవితం గడిపి, అసహాయులకు అండదండలందించి జీవితాన్ని ధన్యం చేసుకున్న రతన్‌కు కొందరు కోరుకుం టున్నట్టు 'భారతరత్న' ప్రకటిస్తే అది ఆ అత్యున్నత పురస్కారానికి మరింత వన్నె తెస్తుంది. ఆ మహామనీషికి 'సాక్షి' వినమ్రంగా నివాళులర్పిస్తున్నది.

కొత్త ప్రభుత్వం ముందున్న సవాళ్లు

విశ్లేషణ



డా॥ గద్దె ఓంప్రసాద్

ఆర్థిక సంక్షోభంలో ఉన్న శ్రీలంక నూతన అధ్యక్షునిగా ఎన్నికైన అనుర కుమార దిస్సనాయకే ముందు అనేక సవాళ్లు, సమస్యలు ఉన్నాయి. కోవిడ్ అనంతర పరిణామాల వల్ల ఇప్పటికే మొత్తం జనాభాలో సుమారు 27 శాతం దారిద్ర్య రేఖకు దిగువకు జారిపోయారు. వ్యాపారస్తులకు, పెట్టుబడి దారులకు, ఉత్పత్తిదారులకు అధిక వడ్డీ రేట్ల మూలంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందువల్ల ఉత్పత్తి తగ్గి, ఉద్యోగావకాశాలపై వ్యతిరేక ప్రభావం పడుతోంది. గత రెండేళ్లలో ద్రవ్యోల్బణం 60 శాతం నుండి ఆరు శాతానికి తగ్గించగలిగినప్పటికీ, సున్నితంగా ఉన్న శ్రీలంక ఆర్థిక పరిస్థితుల్లో ఈ 6 శాతం ద్రవ్యోల్బణం కూడా ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చడం, స్థిరీకరించడం, గాడినపెట్టడం లాంటి వ్యవహారాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది.

ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న శ్రీలంకకు నూతన అధ్యక్షుడిగా ఎన్నికయిన అనుర కుమార దిస్సనాయకే ముందు అనేక సవాళ్లు, సమస్యలు ఉన్నాయి. మార్క్సిస్ట్–లెనినిస్ట్ భావజాలంతో నడిచే కమ్యూనిస్ట్ సిద్ధాంతాలు గల జనతా విముక్తి పెరుమున పార్టీ నుండి ఎన్నికయిన అనుర పట్ల కొన్ని సందేహాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థను ఎలా గాడిలోపెడతారు, పొరుగున ఉన్న భారత్‌తో ఎలాంటి సంబంధాలు నెరుపుతారు అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ప్రపంచ బ్యాంకు వెలువరించిన కొన్ని అంచనాల ప్రకారం ఈ సంవత్సరంతో పాటు వచ్చే 2025 సంవత్సరంలో కూడా శ్రీలంక 2.4 శాతానికి కొంచెం అటు ఇటుగా వృద్ధి రేటు నమోదు చేయబో తోంది. గత కొన్ని సంవత్సరాల నుండి తిరోగమన స్థితిలో ఉన్న ఆర్థిక వ్యవస్థ తిరిగి వృద్ధి పథం అందుకోవడం కొంత సంతోషకరమైన విషయమే. అయినప్పటికీ పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఒకవైపు, ఉద్యోగ అవకాశాలు కల్పించడం మరోవైపు అనుర కుమార ముందున్న ముఖ్యమైన సవాళ్లు. కోవిడ్ తదనంతర పరిణామాల వల్ల ఇప్పటికే మొత్తం జనాభాలో సుమారు 27 శాతం దారిద్ర్య రేఖకు దిగువకు జారిపోయారు. ఎక్కువగా మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించే సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు మూతపడడం వల్ల మహిళల్లో నిరుద్యోగిత విపరీతంగా పెరిగిపోయింది. శ్రీలంక ఆర్థిక వ్యవస్థలో చిన్న, మధ్య తరహా సంస్థలు సుమారు 75 శాతం భాగం కలిగి ఉండడమే కాకుండా సుమారు 45 శాతం ఉద్యోగ అవకాశాలను కూడా కల్పిస్తున్నాయి. వీటిలో చాలావరకు ఎగుమతులు, దిగుమ తులపైన ఆధారపడిన సంస్థలు. అధిక ద్రవ్యోల్బణం, ఇంధన కొరత, సరఫరాల్లో అంతరాయాలు తదితర కారణాల వల్ల పెరిగిన నిర్వ హణ, ఉత్పత్తి ఖర్చుల వల్ల, వస్తువుల ధరలు పెరగడం వల్ల, తగ్గిన డిమాండ్ తదితర కారణాల వల్ల ఇవి మూతపడ్డాయి. గత రెండు సంవత్సరాల కాలంలో రణిల్ విక్రమసింఘే ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల నిరుద్యోగిత శాతం ఈ సంవత్సరం మొదటి త్రైమాసికం అంతానికి 4.5 శాతం వరకు తగ్గించగలిగినప్పటికీ పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా జీతాలు పెరగక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

2022 జూలైలో రాజపక్సే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విదేశీ మారకద్రవ్యం నిల్వలు అత్యంత కనిష్ఠ స్థాయిలో అంటే 1.8 బిలియన్ డాలర్లు ఉండి నిత్యావసర వస్తువుల దిగుమతులకు ఇబ్బందిగా మారిన పరిస్థితులు ధరల పెరుగుదలకు దారి తీశాయి. తత్ఫలితంగా ప్రజల అసంతృప్తికి, తిరుగుబాటుకు కారణ మయ్యాయి. ఆ నిల్వలు తర్వాత ఏర్పడిన రణిల్ విక్రమసింఘే ప్రభుత్వం తీసు కున్న చర్యల ఫలితంగా జూలై 2024 నాటికి 5.58 బిలియన్ డాలర్లకు



చేరుకున్నాయి. ఇదే కాలంలో విదేశీ అప్పులు కూడా శ్రీలంక ఆర్థిక మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం 34.8 బిలియన్ డాలర్ల నుండి 37.40 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అవి ప్రస్తుత ధరల ప్రకారం 2022 జూన్‌లో 51.2 బిలియన్ డాలర్లు ఉంటే... ఈ సంవత్సరం మొదటి త్రైమాసికం ముగిసేనాటికి 55.4 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. విక్రమసింఘే ప్రభుత్వం తన సన్నిహిత దేశాలయిన చైనా, భారత్, జపాన్‌లతో జరిపిన చర్చల ఫలితంగా... సుమారు 10 బిలియన్ డాలర్ల వరకు తిరిగి చెల్లించే కాలపరిధులు, వడ్డీ రేట్లు తగ్గించడం వంటి వెసులుబాట్లు లభించాయి. ఇందువల్ల ఐఎంఎఫ్ నుండి ఉద్దీపన ప్యాకేజీలు లభించడానికీ, అనేక మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేయడానికి వెసులుబాటు లభించినట్లయింది. ఈ చర్యలు 2023 డిసెంబర్ నాటికి సుమారు 237 మిలియన్ డాలర్ల మిగులు బడ్జెట్‌కు దారితీశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడులు కూడా పెరిగి 2024 మార్చి నాటికి 96.3 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్మెంట్స్ కూడా పెరిగి 44.9 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇవన్నీ కూడా శ్రీలంక ఆర్థిక వ్యవస్థ పురోగమనంలో పడింది అనడానికి సంకేతాలే.

గత రెండు సంవత్సరాలలో ద్రవ్యోల్బణం 60 శాతం నుండి ఆరు శాతానికి తగ్గించగలిగినప్పటికీ, సున్నితంగా ఉన్న శ్రీలంక ఆర్థిక పరిస్థితుల్లో ఈ ఆరు శాతం ద్రవ్యోల్బణం కూడా ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చడం, స్థిరీకరించడం, గాడినపెట్టడం లాంటి వ్యవహారాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. ముఖ్యంగా, అప్పులు పెరిగిన నేపథ్యంలో, విదేశీ మారక ద్రవ్య నిల్వల కొరత ఉన్న సమయంలో ఈ ద్రవ్యోల్బణం ధరల పెరుగుదలకు దారితీస్తుంది. దానివల్లే ఇప్పటికి ఆహారవస్తువుల, పెట్రోల్, డీజిల్, మందుల ధరలు ఇంకా దిగి రాలేదు. వీటివల్ల సామాన్య ప్రజల జీవన వ్యయంపై ప్రభావం ఇంకా తీవ్రంగానే ఉంది. అనుర కుమార దిస్సనాయకే అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన మూడు రోజులకు అంటే 26 సెప్టెంబర్ నాడు జరిగిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ శ్రీలంక సమావేశంలో డిపాజిట్లపై, రుణాలపై వరుసగా ప్రస్తుతం ఉన్న 8.25, 9.25 శాతం వడ్డీ రేట్లను కొనసాగించాలని నిర్ణయించుకుంది. ఈ వడ్డీ రేట్లు బ్యాంకుల్లో పొదుపుచేసే వారిని ప్రోత్సహించడానికీ, రుణాలు తీసుకోవాలనుకునే వారిని నిరుత్సాహపరచడానికీ, ద్రవ్యోల్బణం స్థిరీకరించడానికి ఉప యోగపడ్డాయి. అయితే అదే సమయంలో వ్యాపారస్తులకు, పెట్టుబడిదారులకు, ఉత్పత్తిదారులకు అధిక వడ్డీ రేట్ల మూలంగా ప్రతికూల పరిస్థితులను కల్పించి, ఉత్పత్తి వ్యయాలు, ధరలు పెరిగేలా చేసి వినియోగదారులను దూరం చేస్తాయి. వీటి వల్ల ఉత్పత్తి తగ్గి, ఉద్యోగావకాశాలపై వ్యతిరేక ప్రభావం పడుతుంది. మరోవైపు బ్యాంకుల లాభాల్లో మార్జిన్ తక్కువగా ఉండడం వలన అవి ఇచ్చే రుణాలు తగ్గిపోతాయి. ఇన్ని ప్రతికూలతలు ఎదుర్కోవడం అనుర కుమార దిస్సనాయకే అయన ప్రభుత్వానికి పెద్ద సవాలు.

అనుర దిస్సనాయకే పార్టీ గతంలో భారత్ పట్ల వ్యతిరేక భావనతో రగిలిపోయినప్పటికీ, కొత్త ప్రభుత్వం అదే ధోరణి ఇంకా కొనసాగించడం సాధ్యం కాకపోవచ్చు. భారత్ ఇప్పటికే శ్రీలంకను అనేక సందర్భాల్లో ఆదుకుంది. గత రెండు సంవత్సరాల్లో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలో భారత్ 4 బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం అందించింది. ఇది ఐఎంఎఫ్, చైనా అందించిన సహాయం కన్నా అధికం. వాణిజ్య సంబంధాలు పెంపొందించుకు నేందుకు రెండు దేశాలు 'భారత – శ్రీలంక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' చేసుకొన్నాయి. గత రెండు సంవత్సరాల్లో రెండు దేశాల మధ్య 4 నుండి 6 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతున్నప్పటికీ ఇందులో అధిక భాగం భారత్ శ్రీలంకకు చేస్తున్న ఎగుమతులు ఎక్కువ. భారత్‌తో ఉన్న సన్నిహిత, నిర్మాణాత్మక సంబంధాల రీత్యా కొత్త ప్రభుత్వానికి భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడం అనివార్యమవుతుంది.

అనుర దిస్సనాయకే నాయకత్వంలో శ్రీలంక కొత్త అధ్యాయం మొదలు పెట్టబోతున్న తరుణంలో, ఆర్థిక వ్యవస్థ దిద్దుబాటు చర్యలు కొనసాగించడం ఒకవైపు; విదేశాలతో మంచి సంబంధాలు కొనసాగించడం మరోవైపు అత్యంత అవసరం. ఎన్నికల సమయంలో ఐఎంఎఫ్‌తో 2.9 బిలియన్ డాలర్ల బెయిలౌట్ ప్యాకేజీ పైన చర్చలు తిరిగి ప్రారంభిస్తామని వాగ్దానం చేసినప్పటికీ, అది అంత సులభం కాదు. భారత్ ఆ దేశానికి ఇచ్చిన ఆర్థిక సహాయం, వాణిజ్య సంబంధాలు కొనసాగించడం ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకం. కొత్త ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయాలు, రాజకీయంగానే కాకుండా ఆర్థిక వ్యవస్థలు గాడినపెట్టడం పైన కూడా ప్రభావం చూపిస్తాయి.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్, దక్షిణాసియా వ్యవహారాల అధ్యయన కేంద్రం, జేఎన్‌యూ । 79089 33741

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అదీ ఒక పార్టీ!



భారత ముస్లింల రాజకీయ పరిణామం బీజేపీని కూడా అన్ని పార్టీలలాగే పరిగణించడంలో ఉంది. ఆ పార్టీతో ఎడతెగని ఘర్షణ మనల్ని ఇతర పార్టీల దయ మీద మనిలేట్టు చేస్తోంది. ఇది మనకు సొంత నిర్ణయాధికారం లేకుండా చేయడంతో పాటు, ఆ పార్టీ నుంచి మరింత దూరం నెడుతోంది. చర్చలే పరిష్కారం.

– ఖాలిద్ బేగ్, హోస్ట్

శ్రామికులకు దూరం?



బ్రిటన్‌లోని లేబర్ పార్టీ గతంలో దేనికి నిలబడిందో దాన్నుంచి గణనీయంగా దూరం జరుగుతోంది. అది క్రమంగా గర్వాన్ని, ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ, విమర్శకులను హేళన చేస్తూ, కులీనుల పార్టీగా మారుతోంది. శ్రామిక జన హక్కుల నుంచి దూరం జరిగింది. ఆఖరికి 'ద లేబర్ పార్టీ' అనే పేరే విరోధాభాసగా మారింది.

– జేమ్స్ మెల్‌విల్, వ్యాఖ్యాత

ఒక్క శాతంతో...



2023 రాజస్థాన్ శాసన సభ ఎన్నికల్లో బీజేపీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 39 శాతం ఓట్లు వచ్చాయి. 2024 హరియాణా శాసన సభ ఎన్నికల్లో బీజేపీకి 39.9 శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 39 శాతం ఓట్లు వచ్చాయి. రాజకీయాల్లో ఒక్క శాతం కూడా చాలా తేడా చేస్తుంది. రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీ బీజేపీ చేతిలో ఓడిపోయింది.

– రాజేశ్ సహానీ, ఇన్వెస్టర్

మళ్లీ మూలాల్లోకి...



దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో, మనం వలసవాద వ్యతిరేకులం. ప్రపంచానికి కొత్త దారులు వేశాం. ప్రచ్ఛన్న యుద్ధం ముగిశాక (1991) మన విదేశాంగ విధానం పెట్టుబడిదారీ, వ్యవహారయుతంగా మారిపోయింది. మళ్లీ మనం వలసవాద వ్యతిరేక మూలాలకు వెళ్లాలి. విలువలను వ్యాపార ప్రయోజనాలు మించి పోకూడదు.

– చేతన్ కుమార్ అహింస, నటుడు

సనాతన యోగం



క్రిస్టియన్ యోగా అనేది లేదు. ముస్లిం యోగా అనేది లేదు. న్యూ ఏజ్ యోగా అనేది లేదు. యోగా ఒకటే. యోగాను సనాతన ధర్మంతో ఎవరూ విడదీయలేరు.

– రెనీ లిన్, హిందూ యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

నులిపురుగు – నోబెల్ పురస్కారం

ఈ సంవత్సరం వైద్య రంగంలో నోబెల్ ప్రైజ్ ఇద్దరు శాస్త్రవేత్తలు, అంబ్రోస్, రువ్ కున్‌లకు సంయుక్తంగా లభించింది. జన్యువులను నియంత్రించే సూక్ష్మ ఆర్ఎన్ఏ ని కనుగొనడం ద్వారా వారు చరిత్ర సృష్టించారు. ఈ ఆవిష్కరణ ముమ్ముందు వైద్య రంగంలో... ప్రత్యేకించి వ్యాధుల్ని అర్థం చేసుకోవడం, నియంత్రించడం, మెరుగైన చికిత్సలను అందించడంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగల ప్రాముఖ్యం కలది. ఇంతవరకూ అసంపూర్ణంగానే కొరుకుడు పడిన జన్యువుల నియంత్రణ విధానం అన్నది ఈ ఆవిష్కరణతో తేటతెల్లం అయ్యింది.

శాస్త్రజ్ఞులు ఇరువురూ ఒక మిల్లీమీటరు మాత్రమే పొడవున్న నులి పురుగు (రౌండ్ వార్మ్)లో వివిధ రకాల కణాలుండడం చూసి తమ పరిశోధనకు ఎంచుకున్నారు. ఒక్కో రకం కణాల సముదాయం ఏర్పడ డంలో సూక్ష్మ ఆర్ఎన్ఏల పాత్ర ఉన్నట్టు గుర్తించారు. ఆ సూక్ష్మ ఆర్ఎన్ ఏని ప్రభావితం చెయ్యడం ద్వారా, ఏర్పడబోయే కణ సముదాయాల్లో మార్పులు తీసుకురాగలిగారు. 1993లో గుర్తించిన విషయం, దశాబ్దం తర్వాత నిర్ధారణ అయింది. అదే పద్ధతిలో జంతు, మానవ జన్యువుల పనితీరులో సూక్ష్మ ఆర్ఎన్ఏలు కీలక భూమిక పోషిస్తున్నట్లు వారి పరిశోధనల ఫలితంగా అర్థమైంది. ప్రతీ జీవిలో, ఒక్కో జీవకణంలో కేంద్రకం, ఆ కేంద్రకంలో డీఎన్ఏ, జన్యువులు ఉంటాయి. వాటిలో నిక్షిప్త మైన సకల సమాచారం ద్వారా, అవసరానికి అనుగుణమైన ప్రత్యేక ప్రొటీన్లు తయారై, వాటికి కేటాయించబడిన పాత్ర నిర్వహిస్తుంటాయి. అయితే సమాచారం అందించే జన్యువులను కొన్ని రకాల ప్రొటీన్లు నియంత్రించడం ద్వారా ఫలితాలు తారుమారు జరిగి కొన్ని రకాల వ్యాధులు, లోపాలు సంభవిస్తుంటాయి అని ఇంతవరకూ అనుకున్నారు. అయితే ఆ పాత్ర పోషించేది సూక్ష్మ ఆర్ఎన్ఏలు అని తెలిసింది. కనుక భవిష్యత్‌లో వాటినే టార్గెట్ చేసి పరిశోధించి, వైద్య రంగం కొత్త పుంతలు తొక్కగలదు.

– డా॥ డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం మాజీ ఎంపీ

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇది పరిష్కరించుకోదగిన మిత్రవైరుధ్యం!

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

భారతదేశంలో ఉన్న నిచ్చెన మెట్ల కుల సమాజం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తోంది. ప్రతి విషయంలోనూ కులం ప్రధానపాత్ర వహిస్తోంది. కులనిర్మూలన జరగకపోగా కులం వేళ్ళు మరింత బలంగా లోలోతుల్లోకి వెళ్తున్నాయి. ప్రజాస్వామ్యంలో కుల నిర్మూలనైనా జరగాలి లేదా సంపద, అధికారాల్లో ఎవరి వాటా వారికైనా దక్కాలి. ఇవేవీ జరుగకపోగా వేలసంఖ్యలో విభజింపబడిన పాలిత కులాల మధ్య చెప్పలేనన్ని వైరుద్ధ్యాలు! తమకు దక్కాల్సిన వాటా కోసం ఉమ్మడి పోరాటాలు చేయకుండా తమలో తామే తన్నుకోవడం కనిపిస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల మధ్య వైరుద్ధ్యాలే కనిపిస్తున్నాయి. నిజానికివన్నీ మిత్ర వైరుద్ధ్యాలే తప్ప శత్రు వైరుద్ధ్యాలు కావు. వీటిని పరిష్కరించుకోకుండా దశాబ్దాలుగా తగవులాడుకుంటూనే ఉన్నారు.

ఎస్సీల్లోని మాల–మాదిగలు, వారి ఉపకులాల మధ్య ఉండాల్సింది మిత్రవైరుద్ధ్యం కాగా అది శత్రు వైరుద్ధ్యంగా కొనసాగుతుండడం బాధాకరం. ఇరువురికీ ఆరాధ్యుడు అంబేడ్కర్. ఆయన స్ఫూర్తితో దళిత జాతి విముక్తికై ఉమ్మడి పోరాటాలు చేయకుండా దశాబ్దాలుగా పాత వైరుద్ధ్యాలను మరింత విస్తృతం చేసి దళిత రాజ్యాధికార భావనకు మరింతదూరం జరుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 'దళిత మహాసభ' దళితులపై జరిగిన పాశవిక దాడులను సమర్థంగా ఎదుర్కొంది. ఎండగట్టింది. దళితుల్లో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచింది. అంబేడ్కర్ స్ఫూర్తితో, ఇంగ్లీషు చదువులతో, క్రైస్తవ చైతన్యంతో ఆంధ్ర మాలలు కొంతవరకైనా పాలక స్థాయికెదిగి ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వీసులకు ఎంపికయ్యారు. రాజకీయ పదవులూ గెలుచుకున్నారు.

అలాగే మూడు దశాబ్దాల క్రితం మంద కృష్ణ మాదిగ ప్రారంభించిన 'మాదిగ దండోరా' ఉద్యమం చరిత్రాత్మకమైనది. అది మాదిగల్లో ఆత్మగౌరవాన్ని, పోరాట పటిమను, అంబేడ్కర్ భావజాలాన్ని అర్థం చేసుకునేలా చేసింది. అది కేవలం వర్గీకరణ ఉద్యమంగానే ఉండిపోకుండా వికలాంగుల పెన్షన్, తెలంగాణ ఉద్యమానికి ఊతమిచ్చింది. కొందరు ఆధిపత్య కులాల వారు తమ పేరు చివర తమ కులాలను తెలియచేసే విశేషాలను పెట్టుకున్నట్లే... మాదిగలు కూడా తమ పేరు చివర 'మాదిగ' పదాన్ని చేర్చుకోవాలని మంద కృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు ఆ కులంలో ఆత్మ గౌరవాన్ని ప్రోది చేసింది. ఒక్క దళిత కులాల్లోనే కాదు పీడిత కులాలందరికీ ఆత్మవిశ్వాసాన్నిచ్చిందీ దండోరా ఉద్యమం. అయితే దండోరా ప్రధాన లక్ష్యం రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ సాధించడం.



కానీ వర్గీకరణ విషయంలో మాల, మాదిగల మధ్య అభిప్రాయ భేదాలు ఏర్పడ్డాయి. దేశం మొత్తంగా కొన్నిచోట్ల మాలలు, మరికొన్ని చోట్ల మాదిగలు రిజర్వేషన్లలో భాగాన్ని ఎక్కువగా అనుభవిస్తున్నారన్నది వాస్తవం. వర్గీకరణ చేస్తే మాల, మాదిగ ఉపకులాలన్నీ రిజర్వేషన్ సౌకర్యాన్ని సమానంగా అనుభవించి అన్ని ఉపకులాలు పైకొస్తాయన్నది వర్గీకరణ కావాలనే వారి వాదం. వర్గీకరణ వల్ల దళితుల్లో ఐక్యత దెబ్బతింటుందని వర్గీకరణను వ్యతిరేకించే వారి వాదన. ఎక్కడ మాలల్లో గానీ, మాదిగల్లో కానీ చైతన్యం ఎక్కువగా ఉంటే అక్కడ ఆ యా కులాలవారు రిజర్వేషన్ సౌకర్యాన్ని ఎక్కువ ఉపయోగించుకున్నారన్నది వాస్తవం.

వర్గీకరణ కావాలనడంలో ఎవరి వాటా వారికి చెందాలన్న ప్రజాస్వామిక సూత్రముంది. ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణను ఒకసారి చేసినా కొందరు సుప్రీం కోర్టుకు వెళ్లడం వల్ల దాని అమలు నిలిపివేయబడింది. అప్పట్నుంచి వైరుద్ధ్యాలు మరీ ఎక్కువయ్యాయి. వర్గీకరణ ఉద్యమం దేశవ్యాప్తమైంది. దీన్ని ఆసరాగా చేసుకొని పాలకపార్టీలు ఓట్లు రాజకీయాలాడటం మొదలు పెట్టాయి. దళితుల ఓట్లు కోసం వర్గీకరణను సమర్థించడం, వ్యతిరేకించడం రాజకీయ పార్టీలకు ఓ ఆటగా మారింది.

ఈ మధ్యనే సుప్రీంకోర్టు వర్గీకరణ చేయడం సరైనదేనని తీర్పునిచ్చింది. అందులో మెలిక పెట్టింది. క్రీమీ లేయర్ పాటించాలని. తరతరాలుగా రాజకీయ, సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగపరమైన అధికారాలు అనుభవిస్తున్న వారికి లేని క్రీమీలేయర్ దళితుల వర్గీకరణకు కావాలనడం ధర్మ సమ్మతమేనా? కొందరు దళితనేతలు క్రీమీలేయర్ వద్దంటే మరికొందరు వర్గీకరణే వద్దంటున్నారు. మాయావతి లాంటి నాయకురాలు కూడా వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా ఇలాంటి సందర్భాల్లో వర్గీకరణ అమలవుతుందా అనే అనుమానం రావడం సహజమే. అమలు కాకుండా ఉండటానికి వర్గీకరణ వ్యతిరేకులు, అమలు చేయడానికి వర్గీకరణ అనుకూలురు ఇంకా ఎన్నేండ్లు పోరాటాలు చేస్తూ తమ ఉమ్మడి లక్ష్యాన్ని మరిచిపోతారు?

దళిత సోదర సోదరీమణులు తమ మధ్య నున్న వైరుద్ధ్యాలను మిత్ర వైరుద్ధ్యాలుగా భావించి చర్చలతో వర్గీకరణ సమస్య విషయంలో ఏకీభావానికి వచ్చి దళిత రాజ్యాధికార భావనను సాకారం చేసే దిశగా పయనం కొనసాగిస్తే మంచిది. తమ అంతిమ లక్ష్యం దళిత సాధికారత, రాజ్యాధికారం అన్న విషయాన్ని అర్థం చేసుకుంటే ఇరువైపుల వారికీ వర్గీకరణ సమస్య అతి చిన్నదిగా కనబడుతుంది.

వ్యాసకర్త ప్రముఖ కథా రచయిత
మొబైల్: 91829 18567

చెడుపై మంచి గెలిచిన రోజు

దసరా హిందువుల ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులూ, పదవ రోజు విజయ దశమినీ కలిపి దసరా అంటారు. ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యమిచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చింది. కొందరు ఈ పండుగకు మొదటి మూడు రోజులు పార్వతిదేవికీ, తరువాతి మూడు రోజులు లక్ష్మీ దేవికీ, తరువాత మూడురోజులు సరస్వతీ దేవికీ పూజలు నిర్వహిస్తారు. ముఖ్యంగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు.



తెలంగాణలో ఈ తొమ్మిది రోజులు అమావాస్య నుంచి నవమి వరకు బతుకమ్మ ఆడుతారు. విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణునిపై గెలిచిన సందర్భమే కాక... పాండవులు అజ్ఞాత వాసం ముగిసిన తర్వాత జమ్మి చెట్టు మీద నుంచి తమ ఆయుధాలు తీసుకున్నరోజు కూడా! ఈ సందర్భంగా 'రావణ వధ', జమ్మి ఆకుల పూజ వంటివి చేయటం ఆచారం. జగన్మాత అయిన దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసునితో తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి అతనిని వధించి విజయాన్ని పొందినందుకు 10వ రోజు ప్రజలంతా సంతోషంతో పండగ జరుపుకొంటారు. బ్రహ్మ దేవుని వరాల వలన వరగర్వితుడైన మహిషాసురుడు దేవతలతో ఘోరమైన యుద్ధం చేసి వారిని ఓడించి ఇంద్రపదవి చేపట్టాడు. దేవేంద్రుడు త్రిమూర్తులతో మొరపెట్టుకొనగా మహిషునిపై వారిలో రగిలిన క్రోధాగ్ని ప్రకాశవంతమైన తేజంగా మారింది. త్రిమూర్తుల తేజం కేంద్రీకృతమై ఒక స్త్రీ జన్మించింది. సర్వ దేవతల ఆయుధాలు సమకూర్చుకొని మహిషాసురుని సైన్యంతో తలపడింది. ఈ యుద్ధంలో ఆ దేవి వాహనమైన సింహమూ శత్రు వులను చీల్చి చెండాడింది. దేవితో తలపడిన అసురుడు మహిష రూపం, సింహం రూపం, మానవ రూపంతో భీకరంగా పోరాడి చివరకు మహిషం రూపంలో దేవి చేతిలో హతుడైనాడు.

తెలంగాణలో పాలపిట్టను చూసిన తర్వాత జమ్మి చెట్టు వద్దకు పోయి పూజలు చేసి జమ్మి ఆకులు (బంగారం) పెద్ద వాళ్లకు ఇస్తూ వారి దీవెనలు తీసుకుంటారు. ఒకరినొకరు 'అలాయ్ బలాయ్' చేసుకుంటూ మురిసిపోతుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణలో దసరా ఒక మహోన్నతమైన పర్వదినం.

– దండంరాజు రాంచందర్ రావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.అష్టమి ఉ.6.40 వరకు, తదుపరి నవమి తె.5.37 వరకు, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.1.41 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.9.47 నుండి 11.19 వరకు, తదుపరి తె.5.34 నుండి 7.06 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.12 నుండి 1.00 వరకు, **అమృత ఘడియలు:** రా.7.04 నుండి 8.44 వరకు, మహర్నవమి; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.55, **సూర్యాస్తమయం:** 5.41.

15న నేవీ రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన

- సీఎం రేవంత్, మంత్రి సురేఖకు ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నేవీ అధికారులు.

సాక్షి, హైదరాబాద్: ఈనెల 15న వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం పూడూరు మండలం దామగుండంలో నేవీ రాడార్ ప్రాజెక్టు పనుల శంకుస్థాపన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డిని.. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, రాడార్ స్టేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్ బీర్ సింగ్, నేవీ అధికారులు ఆహ్వానించారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో గురువారం ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. సీఎంతో పాటు అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖకు కూడా వారు ఆహ్వానాన్ని అందజేశారు. ఈ మేరకు మంత్రిని ఆమె నివాసంలో వారు కలుసుకున్న సందర్భంగా.. సురేఖ మాట్లాడుతూ రాడార్ స్టేషన్ ఏర్పాటుతో భారత రక్షణ వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందన్నారు. పరిగి నియోజకవర్గ ప్రజలకు ఈ స్టేషన్ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. దేశంలోనే రెండో రాడార్ స్టేషన్ కేంద్రంగా తెలంగాణకు మంచి గుర్తింపు లభిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.

తహసీల్దార్ల బదిలీకి పచ్చజెండా

- ఆప్షన్లు కోరిన సీసీఎల్‌ఏ..
- 9 నెలల నిరీక్షణకు తెర

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సుదూర ప్రాంతాలకు బదిలీ అయిన తహసీల్దార్లకు తీపి కబురు అందింది. ఎన్నికలకు ముందు వారు పనిచేసిన పూర్వ జిల్లాలకు బదిలీ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో తొమ్మిది నెలల నిరీక్షణకు తెర పడింది. ఈ మేరకు ఆప్షన్లు ఎంచుకోవాలని ఆయా తహసీల్దార్లకు సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ (టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్ హర్షం వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్‌కు గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

కట్ ఆఫ్ డేట్ మార్చండి

గల్ఫ్ బాధిత కుటుంబాల వినతి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : గడచిన పదేళ్ల కాలంలో అంటే తెలంగాణ ఏర్పడిన తర్వాత గల్ఫ్ దేశాల్లో చనిపోయిన వారి సంఖ్య వేలల్లో ఉంది. రాష్ట్రం ఏర్పడిన తేదీని కట్ ఆఫ్ డేట్‌గా మారిస్తే వారి కుటుంబాలకు ఎంతో ప్రయోజనంగా ఉంటుంది. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి లక్షలాది మంది గల్ఫ్ దేశాలకు వెళ్లారు. ఇప్పటికీ వెళుతున్నారు. గల్ఫ్‌లో చనిపోయిన వారి మృతదేహాలు తీసుకురావడానికి కూడా వారి కుటుంబాలు అనేక కష్టాలు ఎదుర్కొన్నాయి. అప్పు చేసి గల్ఫ్ వెళ్లిన వ్యక్తి చనిపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక, కుటుంబ పెద్దను కోల్పోయి కుటుంబభారం మోయలేక కుటుంబ సభ్యులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ప్రభుత్వం మానవత్వంతో ఆలోచించి కట్ ఆఫ్ డేట్‌ను మార్చాలని పలువురు కోరుతున్నారు.

ఎడారి దేశాల్లో తెలం'గానం'

గల్ఫ్ దేశాల్లో ఉన్న వారంతా తెలంగాణ ఉద్యమానికి జైకొట్టారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత గల్ఫ్‌లో బతుకుదెరువుకు వెళ్లి రకరకాల కారణాలతో ఇబ్బందులు పడిన వారికి ప్రభుత్వం సాయం అందించాలనే డిమాండ్ ఉంది. అందుకోసం అనేక ఉద్యమాలు కూడా జరిగాయి. అప్పట్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేరళ పాలసీని అమలు చేస్తామని ప్రకటించినా, ఆచరణకు నోచుకోలేదు. గత ఏడాది డిసెంబర్‌లో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకుంటామని ప్రకటించింది. అందుకు అనుగుణంగా మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం అందించేందుకు విధివిధానాలను ఇటీవల వెల్లడించింది. అయితే కట్ ఆఫ్ డేట్ తో చాలా కుటుంబాలకు నిరాశే ఎదురైంది. గడచిన పది నెలల కాలంలో తెలంగాణకు చెందిన వారు గల్ఫ్ దేశాల్లో దాదాపు 160 మంది చనిపోయినట్టు అనధికారిక లెక్కలు చెబుతున్నాయి.

విధివిధానాలు ఇలా...

ప్రభుత్వం ఈ నెల 7న జారీ చేసిన జీవో 216 ప్రకారం.. చనిపోయిన వ్యక్తి తాలూకు భార్య, పిల్లలు లేదా తల్లిదండ్రులు మృతుడి డెత్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు క్యాన్సల్ రిపోర్టు, కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతా వివరాలతో నేరుగా జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. కలెక్టర్ ఆధ్వర్యంలో దరఖాస్తు, సర్టిఫికెట్లను పరిశీలించిన తర్వాత ఆర్థిక సాయం మంజూరవుతుంది. బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఓమన్, కతర్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలకు వెళ్లి చనిపోయిన వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. 2023 డిసెంబర్ 7 తర్వాత చనిపోయిన వారు మాత్రమే అర్హులని ఆ జీఓలో స్పష్టంగా పేర్కొన్నారు.

డ్రగ్స్ సరఫరాపై కఠినంగా వ్యవహరించండి

- అదనపు సిబ్బందిని కేటాయిస్తాం
- యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులను ఆదేశించిన డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరా ముఠాలపై కఠినంగా వ్యవహరించాలని డీజీపీ డాక్టర్ జితేందర్ స్పష్టం చేశారు. డీజీపీ కార్యాలయంలో గురువారం యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఇన్‌చార్జి సందీప్ శాండిల్యతోపాటు పలువురు పోలీసు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ....రాష్ట్రంలో డ్రగ్స్ అమ్మకాలను నియంత్రిస్తూ కేసులు పెడుతున్నప్పటికీ సరఫరా విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పకడ్బందీగా వ్యవహరించి డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగం నుంచి సిబ్బందిని అదనంగా బ్యూరోకి కేటాయిస్తామని తెలిపారు. విదేశీయులెవరైనా డ్రగ్ వ్యవహారాల్లో తల దూర్చితే వారిని తిరిగి వారి దేశాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ...నిందితులను పట్టుకోవడంతోపాటు వారికి శిక్ష పడేలా సాక్ష్యాధారాలను కోర్టులకు సమర్పించాలని సూచించారు. అదనపు సిబ్బందిని కేటాయించడం పట్ల సందీప్ శాండిల్య సంతోషం వ్యక్తం చేశారు. నూతన నేర చట్టాలను పకడ్బందీగాఅమలు చేసేందుకు చర్యలు తీసు కో వాలని డీజీపీ జితేందర్ సూచించారు. క్షేత్రస్థాయి లో నూతన నేర చట్టాల అమలుకు తీసుకోవలసిన చర్యలపై గురువారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో డీజీపీ పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షలో సీఐడీ డీజీ శిఖాగోయెల్, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్ ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

‘ఈవీ’లు... టైంబాంబులు!

మంటలు పుట్టిస్తాయ్ • లిథియం-అయాన్ బ్యాటరీలతో జాగ్రత్త • ఉప్పునీటి ముంపుతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు



‘‘టిక్.. టిక్.. టిక్..’’ అంటూ నిశ్శబ్దంగా ఆడుతున్న టైంబాంబులు అవి! ఆదమరిస్తే ఏ క్షణమైనా అంటుకోవచ్చు. కన్ను మూసి తెరిచేంతలో ఉవ్వెత్తున మంటలు చెలరేగవచ్చు. విధ్వంసం సృష్టించవచ్చు. ప్రాణాలు తీయవచ్చు. ఆస్తినష్టం కలిగించవచ్చు. ఇంతకీ ఏమిటవి అంటారా? కాలుష్యం కలిగించకుండా పర్యావరణానికి ఎంతో మేలు చేస్తున్నాయని మనం ఎంతో గొప్పగా చెబుతున్న ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ). అమెరికాలో తాజాగా విరుచుకుపడుతున్న హరికేన్ ‘మిల్టన్’ మరో ఉపద్రవాన్ని మోసుకొస్తోంది. ఈవీలు, హైబ్రిడ్ వాహనాలు వంటి రీఛార్జి బ్యాటరీ ఆధారిత ఇంధనాన్ని వాడే వాహనాలతో ప్రస్తుతం అమెరికన్లకు ముప్పు పొంచివుంది. ఇదంతా వాటిలోని లిథియం-అయాన్ బ్యాటరీలతోనే. ఎలక్ట్రిక్ కార్లు మాత్రమే కాకుండా రీఛార్జి బ్యాటరీల శక్తితో పనిచేసే స్కూటర్లు, బైకులు, హోవర్ బోర్డులు, వీల్ ఛైర్లు, లాన్ మూవర్స్, గోల్ఫ్ కార్లు, బొమ్మలతోనూ ఇకపై అప్రమత్తంగా మెలగక తప్పదు. హరికేన్ ‘మిల్టన్’ ఉప్పునీటి వరద ముంపు బారినపడిన ఈవీలను అగ్నికీలలు చుట్టుముట్టే అవకాశముంది. హరికేన్ల ప్రభావంతో 15 అడుగుల లోతుతో ఉప్పునీటి వరద నీరు చేరుకునే తీరప్రాంతాలు అమెరికాలో చాలా ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం హరికేన్ ‘హెలెన్’ వచ్చిపోయాక అమెరికాలో పలు చోట్ల లిథియం-అయాన్ బ్యాటరీలు వేడెక్కి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ల కారణంగా 48 ఎలక్ట్రిక్ వాహనాలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఫ్లోరిడాలోని ఓ ఇంటి గ్యారేజీలో నిలిపివుంచిన టెస్లా కారు ఇటీవలి ‘హెలెన్’ ప్రభావపు ఉప్పునీటి ముంపు కారణంగా మంటల్లో ఆహుతి కావటంతో ఆ ఇంట్లోని వారు భయంతో బయటకు పరుగులు తీశారు. గతంలో 2022లో సంభవించిన హరికేన్ ‘ఇయాన్’ సందర్భంగానూ అమెరికాలో పలు ఈవీలు అగ్నికి ఆహుతయ్యాయి.

తొలుత వేడి... తర్వాత మంటలు!

ఈవీల్లో లిథియం-అయాన్ బ్యాటరీ ప్యాక్ లోపల సెల్స్, జ్వలించే స్వభావం గల విద్యుద్వాహక ద్రావణి ఉంటాయి. ఉప్పునీరు విద్యుద్వాహకం. ఈ-బైకులతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలు లేదా ప్లగ్-ఇన్ హైబ్రిడ్ వాహనాల్లో వెయ్యి రెట్లు ఎక్కువగా సెల్స్ (చిన్న ఘటాలు) ఉంటాయి. ఎక్కువ సెల్స్ ఉండే హై ఎనర్జీ బ్యాటరీలు విఫలమయ్యే అవకాశాలు మరింత అధికం. సాధారణ వర్షపు నీటితో లేదా నదుల మంచినీటితో తలెత్తే ముంపుతో ఈవీలకు పెద్దగా నష్టం ఉండదు. కానీ ఎక్కువ కాలం... అంటే కొన్ని గంటలు లేదా ఒకట్రెండు రోజులపాటు ఉప్పునీటిలో వాహనాలు మునిగితే మాత్రం ఉప్పు వల్ల ఈవీ ‘బ్యాటరీ ప్యాక్’ దెబ్బతింటుంది. ఉప్పునీటికి ‘తినివేసే’ (కరోజన్) లక్షణం ఉంది. బ్యాటరీ లోపలికి ఉప్పునీరు చేరాక విద్యుద్ఘటాల్లోని ధనాత్మక, రుణాత్మక టెర్మినల్స్ మధ్య కరెంటు ప్రవహించి షార్ట్ సర్క్యూట్లు సంభవిస్తాయి. ఫలితంగా వేడి పుడుతుంది. విద్యుద్ఘటాలను వేరు చేసే ప్లాస్టిక్ లైనింగ్ ఈ వేడికి కరిగిపోతుంది. దాంతో వేడి ఓ శృంఖల చర్యలాగా (థర్మల్ రన్ అవే) ఒక విద్యుద్ఘటం నుంచి మరో విద్యుద్ఘటానికి ప్రసరించి మరిన్ని షార్ట్ సర్క్యూట్లతో విపరీతంగా వేడిని పుట్టిస్తుంది. అలా చివరికి అగ్గి రాజుకుని వాహనాలు బుగ్గి అవుతాయి.

ఎత్తైన ప్రదేశాలకు తరలించాలి

హరికేన్లు తీరం దాటడానికి మునుపే ప్రజలు అప్రమత్తమై తమ ఎలక్ట్రిక్ వాహనాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఈవీలు తుపాన్ల ఉప్పునీటిలో తడవకుండా, వరద ముంపులో నానకుండా వాటిని ఎత్తైన, సురక్షిత ప్రదేశాల్లో భద్రంగా పార్క్ చేయాలి. ఇంటికి కనీసం 50 అడుగుల దూరం అవతల వాటిని పార్క్ చేయడం వల్ల రిస్క్ తగ్గుతుంది. తుపాన్లు/హరికేన్లు దాటిపోయాక రీ-స్టార్ట్ చేయడానికి ముందు బ్యాటరీ వాహనాలను ఖాళీ ప్రదేశాలకు తరలించాలి. వాటిని మెకానిక్ సాయంతో అన్ని రకాలుగా పరీక్షించాకే పునర్వినియోగంలోకి తేవాలి. వరద నీటిలో మునిగిన వాహనాలను పరీక్షించకుండా నేరుగా కరెంటు ప్లగ్గులో వైరు పెట్టి వాటిని రీఛార్జి చేయడానికి ఉపక్రమించరాదు. ఆ వాహనాలను ఇళ్లలోనే ఉంచి రీ-స్టార్ట్ చేస్తే లిథియం-అయాన్ బ్యాటరీలు వేడెక్కి, మంటలు అంటుకుని గృహాలు సైతం అగ్నిప్రమాదాల బారినపడవచ్చు. హరికేన్ ‘మిల్టన్’ నేపథ్యంలో ఈవీల వినియోగదారులకు పలు సూచనలు చేస్తూ ఫ్లోరిడా ఫైర్ మార్షల్ జిమ్మీ పాట్రోనిస్ విడుదల చేసిన ప్రకటన సారాంశం ఇది. ఎలక్ట్రిక్ వాహనాలు వాడే వారికి ఇదో హెచ్చరిక లాంటిది.

- జమ్ముల శ్రీకాంత్

మిల్టన్ ధాటికి ఫ్లోరిడా అతలాకుతలం | సాక్షి ప్లస్‌లో..

మన స్నేహం బహు కీలకం

భారత్-ఆసియాన్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

- కూటమి దేశాలన్నీ శాంతిని కోరుకుంటున్నాయని వెల్లడి
- సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయం



గురువారం వీయెంటియన్‌లో ఆసియాన్ దేశాల నేతలతో చేతులు కలిపిన మోదీ

వీయెంటియన్: ప్రపంచంలో చాలాచోట్ల సంఘర్షణలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో భారత్-ఆసియాన్(అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఈస్టు ఆసియన్ నేషన్స్) మధ్య స్నేహ సంబంధాలు, పరస్పర సహకారం అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. తూర్పు కార్యాచరణ(యాక్ట్ ఈస్టు) విధానాన్ని పదేళ్ల క్రితం ప్రకటించానని గుర్తుచేశారు. ఈ దశాబ్ద కాలంలో భారత్-ఆసియాన్ దేశాల మధ్య చరిత్రాత్మక సంబంధాల్లో నూతన శక్తి, కొత్త దిశ, వేగం చోటుచేసుకున్నాయని హర్షం వ్యక్తంచేశారు. గురువారం లావోస్ రాజధాని వీయెంటియన్‌లో 21వ ఇండియా-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడారు. 21వ శతాబ్దం ఆసియా శతాబ్దమని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. భారత్‌తోపాటు ఆసియాన్ దేశాల ప్రగతికి ఈ శతాబ్దం కీలకమని చెప్పారు. గ్లోబల్ సౌత్‌లో ఇరుగుపొరుగున ఉన్న భారత్, ఆసియాన్ దేశాల్లో వేగవంతమైన అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. తమ దేశాలన్నీ శాంతిని కోరుకుంటున్నాయని వివరించారు.

300 మిలియన్ డాలర్ల నిధులు

ఆసియాన్ కేంద్రంగా 2019లో ఇండో-పసిఫిక్ సముద్రాల కార్యక్రమం ప్రారంభించామని ప్రధాని మోదీ గుర్తుచేశారు. పదేళ్లలో ఆసియాన్ దేశాలతో భారత వాణిజ్యం దాదాపు రెండు రెట్లు పెరిగిందని, 130 బిలియన్ డాలర్లకు చేరుకుందని తెలిపారు. ఇండియా నుంచి ఏడు ఆసియాన్ దేశాలకు నేరుగా విమానాలు నడుస్తున్నాయని, త్వరలో బ్రూనైకి కూడా విమాన సర్వీసులు ప్రారంభం కాబోతున్నాయని వెల్లడించారు. సింగ్‌పూర్‌తో ఫిన్‌టెక్ అనుసంధానం ప్రారంభించామన్నారు. ఇండియాలోని నలంద యూనివర్సిటీ నుంచి ఆసియాన్ ప్రాంతానికి చెందిన 300 మంది విద్యార్థులు ఉపకార వేతనాలు పొందుతున్నారని వివరించారు. వేర్వేరు కీలక రంగాల్లో కలిసి పని చేయడానికి ఇండియా-ఆసియాన్ సంయుక్తంగా సైన్స్ అండ్ టెక్నాలజీ ఫండ్, డిజిటల్ ఫండ్, గ్రీన్ ఫండ్ ఏర్పాటు చేశాయని, వీటికి భారత్ 300 మిలియన్ డాలర్లకుపైగా నిధులు అందించిందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇప్పటిదాకా చేపట్టిన చర్యల ఫలితంగా ఆసియాన్ దేశాలతో తమ భాగస్వామ్యం సమగ్రంగా మారిందన్నారు. సదస్సు అనంతరం ప్రధానమంత్రి ‘ఎక్స్’లో పోస్టు చేశారు. ఇండియా-ఆసియాన్ సదస్సు ఫలవంతంగా జరిగిందని పేర్కొన్నారు. వ్యాపార, వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించామని వెల్లడించారు. 1967లో ఏర్పాటైన ‘ఆసియాన్’కు ప్రస్తుతం లావోస్ సారథ్యం వహిస్తోంది. వచ్చే ఏడాది సారథ్య బాధ్యత మలేషియాకు లభించనుంది. ఈ కూటమిలో బ్రూనై, బర్మా, కాంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, ఫిలిప్పైన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం సభ్యదేశాలుగా ఉన్నాయి.

జపాన్, న్యూజిలాండ్ ప్రధానులతో మోదీ భేటీ

ప్రధాని నరేంద్ర మోదీ గురువారం లావోస్‌లో జపాన్ ప్రధానమంత్రి షిగెరు ఇషిబా, న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఇషిబా ఇటీవలే జపాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. మౌలిక వసతులు, అనుసంధానం, రక్షణ తదితర కీలక రంగాల్లో ఇరుదేశాల మధ్య పరస్పర సహకారంపై అభిప్రాయాలు పంచుకున్నారు. క్రిస్టోఫర్ లక్సన్‌తో జరిగిన చర్చల్లో భారత్-న్యూజిలాండ్ మధ్య సంబంధ బాంధవ్యాల పురోగతిని సమీక్షించారు.

లావోసియన్ రామాయణం తిలకించిన మోదీ

రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం లావోస్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. ఆయన బస చేసిన హోటల్ వద్దకు లావోస్‌లోని భారతీయులు తరలివచ్చారు. వారితో మోదీ సంభాషించారు. అనంతరం లావోసియన్ రామాయణం ‘ఫ్రాలాక్ ఫ్రాలామ్’ నృత్య రూపకాన్ని మోదీ ఆసక్తికరంగా తిలకించారు. భారత్‌లోని అసలైన రామయణం కంటే ఇది కొంత భిన్నంగా ఉంటుంది. ఈ రూపకం 16వ శతాబ్దంలో భారత్ నుంచి బౌద్ధ గురువుల ద్వారా లావోస్‌కు చేరుకుంది. మరోవైపు లావోస్‌లో ప్రధాని మోదీకి బౌద్ధ గురువులు ఆశీస్సులు అందించారు.

రతన్‌కు ఘన నివాళి

ముంబై: వ్యాపారదిగ్గజం రతన్ టాటాకు పలు రంగాల ప్రముఖులు నివాళులర్పించారు. ఈ మేరకు గురువారం తమ సంతాప సందేశాలను విడుదలచేశారు.

రతన్ టాటా తన జీవితాన్ని దేశానికి అంకితం చేశారు. టాటా సంస్థల విలువలను కాపాడుతూనే సంస్కరణలు తీసుకొచ్చారు. భవిష్యత్ తరాలు, అన్ని రంగాల వ్యాపారవేత్తలకు రతన్ ఒక స్ఫూర్తికణికగా వెలుగొందారు

- కేంద్ర మంత్రి అమిత్ షా

టాటా సంస్థలను మరింత అంకితభావం, దార్శనికత, సమగ్రతలతో కూడిన సంస్థలుగా మార్చి వాటిని రతన్ ఉన్నతశిఖరాలకు చేర్చారు. సంస్థ ప్రభ దశాబ్దాలపాటు అలాగే ఉంటుంది. భారత పారిశ్రామికరంగంపై రతన్ తన చెరగని ముద్ర వేసి జేఆర్‌డీకి సిసలైన వారసుడిగా నిరూపించుకున్నారు.

- బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానీ

ఏమాత్రం సంకోచించకుండా ధైర్యంగా ప్రభుత్వ పెద్దలతో నిజం మాట్లాడగల సత్తా ఉన్న ముక్కుసూటి మనిషి. పారిశ్రామికవేత్తగానేకాకుండా మానవీయ విలువలున్న దార్శనికుడు. జీవితాంతం ఛారిటీల కోసం పనిచేశారు.

- మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్

అవిశ్రాంతంగా కృషిచేసి భారత పారిశ్రామిక రంగాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చారు. ప్రజా సంక్షేమం, మానవతా, సేవా కార్యక్రమాలతో ఆయన చేసిన మంచి పనులు శతాబ్దాలపాటు గుర్తుంటాయి. దేశం రతన్‌ను మిస్ అవుతోంది.

- కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా

సమున్నత పారిశ్రామికవేత్తగానే కాదు ప్రజాసంక్షేమం గురించి ఆలోచించే దాతృత్వశీలి. ఆయన లేని లోటును భారతీయ సమాజంలో, వ్యాపారరంగంలో ఎవరూ పూడ్చలేరు. ఆయన కుటుంబసభ్యులు, గ్రూప్ సంస్థల ఉద్యోగులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా.

- పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

బ్రిటిష్ ఇండస్ట్రీకి ఒక కొత్త రూపును తీసుకొచ్చారు. వ్యాపార ప్రపంచంలో ‘టైటాన్’గా వెలుగొందిన రతన్‌కు ఘన నివాళులు.

- బ్రిటన్ వ్యాపార, వాణిజ్య శాఖ మంత్రి జొనాథన్ రేనాల్డ్స్

ద.కొరియా రచయిత్రికి సాహిత్య నోబెల్

వచన కవిత్వం రాసిన హాన్ కాంగ్‌కు ప్రకటించిన నోబెల్ కమిటీ



హాన్ కాంగ్



ఆమె రచనలు

స్టాక్‌హోమ్: చరిత్రలోని గాయాలను, మానవ జీవితంలోని దుర్బలత్వాన్ని అద్భుతమైన వచన కవిత్వం ద్వారా ఆవిష్కరించిన దక్షిణ కొరియా రచయిత్రి హాన్‌కాంగ్‌కు ఈసారి సాహిత్య నోబెల్ దక్కింది. కవిత్వంలోని పాత్రల ద్వారా మహిళల జీవితాల్లోని విషాదాలను, వారి పట్ల తన సహానుభూతిని 53 ఏళ్ల హాన్‌కాంగ్ మనసుకు హత్తుకునేలా చెప్పారని నోబెల్ కమిటీ చైర్మన్ ఆండర్స్ ఆల్సన్ పొగిడారు. ‘‘ శరీరానికి, ఆత్మకు మధ్య అల్లుకుపోయిన అవినాభావ సంబంధాన్ని హాన్‌కాంగ్ భలేలా విడమిరిచి చెప్పారు. చావు పుట్టుకలను తన ప్రయోగాత్మకమైన వచన కవిత్వంలో చక్కగా విపులీకరించారు. సమకాలీన గద్య కవిత్వంలో కొత్త ఆవిష్కరణలకు ఆమె బాటలు వేశారు’’ అని ఆల్సన్ శ్లాఘించారు. ‘‘కొన్ని సార్లు సుతిమెత్తగా, మరికొన్ని సార్లు కర్కశంగా, ఇంకొన్ని సార్లు వెటకారంగా ఆమె రచన సాగింది’’ అని నోబెల్ సాహిత్య కమిటీలో సభ్యురాలు, స్వీడన్ రచయిత్రి అన్నా కరిన్ పామ్ విశ్లేషించారు. ఈ ఏడాదికి సాహిత్య నోబెల్‌కు ఎంపికవడం ద్వారా హాన్‌కాంగ్ ఈ అవార్డ్‌ను గెల్చుకున్న తొలి ఆసియన్ మహిళగా, రెండో దక్షిణకొరియా వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. గతంలో దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు కిమ్ దాయి జంగ్‌కు 2000 సంవత్సరంలో నోబెల్ పీస్ ప్రైజ్ దక్కింది. ద.కొరియా సంస్కృతి క్రమంగా అంతర్జాతీయంగా ప్రభావం చూపుతున్న తరుణంలో ఆమెకు ఈ అవార్డ్ రావడం విశేషం.

గతంలోనూ అంతర్జాతీయ అవార్డులు

హాన్‌కాంగ్‌కు 2016లో ‘ది వెజిటేరియన్’ రచనకుగాను అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ లభించింది. మాంసాహారం మానేసి శాకాహారిగా మారుదామని ఒక మహిళ తీసుకున్న కఠిన నిర్ణయం కారణంగా జీవితంలో ఆమెకు ఎదురైన అనుభవాల సమాహారంగా ఈ పుస్తకాన్ని రాశారు. 2018లో ఈమె రాసిన హ్యూమన్ యాక్ట్స్ పుస్తకం సైతం ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ తుది జాబితాకు ఎంపికైంది. 1998లో ఆమె రాసిన తొలి నవల బ్లాక్‌డీర్ మార్కెట్లోకి వచ్చింది. ది వెజిటేరియన్, గ్రీక్ లెసన్స్, హ్యూమన్ యాక్ట్స్, ది వైట్ బుక్ వంటి రచనలు ఇంగ్లిష్‌లోకి అనువాదమయ్యాయి. హ్యూమన్ యాక్ట్స్ రచన 1980లో హాన్ సొంత నగరం గ్వాంగ్జులో ప్రజాస్వామ్య ఉద్యమకారుల హత్యోదంతం ఘటనలను కళ్లకు కడుతుంది.

రచనా వారసత్వం

హాన్ రచనా నైపుణ్యం వారసత్వంగా వచ్చిందనే చెప్పాలి. ఈమె తండ్రి హాన్ స్యూంగ్ వాన్ ఆధునిక కొరియా రచయితల్లో లబ్దప్రతిష్టుడిగా పేరొందారు. ఈమె గ్వాంగ్జు సిటీలో జన్మించినా కొన్నాళ్లకే కుటుంబం సియోల్ సిటీ దగ్గర్లోని సుయురి ప్రాంతానికి తరలిపోయింది. హాన్ అక్కడి యోన్‌సీ విశ్వవిద్యాలయంలో పుస్తకాలు తిరగేసి కొరియా సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. హాన్ సోదరుడు డాంగ్ రిమ్ కూడా రచయితే. హాన్ రాసిన వ్యాస సంపుటాలు సహా 18 పుస్తకాలను ఇప్పటిదాకా ఇంగ్లిష్‌లోకి అనువదించారు. వీటిల్లో ‘ది వెజిటేరియన్’ పుస్తకం విశేష ఆదరణ పొందింది. సాహిత్య నోబెల్‌ను ఎక్కువగా యూరప్, ఉత్తర అమెరికా రచయితలకు కట్టబెడుతున్నారన్న విమర్శల నడుమ ద.కొరియా నుంచి హాన్‌కాంగ్ ఈ అవార్డ్‌ను గెల్చుకోవడం గమనార్హం.

రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలి

మహారాష్ట్ర కేబినెట్ తీర్మానం

ముంబై: పారిశ్రామిక దిగ్గజం, దివంగత రతన్ టాటాకు దేశ అత్యున్నత పౌర పురస్కారం ‘భారతరత్న’ ఇవ్వాలని మహారాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసింది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో సమావేశమైన మంత్రివర్గం రతన్‌టాటాకు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసింది. ‘సమాజాన్ని వృద్ధిలోకి తేవాలని నిజాయితీగా భావించాలి. దేశంపై ప్రేమ ఉండాలి. దేశ, సమాజ వృద్ధికి అంకితభావంతో పనిచేసిన దార్శనికుడిని కోల్పోయాం. పారిశ్రామిక రంగంలో, సమాజసేవలో ఆయన కృషి అసమానమైనది. ఉన్నత విలువలు, పారదర్శకత, సమున్నత వ్యాపార నిర్వహణ, క్రమశిక్షణలతో అన్ని సవాళ్లను ఎదుర్కొన్నారు’ అని తీర్మానం పేర్కొంది.

ఎన్సీ శాసనసభా పక్షనేతగా ఒమర్



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ శాసనసభాపక్ష నేతగా ఆ పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నవా-ఇ-సుబాహ్‌లో ఎన్సీ ఎమ్మెల్యేలంతా సమావేశమై ఒమర్‌ను ఎన్నుకున్నట్లు పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు. దీంతో జమ్మూకశ్మీర్ తదుపరి ముఖ్యమంత్రిగా ఒమర్ పేరు ఖరారైంది. జమ్మూకశ్మీర్‌లో నూతన ప్రభుత్వ ఏర్పాటు తేదీపై ఎన్సీ, కాంగ్రెస్ కూటమి నేతలు సమావేశమై నిర్ణయం తీసుకుంటారని ఫరూక్ చెప్పారు.

స్కూలు, క్లినిక్‌లపై ఇజ్రాయెల్ దాడి

34 మంది మృతి, 69 మందికి గాయాలు

డెయిర్ అల్-బలాహ్/బీరుట్: గాజాపై ఇజ్రాయెల్ దాడులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గురువారం ఒక స్కూలు, క్లినిక్‌లపై జరిగిన దాడుల్లో కనీసం 34 మంది ప్రాణాలు కోల్పోగా, 69 మంది గాయపడ్డారు. శరణార్థులు తలదాచుకుంటున్న డెయిర్ అల్- బలాహ్‌లోని స్కూలు భవనంపై ఇజ్రాయెల్ జరిపిన బాంబు దాడిలో 28 మంది చనిపోగా, 54 మంది గాయపడ్డారు. మృతుల్లో ఒక చిన్నారి, ఏడుగురు మహిళలున్నట్లు అల్ అక్సా మార్టిర్స్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. శరణార్థులకు సాయం అందించే విషయమై ఓ సంస్థ ప్రతినిధులు శిబిరం నిర్వాహకులతో చర్చిస్తున్న సమయంలో భవనంపై దాడి జరిగినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. ఉదయం 11.20 గంటల సమయంలో ఘటన జరిగినప్పుడు స్కూలు భవనంలో సుమారు 3 వేల మంది ఉన్నట్లు పాలస్తీనియన్ రెడ్ క్రీసెంట్‌కు చెందిన రిస్క్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ హిషామ్ అబూ హోలీ తెలిపారు. దాడి తీవ్రతకు మృతదేహాలు ముక్కముక్కలు ముక్కలై చెల్లా చెదురుగా పడిపోయాయన్నారు. ఛిద్రంగా మారిన శరీర భాగాలనే ఏరి ఆస్పత్రికి తరలించినట్లు అక్కడి భయానక పరిస్థితిని హిషామ్ వివరించారు. మృతుల్లో ఆరేళ్ల చిన్నారి నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకు ఉన్నారన్నారు. మొత్తం మూడంతస్తులకు గాను ఒకటో ఫ్లోర్‌లో శిబిరం పరిపాలన సిబ్బంది ఉండగా, మిగతా రెండంతస్తుల్లోనూ శరణార్థులే తలదాచుకుంటున్నారన్నారు. మొదటి అంతస్తు లక్ష్యంగా చేసుకుని దాడి జరిగినట్లు భావిస్తున్నామన్నారు. కానీ, దాడి తీవ్రతకు రెండు, మూడు అంతస్తులు సైతం తీవ్రంగా దెబ్బతిన్నట్లు వివరించారు. మరో ఘటనలో..గాజా నగరం పశ్చిమాన ఉన్న అల్-రిమల్ క్లినిక్‌పై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన లక్షిత దాడిలో ఆరుగురు చనిపోగా మరో 15 మంది గాయపడ్డారని గాజాలోని అంబులెన్స్ సర్వీస్ ప్రతినిధి ఫరేస్ అవాద్ తెలిపారు.

బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి: 11 మంది మృతి

బీరుట్: సెంట్రల్ బీరుట్‌పై ఇజ్రాయెల్ గురువారం చేసిన రెండు వేర్వేరు దాడుల్లో 11 మంది మృతి చెందారని, 48 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్యశాఖ వెల్లడించింది. రస్ అల్-నబాలో ఓ ఎనిమిది అంతస్తుల భవనంపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించగా.. అపార్ట్‌మెంట్ కింది భాగం దెబ్బతింది.

సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఈవీఎంలలో తేడాలపై కాంగ్రెస్ డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ.. విచారణ పూర్తయ్యే వరకు అనుమానాస్పద ఈవీఎం మెషీన్లను సీల్ చేయాలని కాంగ్రెస్ పునరుద్ఘాటించింది. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. తాము పట్టుబట్టినప్పటికీ పెద్ద సంఖ్యలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించలేదని కాంగ్రెస్ పేర్కొంది. ఈవీఎం ట్యాంపరింగ్ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై క్షేత్రస్థాయి నుంచి ఆధారాలను సేకరిస్తున్నారు. కీలక నాయకులతో రాహుల్ సమాలోచనలు కొనసాగిస్తున్నారు. సీనియర్ నాయకులు కేసీ వేణుగోపాల్, అశోక్ గహ్లోత్, జైరాం రమేశ్ తదితర నాయకులు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి రాతపూర్వక ఫిర్యాదు అందించారు. ఏడు నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలలో తేడాలపై ఆధారాలు సమర్పించారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈవీఎం ట్యాంపరింగ్ జరిగిందని ఆరోపించిన కాంగ్రెస్ పార్టీ మొత్తం 20 ఫిర్యాదులు చేసింది. వీటిపై విచారణ చేస్తామని ఈసీ హామీ ఇచ్చింది. ఈవీఎంలపై సందేహాలను లేవనెత్తుతూ కాంగ్రెస్ నాయకులు గురువారం మాట్లాడారు. వారేమన్నారంటే..

రోజంతా వాడితే 99 శాతం చార్జింగ్ ఎలా సాధ్యం?

ఎన్నికల్లో వినియోగించే ఈవీఎం మెషీన్ల బ్యాటరీలు 99 శాతం చార్జింగ్ కావడం అనుమానాలకు తావిస్తోంది. బ్యాటరీ ఛార్జ్ 90 శాతానికి మించి ఉన్న చోట బీజేపీ గెలుస్తోంది. 60-70 శాతం బ్యాటరీలు చార్జింగ్ అయిన చోట బీజేపీ గెలవదు. బ్యాటరీ 99 శాతానికి ఛార్జ్ అవ్వడానికి కారణం ఏమిటి? యంత్రాన్ని రోజంతా ఉపయోగించినప్పుడు, అది 99 శాతం ఛార్జ్ ఎలా ఉంటుంది. కాబట్టి మా సందేహానికి కారణం ఉంది.

-ఉదయ్‌భాన్, హరియాణా కాంగ్రెస్ అధ్యక్షుడు

కౌంటింగ్ ప్రక్రియపై సందేహాలున్నాయి

ఈవీఎం ట్యాంపరింగ్‌కు బీజేపీ పాల్పడుతోంది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి. హరియాణాలో బీజేపీ హయాంలో అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎంలు) హ్యాకింగ్‌కు గురయ్యాయి. ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యాక, గంట సేపటిదాకా కాంగ్రెస్ 65 స్థానాల్లో ముందంజలో ఉండగా, బీజేపీ 17 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. అయితే ఈ దశలో ట్రెండ్ యూటర్న్ తీసుకుంది. ఇది కౌంటింగ్ ప్రక్రియపై సందేహాలను లేవనెత్తుతోంది.

- సుభాష్ బాత్రా, హరియాణా మాజీ హోంమంత్రి

ప్రజాభీష్టం తారుమారు

ప్రజల అభీష్టాన్ని తారుమారు చేసిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను మేం అంగీకరించబోం. ఈ ఫలితాలు ఊహించనివి.. వాస్తవికతకు విరుద్ధంగా ఫలితాలు ఉన్నాయి. హరియాణా ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా ఫలితాలు వెలువడ్డాయి. ఫలితాలపై తప్పకుండా విశ్లేషణ చేస్తాం. వివిధ జిల్లాల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎన్నికల సంఘానికి పంపిస్తాం.

- జైరాం రమేష్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

ఆలస్యమెందుకో..!

హరియాణా ఫలితం చాలా ఆశ్చర్యకరంగా ఉంది. అన్ని ఏజెన్సీల సర్వే ప్రకారం, హరియాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతోందని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభమైనప్పుడు, కాంగ్రెస్ అన్ని చోట్లా ఆధిక్యంలో ఉంది. కానీ ఈవీఎంల లెక్కింపు ప్రారంభమైనప్పుడు, కాంగ్రెస్ వెనుకబడటం ప్రారంభమైంది. చాలా చోట్ల ఓట్ల లెక్కింపు ఆలస్యమైంది. పలు జిల్లాల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం.

- భూపిందర్‌సింగ్ హుడా , మాజీ ముఖ్యమంత్రి



కల్కాజీలోని తన నివాసంలో ప్యాక్ చేసిన సామగ్రి మధ్య ఫైళ్లు చూస్తున్న అతిశి

ఆప్‌ను ఎదుర్కోలేకే: అతిశి

న్యూఢిల్లీ: సీఎం నివాసాన్ని ఆక్రమించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశి ఆరోపించారు. ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించలేకపోయినందుకు బీజేపీ ఫ్రస్టేషన్‌లో ఉందని, అందుకే తీవ్ర చర్యలకు దిగుతోందని ఆమె వ్యాఖ్యానించారు. పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు వారు చేపట్టిన ‘ఆపరేషన్ కమలం’ కూడా విఫలమవడం, తమ నాయకులను జైల్లో పెట్టినా ప్రయోజనం లేకపోవడంతో బీజేపీ ఇలా చేస్తోందన్నారు. కార్లు, బంగ్లాల కోసం ఆప్ రాజకీయాలు చేయదని గురువారం విలేకరుల సమావేశంలో అతిశి స్పష్టం చేశారు. సీఎం ఇంటిని ఆక్రమించడం ద్వారా బీజేపీకి శాంతి చేకూరితే స్వాగతిస్తామని తెలిపారు. అవసరమైతే ఆప్ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా వారి భవనాలు ఖాళీ చేసి, వీధుల్లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్ బంగ్లా ఖాళీ చేసిన అనంతరం కల్కాజీలో ఉన్న తన నివాసంలో కార్టన్ల మధ్య కూర్చుని సీఎం అతిశి ఫైళ్లపై సంతకాలు చేస్తున్న చిత్రాలను ఆప్ ఎక్స్‌లో షేర్ చేసింది. ఢిల్లీ ప్రజల కోసం పనిచేయాలనే అతిశి నిబద్ధతను బీజేపీ తీసేయలేదని ఆప్ నాయకుడు సంజయ్ సింగ్ పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఒక మహిళా ముఖ్యమంత్రి నివాసం నుంచి వస్తువులను బీజేపీ విసిరేసిందని మండిపడ్డారు. ఇది మహిళా ముఖ్యమంత్రిని, ఢిల్లీ ప్రజలను తీవ్రంగా అవమానించడమేనన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆదేశాల మేరకే అతిశి ఆస్తులను బంగ్లా నుంచి తొలగించారని ఆరోపించారు. దక్షిణ ఢిల్లీలోని తన అసెంబ్లీ నియోజకవర్గం కల్కాజీలో నివసిస్తున్న అతిశికి.. గత ఏడాది ఆమె మంత్రిగా నియమితులైన తర్వాత మధుర రోడ్డులోని ఏబీ-17 బంగ్లాను కేటాయించారు. అయినా ఆమె కల్కాజీలోనే నివాసముంటున్నారు.

సానుభూతికోసం ఆప్ డ్రామాలు: బీజేపీ

ఆప్ ఆరోపణలపై దీనిపై బీజేపీ స్పందించింది. సానుభూతి పొందేందుకు ఆప్ డ్రామాలకు పాల్పడుతోందని, ఆస్తులపై బాధిత కార్డు ఆడుతోందని మండిపడింది. ఫ్లాగ్ స్టాఫ్ రోడ్ బంగ్లా ఢిల్లీ ముఖ్యమంత్రి అధికారిక నివాసం కాదని ఆ పార్టీ ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ పేర్కొన్నారు.



పద్మ విభూషణ్

శ్రీ. రతన్ ఎన్ టాటా

28.12.1937 – 09.10.2024

తన ఎనలేని సహాయ సహకారాలతో కేవలం టాటా గ్రూప్ ను తీర్చిదిద్దటమే కాకుండా మన జాతికి అమూల్యమైన సేవలు అందించిన నిజమైన అసాధారణ నాయకుడు శ్రీ. రతన్ నవల్ టాటా ఇక లేరని బాధాతప్త హృదయాలతో ఆయనకు వీడ్కోలు చెబుతున్నాం.

టాటా గ్రూప్ కోసం, శ్రీ టాటా ఛైర్మన్ కి మించిన బాధ్యతలు చేపట్టి సంస్థ పురోగతిలో కీలకమైన బాధ్యతలు వహించారు. ఆయన ప్రేరణకు ఉదాహరణగా నిలిచారు. శ్రేష్టత, సమగ్రత, వినూత్నతలకు అచంచలమైన నిబద్ధతతో, ఆయన నాయకత్వంలో టాటా గ్రూప్ తన నైతికతకు అనుగుణంగా ఎల్లప్పుడూ ఉంటూనే ప్రపంచవ్యాప్తంగా కూడా విస్తరించింది.

దాతృత్వానికి మరియు సమాజాభివృద్ధికి శ్రీ. టాటా అంకిత భావం లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేసింది. విద్య నుండి ఆరోగ్య సంరక్షణ వరకు, ఆయన చేపట్టిన చొరవలు భావి తరాల వారికి కూడా ప్రయోజనం కలిగించే విధంగా ఎంతో విస్తృతమైన ముద్ర వేశాయి. ప్రతి వ్యక్తిగత చర్యలో శ్రీ. టాటా నిజమైన వినయ విధేయతలే ఈ పని అంతటినీ బలపరుస్తోంది.

పూర్తి టాటా కుటుంబం తరపు నుండి, ఆయన కుటుంబానికి, సన్నిహితులకు మేము మా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాము. ఆయన ఎంతో అభిరుచి తో మార్గదర్శకత్వం వహించిన ఆదర్శాలను కొనసాగించడానికి మేము చేసే కృషి లో ఆయన వారసత్వం మమ్మల్ని ప్రేరేపిస్తూనే ఉంటుంది.

TATA

టాటా సన్స్ & టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీస్

బీసీ రిజర్వేషన్ల పెంపే మా ప్రభుత్వ లక్ష్యం

- అందుకే సమగ్ర కులగణనకు చర్యలు వేగవంతం చేశాం
- దసరా పండుగ తర్వాత సర్వే ప్రక్రియ ప్రారంభిస్తాం
- బీసీ కుల సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి


సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న మహేశ్‌గౌడ్, జాజుల, గౌడ సంఘాల ప్రతినిధులు. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి తదితరులు

సాక్షి, హైదరాబాద్: బీసీలకు రాజకీయ అవకాశాలను మెరుగుపరిచేందుకు స్థానికసంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, వారి జనాభాకు అనుగుణంగా అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, కన్వీనర్ బాలగోనీ బాలరాజుగౌడ్ తదితరులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బీసీ ప్రతినిధుల బృందానికి డిసెంబర్‌లోగా కుల గణన సర్వే పూర్తి చేస్తామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. దీనిపై బీసీ కుల సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉండటం పట్ల బీసీ సంక్షేమసంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. వేగవంతంగా ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులను సందర్భంగా కోరారు.


బాసర శ్రీజ్ఞాన సరస్వతీదేవి క్షేత్రంలో మహాగౌరి దేవి అలంకారంలో అమ్మవారు


అలంపూర్ శ్రీ జోగులాంబ ఆలయంలో మహాగౌరిదేవిగా అమ్మవారు


వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయంలో మహాదుర్గాలంకారంలో అమ్మవారు

తెలంగాణ భవన్‌లో జమ్మి చెట్టు


జమ్మి మొక్కను నాటుతున్న మాజీ ఎంపీ వినోద్

సాక్షి, హైదరాబాద్: రాజ్యసభ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా తెలంగాణ భవన్ ఆవరణలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ గురువారం జమ్మి మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు హిందూ సంస్కృతీ సంప్రదాయాల్లో జమ్మిచెట్టుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రతీ దేవాలయం ఆవరణలో జమ్మి మొక్క నాటాలని వినోద్ కుమార్ కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, గ్రీన్ ఇండియా చాలెంజ్ కో–ఫౌండర్ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మెరుగైన హెల్త్ స్కీం తెస్తాం

ట్రస్ట్ లేదా ఇన్సూరెన్స్‌తో ఈహెచ్ఎస్‌కు కసరత్తు చేస్తున్నాం
- డిజిటల్ ఫ్యామిలీ కార్డులతో అన్ని పథకాలు, సేవలు
- ఈ సమాచారానికి సైబర్ దాడుల ముప్పు లేకుండా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తాం
- ప్రపంచ బ్యాంకు నిధులొస్తే వైద్య మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తాం
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకంపై దృష్టిసారించినట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఏ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లినా తక్షణమే నగదురహిత ఉచిత వైద్యం అందేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే డిజిటల్ ఫ్యామిలీ కార్డుల జారీ కోసం సేకరిస్తున్న కుటుంబాల వివరాల్లో ప్రజలు ఆరోగ్య సమాచారాన్ని కూడా నిక్షిప్తం చేస్తామన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ చేపట్టిన వివిధ కార్యక్రమాలు, అమలుపై మంత్రి దామోదర 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: ప్రభుత్వోద్యోగులకు ఇప్పటికీ నగదురహిత వైద్య సేవలు సరిగ్గా అందట్లేదు. ఈ పథకాన్ని మెరుగుపరిచేందుకు ఏం చేయబోతున్నారు?

దామోదర: ఉద్యోగులు, పింఛన్‌దారులు, జర్నలిస్టులకు నగదురహిత ఆరోగ్య పథకాన్ని (ఈహెచ్ఎస్) కొత్తగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావుడిగా జీవో జారీచేసింది. దానివల్ల ఎలాంటి ప్రయోజనం జరగలేదు. మేం అత్యంత పకడ్బందీగా ఆ పథకాన్ని అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. ట్రస్ట్ ద్వారా నగదురహిత ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలా లేక బీమా పద్ధతిలో అమలు చేయాలా అనే విషయమై ఆలోచిస్తున్నాం. ఉద్యోగుల నుంచి కంట్రిబ్యూషన్ తీసుకోవాలా లేదా? అనే అంశంపై నిర్ణయం తీసుకోలేదు. దీనిపై ఉద్యోగుల అభిప్రాయం తీసుకొని వారు కోరుకుంటున్నట్లుగా ఈ పథకానికి రూపకల్పన చేస్తాం.

సాక్షి: తొలుత డిజిటల్ హెల్త్ కార్డులని ప్రకటించిన ప్రభుత్వం తాజాగా అన్ని పథకాలకు వర్తించేలా డిజిటల్ ఫ్యామిలీ కార్డులు జారీ చేస్తామంటోంది. ఈ మార్పునకు కారణం ఏమిటి?

దామోదర: మొదట డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వాలనుకున్నాం. కానీ అన్ని రకాల సంక్షేమ పథకాలు, సేవలకు ఒకే ఫ్యామిలీ డిజిటల్ కార్డుంటే బాగుంటుందన్న అభిప్రాయం వచ్చింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఈ ఫ్యామిలీ కార్డు ద్వారా ఏకీకృతం చేయడం వల్ల ప్రజలు ఎక్కువ ప్రయోజనం పొందుతారు. ఒక్కో సేవకు ఒక్కో కార్డు అంటూ ఇవ్వడం వల్ల అంతా గందరగోళం నెలకొంటుంది. అందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

సాక్షి: సైబర్ దాడుల ముప్పు నేపథ్యంలో ప్రజల వివరాలతో కూడిన డిజిటల్ హెల్త్ కార్డులు ఎంతవరకు భద్రం?

దామోదర: సైబర్ దాడులకు గురికాకుండా, ప్రజల సమాచారం ఇతరుల చేతుల్లోకి పోకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తాం. ఈ విషయంలో ప్రభుత్వం ఆషామాషీగా వ్యవహరించదు.

సాక్షి: వైద్య, ఆరోగ్యశాఖకు దాదాపు రూ. 5 వేల కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులకు ఆమోదం లభించిందా? ఈ నిధులను వేటి కోసం వాడతారు?

దామోదర: ప్రపంచ బ్యాంకు నిధుల ప్రక్రియ కొనసాగుతోంది. ఒకవేళ ప్రపంచ బ్యాంకు నిధులు వస్తే వైద్య మౌలిక సదుపాయాలపై దృష్టిసారిస్తాం. ప్రధానంగా 14 కాంపోనెంట్లపై కేంద్రీకరిస్తాం. ట్రామా కేర్ సెంటర్లు, డయాలసిస్ సెంటర్లు, వ్యాస్క్యులర్ యాక్సెస్ సెంటర్లు, సిములేషన్ అండ్ స్కిల్ ల్యాబ్స్ ఫర్ ఎమర్జెన్సీ కేర్, ఇంటిగ్రేటెడ్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్స్, డయాగ్నొస్టిక్ సర్వీసెస్ పెంపు, ఆర్గాన్ రిటీవ్రవల్ అండ్ స్టోరేజ్ సెంటర్లు, ఆరోగ్య మహిళ కార్యక్రమంతో కలిపి ఎంసీహెచ్ సర్వీసెస్ మెరుగుపరచడం, కాక్లియర్ ఇంప్లాంట్ సెంటర్లు, డ్రగ్స్ డీఅడిక్షన్ సెంటర్లు, టిమ్స్, ఉస్మానియా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో కొత్త పరికరాల కొనుగోళ్లు, కేన్సర్ కేర్‌లపై దృష్టిసారిస్తాం.

సాక్షి: ఇప్పటివరకు వైద్య నియామకాలు ఎన్ని జరిగాయి? భవిష్యత్తులో ఇంకెంతమందిని భర్తీ చేస్తారు?

దామోదర: ఇప్పటివరకు 7,308 వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేశాం. ఇంకా 6,293 పోస్టులు భర్తీ దశలో ఉన్నాయి. వాటికి నోటిఫికేషన్లు కూడా ఇచ్చాం. రానున్న రోజుల్లో మరిన్ని పోస్టులను కూడా భర్తీ చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

కాటన్ పరిశ్రమను బతికించాలి

- నేతన్నల ఆకాంక్షతో సిరిసిల్లలో ఫ్లెక్సీలు
- ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని విజ్ఞప్తి


సిరిసిల్లలో వెలసిన ఫ్లెక్సీలు

సిరిసిల్లటౌన్: 'కాటన్ ప్రభుత్వ చీరలు రావాలి..కాటన్ వస్త్ర పరిశ్రమను కాపాడాలి'అని సిరిసిల్లలో నేతన్నల ఆకాంక్షతో ఫ్లెక్సీలు వెలిశాయి. గతంలో ఇక్కడ తయారయ్యే కాటన్ కేస్మిట్ క్లాత్ (పెటీకోట్స్ వస్త్రం)కు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉండేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సిరిసిల్ల నేత కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గతంలోని బీఆర్ఎస్ సర్కారు ఏడేళ్లపాటు బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇచ్చింది. దీంతో సిరిసిల్లలో కాటన్ వస్త్రోత్పత్తిదారులు ప్రభుత్వ ఆర్డర్ల ప్రకారం చీరలు తయారు చేస్తూ వచ్చారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ చీరల ఆర్డర్లకు బదులు మహిళా సంఘాల సభ్యులకు మెరుగైన చీరల ను అందిస్తామని ప్రకటిస్తూ..వాటిని సిరిసిల్లకు ఆర్డర్లు ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. దీంతో గతంలో కేస్మిట్ తయారు చేసిన వస్త్రోత్పత్తిదారులు, అనుబంధ రంగాల ప్రతినిధులు కలసి ప్రభుత్వ ఆర్డర్లలో కాటన్ చీరలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆర్డర్లపై సర్వత్రా చర్చసాగుతోంది. ఈ క్రమంలో కాటన్ వస్త్రోత్పత్తి, అనుబంధ రంగాల జేఏసీ పేరుతో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల వెంట బతుకమ్మ, దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ... ప్రభుత్వానికి తమ ఆకాంక్షలను ఇలా తెలియజేయడం సర్వత్రా చర్చకు దారితీసింది.

'డీకేజెడ్' నిందితులు చిక్కారు

- 17,500 మంది నుంచి రూ.229 కోట్ల వసూలు

సాక్షి, హైదరాబాద్: వివిధ రకాల స్కీముల పేరుతో, అధిక వడ్డీ ఆశచూపి భారీ స్కామ్‌కు పాల్పడిన డీకేజెడ్, డీకాజూ టెక్నాలజీస్ సొల్యూషన్స్ లిమిటెడ్ సంస్థల కేసులో కీలక నిందితులను హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వీరు 17,500 మంది నుంచి రూ.229 కోట్లు వసూలు చేసి మోసం చేసినట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ చెప్పారు. గుడిమల్కాపూర్‌కు చెందిన అబ్దుల్ జైయిష్ వృత్తిరీత్యా డాక్టర్. ఈయన గత జనవరిలో ఓ యూట్యూబ్‌లో డీకేజెడ్ టెక్నాలజీస్ సొల్యూషన్స్, డీకాజూ టెక్నాలజీస్ సొల్యూషన్ సంస్థలకు చెందిన వీడియోలు చూశాడు. వారి వ్యాపారానికి ఆకర్షితుడైన జైయిష్ మాదాపూర్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ అష్బఖ్ రాహిల్, మేనేజర్లు మహ్మద్ ఇక్బాల్, సయ్యద్ ఉమర్ అహ్మద్, మోహిజ్, నజీర్, బిలాల్‌లను కలిశాడు. రూ.5 వేలు మొదలు ఎంత పెద్ద మొత్తమైనా తమ వద్ద డిపాజిట్ చేయొచ్చని, 8 నుంచి 12 శాతం వడ్డీ ఇస్తామని చెప్పారు. తాము మాదాపూర్‌లో డీకాజో, చాదర్‌ఘాట్‌లో అవర్లీ ఫ్రెష్ పేర్లతో, టోలీచౌకీలో మరో స్టోర్‌ను నిర్వహిస్తున్నామని, రోజూ దాదాపు 4 వేల మందికి సరుకులు డెలివరీ చేస్తున్నామని నమ్మించారు. తమ స్టోర్స్ ద్వారా వినియోగదారులకు డిస్కౌంట్ ధరల్లో వస్తువులు విక్రయిస్తున్నామని, ఎక్కువగా హెడ్ ఫోన్స్, నెక్ బ్యాండ్స్ అమ్మి లాభాలు ఆర్జిస్తామని చెప్పారు. ఈ మాటలతో వారి వలలో పడిన వైద్యుడు ఆగస్టులో రూ.2.74 కోట్లు పెట్టుబడిగా పెట్టారు. ఆ తరువాత కొన్ని రోజులకే సంస్థ బోర్డు తిప్పేయడంతో ఆయన సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంస్థ లావాదేవీలపై దృష్టిపెట్టిన పోలీసులు పలు కీలకాంశాలు గుర్తించారు. 17,500 మంది నుంచి రూ.229 కోట్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో సేకరించినట్లు బయటపడింది. పరారీలో ఉన్న సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాహిల్, డైరెక్టర్‌గా ఉన్న ఆయన భార్య సైదా అయిషా నాజ్‌లను గురువారం పట్టుకున్నారు. వీరి నుంచి 564 గ్యారంటీ అగ్రిమెంట్లు, ఖాళీ లెటర్ హెడ్స్, 13 ల్యాప్‌టాప్‌లు, రూ.1.7 కోట్ల నగదు సీజ్ చేశారు. బాధితుల సంఖ్య పెరిగే అవకాశముందని పోలీసులు చెప్పారు.

మంచు విష్ణు పేరు దుర్వినియోగం చేయొద్దు

- యూట్యూబర్లకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు, నటుడు మంచు విష్ణు పేరును దుర్వినియోగం చేసిన యూట్యూబ్ చానల్స్ నిర్వాహకులను ఢిల్లీ హైకోర్టు మందలించింది. కొంతకాలం క్రితం మంచు విష్ణు గొంతు, సినిమా పేర్లపై పలు యూట్యూబ్ చానల్స్‌లో అవమానకరమైన రీతిలో వీడియోలు, ఆడియోలను పోస్ట్ చేశారు. ఇవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో పలువురు యూట్యూబర్లు తన వ్యక్తిగత ప్రతిష్టను డ్యామేజ్ చేస్తున్నారంటూ మంచు విష్ణు ఢిల్లీ హైకోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఈ పిటిషన్‌పై గురువారం జస్టిస్ మిని పుష్కర్ణ విచారణ చేపట్టి మంచు విష్ణు పేరును దుర్వినియోగం చేయొద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. విష్ణు వ్యక్తిగత ప్రతిష్టతను డ్యామేజ్ చేసేలా వ్యవహరించిన యూట్యూబర్లను మందలించారు. అవమానకరమైన రీతిలో రూపొందించిన వీడియోలు, ఆడియోలను ఆయా యూట్యూబ్ చానళ్ల నుంచి నిలుపుదల చేయాలని కేంద్ర ప్రభుత్వ పరిధిలోని టెక్నాలజీ మంత్రిత్వ శాఖను ఆదేశించారు. 48 గంటలలోపు ఈ లింక్‌లను పూర్తిగా తొలగించాలని, లేనిపక్షంలో ఆయా చానళ్లను తామే నిషేధిస్తామని యూట్యూబర్లకు స్పష్టంచేశారు. కాగా, ఢిల్లీ హైకోర్టు తీర్పుతో సెలబ్రిటీల డిజిటల్ హక్కుల పరిరక్షణలో ఓ ముందడుగు పడిందని విష్ణు తరఫు న్యాయవాది ప్రవీణ్ ఆనంద్ మీడియాకు చెప్పారు. హైకోర్టు ఆదేశాలతో దాదాపు 75 యూట్యూబ్ లింకులను తొలగించారన్నారు.

యాదాద్రి 'తాపడానికి' బంగారం అప్పగింత

- స్మార్ట్ క్రియేషన్ సంస్థకు అందజేసిన ఈవో


బంగారం తూకం వేస్తున్న స్మార్ట్ క్రియేషన్ సంస్థ నిర్వాహకుడు, పక్కన ఈవో భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ విమాన గోపురం బంగారు తాపడం పనులను అధికారులు వేగవంతం చేశారు. ఇందులో భాగంగానే చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్ సంస్థకు గురువారం ఈవో భాస్కర్‌రావు బంగారాన్ని అప్పగించారు. సుమారు 12 కిలోల బంగారాన్ని చెన్నైకి తీసుకెళ్లి సంస్థ ప్రతినిధులకు అందజేశారు. ఈ మేరకు బంగారం నాణ్యతను పరిశీలించి, తూకం వేసి తీసుకున్నారు. మరింత బంగారాన్ని సైతం మరో విడతగా ఆలయ అధికారులు స్మార్ట్ క్రియేషన్ సంస్థకు అప్పగించనున్నట్లు తెలిసింది. బంగారం తీసుకెళ్లిన వారిలో ఏఈవో గజివెల్లి రఘు, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు తదితరులు కూడా ఉన్నారు.

సీడీఓ మాజీ సీఈని విచారించిన విజిలెన్స్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ వైఫల్యంపై విచారణలో భాగంగా నీటిపారుదలశాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీఓ) చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసిన కేఎస్ఎస్ చంద్రశేఖర్‌ను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గురువారం విచారించింది. బరాజ్ డిజైన్ల రూపకల్పన, నిర్మాణ దశలో డిజైన్లలో చేసిన మార్పులు, షీట్ పైల్స్‌కి బదులు సెకెంట్ పైల్స్ వినియోగించాలని తీసుకున్న నిర్ణయాలకు బాధ్యులెవరని ఆయనను ప్రశ్నించినట్లు తెలిసింది. శుక్రవారం గజ్వేల్ ఎస్ఈ బస్వరాజుతో పాటు సీడీఓ డిప్యూటీ ఈఈను విచారించనుంది. మేడిగడ్డ బరాజ్ డిజైన్ల రూపకల్పనలో సీడీఓ డీఈగా బస్వరాజు పనిచేశారు.

ఇంటికొచ్చి లింగ నిర్ధారణ పరీక్ష

- రాజంపేటలో ఒకరిని అరెస్ట్ చేసిన పోలీసులు
- స్కానింగ్ మెషీన్ స్వాధీనం

కామారెడ్డి టౌన్: మొబైల్ వైద్య పరీక్షల ముసుగులో ఇంటి వద్దకే వచ్చి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఓ వ్యక్తి పోలీసులకు చిక్కాడు. ఈ ఘటన గురువారం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బల్ల రవీందర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో స్కానింగ్ సెంటర్‌లో పని చేస్తూ గర్భిణీలకు లింగనిర్ధారణ పరీక్షలు ఎలా చేయాలో నేర్చుకున్నాడు. ఓ గర్భిణి లింగనిర్ధారణ కేసులో ఆ ఆస్పత్రి రెండేళ్ల క్రితం సీజ్ కావడంతో రవీందర్ రాజంపేటలో స్వయంగా లింగనిర్ధారణ పరీక్షలు ప్రారంభించాడు. ఇందుకోసం ఓ మినీ స్కానింగ్ యంత్రాన్ని కొనుగోలు చేశాడు. వాస్తవానికి అతనికి స్కానింగ్ చేసే అర్హత లేదు. అయితే వారి కుటుంబ వృత్తి అయిన బీడీ కార్ఖానా ముసుగులో స్కానింగ్ పరీక్షలు ప్రారంభించాడు. రోజూ బీడీల గంప పేరుతో జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో పర్యటించి గర్భిణీలకు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ డబ్బులు దండుకుంటున్నాడు. చట్ట విరుద్ధంగా లింగ నిర్ధారణ చేస్తూ ఆడ, మగ శిశువు అని చెప్పి గర్భస్థ పిండాలను చిదిమేసేందుకు కారకుడయ్యాడు. కామారెడ్డి, గాంధారి, తాడ్వాయి, దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, సదాశివనగర్, ఎల్లారెడ్డి, బాన్సువాడ ఇలా చాలా మండలాలకు తన ద్విచక్ర వాహనంపై మినీ స్కానింగ్ యంత్రాన్ని తీసుకెళ్లి గర్భిణి ఇంటి వద్దనే లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నాడు. ఆడ పిల్లలుండి మగ పిల్లలు కావాలనుకునే వారి గురించి ఆరాతీస్తూ గుట్టుచప్పుడు కాకుండా రెండేళ్లుగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాడు. ఒక్కొక్కరి నుంచి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నాడు. ఈ విషయమై ఫిర్యాదులు రావడంతో కామారెడ్డి సీసీఎస్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి రవీందర్ ఇంటిపై దాడి చేసి అరెస్టు చేశారు. ఇంట్లో ఉన్న స్కానింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకుని దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు.

సమీకృత గురుకుల భవనాలకు నేడు శంకుస్థాపన

- రాష్ట్రవ్యాప్తంగా 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో భూమిపూజ
- కొందుర్గులో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి


కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మించే స్థలం ఇదే ..

సాక్షి, హైదరాబాద్/కొందుర్గు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల భవన నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో ఈ భవనాలకు ప్రభుత్వం శంకుస్థాపన చేయనుంది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కొందుర్గులో సమీకృత గురుకుల పాఠశాల భవన భూమిపూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అదేవిధంగా ఇతర ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో మంత్రులు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. శంకుస్థాపన ఏర్పాట్లకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం సచివాలయం నుంచి ఆయా జిల్లా కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొందుర్గులో నిర్వహించే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మధిర నియోజకవర్గంలో జరిగే కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొంటారని సీఎస్ చెప్పారు. ఈ కార్యక్రమాలకు ఆయా జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులందరినీ ఆహ్వానించాలని సూచించారు. ఇప్పటికే సంబంధిత అధికారులు శంకుస్థాపన జరిగే ప్రాంతాన్ని పరిశీలించినట్లు కలెక్టర్లు సీఎస్‌కు వివరించారు. ప్రస్తుతం భూమి లభ్యత ఉన్న 28 నియోజకవర్గాల్లో శంకుస్థాపన నిర్వహిస్తున్నామని, రెండో దశలో ఇతర ప్రాంతాల్లో భూమిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని సీఎస్ చెప్పారు.

మొదటి విడత కింద ఎంపిక చేసినవి..

కొడంగల్, మధిర, హుస్నాబాద్, నల్లగొండ, హుజూర్‌నగర్, మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్లాపూర్, అందోల్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట్, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, షాద్‌నగర్, పరకాల, నారాయణ్ ఖేడ్, దేవరకద్ర, నాగర్ కర్నూల్, మానకొండూర్, నర్సంపేట నియోజకవర్గాలున్నాయి.

కొందుర్గులో సీఎం సభ

రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో రూ.125 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేయనున్నారు. అనంతరం బహిరంగసభలో మాట్లాడ నున్నారు. ఇందుకోసం కొందుర్గు శివారులోని 109 సర్వే నంబర్‌లో 20 ఎకరాలను కేటాయించారు. సీఎం రాక నేపథ్యంలో జిల్లా కలెక్టర్ శశాంక, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పనులను పర్యవేక్షించారు.

పిడుగుపాటుతో మహిళ మృతి

అడవిదేవులపల్లి: మిరప తోటలో కలుపు తీసేందుకు వెళ్లిన మహిళ పిడుగుపాటుతో మృతి చెందింది. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంలో గురువారం జరిగిన ఈ సంఘటనపై ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాలివి. దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన పాతులోతు హనిమి (45) గురువారం మరో ఏడుగురితో కలిసి అడవిదేవులపల్లి గ్రామ శివారులో మిరప తోటలో కలుపు తీసేందుకు వెళ్లింది. కలుపు తీస్తుండగా వర్షం రావడంతో మిగతా కూలీలతో కలిసి హనిమి దగ్గర్లోని వేపచెట్టు కిందకు వెళ్లింది. ఆ చెట్టుపై భారీ శబ్దంతో ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో పాతులోతు హనిమి అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురు తేజావత్ సక్రియ, తేజావత్ కళావతి, పాతులోతు గూగు స్పృహ తప్పి పడిపోయారు. మిగిలిన కూలీలు కేకలు వేయడంతో సమీప పొలంలో ఉన్న వారు అక్కడికి చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హనిమి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకటే చట్టం... ఒకటే మాడ్యూల్

రాష్ట్రంలోని 124 చట్టాలను కలిపి రెవెన్యూ కోడ్ అమలు

ఇప్పటికే సిద్ధమవుతున్న ముసాయిదా.. త్వరలోనే ప్రభుత్వ పరిశీలనకు..

ప్రస్తుతం ఉన్న 20కిపైగా కాలంచెల్లిన రెవెన్యూ చట్టాలను రద్దు చేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్‌లోని అన్ని మాడ్యూళ్లను రద్దు చేసి ఒకటే మాడ్యూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న అన్ని రెవెన్యూ చట్టాల స్థానంలో ఒకటే చట్టాన్ని (రెవెన్యూ కోడ్) అమల్లోకి తెచ్చేందుకు కూడా కసరత్తు చేస్తోంది. ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీతోపాటు గతంలో నల్సార్ విశ్వవిద్యాలయం చేసిన సిఫార్సు మేరకు రెవెన్యూ కోడ్‌ను అమలు చేసే దిశగా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ఈ కోడ్ ముసాయిదా తయారీలో నిమగ్నమైన రెవెన్యూ వర్గాలు త్వరలోనే ముసాయిదా చట్టాన్ని ప్రభుత్వ పరిశీలనకు పంపనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 124 రెవెన్యూ చట్టాలు, నియమాలు అమల్లో ఉన్నాయి. రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)తోపాటు సర్వే, భూ రికార్డుల నిర్వహణ, సీలింగ్, కౌలు, రెవెన్యూ రికవరీ, భూ ఆక్రమణ నిరోధం, రెవెన్యూ పరిపాలన, భూదాన్, ఇనాం, వదిలివేయబడిన భూములు, భూవివాదాల పరిష్కారం... ఇలా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమల్లో ఉన్న అన్ని చట్టాలు ప్రస్తుతం కూడా అమల్లో ఉన్నాయి. అయితే వాటన్నింటినీ తెలంగాణకు వర్తింపజేయాల్సిన అవసరం లేదని.. వాటిలో 20కిపైగా కాలంచెల్లిన చట్టాలున్నాయని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో భూచట్టాల నిపుణులు పేర్కొన్నారు. కానీ ప్రభు త్వం దీన్ని పెడచెవిన పెట్టింది. కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పాటయ్యాక రెవెన్యూ వ్యవస్థ అమల్లో గందరగోళాన్ని నివారించేందుకు ఒకటే రెవెన్యూ చట్టాన్ని అమల్లోకి తేవాలనే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాలంచెల్లిన ఆ చట్టాలను రద్దు చేయడంతోపాటు అన్ని రాష్ట్రాల్లో అమల్లో ఉన్న 5 వేల భూ చట్టాలను అధ్యయనం చేసి అందులో అవసరమైన చట్టాలను తెలంగాణకు వర్తింపజేస్తూ రెవెన్యూ కోడ్‌లో పొందుపరిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అధికారులకూ సులభతరం...

నిజాం హయాంలో తెలంగాణ ప్రాంత భూపరిపాలన, రెవెన్యూ వ్యవస్థ అమలు కోసం భూమి రెవెన్యూ చట్టం -1907 పేరుతో సమగ్ర చట్టం అమల్లో ఉండేది. తెలంగాణ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో కలిశాక ఈ చట్టం స్ఫూర్తిని నిర్వీర్యం చేస్తూ 124 చట్టాలుగా మార్చారని భూచట్టాల నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు రెవెన్యూ కోడ్ అమల్లోకి వస్తే భూమి సమస్యల పరిష్కారం సంబంధిత అధికారులకు సులభతరం కావడంతోపాటు భూమి హక్కులను కాపాడుకునే విషయంలో రైతులకు కూడా స్పష్టత వస్తుందని అంటున్నారు. ఏ చట్టం ద్వారా ఏ సమస్య పరిష్కారమవుతుంది, ఏ అధికారి వద్దకు వెళ్లాలనే విషయంలో కూడా అన్నదాతలకు గందరగోళం పోతుందని చెబుతున్నారు. యూపీలో 2016లోనే ఈ కోడ్ అమల్లోకి వచ్చిందని, ప్రస్తుతం ఒడిశాలోనూ కోడ్ అమలు ప్రయత్నాలు జరుగుతున్నాయని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా రెవెన్యూ కోడ్ అమల్లోకి వస్తే భూమి సమస్యలు, రైతుల ఇబ్బందుల పరిష్కారానికి సమగ్ర వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

సౌకర్యవంతంగా ఉంటుంది

దేశవ్యాప్తంగా 5 వేలకుపైగా భూ చట్టాలు అమల్లో ఉన్నాయి. ఆయా రాష్ట్రాల భౌగోళిక, సామాజిక పరిస్థితుల ఆధారంగా ఆయా రాష్ట్రాలు తగిన చట్టాలను అమలు చేసుకుంటున్నాయి. యూపీలో రెవెన్యూ కోడ్ అమల్లోకి వచ్చాక అక్కడ మారిన పరిస్థితుల గురించి క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చాం. ప్రతి రాష్ట్రంలో రెవెన్యూ కోడ్ అమల్లోకి వస్తే భూచట్టాల్లో ఉన్న గందరగోళం పోతుంది.

– ఎం. సునీల్‌కుమార్, భూచట్టాల నిపుణులు



మహిళలతో కోలాటం ఆడుతున్న పొంగులేటి

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ: పొంగులేటి

కూసుమంచి: తెలంగాణ అంటే గుర్తుకొచ్చేది బతుకమ్మ పండుగని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పెరికసింగారం, జక్కేపల్లి, కూసుమంచిల్లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. దుర్గామాత, బతుకమ్మకు పూజలు నిర్వహించి మహిళలతో కలిసి కోలాటమాడారు. పెరికసింగారంలో మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు – విజయలక్ష్మి నేతృత్వాన తయారు చేసిన 51 అడుగుల భారీ బతుకమ్మను మంత్రి తిలకించి అభినందించారు.

క్లుప్తంగా...

కేంద్రం నుంచి పన్నుల వాటా విడుదల

తెలంగాణకు రూ.3,745 కోట్లు, ఏపీకి రూ.7,211కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 28 రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వాల్సిన రూ.1,78,173 కోట్ల పన్నుల వాటాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మొత్తంలో 2024 అక్టోబర్‌లో చెల్లించాల్సిన సాధారణ వాయిదాకు అదనంగా ఒక ముందస్తు వాయిదా రూ.89,086.50 కోట్లు కూడా ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. దీనిలో తెలుగు రాష్ట్రాల వాటా రూ.10,956 కోట్లు కాగా.. తెలంగాణకు రూ.3,745 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,211 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పన్నుల వాటాలో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు రూ.31,962 కోట్లు వెళ్లగా, బిహార్‌కు రూ.17,921 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ.13,987 కోట్లు, పశ్చిమబెంగాల్‌కు రూ.13,404 కోట్లు, మహారాష్ట్రకు రూ.11,255 కోట్లు, రాజస్తాన్‌కు రూ.10,737 కోట్లు విడుదలయ్యాయి. అత్యల్పంగా గోవాకు రూ.688 కోట్లు విడుదల చేశారు. పండుగల సీజన్ దృష్ట్యా రాష్ట్రాల మూల ధన వ్యయాన్ని వేగవంతం చేయడం, అభివృద్ధి, సంక్షేమ తదితర వ్యయాలకు ఆర్థిక సహాయం చేయడానికి ముందస్తు వాయిదాలు విడుదల చేసినట్లు కేంద్రం తెలిపింది. ఏడాది పొడవునా వసూలయ్యే పన్నుల్లో కేంద్రం నిబంధనల ప్రకారం తమ వాటాను ఉంచుకుని రాష్ట్రాలకు మిగిలింది ఇవ్వాల్సి ఉంటుంది. వీటిని దశల వారీగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న విషయం తెలిసిందే.

త్వరలో వేదిక విధివిధానాలు ప్రకటిస్తాం

- ‘తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార సాధన జేఏసీ’ నేతల ప్రకటన



విశారదన్

సాక్షి, హైదరాబాద్: ఈ నెలాఖరులో లేదా నవంబర్ రెండో వారంలో తమ వేదికకు సంబంధించిన పూర్తి వివరాలు, విధివిధానాలను ప్రకటిస్తామని ‘తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార సాధన జేఏసీ’ నేతలు డాక్టర్ విశారదన్ మహారాజ్, రాఘవేంద్ర ముదిరాజ్ తెలిపారు. ఈ వేదిక పూర్తిగా రాజకీయేతర సంస్థ అని బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికార సాధన, వారి హక్కుల పరిరక్షణ ఏకైక లక్ష్యంగా పనిచేస్తుందని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తెలంగాణ సాధన అంటే.. దానికి నాయకత్వం వహించిన ఆధిపత్య కులాల అధీనంలోకి రాష్ట్రం వెళ్లడమేనని, ఇది ప్రజా తెలంగాణ, ప్రజాస్వామ్య తెలంగాణ కానే కాదని పేర్కొన్నారు. తెలంగాణ తొలి, మలి పోరాటాల్లో సమిధలై, బలిపీఠం ఎక్కింది 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలేనని పేర్కొన్నారు.

రాజకీయ భిక్ష పెట్టింది టీడీపీనే..: మల్లారెడ్డి



సాక్షి, హైదరాబాద్: టీడీపీ, బీజేపీ పొత్తు వల్లే గతంలో ఎంపీ కాగలిగానని, తనకు రాజకీయ భిక్ష పెట్టింది చంద్రబాబేనని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పష్టం చేశారు. ఆయన గురువారం కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని తన అల్లుడు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో పాటు కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి కుమార్తె, తన మనవరాలి వివాహ ఆహ్వానపత్రికను కిషన్‌రెడ్డికి అందజేశారు. అనంతరం మల్లారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. తాను రాజకీయాలు మాట్లాడేందుకు రాలేదన్నారు. పెళ్లి ఆహ్వానం అందించేందుకే వచ్చానని చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి రెండోసారి బాధ్యతలు చేపట్టడం సంతోషాన్ని కలిగించిందన్నారు. మీరు టీడీపీలో చేరుతున్నారా? అన్న విలేకరుల ప్రశ్నకు మల్లారెడ్డి సమాధానం దాటవేస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆదాయం ఎందుకు తగ్గింది?



వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో జరిగిన సమీక్షలో సీఎం రేవంత్. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి

వాణిజ్యపన్నుల ఉన్నతాధికారులపై సీఎం రేవంత్ సీరియస్

- లొసుగులపై దృష్టిపెట్టాలని ఆదేశం
- మూసీలో నిర్మాణాల తొలగింపునకు, రిజిస్ట్రేషన్లు తగ్గడానికి ఎలా ముడిపెడతారు?
- ఆదాయ వనరులపై సీఎం సమీక్ష

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరు అయిన వాణిజ్యపన్నుల శాఖ నుంచి ఆదాయం తగ్గడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రావాల్సిన ఆదాయం కంటే గడిచిన ఆరేడు నెలల్లో ప్రతి నెలా ఆదాయం రూ 650 కోట్ల మేరకు తగ్గడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదాయం తగ్గడానికి కారణాలేంటి? ఎక్కడ లొసుగులున్నాయో దృష్టిపెట్టాలని ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే వాణిజ్యపన్నులు, రవాణా, మైనింగ్, ఎక్సైజ్ తదితర శాఖల ఉన్నతాధికారులతో గురువారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వాణిజ్యపన్నుల లక్ష్యం రూ.85,126 కోట్లుగా ఉంటే.. ఏప్రిల్‌నుంచి సెప్టెంబర్‌వరకు రూ.42,034 కోట్లు ఆదాయం రావాల్సి ఉంది. అయితే ఇందులో రూ.37,315 కోట్లు మాత్రమే వచ్చింది. రూ.4,719 కోట్లు తక్కువ రావడంపై సీఎం సీరియస్ అయినట్లు సమాచారం.

లక్ష్యాన్ని చేరుకోవాలి

ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరే విధంగా పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఆదాయ వసూళ్లపై నిక్కచ్చిగా ఉండాలని, అవసరమైతే సంబంధిత విభాగాన్ని పునర్వ్యవస్థీకరించుకోవాలని, సంస్కరణలు చేసుకోవాలని సూచించారు. ఆదాయాన్ని తెచ్చిపెట్టే ప్రతీశాఖ పనితీరును క్షుణ్ణంగా సమీక్షించారు. జీఎస్టీ చెల్లింపుల విషయంలో ఎవరినీ ఉపేక్షించరాదని హెచ్చరించారు. అత్యధికంగా జీఎస్టీలో 4,086 కోట్లు, పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి రూ.654 కోట్లు తక్కువగా వచ్చినట్లు తేలింది. రాష్ట్రంలో జీఎస్టీలో ఎంట్రీ కాకుండా చాలామంది కోట్ల రూపాయల వ్యాపారాలు చేస్తున్నారని. అటువంటి వారిని కూడా గుర్తించాలని ఆదేశించారు. మద్యం విక్రయాల్లో ఆదాయం మరింత పెరగాల్సిన అవసరం ఉందని చెప్పినట్లు తెలిసింది. అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టాలన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌తో సానుకూల వాతావరణం

రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ అభివృద్ధి ప్రాజెక్టులతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. వీటితోపాటు ఫోర్త్‌సిటీ, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, కొత్త ఎయిర్‌పోర్టులు వంటివాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. అయితే అనుకున్న స్థాయిలో ఈ నిర్ణయాలు ప్రజల్లోకి వెళ్లలేదని, గందరగోళానికి తావు లేకుండా చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని చెప్పినట్లు తెలిసింది. ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలనే హైడ్రా కూల్చివేసిందని, అన్నీ సక్రమంగా ఉన్న భూముల విలువ పెరిగి.. రిజిస్ట్రేషన్లు పెరగాల్సిన చోట.. ఆదాయం తగ్గడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. మూసీలోని నిర్మాణాల తొలగింపునకు, రిజిస్ట్రేషన్లు తగ్గడానికి ఎలా ముడిపెడతారని సీఎం అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది.

యువకుడి ప్రాణం తీసిన ప్రేమపెళ్లి

సద్దుల బతుకమ్మకు వస్తున్నా చెల్లీ అని చెప్పిన ఓ అన్న.. నిజమేనని నమ్మిన సోదరి

మాజీ భర్త సాయంతో చెల్లి భర్తను హతమార్చిన అన్న

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ప్రేమపెళ్లి వ్యవహారం ఓ యువకుడి ప్రాణం తీసింది. ‘నిన్ను చూడాలని ఉంది చెల్లీ.. సద్దుల బతుకమ్మకు మీ ఇంటికి వస్తున్నా’అని తన చెల్లికి ఫోన్ చేశాడు ఓ అన్న. నిజమేనని నమ్మిన ఆ చెల్లి.. తన భర్తను ఎదురు పంపించింది. అయితే అన్నతోపాటే, ఆమె మాజీ భర్త ఇంటికి చేరుకున్నారు. వచ్చీరాగానే చెల్లిని ఓ గదిలో బంధించిన అన్న.. బయట గడియపెట్టాడు. వెంట తెచ్చుకున్న కత్తితో చెల్లి భర్తపై దాడిచేసి చంపేశాడు. గోదావరిఖని ఏసీపీ రమేశ్ కథనం ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీలోని హనుమాన్‌నగర్‌కు చెందిన వద్దాది వినయ్‌కుమార్(25) గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో స్కావెంజర్‌గా పనిచేస్తున్నాడు. అదే ఏరియాకు చెందిన ఇద్దరు పిల్లలున్న ఓ వివాహితతో అతడికి పరిచయం ఏర్పడింది. అదికాస్త ప్రేమగా మారింది. ఇద్దరూ వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకోగా, రెండు కుటుంబాలు అంగీకరించలేదు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ సాగుతుండగానే వినయ్ ఆ వివాహితను పెళ్లి చేసుకున్నాడు. యైటింక్లయిన్‌కాలనీ హనుమాన్‌నగర్‌లో ఇంట్లో ఇద్దరూ అద్దెకు ఉంటున్నారు. అయితే తమ కొడుకు ఇష్టాన్ని కాదనలేక వినయ్ తల్లిదండ్రులు అద్దె ఉంటున్న ఇంటి వివరాలు ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడుతూ వస్తున్నారు. అయితే సద్దుల బతుకమ్మ వేడుకను సాకుగా తీసుకున్న ఆ వివాహిత సోదరుడు.. ఆమెకు ఫోన్‌చేసి చూడాలని ఉందన్నాడు. అడ్రస్ తెలియదని, వినయ్‌ను తన వద్దకు పంపించాలని కోరాడు. ఇది నిజమని నమ్మిన ఆమె వినయ్‌కు విషయం చెప్పి తన అన్నను తీసుకురమ్మని పురమాయించింది. వినయ్ వివాహిత అన్నను తీసుకొని ఇంటికొచ్చాడు. ఆయన వెంట మాజీ భర్త కూడా వచ్చాడు. ఇంటికి రాగానే వివాహిత అన్న, మాజీ భర్త వినయ్‌పై విచక్షణా రహితంగా దాడిచేశారు. కత్తితో పొడిచి హత్య చేశారు. ఏసీపీ రమేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీఐ ప్రసాద్‌రావుతో కలిసి వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రజాపాలన ఓర్వలేని కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్న సీఎం రేవంత్‌పై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబద్ధాలతో విషం చిమ్ముతున్నారని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి విమర్శించారు. ఆయన సీఎల్‌పీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. రేవంత్ ప్రజాపాలనను చూసి ఓర్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. డీపీఆర్ కూడా సిద్ధం కాని మూసీ ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



బాణసంచా వెలుగుల్లో ట్యాంక్‌బండ్

కవాడిగూడ: హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతి కళారూపాలు విశేషంగా కట్టుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాకారు లు ఈ వేడుకల్లో తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. లంబాడి నృత్యాలు, డప్పు వాయిద్యాలు ఒగ్గుడోలు నృత్యాలు గుస్సాడి, బోనాలు పోతురాజు ల కోలాటాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగలో భక్తి, బతుకు రెండు కలగలిసి ఉన్నాయన్నారు. ప్రజా గాయకురాలు విమలక్క మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రకృతితో ముడిపడి ఉందని.. ప్రకృతికి, మహిళకి విడదీయరాని బంధం ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, మేయర్ గద్వాల విజయలక్ష్మి, తెలంగాణ నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ స్ఫూర్తితో ప్రకృతిని కాపాడుకుందాం: సీతక్క

సాక్షి, హైదరాబాద్ : చెరువులకు బతుకమ్మకు అవినాభావ సంబంధం ఉందని, చెరువులు నిండితేనే మన పంటలు పండుతాయని ఈ పండుగ స్ఫూర్తితో ప్రకృతిని, చెరువులను కాపాడుకుందామని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. బతు కమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గురువారం ఆమె ఓ ప్రకట నలో శుభాకాంక్షలు తెలిపారు.

9 మంది ఏఐఎస్‌లు ఏపీకే!

▶ మొదటి పేజీ తరువాయి

పరిస్థితి ఏర్పడింది.

వివాద నేపథ్యం ఇది...

రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యూష్ సిన్హా కమిటీ సిఫారసుల ఆధారంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఏఐఎస్ అధికారుల కేటాయింపులను కేంద్రం చేపట్టింది. ఐఏఎస్ అధికారులు సోమేశ్‌కుమార్, కాటా ఆమ్రపాలి, జి.అనంతరాము, ఎం. ప్రశాంతి, వాకాటి కరుణ, ఎ.వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, ఎస్ఎస్ రావత్‌లను ఏపీ కేడర్‌కు.. హరికిరణ్, జి. సృజన, శివశంకర్ లహోటిలను తెలంగాణ కేడర్‌కు కేటాయించింది. ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష బిష్త్, అభిషేక్ మహంతిని ఏపీకి కేటాయించారు. అయితే ఈ కేటాయింపులను సవాల్ చేస్తూ ఆయా ఐఏఎస్, ఐపీఎస్‌లు గతంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. వారి వాదనలు విన్న ట్రిబ్యునల్.. ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలను కొట్టేస్తూ 2017లో తీర్పు ఇచ్చింది.

హైకోర్టు తీర్పుతో మారిన పరిస్థితి..

ఈ తీర్పును రద్దు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో 2017, 2018లో వేర్వేరు అప్పీళ్లను దాఖలు చేసింది. సోమేశ్ కుమార్‌ను తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన తీర్పుపై తొలుత విచారణ చేపట్టిన హైకోర్టు... ఆ కేటాయింపును రద్దు చేస్తూ తక్షణమే ఏపీలో రిపోర్టు చేయాలని 2023 జనవరి 10న తీర్పు ఇచ్చింది. ప్రత్యూష్ సిన్హా కమిటీ సిఫారసులను సమర్థించింది. దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పోస్టులో ఉన్న సోమేశ్‌కుమార్ ఏపీకి వెళ్లి రిపోర్టు చేశారు. ఈ తీర్పును నాటి తెలంగాణ డీజీపీ అంజనీ కుమార్‌తోపాటు ఇతర ఐపీఎస్, ఐఏఎస్ అధికారులకూ వర్తింపజేయాలంటూ కేంద్రం దాఖలు చేసిన అప్పీళ్లపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టి జనవరి 3న తీర్పునిచ్చింది. 10 మంది ఐఏఎస్‌లు, ముగ్గురు ఐపీఎస్‌ల కేటాయింపులపై క్యాట్ ఇచ్చిన తీర్పును పక్కకు పెట్టింది. ఆ అధికారుల ప్రస్తుత సర్వీసు, మిగిలిన సర్వీసుతోపాటు వారి వ్యక్తిగత అభ్యంతరాలను వేర్వేరుగా పరిగణనలోకి తీసుకొని గతంలో జరిపిన తుది కేటాయింపులపై పునఃసమీక్షించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ వివాదంపై నిర్ణయం తీసుకొనే బాధ్యతను డీవోపీటీకి అప్పగించింది. ఆ అధికారుల విజ్ఞప్తులపై కేంద్రం నిర్ణయం తీసుకొనే వరకు వారందరినీ ప్రస్తుత రాష్ట్రాల్లోనే కొనసాగించాలని స్పష్టం చేసింది. ఈ అధికారుల తుది కేటాయింపులపై పునఃపరిశీలన కోసం హైకోర్టు ఆదేశాల మేరకు డీవోపీటీ శాఖ మాజీ సెక్రటరీ, రిటైర్డ్ ఐఏఎస్ దీపక్ ఖండేకర్‌తో ఆ శాఖ ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఆయా అధికారుల నుంచి కమిటీ వినతి పత్రాలను స్వీకరించడంతోపాటు వారితో వ్యక్తిగతంగా సమావేశమై అభిప్రాయాలను సేకరించింది. అనంతరం ఆయా అధికారుల విజ్ఞప్తులను తిరస్కరిస్తూ డీవోపీటీకి సిఫార్సులు చేసింది. ఈ సిఫార్సులను డీవోపీటీ ఆమోదించింది.

తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లనున్న ఐఏఎస్ అధికారులు

1..మల్లేల ప్రశాంతి; 2. వాకాటి కరుణ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి; 3. ఎ.వాణీ ప్రసాద్, ముఖ్యకార్యదర్శి, యువజన, పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖ ; 4. డి.రోనాల్డ్ రోస్, ఇంధన శాఖ కార్యదర్శి; 5. కాటా ఆమ్రపాలి, జీహెచ్ఎంసీ కమిషనర్

తెలంగాణకు కేటాయించాలన్న విజ్ఞప్తి తిరస్కరించడంతో ఏపీలోనే కొనసాగనున్న ఐఏఎస్ అధికారులు..

1. షంషేర్ సింగ్ రావత్, స్పెషల్ సీఎస్, ఏపీ (దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు)

2.జి.అనంతరాము, స్పెషల్ సీఎస్, ఏపీ అటవీ శాఖ

తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లనున్న ఐపీఎస్ అధికారులు

1.అంజనీకుమార్, డీజీ, రోడ్ సేఫ్టీ అథారిటీ; 2. అభిలాష భిష్త్, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్

ఏపీ నుంచి తెలంగాణకు రానున్న ఐఏఎస్ అధికారులు...

1.శివశంకర్ లోతేటి – వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్; 2. శ్రీజన, ఎన్టీఆర్ కృష్ణా జిల్లా కలెక్టర్; 3. సి.హరికిరణ్

రైతులను ప్రభుత్వం మళ్లీ ముంచుతోంది: కేటీఆర్

- కంటి తుడుపు పరిహారంతో రైతన్నకు తీవ్ర అన్యాయం
- లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే.. వేల ఎకరాలకు మాత్రమే పరిహారం ఇస్తున్నారు



సాక్షి, హైదరాబాద్: వరదల్లో నిండా మునిగిన రైతాంగాన్ని వంచనతో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ముంచుతోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. నష్ట పోయిన రైతుల విషయంలో పరిహారం పేరిట పరిహాసం ఆడుతోందని ఆయన ‘ఎక్స్’వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతింటే వేల ఎకరాలకు మాత్రమే అరకొర సాయం అందించి చేతులు దులుపుకోవడం అన్యాయమన్నారు. 4.15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. భారీ వర్షాలు, వరదల కారణంగా 5.20 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ నివేదిక ఇచ్చిందన్నారు. కానీ పంట నష్టం లెక్కలను తారుమారు చేస్తూ 79,574 ఎకరాలకు మాత్రమే కంటి తుడుపు పరిహారం ఇస్తున్నారని మండిపడ్డారు. పొలాల్లో రాళ్లు, ఇసుక మేటలను తొలగించుకునేందుకు రైతులకు ఇచ్చే రూ.10 వేలు ఏమూలకూ సరిపోవన్నారు. ఆపదలో ఉన్న అన్నదాతను ఆదుకోవాలని, నష్ట పోయిన ప్రతీ ఎకరానికి పరిహారం చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రుణమాఫీ, రైతుభరోసాను ఇవ్వని ప్రభుత్వం.. కష్టాల్లో కూరుకుపోయిన రైతులకు అండగా నిలవాలన్నారు.

సంస్కృతిని ప్రతిబింబించే వేడుక: ‘పువ్వులను పూజించే అరుదైన, అపురూపమైన పండుగ బతుకమ్మ అని, విభిన్నమైన తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే గొప్ప వేడుక బతుకమ్మ పండుగ అని కేటీఆర్ అన్నారు. తెలంగాణ మహిళలకు, ఆడపిల్లలకు ఎంతో ప్రీతిపాత్రమైన సద్దుల బతుకమ్మ పండుగను ఆటపాటలతో వైభవోపేతంగా జరుపుకోవాలని పేర్కొంటూ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

‘కేసీఆర్‌ను విమర్శించడమే రేవంత్ విధానం’



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు, గురువుల ముందు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను విమర్శించడమే సీఎం రేవంత్ తన విధానంగా పెట్టుకున్నారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చింది మొదలు..గడిచిన పది నెలల్లో ఒక్క సభలో కూడా కేసీఆర్ పేరు ఎత్తకుండా రేవంత్ ప్రసంగం సాగడం లేదని చెప్పారు. ప్రసంగించేది ప్రభుత్వ కార్యక్రమమా, పార్టీ కార్యక్రమమా అనే విషయాన్ని కూడా సీఎం మరిచిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘ఎక్స్’లో సీఎం తీరును ప్రశ్నిస్తూ సబితాఇంద్రారెడ్డి పోస్ట్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అనుమతితో మంజూరు చేసిన ఉపాధ్యాయ పోస్టులను సీఎం రేవంత్ తన ఘనతగా చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చినట్టుగా 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఎందుకు భర్తీ చేయలేదో, కొత్తగా ఉద్యోగాల్లో చేరబోతున్న వారికి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 6 వేల పాఠశాలలు మూతపడ్డాయన్న రేవంత్, వాటి జాబితాను కూడా విడుదల చేయాలన్నారు. మన ఊరు-మన బడి, బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాలు ఎందుకు నిలిపివేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రూ.5లక్షల విద్యా భరోసా కార్డు ఇవ్వాలన్నారు.

రేవంత్‌రెడ్డిని నమ్మేది లేదు: మందకృష్ణ



బౌద్ధనగర్ (హైదరాబాద్): మాదిగ జాతిని నమ్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్ని ప్రకటనలు చేసినా ఆయనను నమ్మే ప్రసక్తే లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గురువారం పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాదిగలను ఇంకా మోసపూరిత మాటలతో నమ్మించే పనిలో రేవంత్‌రెడ్డి ఉన్నారన్నారు. ఆయనకు నిజాయితీ, బాధ్యత లేవని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఇచ్చిన మాట ఏమైందో ఆయన చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైతే ఆర్డినెన్సు తీసుకువచ్చి.. ప్రస్తుత నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తానని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. సీఎం రేవంత్ పరిధిలో ఉన్న విద్యాశాఖలో ఎస్సీ వర్గీకరణ లేకుండా టీచర్ పోస్టుల భర్తీ ఎందుకు చేపట్టారని నిలదీశారు. ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాల భర్తీ జరిగితే మాదిగ బిడ్డలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రాబోయే నోటిఫికేషన్ల గురించి కాదని.., ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్ల గురించి ముందు మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ లేకుండా భర్తీ జరిగిన టీచర్ పోస్టులు, మిగతా పోస్టుల్లో మాదిగలకు, మాలలకు ఎన్నెన్ని వచ్చాయో శ్వేత పత్రం విడుదల చేయాలని, తద్వారా మాదిగలకు జరిగిన అన్యాయం సమాజానికి తెలుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టుల కోసం జరుగుతున్న పరీక్షలను వాయిదా వేసి ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చిన అనంతరమే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టిలు కలసి మాదిగలకు అన్యాయం చేస్తున్నారన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ జాతి పక్షాన నిలబడటంలో విఫలమయ్యారన్నారు.



దుబాయ్‌లో

దుబాయ్‌లో సద్దుల బతుకమ్మ సంబురాలు

బంజారాహిల్స్ (హైదరాబాద్): దుబాయ్‌లోని గల్ఫ్ తెలంగాణ ఫోరం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచులు పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్ది ఆడిపాడారు. దుబాయ్‌లోని తెలుగు కుటుంబాలు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పాయి. కార్యక్రమానికి ఫోరం ఫౌండర్ ప్రెసిడెంట్ ఆకుల సురేందర్ పటేల్, ఉపాధ్యక్షులు తేలు వెంకటేశ్, యుజ్వేందర్, రాజేశ్వర్, జగన్, పురుమాండ్ల జితేందర్‌రెడ్డి, శ్రీకాంత్, బాలరాజ్‌గౌడ్, వినోద్, రాజశేఖరరెడ్డిలతో పాటు కళాకారుడు బుర్ర సతీశ్‌గౌడ్, గాయని, డ్యాన్సర్ లాస్య హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగు వారందరూ కలిసి విందు భోజనాలను ఆరగించారు.

క్లుప్తంగా...

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన జీవో 317 బాధితులు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం జీవో 317 బాధిత ఉద్యోగులు ఈ జీవోపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సభ్యుడు మంత్రి శ్రీధర్‌బాబును గురువారం సచివాలయంలో కలుసుకుని తమ సమస్యలను వివరించారు. జీవో 317కు సంబంధించి ఎలాంటి న్యాయపరమైన వివాదాలు లేని ముగ్గురు బాధితుల సమస్యపై కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని శ్రీధర్‌బాబు చెప్పారని వారు మీడియాకు వెల్లడించారు. మంత్రితోపాటు జీఏడీ కార్యదర్శి బెన్ హర్ మహేశ్‌దత్ ఎక్కా కలుసుకున్న వారిలో 317 జీవో బాధిత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పడకంటి అజయ్, మధుకర్‌రెడ్డి, వామనరావు, ఎం.సాయిరాం, రాథోడ్ ప్రకాశ్, రవీందర్ ఉన్నారు.

పర్యాటక భాగస్వామ్యంపై దృష్టి

అమెరికా 2024 ట్రేడ్ షోలో మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, హైదరాబాద్: పర్యాటక రంగంలో భాగస్వాముల సహకారంపై దృష్టి పెట్టామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. లాస్‌వెగాస్‌లోని మాండలే బేలో నిర్వహించిన ఐఎంఈఎస్ అమెరికా–2024 ట్రేడ్‌షోలో మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచస్థాయి వేదికపై ఏర్పాటు చేసిన తెలంగాణ టూరిజం స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. వాణిజ్య ప్రదర్శనలో ఏర్పాటు చేసిన విదేశీ స్టాళ్లను మంత్రి సందర్శించారు. అనంతరం జూపల్లి మాట్లాడుతూ ప్రగతిశీల విధానాలతో పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పిస్తామని హామీ ఇచ్చారు. విశ్వనగరమైన హైదరాబాద్ అంతర్జాతీయ సదస్సుల వేదికగా మారిందన్నారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులకు కేంద్ర బిందువుగా మారిందని పేర్కొన్నారు. పర్యాటక, వినోదం, వ్యాపార, ఐటీ, హెల్త్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త అనుభూతులు, అన్వేషించని ప్రదేశాలను చూడాలని కోరుకునే నేటితరం పర్యాటకులకు స్వాగతం పలికేందుకు తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఘనమైన వారసత్వ సంపదతో అలరారుతున్న తెలంగాణ రాష్ట్రంలో పర్యటించాలని ఆయా దేశాల ప్రతినిధులను మంత్రి ఆహ్వానించారు. భారతదేశం నుంచి వచ్చిన అతి కొద్దిమందిలో తెలంగాణ ప్రతినిధిగా ట్రేడ్‌షోలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ప్రకాశ్‌రెడ్డి, పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డీఎస్ ఓంప్రకాశ్, టీఎస్టీడీసీ మార్కెటింగ్ జీఎం కె.అంజిరెడ్డి, హెచ్‌సీవీబీ సీఈవో గ్యారీఖాన్ తదితరులు హాజరయ్యారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

కోయంబత్తూరు నుంచి వచ్చిన విమానం పూర్తిగా తనిఖీ

శంషాబాద్: చెన్నై విమానంలో బాంబు ఉందంటూ గుర్తు తెలియని వ్యక్తి నుంచి వచ్చిన మెయిల్‌తో శంషాబాద్ విమానాశ్రయ భద్రతాధికారులు ఉరుకులు పరుగులు పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బుధవారం మధ్యాహ్నం వచ్చిన మెయిల్‌తో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) అధికారులు, ఆర్‌జీఐఏ పోలీసులు, ఎయిర్ పోర్టు భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. సాయంత్రం కోయంబత్తూరు నుంచి బయల్దేరి వయా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మీదుగా చెన్నై ప్రయాణిస్తున్న ఇండిగో విమానాన్ని పూర్తిస్థాయిలో తనిఖీలు చేశారు. ప్రయాణికులను దింపి ఇండిగో విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లిన మరో మూడు విమానాలను కూడా తనిఖీ చేశారు. చివరకు బాంబులేదని తేలడంతో అంతా ఊపిరి పీల్చు కున్నారు. గత ఏడాదిలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆరు సార్లు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.

రుణ వాయిదాలకే నెలకు రూ. 2 కోట్లు

రావిర్యాల విజయ డెయిరీ నడిపేదెలా?

- కనాకష్టంగా మారిన యూనిట్ నిర్వహణ
- రూ.1.80 కోట్లు విద్యుత్, తాగునీటి బిల్లులకు..
- వీటికి తోడు నిర్వహణ, సిబ్బంది వేతనాలు అదనం
- తొమ్మిది నెలలకే చేతులెత్తేయాల్సిన పరిస్థితి
- ఏం చేయాలన్న దానిపై మల్లగుల్లాలు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: విజయ డెయిరీకి నిర్వహణ కష్టాలు వచ్చి పడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో రూ. 246 కోట్ల వ్యయంతో రావిర్యాలలో నిర్మించిన మెగా యూనిట్ ఈ కష్టాలకు కారణం కానుంది. త్వరలో మీద పడనున్న ఆర్థిక భారం డెయిరీకి పెద్ద తలనొప్పిగా మారనుందని తెలుస్తోంది. ఈ మెగా యూనిట్ నిర్వహణను పకడ్బందీగా గాడిలోకి తెచ్చిన తర్వాతే పూర్తిస్థాయిలో డెయిరీకి అప్పగించాల్సిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) కూడా తన బాధ్యతల నుంచి తప్పుకునే యోచనలో ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మెగా యూనిట్‌ను ఏం చేయాలి? ఎలా నడపాలన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది.

➤ సరైన అంచనాలు, సౌకర్యాల కల్పన, ప్రణాళికలు లేకుండా రావిర్యాలలో నిర్మించిన విజయ డెయిరీ మెగా యూనిట్ చిక్కుల్లో పడింది. నీటి సౌకర్యం లేని ప్రాంతంలో ఈ డెయిరీని ఏర్పాటు చేయడంతో కేవలం ప్లాంటును నడిపించేందుకు నీటి కోసం నెలకు రూ.80 లక్షలు ఖర్చవుతోందని తెలుస్తోంది. ఇక, ఈ యూనిట్ కరెంటు బిల్లులు నెలకు రూ. కోటి దాటుతున్నాయి. వీటికి తోడు వచ్చే

తరుముకొస్తున్న కష్టాలు..

నెల నుంచి నెలకు రూ.2 కోట్ల వరకు రుణ వాయిదాలను చెల్లించాల్సి ఉంది. ఇవేకాక, ప్లాంటు నిర్వహణ, సిబ్బంది జీత భత్యాలు అదనం కావడంతో ప్రారంభించిన తొమ్మిది నెలలకే మెగా యూనిట్ నిర్వహణ విషయంలో చేతులెత్తేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని డెయిరీ వర్గాలంటున్నాయి. వాస్తవానికి, లాలాపేటలోని యూనిట్ ద్వారా విజయ డెయిరీ రోజుకు 4.5 లక్షల లీటర్ల పాలను ఉత్పత్తి చేసి మార్కెట్‌లోకి పంపుతోంది. ఈ యూనిట్‌ను నడుపుతూనే రావిర్యాలలో రోజుకు 5–8 లక్షల లీటర్ల పాల ఉత్పత్తులు చేసే అంచనాలతో, ఆ మేరకు అత్యాధునిక యంత్రాంగంతో మెగా యూనిట్‌ను ఏర్పాటు చేశారు. కానీ, ఇప్పటివరకు కేవలం 3 లక్షల లీటర్ల ఉత్పత్తులను మాత్రమే తయారు చేయగలుగుతున్నారు. ఈ మేరకు ఉత్పత్తి చేసేందుకు డెయిరీకి ఆర్థికంగా భారమవుతోంది. రోజుకు 3 లక్షల లీటర్ల ఉత్పత్తికి, 8 లక్షల వరకు లీటర్ల ఉత్పత్తికి అయ్యే నిర్వహణ ఖర్చులో పెద్దగా తేడా ఉండదని, ఈ నేపథ్యంలో 8 లక్షల లీటర్ల వరకు ఉత్పత్తి జరిగితేనే యూనిట్ మనుగడ సాధ్యమవుతుందని డెయిరీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. కనీస సౌకర్యాలు, సిబ్బంది లేని పరిస్థితుల్లో మెగా యూనిట్ నిర్వహణ భారం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోననే ఆందోళనను వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఒకే డిజైన్ చీరలు

- ఏ పథకాన్ని అమలు చేయాలన్న దానిపై సమీక్షించిన మంత్రి తుమ్మల
- త్వరలో సీఎంతో భేటీలో చీరల డిజైన్ల ఖరారు
- బడ్జెట్, ఇతర అంశాలపై అధికారుల కసరత్తు
- 63 లక్షల మంది మహిళలకు చీరల పంపిణీ చేసే దిశగా...



ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో జరిగిన సమావేశంలో అధికారులు ప్రదర్శించిన కొన్ని డిజైన్లు

సాక్షి, హైదరాబాద్: మహిళా స్వయం సహాయక సంఘాల్లో (ఎస్‌హెచ్‌జీ) సభ్యులుగా ఉన్న మహిళలకు ఒకే డిజైన్‌తో ఉండే చీరలు పంపిణీ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దీనికి సంబంధించి ఈ నెలాఖరులోగా విధి విధానాలు ఖరారు చేయాలని నిర్ణయించింది. చీరల పంపిణీ పథకాన్ని ఏ తరహాలో అమలు చేయాలనే అంశానికి సంబంధించి చేనేతశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల సమీక్షించారు. మరో వారం రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో జరిగే భేటీలో పూర్తి స్థాయిలో చర్చించిన తర్వాత, చీరల పంపిణీ పథకం అమలుపై తుది నిర్ణయం తీసుకుంటారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రేషన్‌కార్డులో పేర్లు కలిగిన 18 ఏళ్ల పైబడిన యువతులు, మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసింది. అయితే రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), మెప్మా పరిధిలోని 63 లక్షల మంది మహిళా సభ్యులకు ఈ చీరలు పంపిణీ చేయాలని ప్రస్తుత ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. అయితే స్వయం సహాయక సంఘాల మహిళలకు పంపిణీ చేసేది బతుకమ్మ చీరలు కాదని, రాష్ట్రమంతటా ఒకే డిజైన్ కలిగిన చీరలను పంపిణీ చేస్తామని చేనేతశాఖ వర్గాలు చెబుతున్నాయి. గత ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరల్లో నాణ్యత లేదని, సరఫరాలో కుంభకోణం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించారు. ఈ నేపథ్యంలో పూర్తిగా స్థానికంగా ఉండే నేత కార్మికులను భాగస్వాములను చేస్తూ నాణ్యత కలిగిన చీరలను ఉత్పత్తి చేసి పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ఒక్కో మహిళకు ఒకటా.. రెండా..?

స్వయం సహాయక సంఘాల మహిళలకు ఒక్కొక్కరికీ ఏటా ఎన్ని చీరలు పంపిణీ చేయాలనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఎస్‌హెచ్‌జీల్లో పెరిగే సభ్యుల సంఖ్యను కూడా దృష్టిలో పెట్టుకొని ఏటా రెండేసి చీరల చొప్పున పంపిణీ చేస్తే 1.3 కోట్ల చీరలు అవసరమవుతాయని ప్రాథమికంగా లెక్కలు వేశారు. ఒక్కో చీర తయారీకి అయ్యే ఖర్చు, ఏటా కేటాయించాల్సిన బడ్జెట్ తదితరాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ చీరలను పండుగ సమయాల్లో ఇవ్వాలా, ఏదైనా ప్రత్యేక సందర్భంలో ఇవ్వాలా అనే కోణంలోనూ అధికారులు ఆలోచిస్తున్నారు. 2017లో బతుకమ్మ చీరల పథకం ప్రారంభంకాగా సగటున రూ.325 కోట్ల బడ్జెట్‌తో కోటి చీరలు పంపిణీ చేస్తూ వచ్చారు. గత ఏడాది 30 రకాల డిజైన్లు, 20 విభిన్న రంగుల్లో 240 వెరైటీల్లో చీరలను తయారు చేయించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) డిజైనర్లతో బతుకమ్మ చీరలు డిజైన్ చేయించారు. ఎస్‌హెచ్‌జీ మహిళలకు పంపిణీ చేసే చీరల డిజైన్లను కూడా నిఫ్ట్ డిజైనర్ల సూచనలు, సలహాల ఆధారంగా ఖరారు చేస్తారు.

ప్రస్తుతం సొంతంగా ఎస్‌హెచ్‌జీల కొనుగోలు

ప్రస్తుతం రాష్ట్రంలోని ఎస్‌హెచ్‌జీల మహిళలకు ప్రత్యేక యూనిఫారం లేకున్నా స్థానికంగా గ్రామ, మండల సమాఖ్యలు మూకుమ్మడిగా నిర్ణయించుకొని తమకు నచ్చిన డిజైన్ చీరలను యూనిఫారాలుగా ఎంచుకుంటున్నాయి. ఎస్‌హెచ్‌జీల సమావేశాలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు ఒకే డిజైన్ చీరలు ధరించి హాజరవుతున్నారు. గ్రామ, మండల సమాఖ్య నిధుల నుంచి లేదా సొంతంగా తలాకొంత మొత్తం పోగు చేసి వీటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వమే పంపిణీ చేయాలని భావిస్తున్న నేపథ్యంలో ఒకటి లేదా రెండు డిజైన్లను ఎంపిక చేసి చీరల తయారీకి ఆర్డర్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటి వరకు ప్రాథమికంగా పది డిజైన్లను సిద్ధం చేసిన చేనేత విభాగం త్వరలో సీఎంతో జరిగే భేటీలో ఒకటి రెండు డిజైన్లను ఖరారు చేసే అవకాశముంది.

మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు నోటీసులు

హీరో నాగార్జున పిటిషన్‌పై తదుపరి విచారణ 23కి వాయిదా

సిటీ కోర్టులు: మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు నోటీసులు జారీ చేసింది. సినీ హీరో నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ గురువారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, ఎక్సైజ్ కోర్టులో జరిగింది. హీరో నాగచైతన్య, సమంత విడాకుల అంశంపై మంత్రి కొండా సురేఖ అసంబద్ధమైన మాటలు మాట్లాడారని, ఆమె తమ కుటుంబ పరువు తీసేలా మాట్లాడినందుకు ఆమెపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని హీరో నాగార్జున మంత్రిపై పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే గత విచారణలో ఫిర్యాదుదారు నాగార్జునతో పాటు మరో సాక్షి సుప్రియా వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసుకుంది. దీనిపై విచారణ చేపట్టిన స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, ఎక్సైజ్ కోర్టు జడ్జి ఎస్.శ్రీదేవి మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేస్తూ విచారణను ఈనెల 23కి వాయిదా వేసింది. ఆరోజు కొండా సురేఖ కోర్టుకి హాజరైతే ఆమె వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఈ కేసు విచారణకు నాగార్జున తరపున న్యాయవాది అశోక్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ తరపున న్యాయవాది, టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ తిరుపతి వర్మ హాజరయ్యారు.

మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ పరువు నష్టం కేసు

మంత్రి కొండా సురేఖపై మరో పరువు నష్టం కేసు దాఖలైంది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, ఎక్సైజ్ కోర్టులో సెక్షన్ 356 కింద పరువునష్టం కేసు దాఖలు చేశారు. మంత్రి పదవిలో ఉండి.. స్థాయిని మరచి దిగజారుడు వ్యాఖ్యలు చేశారని, తన ప్రతిష్ట దెబ్బతినేలా ఆమె మాట్లాడారని కేటీఆర్ ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం దురుద్దేశపూర్వకంగా, అడ్డగోలు వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తనపై అసత్యపు ఆరోపణలు చేసిన మంత్రి కొండా సురేఖ ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని వారం రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే పరువునష్టం కేసు దాఖలు చేస్తామని లీగల్ నోటీసు కూడా జారీ చేశామని పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసు గడువు తీరినా ఆమె క్షమాపణ చెప్పలేదని, అందుకే ఆమెపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కేసు దాఖలు చేసినట్టు కేటీఆర్ పేర్కొన్నారు. కొండా సురేఖ గతంలో కూడా అసత్యపు ఆరోపణలు, అడ్డగోలు వ్యాఖ్యలు చేసినప్పుడు భారత ఎన్నికల సంఘం ఆమెకు చీవాట్లు పెట్టిందని, ఆమె తాజాగా చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయపరమైన వ్యాఖ్యలు మాత్రమే కావని, తన పరువుకు భంగం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా, ప్రణాళికా బద్ధంగా చేసిన కుట్రగా ఉన్నాయని ఆయన తెలిపారు. మంత్రి చేసిన వ్యాఖ్యలను, వాటి వెనుక ఉన్న నేరపూరిత దురుద్దేశాలను పరిగణనలోకి తీసుకొని ఆమెపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా, ఈ పిటిషన్ సోమవారం జడ్జి ముందుకు వచ్చే అవకాశం ఉంది.





బస్సులో కూర్చున్న తర్వాత సంతకం తీసుకున్న దృశ్యం

ఉద్యోగ నియామక పత్రం అందుకునేందుకు వెళ్లేవారి జాబితాను బస్సుకు అతికించిన దృశ్యం

ఆశ పెట్టి.. నిరుద్యోగితో ఆడుకున్నారు

- టీచర్ ఉద్యోగానికి ఎంపిక అయినట్లు మెసేజ్
- హైదరాబాద్ వెళ్లేవారి జాబితాలోనూ పేరు
- తీరా అక్కడికి వెళ్లాక మొండిచేయి



కారంగుల సాయిరెడ్డి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఆ యువకుడికి ఉద్యోగం వచ్చిందన్న ఆనందం 24 గంటలు కూడా లేకుండా పోయింది. కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రానికి చెందిన కారంగుల సాయిరెడ్డి డీఎస్సీలో మంచి మార్కులు సాధించారు. ఈ నెల 8న ఆయనకు డీఈవో కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. 'మీరు స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు సోషల్ స్టడీస్‌లో సెలెక్ట్ అయ్యారు. 9న కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌కు చేరుకోవాలి'అని ఫోన్ చేసి చెప్పారు. అదే రోజు రాత్రి ఆయన సెల్‌ఫోన్‌కు మెసేజ్ కూడా వచ్చింది. 9న ఉదయం కామారెడ్డికి చేరుకున్న సాయిరెడ్డి.. జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసిన బస్సులో హైదరాబాద్ బయలుదేరారు. బస్సుకు అతికించిన జాబితాలో కూడా సాయిరెడ్డి పేరుంది. హైదరాబాద్‌కు వెళ్లిన సాయిరెడ్డికి అక్కడ సీఎం ప్రోగ్రాం ముగిసిన తరువాత నియామక పత్రాలు ఇచ్చేటపుడు జాబితాలో పేరు లేదన్నారు. దీంతో గురువారం డీఈవో రాజును కలవగా, పొరపాటు జరిగిందని, మీరు సెలెక్ట్ కాలేదని సమాధానం ఇచ్చారు. 'మీకన్నా ముందు ర్యాంకు వాళ్లకు వెళ్లాల్సిన మెసేజ్, ఫోన్ కాల్ మీకు వచ్చింది, సారీ'అంటూ చెప్పారు. దీంతో సాయిరెడ్డి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తొలుత జాబితాలో పేరు ఉన్నట్టుగా చూపి, చివరకు ఇలా లేదని చెప్పడంలో ఏదో కుట్ర దాగుందని అనుమానం వ్యక్తం చేశారు.

పీసీఎఫ్ఎస్ కంపెనీ ఆస్తుల జప్తును సమర్థించిన అప్పిలేట్ ఫోరమ్

- క్యాష్‌బీన్ లోన్ యాప్ ద్వారా ప్రజల నుంచి అధిక వడ్డీ వసూలు చేసిన పీసీఎఫ్ఎస్
- ఫెమా చట్టం కింద రూ. 252.36 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసిన ఈడీ
- పీసీఎఫ్ఎస్‌పై భారీ జరిమానా విధింపు

సాక్షి, హైదరాబాద్: క్యాష్‌బీన్ అనే లోన్‌యాప్ ద్వారా ప్రజల నుంచి వడ్డీల రూపంలో డబ్బులు కొల్లగొట్టిన పీసీఎఫ్ఎస్ (పీసీ ఫైనాన్షియల్ సర్వీసెస్) ప్రై.లిమిటెడ్‌కు చెందిన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇటీవల చేసిన జప్తును అప్పిలేట్ ఫోరమ్ సమర్థించింది. దీంతోపాటుగా పీసీఎఫ్ఎస్‌పై అప్పిలేట్ ఫోరమ్ రూ.2146,48,26,480 జరిమానా విధించినట్లు ఈడీ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. నార్వేలోని ఒపెరా గ్రూప్ అనుబంధ సంస్థగా ఉన్న పీసీఎఫ్ఎస్ ప్రై. లిమిటెడ్, ఆన్‌లైన్ లోన్‌యాప్ ద్వారా భారత్‌లో ప్రజలకు డబ్బును అప్పుగా ఇచ్చే వ్యాపారం నిర్వహిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి అధిక వడ్డీ వసూలు చేయడంతోపాటు కస్టమర్లను వేధిస్తున్న సదరు సంస్థ చైనా కంపెనీల నియంత్రణలో పనిచేస్తోంది. ఇక్కడ కొల్లగొట్టిన రూ.429.30కోట్లు విదేశాల్లోని షెల్ కంపెనీల ఖాతాల్లోకి మళ్లించింది. ఫెమా చట్టాలను ఉల్లంఘించిన ఆరోపణలపై కేసు నమోదు చేసిన ఈడీ అధికారులు 2021 నుంచి దర్యాప్తు చేపట్టారు. కీలక ఆధారాలు లభించడంతో హైదరాబాద్ జోనల్ ఈడీ కార్యాలయ అధికారులు రూ.252.36 కోట్ల విలువైన ఆస్తులను ఇటీవలే జప్తు చేశారు. అయితే దీనిపై పీసీఎఫ్ఎస్ అప్పిలేట్ ఫోరమ్‌లో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన అప్పిలేట్ ఫోరమ్ ఈడీ చర్యలను సమర్థిస్తూ ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసింది.

ఇక బియ్యం అక్రమార్కుల భరతం

- రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీస్ ఫోకస్
- బియ్యం సేకరణ ముఠాలోని కీలక వ్యక్తులపై నిఘా



సాక్షి, హైదరాబాద్: రేషన్ బియ్యం అక్రమార్కుల భరతం పట్టేందుకు పోలీస్‌శాఖ సిద్ధమైంది. ఇప్పటికే డీజీపీ జితేందర్ అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లకు రేషన్ బియ్యం అక్రమ రవాణా కట్టడి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్, పౌరసరఫరాలశాఖ అధికారులతో కలిసి జాయింట్ ఆపరేషన్స్ చేపట్టనున్నట్టు ఓ పోలీస్ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు. పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొన్ని ముఠాలు అక్రమంగా ఇతర రాష్ట్రాలు, దేశాలకు తరలిస్తున్నాయి. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ ముఠాలు బియ్యాన్ని తక్కువ ధరకు వివిధ మార్గాల్లో సేకరించి, వాటిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తుండగా, అన్ని స్థాయిల్లో నిఘా పెట్టారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా ముఠాలతో అంటకాగుతున్న పోలీసు అధికారులపైనా వేటు వేసేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నిఘా వర్గాల నుంచి, ఇతర పద్ధతుల్లో అవినీతి అధికారుల వివరాలు సేకరిస్తున్నట్టు తెలిసింది.

కీలక నిందితులపైనే గురి

ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా దందా ఎక్కువగా సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో బ్రోకర్ల ద్వారా ఈ ముఠాలు లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని సేకరిస్తున్నాయి. రేషన్ దుకాణాల నుంచి బియ్యం లబ్ధిదారులు తీసుకున్న వెంటనే వారికి కిలోకు రూ.10 నుంచి రూ.12 చెల్లిస్తున్నారు. వాటిని మండల స్థాయిలో మరో దళారీకి చేరవేసి, అక్కడి నుంచి జిల్లా స్థాయికి పంపించి అక్రమ రవాణా చేస్తున్నారు. ఇదంతా స్థానిక పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులకు తెలిసే జరుగుతుందన్నది బహిరంగ రహస్యం. ప్రధానంగా వీటిని మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు, ఏపీలోని కాకినాడ, కృష్ణపట్నం పోర్టులకు తరలిస్తున్నట్టు పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. పోర్టుల నుంచి విదేశాలకు ఈ బియ్యం వెళుతోందన్నారు. మరికొన్ని ముఠాలు స్థానికంగా హోటళ్లకు సైతం రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. రీసైక్లింగ్ కోసం కొందరు మిల్లర్లు కూడా కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. అయితే బియ్యం అక్రమ రవాణా కట్టడిలో కేవలం స్థానిక ముఠాలను అరెస్టు చేస్తే లాభం లేదని ఆ అధికారి అభిప్రాయపడ్డారు. ఈ అక్రమ రవాణాలో కీలక వ్యక్తులను గుర్తించేందుకు ఇప్పటికే ప్రత్యేక బృందాలతో సమాచారం సేకరిస్తున్నామన్నారు.

అక్రమ అధికారులపైనా కొరడా

ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, గ్యాంబ్లింగ్, మట్కాలకు సహకరిస్తున్న పోలీసులపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. మల్టీజోన్–2 పరిధిలో ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను, 13 మంది ఎస్సైలను వీఆర్‌కు పంపిన విషయం తెలిసిందే. అంతకు ముందు సైతం ఇదే విషయంలో 14 మంది ఎస్సైలను వారు పనిచేస్తున్న స్థానాల నుంచి బదిలీ చేశారు. ఇసుక అంశంలో మాదిరిగానే రేషన్ బియ్యం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తున్న పోలీసులపై నిఘా విభాగం దృష్టి పెట్టింది. దీంతో అక్రమాలకు పాల్పడుతున్న పోలీస్ అధికారుల్లో భయం మొదలైంది.

డమ్మీ కాన్సులేట్‌లో వీసా ఇంటర్వ్యూ

- గుజరాత్ వ్యాపారి కుటుంబాన్ని మోసం చేయడానికి ఓ ముఠా పక్కా ప్లాన్
- హైదరాబాద్ శివార్లలోని హోటల్‌లో యూఎస్ కాన్సులేట్ సెట్‌వేసి వీసా ఇంటర్వ్యూల నిర్వహణ
- ప్రాసెసింగ్ పేరుతో రూ.41.5 లక్షలు కాజేసిన గ్యాంగ్
- బాధితుడి ఫిర్యాదుతో అహ్మదాబాద్‌లో కేసు నమోదు
- ఆధారాల కోసం నగరానికి రానున్న దర్యాప్తు బృందం

సాక్షి, హైదరాబాద్: నగర శివారులోని ఓ స్టార్ హోటల్‌లో అమెరికన్ కాన్సులేట్ సెట్ వేసిన ఓ ముఠా.. గుజరాత్‌కు చెందిన వ్యాపారిని మోసం చేసింది. వీసా ఇంటర్వ్యూల పేరిట రూ.41.5 లక్షలు కాజేసింది. బాధితుడి ఫిర్యాదుతో అహ్మదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ గ్యాంగ్‌లో కొందరు హైదరాబాద్‌కు చెందినవారు ఉన్నారని అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా కీలక ఆధారాలు సేకరించడానికి ఓ ప్రత్యేక బృందం అహ్మదాబాద్ నుంచి హైదరాబాద్‌కు రానుంది.

ట్రావెల్ ఏజెంట్‌తో పరిచయం..

అహ్మదాబాద్‌లో వస్త్ర వ్యాపారం చేసే వ్యాపారికి స్నేహితుల ద్వారా మీన్‌చంద్ పటేల్ అనే ట్రావెల్ ఏజెంట్‌తో పరిచయమైంది. తనతో సహా 19 మంది స్నేహితులు, కుటుంబీకులు అమెరికా విహారయాత్రకు వెళ్లాలని భావిస్తున్నట్టు మీన్‌చంద్‌కు చెప్పాడు. అందరి వీసాలు ప్రాసెస్ చేయడానికి అంగీకరించిన ఇతగాడు వారి నుంచి టూర్ ప్యాకేజీ కూడా సిద్ధం చేశారు. మొత్తం 19 మంది నుంచి పాస్‌పోర్ట్ కాపీలు తీసుకున్నాడు. అప్లికేషన్ ఫీజు పేరుతో రూ.1.5 లక్షలు వసూలు చేసిన మీన్‌చంద్ వారికి కొన్ని దరఖాస్తులు ఇచ్చి పూరించమని చెప్పాడు. వ్యాపారిని మోసం చేయాలని నిర్ణయించిన ఈ ఏజెంట్, దానికోసం మరికొందరితో కలిసి భారీ స్కెచ్ వేశాడు. హైదరాబాద్ కాన్సులేట్‌లో మాత్రమే తమకు కావాల్సిన సమయంలో వీసా స్లాట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పి నమ్మించాడు. వీసా ఇంటర్వ్యూ కోసం అంతా అక్కడకు వెళ్లాలంటూ ప్రత్యేక బస్సులో తీసుకొచ్చాడు. దీనికి ముందే తన అనుచరులు కొందరిని హైదరాబాద్‌కు పంపిన మీన్ చంద్ శివార్లలోని ఓ స్టార్ హోటల్‌లో బాంక్వెట్ హాల్ బుక్ చేయించాడు. అందులో ప్రత్యేకంగా టేబుళ్లు, కుర్చీలు ఉంచి యూఎస్ కాన్సులేట్ బ్రాంచ్ ఆఫీస్‌గా మార్చాడు. గుజరాత్‌కు చెందిన వారికి వీసాలు జారీ కావడం కష్టమంటూ అహ్మదాబాద్ వ్యాపారికి చెప్పిన మీన్‌చంద్... తనకు ఉన్న పరిచయాలు వినియోగించి ప్రాసెస్ పూర్తయ్యేలా చేస్తున్నానని నమ్మబలికాడు. అయితే భద్రతా కారణాల నేపథ్యంలో నానక్‌రామ్‌గూడలో ఉన్న అమెరికన్ కాన్సులేట్‌లోకి ఎక్కువ మందిని అనుమతించట్లేదని, గ్రూప్ వీసా ప్రాజెక్టులో భాగంగా ఓ హోటల్‌లో ఇంటర్వ్యూలు చేయడానికి కాన్సులేట్ అధికారులు అంగీకరించారని నమ్మించాడు. దాదాపు మూడు నెలల క్రితం అందరినీ హైదరాబాద్ తీసుకొచ్చిన మీన్‌చంద్ మరో హోటల్‌లో బస చేయించాడు. అక్కడ నుంచి వాళ్ల బస్సులోనే ఈ స్టార్‌హోటల్‌కు తీసుకొచ్చాడు. నేరుగా బాంక్వెట్ హాల్‌కు తీసుకెళ్లి... అప్పటికే సిద్ధంగా ఉన్న తన అనుచరుల్ని కాన్సులేట్ అధికారులు, ప్రతినిధులుగా నమ్మించాడు. అలా 19 మందికీ డమ్మీ ఇంటర్వ్యూలు చేయించి వారిని మీన్‌చంద్ తిరిగి అహ్మదాబాద్‌కు తీసుకెళ్లాడు. ఆపై వీసా ఫీజుల పేరుతో మరో రూ.40 లక్షలు వసూలు చేశాడు. ఎన్నాళ్లు వేచి చూసినా వీసాలు ప్రాసెస్ కాకపోవడంతో అనుమానించిన వ్యాపారి అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ స్కామ్‌లో మీన్‌చంద్‌కు హైదరాబాద్‌కు చెందిన వారూ సహకరించి ఉంటారని అనుమానిస్తున్న అక్కడ పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కీలక ఆధారాల సేకరణ కోసం త్వరలో నగరానికి రానున్నారు.


తండ్రిని పట్టించుకోని కొడుకులకు షాక్

- పెద్ద కొడుకు డబుల్ బెడ్రూమ్ ఇల్లు రద్దు
- ఇద్దరు కొడుకులు ప్రతినెల రూ.2 వేల చొప్పున ఇవ్వాలని ఆర్డీవో ఆదేశం



రాజమల్లు కుమారుడికి నోటీసులిస్తున్న తహసీల్దార్ జయంత్ కుమార్

తంగళ్లపల్లి (సిరిసిల్ల): తండ్రిని పోషించకుండా, ఇంట్లో ఉండడానికి చోటు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న ఇద్దరు కొడుకులకు సిరిసిల్ల ఆర్డీవో లోలావర్ రమేశ్ తగిన బుద్ధి చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని రద్దు చేస్తూ, ఆ ఇంటిని తండ్రికి కేటాయిస్తున్నట్లు కొడుకులకు గురువారం నోటీసులిచ్చారు. తంగళ్లపల్లి తహసీల్దార్ జయంత్ కుమార్ కథనం ప్రకారం.. సిరిసిల్లకు చెందిన అదువాల రాజమల్లుకు అనిల్‌కుమార్, సురేశ్ అనే ఇద్దరు కొడుకులు ఉన్నారు. వీరికి రెండేళ్లక్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం తంగళ్లపల్లి మండలంలోని కేసీఆర్ నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇంటిని కేటాయించింది. ఇల్లు రాజమల్లు పేరున కేటాయించాల్సి ఉండగా అనిల్ కుమార్ తన భార్య పేరిట రాయించాడు. ఆరు నెలల నుంచి రాజమల్లును కొడుకులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆయన రోడ్లపైనే ఉంటూ భిక్షాటన చేసి కడుపునింపుకుంటున్నాడు. ఈ క్రమంలో తనను కొడుకులు పట్టించుకోవడం లేదని ఆయన ఆర్డీవోకు మొరపెట్టుకున్నాడు. ఆర్డీవో రమేశ్ ఆదేశాల మేరకు తంగళ్లపల్లి తహసీల్దార్ దీనిపై విచారించి కొడుకులు వృద్ధుడిని పట్టించుకోవడం లేదని నివేదించారు. దీంతో పెద్ద కొడుకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లును ఖాళీచేసి, తండ్రికి అప్పగించాలని, కొడుకులు ఇద్దరూ ప్రతినెల తండ్రికి రూ.2 వేల చొప్పున చెల్లించాలని ఆర్డీవో ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని రాజమల్లు పేరున మార్చాలని తహసీల్దార్‌ను ఆదేశించగా.. గురువారం ఆయన అనిల్‌కుమార్‌కు నోటీసులు అందజేశారు. తనకు న్యాయం చేసిన అధికారులకు రాజమల్లు కృతజ్ఞతలు తెలిపారు.



జీపీ లేఔట్లన్నీ నిషేధిత జాబితాలోకి..

గ్రామ పంచాయతీ పరిధిలోని స్థలాలకు సర్కారు కళ్లెం

- రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తూ సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు
- ప్లాట్లను అమ్ముకోలేక సామాన్య ప్రజలకు కష్టాలు
- రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గుర్తించిన హెచ్‌ఎండీఏ

ఇబ్రహీంపట్నంలోని ఆదిబట్లలో 289/పీ సర్వే నంబరులోని ఓ జీపీ లేఔట్‌లో శ్రీనివాస్ రెడ్డి కొన్నేళ్ల క్రితమే 250 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. కూతురు పెళ్లి సమయానికి కట్నం కింద ఉపయోగపడుతుందని భావించారు. వచ్చే నెలలో ముహూర్తాలు ఉండటంతో పెళ్లి పెట్టుకున్నారు. అల్లుడికి కానుకగా ఇద్దామనుకున్న ఓపెన్ ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసే వీలు లేకుండాపోయింది. దీనికి కారణం ప్రభుత్వం ఆ లేఔట్‌ను నిషేధిత జాబితాలో చేర్చడమే. దీంతో శ్రీనివాస్‌రెడ్డి లబోదిబోమంటున్నాడు.

సాక్షి, హైదరాబాద్: వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలోనే గ్రామ పంచాయతీ (జీపీ) లేఔట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేశారు. కానీ, తాజాగా రేవంత్ సర్కారు జీపీ లేఔట్లను నిషేధిత జాబితాలో చేర్చింది. ఈమేరకు హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని అనధికార లేఔట్ల సర్వే నంబర్లను నిషేధిత జాబితా 22–ఏ (1)(ఈ) కిందకు బదలాయించింది. దీంతో భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుందని కొనుగోలు చేసిన ప్లాట్లను విక్రయించుకోలేక సామాన్య, మధ్యతరగతి ప్రజలు కష్టాలు పడుతున్నారు. సాధారణంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు పైసా పైసా కూడబెట్టుకొని ప్లాట్ కొనుగోలు చేస్తుంటారు. కూతురు పెళ్లి కోసమో, కొడుకు ఉన్నత చదువుల కోసమో అత్యవసర సమయంలో ఉపయోగపడుతుందనుకుంటారు. నగదు అవసరమైనప్పుడు ప్లాట్ అమ్మితే సొమ్ము వస్తుందనే భరోసాతో ఉంటారు. కానీ, తాజాగా ప్రభుత్వం సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచింది. ఎంపిక చేసిన సర్వే నంబర్లలోని జీపీ లేఔట్లు, అందులోని ఓపెన్ ప్లాట్లను నిషేధిత జాబితాలోకి చేర్చింది. దీంతో ఆయా స్థలాలకు రిజిస్ట్రేషన్లు జరగకుండా అడ్డుకట్ట వేశారు. ఫలితంగా స్థల యజమానులు ప్లాట్లను విక్రయించుకోలేరు. రిజిస్ట్రేషన్లు జరగకపోతే కొనుగోలుదారులెవరూ ముందుకు రారు. దీంతో భవిష్యత్తు అవసరాల కోసమని కొనుగోలు చేసిన ప్లాట్ ఎందుకూ పనికిరాకుండా మిగిలిపోయినట్టయింది.

ఏ చట్టం ప్రకారం చేర్చారు?

జీపీ లేఔట్లు ఉన్న సర్వే నంబర్లన్నింటినీ ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెడుతూ నిర్ణయం తీసుకుంది. పట్టా స్థలాలను నిషేధిత జాబితా 22–ఏ (1)(ఈ)లో పెట్టే అధికారం ప్రభుత్వానికి లేదు. లేఔట్లకు అనుమతి ఇచ్చే అధికారం గ్రామ పంచాయతీలకు లేదు. హెచ్‌ఎండీఏ, డీటీసీపీ విభాగాలు మాత్రమే లేఔట్లకు అనుమతి ఇచ్చే అధికారం ఉంది. మరి, హుడా ఏర్పడకముందే ఈ లేఔట్లు వెలిస్తే.. డీటీసీపీ ఏం చేస్తున్నట్టు? కొత్తగా అవి జీపీ లేఔట్లని పేర్కొంటే నిషేధిత జాబితాలోకి ఏ చట్టం ప్రకారం చేర్చారు? అని డెవలపర్ల సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వ భూములు లేదా కోర్టు కేసుల్లో ఉన్న స్థలాలను 22–ఏ జాబితా కింద చేర్చుతారు. ఇందులో ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ భూములు ఇలా ఐదు వర్గాలుగా ఉంటాయి. ఈ స్థలాలను ఎవరూ ఆక్రమించకుండా, రిజిస్ట్రేషన్లు జరగకుండా ఆయా సర్వే నంబర్లను 22–ఏ కింద చేర్చుతారు. తాజాగా ప్రభుత్వం జీపీ లేఔట్లను సైతం 22–ఏ జాబితాలోకి చేర్చడం గమనార్హం. దీంతో లేఔట్, పట్టాదారు స్థలాలు కూడా ప్రభుత్వ భూముల పరిధిలోకి వస్తాయని ఓ న్యాయవాది అభిప్రాయపడ్డారు. దీంతో చాలామంది భూ యజమానులు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత న్యాయస్థానం ఆయా స్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి, రిజిస్ట్రేషన్లు చేయాలంటూ సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేసే అవకాశముంటుందన్నారు. అయితే ఇలా ఎంతమంది సామాన్యులు కోర్టును ఆశ్రయిస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. కాగా, జీపీ లేఔట్లను నిషేధిత జాబితాలో పెడితే వాటిని ఎల్‌ఆర్‌ఎస్ ఎలా చేస్తారని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ప్రశ్నించారు.

మనం చేసిన మేలు ప్రతి ఇంట్లో కనిపిస్తోంది

రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో వైఎస్ జగన్

ఇవాళ రాష్ట్రంలో వ్యవస్థలన్నీ పూర్తిగా దిగజారిపోయాయి. విద్య, వైద్య రంగాలను నాలుగు నెలల్లోనే నాశనం చేశారు. ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని పేదవాడు వెళితే వైద్యం చేస్తారన్న నమ్మకం లేని పరిస్థితి. దాదాపు రూ.2400 కోట్లు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. చదువుకునే పిల్లలు విద్యాదీవెన, వసతి దీవెన కోసం ఎదురు చూస్తున్నారు. రైతులకు ఖరీఫ్ సీజన్ ముగిసినా పెట్టుబడి సహాయం లేదు. ఆర్బీకేలు లేవు. ధాన్యం కొనుగోలులో మళ్లీ దళారులు వచ్చారు. నాడు-నేడు లేదు. ఇంగ్లిష్ మీడియం లేదు. ఏ పథకమూ డోర్ డెలివరీ లేకుండా చేశారు. తెలుగుదేశం పార్టీ నేతల ఇళ్లకు వెళ్తేనే వాళ్ల సమక్షంలో పథకాలు ఇచ్చే పరిస్థితి. అక్కడకు వెళ్లకపోతే పథకాలు నిలిచిపోతాయి. ఇప్పటికే లక్షన్నర పెన్షన్లు కట్ చేశారు.

మనం చేసిన మంచి పనులు ఎక్కడికీ పోలేదు. ప్రతి ఇంట్లో బతికే ఉంది. మన కార్యకర్తలు ఏ గ్రామంలోనైనా ఈ పనులన్నీ చేశామని గర్వంగా చెప్పుకోగలరు. చంద్రబాబులా మనం అబద్ధాలు ఆడలేకపోయాం. ఈ రోజు చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు కానీ.. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గ్రామంలో ఏ ఇంటికీ వెళ్లలేని పరిస్థితి. పిల్లలు రూ.15 వేల గురించి అడుగుతారు. మహిళలు రూ.18 వేల గురించి అడుగుతారు. పెద్ద వాళ్లు రూ.48 వేల గురించి అడుగుతారు. రైతులు రూ.20 వేలు ఏమయ్యాయని అడుగుతారు. ఏమని సమాధానం చెబుతారు?

ఇప్పుడు రెడ్‌బుక్ పాలన సాగుతోంది. ప్రజలను భయపెడుతున్నారు. తప్పుడు కేసులు పెడుతున్నారు. ప్రలోభాలకు గురి చేస్తున్నారు. హద్దుల్లేని అవినీతి జరుగుతోంది. అన్ని వ్యవస్థలు కూలిపోయాయి. అంతులేని అవినీతి రాజ్యమేలుతోంది. ప్రతి నియోజకవర్గంలో కనీసం పది పేకాట క్లబ్బులు నడుస్తున్నాయి. మద్యం అమ్మకాలు పెంచే కార్యక్రమం నడుస్తోంది. డిస్టిలరీస్ నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. లిక్కర్ సిండికేట్స్ అప్పుడే మొదలయ్యాయి. గ్రామ గ్రామాన బెల్టు షాపులు ప్రమోట్ చేసే కార్యక్రమం నడుస్తోంది. ఇసుక గురించి మాట్లాడలేని పరిస్థితి. మన హయాంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. ఇవాళ ఉచితం లేదు కానీ, రెట్టింపుకన్నా ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారు.

\- వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: 'ఎన్నికల్లో చంద్రబాబునాయుడు అన్ని రకాలుగా అబద్ధాలు చెప్పారు. ప్రజలను మోసం చేశారు. ఆ మోసాలకు గురైన ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ప్రతి ఇంటికీ మంచి చేసిన మనకే ఇలా అయితే.. ప్రజలను ఇంతలా మోసం చేసి, అన్నీ అబద్ధాలే చెప్పిన చంద్రబాబును ప్రజలు ఏం చేస్తారు? ఆయన ప్రజలను ఎన్ని రోజులు భయపెడతారు? ఎన్ని రోజులు కేసులు పెడతారు? ప్రజలకు అన్నీ తెలుసు. అందుకే చంద్రబాబుకు పరాజయం తప్పదు. టీడీపీకి సింగిల్ డిజిట్ కూడా ఇవ్వరు. ఇది నిజం' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మన ప్రభుత్వం చేసిన మంచి ప్రతి ఇంట్లోనూ ఉందన్నారు. రేపల్లె నియోజకవర్గంలో అనుకోని పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని ఎత్తి చూపుతూ.. కష్టాలు ఎప్పుడూ శాశ్వతంగా ఉండవని, చీకటి తర్వాత వెలుగు తప్పకుండా వస్తుందని.. ఇది సృష్టి ధర్మమని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఉద్బోధించారు. విలువలు, విశ్వసనీయతే మనకు శ్రీరామ రక్ష అని.. మన వ్యక్తిత్వమే మనల్ని ముందుకు నడిపిస్తుందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన రేపల్లె నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఐదేళ్లు గర్వంగా తలెత్తుకునేలా పాలన

- 2019 నుంచి 2024 వరకు మనం గర్వంగా తలెత్తుకునేలా పరిపాలన చేశాం. 'నేను వైఎస్సార్‌సీపీ కార్యకర్తను' అని ప్రతి కార్యకర్త, ప్రతి ఇంటికి వెళ్లి గర్వంగా చెప్పుకునేలా మన పాలన సాగింది. మేనిఫెస్టో అనేది చెత్తబుట్టలో వేయదగింది కాదని, అది అత్యంత పవిత్రమైనదని ప్రపంచానికి తొలిసారిగా మన పార్టీ మాత్రమే చెప్పింది. ప్రజలకు ఇచ్చిన మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పబోమని వాటిని నెరవేరుస్తూ అడుగులు వేశాం.
- మొట్టమొదటి బడ్జెట్‌లోనే సంక్షేమ క్యాలెండర్ ప్రకటించాం. ప్రతి నెలా క్రమం తప్పకుండా బటన్ నొక్కి పారదర్శకంగా పథకాలన్నీ అమలు చేశాం. మన ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరింది. మనకు ఓటు వేశారా.. లేదా అన్నది చూడలేదు. కులం, మతం కూడా చూడకుండా పథకాలు డోర్ డెలివరీ చేసి అండగా నిలబడ్డ ప్రభుత్వం మనది.
- కోవిడ్ వంటి సంక్షోభం సమయంలో ఆదాయం తగ్గి.. ఖర్చు పెరిగినప్పటికీ ఏ పథకాన్నీ ఆపలేదు. ఎలాంటి సాకులు చూపకుండా పథకాలు అమలు చేశాం. పైగా, అంతకు ముందు చంద్రబాబు చేసిన అప్పుల భారం కూడా మన మీద పడింది. దాదాపు రూ.20 వేల కోట్ల కరెంటు బిల్లులు వదిలిపెట్టి వెళ్లారు. అయినా తొలిసారిగా డెలివరీ మెకానిజంలో లంచాలు లేకుండా ప్రజలకు మేలు చేయొచ్చని రుజువు చేశాం. అది మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమైంది.

కీలక రంగాల్లో విప్లవాత్మక మార్పులు

- విద్య, వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చాం. స్కూళ్లలో ఎప్పుడూ చూడని మార్పులు చేశాం. ఆరో తరగతి నుంచి డిజిటల్ బోధన, ఇంగ్లిష్ మీడియం, నాడు–నేడుతో స్కూళ్ల మార్పులు, సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్ క్లాసులు, ఎనిమిదో తరగతికి వచ్చేసరికి పిల్లల చేతుల్లో ట్యాబులు పెడుతూ ఎప్పుడూ చూడని మార్పులు తీసుకు వచ్చింది కూడా మన ప్రభుత్వమే.
- మనం అధికారంలోకి రాక ముందు కేవలం వెయ్యి చికిత్సలకు మాత్రమే పరిమితమైన ఆరోగ్యశ్రీని 3,350 ప్రొసీజర్లకు పెంచాం. ఏకంగా పేదలకు రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పరిధి పెంచాం. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆరోగ్య ఆసరా కూడా తీసుకు వచ్చాం. ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మారుస్తూ నాడు–నేడు తీసుకొచ్చాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్ల కొరత లేకుండా చూశాం. జీఎంపీ ప్రమాణాలున్న మందులు ఇచ్చాం. కొత్తగా 17 మెడికల్ కాలేజీల పనులు మొదలుపెట్టాం. ఊళ్లలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ ఏర్పాటు చేశాం. అక్కడే 105 రకాల మందులు, 14 రకాల టెస్టులు చేసే విధంగా ఆరోగ్య సురక్ష అందుబాటులోకి తెచ్చాం.
- వ్యవసాయ రంగంలో ఉచిత పంటల బీమా కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అమలైంది. రైతులకు పెట్టుబడి భరోసా పక్కాగా అమలు చేసింది మన ప్రభుత్వం మాత్రమే. మొదటిసారిగా ఇ–క్రాపింగ్, ఆర్బీకేలు, రైతులకు దళారీ వ్యవస్థ లేకుండా పంటలు కొనుగోలు చేసే కార్యక్రమం చేపట్టాం. అక్కచెల్లెమ్మల రక్షణ కోసం దిశ యాప్‌ను అందుబాటులోకి తెచ్చాం.

వాళ్లు తలెత్తుకుని తిరగలేని పరిస్థితి

వాళ్లు అబద్ధాలు చెప్పి మోసంతోనే ప్రచారం చేశారు. వలంటీర్లను తీసేయబోమని, వారికి రూ.10 వేల వేతనం ఇస్తామని చెప్పి దగా చేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఇంట్లో ఎంత మంది ఉన్నా.. పిల్లలు కనిపిస్తే నీకు రూ.15 వేలు అని, వారి తల్లి కనిపిస్తే నీకు రూ.18 వేలు అని, వాళ్ల చిన్నమ్మ కనిపిస్తే నీకూ రూ.18 వేలు అని, 50 ఏళ్లకు పైబడిన మహిళ కనిపిస్తే నీకు రూ.48 వేలు అని, కండువాతో రైతు కనిపిస్తే నీకు రూ.20 వేలు అని చెప్పి అబద్ధాలతో మోసం చేశారు. ఒకవేళ నేను కూడా అలాంటి అబద్ధాలు చెప్పి ఉంటే, ఈరోజు సీఎం స్థానంలో ఉండేవాడిని. కానీ, మీలో ఎవరైనా ఇవాళ ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్లే పరిస్థితి ఉందేదా?

ఉత్తమ్ తండ్రికి నివాళి



మాదాపూర్ (హైదరాబాద్): మాదాపూర్‌లోని హైటెక్స్‌లో గురువారం నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తమ్ రెడ్డి పెద్ద కర్మను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబులతో పాటు పలువురు నాయకులు హాజరై నివాళులర్పించారు. మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీజేపీ ఎంపీ అరవింద్ కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీపీఐ జాతీయ నేత నారాయణ, వ్యాపారవేత్త సుబ్బిరామిరెడ్డి తదితరులు హాజరయ్యారు.


13న 'అలయ్ బలయ్'కు గవర్నర్, సీఎంలకు విజయలక్ష్మి ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 13న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న దసరా మిలన్ 'అలయ్ బలయ్'కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలను అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఆహ్వానించారు. రాజ్‌భవన్‌లో గురువారం గవర్నర్‌ను, సీఎంను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలోను కలుసుకుని 'అలయ్‌బలయ్'కార్యక్రమ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరవుతామని సీఎం, గవర్నర్ చెప్పారని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో విజయలక్ష్మితో పాటు ఫౌండేషన్ సభ్యుడు ప్రదీప్ ఉన్నారు. ఈ సందర్భంగా అలయ్ బలయ్ కార్యక్రమ విశిష్టత, ఇందులోభాగంగా చేపట్టబోయే కార్యక్రమాల గురించి విజయలక్ష్మి, సభ్యుల నుంచి గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. గవర్నర్‌ను కలసిన వారిలో చైర్‌పర్సన్‌తో పాటు కన్వీనర్ చింతల రామచంద్రారెడ్డి, సభ్యులు ఎస్.గౌతమ్‌రావు, శ్యాంసుందర్ గౌడ్, మహేశ్ ఉన్నారు.

జెన్‌కో హైడల్ డైరెక్టర్‌గా సచ్చిదానందం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) ప్రాజెక్టుల విభాగం డైరెక్టర్ ఎం.సచ్చిదానందంకు హైడల్ విభాగం డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సంస్థ సీఎండీ రోనాల్డ్ రోస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంస్థ హైడల్ విభాగం డైరెక్టర్ వెంకటరాజంకు ఇటీవల ఉద్వాసన పలకడంతో.. ఆయన స్థానంలో కొత్త డైరెక్టర్‌ను నియమించే వరకు సచ్చిదానందంకు అదనపు బాధ్యతలు అప్పగించారు.


ఆర్‌బీ–ఎక్స్‌పై హౌస్ మోషన్‌కు హైకోర్టు నో



సాక్షి, హైదరాబాద్: నగరంలోని పేట్లబుర్జ్ వద్ద మూసీ ప్రాంతంలో ప్రభుత్వ సిబ్బంది సర్వే చేయడంతో భయాందోళనలకు గురైన కొందరు దాఖలు చేసిన హౌస్‌మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు హైకోర్టు నిరాకరించింది. హైడ్రా, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది సర్వే నిర్వహించి తమ ఇళ్లపై ఆర్‌బీ–ఎక్స్ అని మార్కింగ్ చేశారని, కూల్చివేసే ప్రమాదం ఉన్నందున అత్యవసరంగా విచారణ చేపట్టాలంటూ ఎస్.మహేందర్‌సింగ్ దాస్ మరో 14 మంది అత్యవసరంగా జడ్జి ఇంటి వద్ద విచారణ చేపట్టాలంటూ హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు దసరా సెలవులు ముగిసే దశలో హౌస్‌మోషన్ విచారణకు హైకోర్టు నిరాకరించింది. దీంతో ఈ నెల 14న తిరిగి ప్రారంభమయ్యాక పిటిషన్‌పై విచారణ జరిగే అవకాశముంది. నిజాం కాలంలో తమకు 4.2 ఎకరాల భూమి ఇస్తే అందులో గురుద్వార్, హనుమాన్ మందిర్, యాత్రికుల సౌకర్యార్థం ధర్మశాల నిర్మాణాలతోపాటు పలువురు ఇళ్లు నిర్మించుకున్నారని, గురుద్వార్, హనుమాన్ ఆలయాల సంరక్షకుడిగా తాను వ్యవహరిస్తున్నానని మహేందర్‌సింగ్ దాస్ వివరించారు. నిజాం కాలంలోనే మూసీకి సరిహద్దు గోడ నిర్మాణం జరిగిందని, దానికి వెలుపలే తమ భూమి ఉందన్నారు. సంబంధిత భూమి పత్రాలన్నీ ఉన్నాయని, ఇంటిపన్ను, నీటిపన్ను కడుతున్నామని చెప్పారు.

పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ పాలన

బీఆర్‌ఎస్ నేత బాలరాజుయాదవ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని, ప్రజలకు ఇచ్చిన హామీలపై నిలబడటం లేదని బీఆర్‌ఎస్ నాయకుడు దూదిమెట్ల బాలరాజు యాదవ్ విమర్శించారు. బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, పార్టీ నేత బమ్మెర రామ్మూర్తితో కలిసి గురువారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బతుకమ్మ, దసరా సంబురం లేకుండా పేదల ఇళ్లపై సీఎం బుల్డోజర్లు పంపుతున్నాడని మండిపడ్డారు. గతంలో కేసీఆర్‌ను విమర్శించిన రేవంత్ ప్రస్తుతం రిటైర్డ్ అధికారులు, ఆంధ్ర ప్రాంత అధికారులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావొస్తున్నా పూర్తిస్థాయి మంత్రివర్గం ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించేందుకు రేవంత్‌కు సీఎం పదవి రాలేదని, మాటలు మాని పాలన మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు.

సింఘ్వీని రాజ్యసభకు పంపడం చారిత్రక అవసరం

ఉప ముఖ్యమంత్రి భట్టి



జానారెడ్డి, అభిషేక్ సింఘ్వీతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ న్యాయవాది డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపడం చారిత్రక అవ సరం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు గిరీష్ సంఘీ గురువారం అభిషేక్ మను సింఘ్వీ ఆత్మీయ అభినందన సత్కార కార్యక్రమాన్ని గురువారం ఇక్కడ ఓ హోటల్లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భట్టి విక్రమార్క మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ఔన్నత్యాన్ని కాపాడటంలో విజయం సాధించి.. దేశంలోనే నిష్టాతులైన గొప్ప న్యాయవాదిగా పేరు ప్రఖ్యా తులు గడించిన అభిషేక్ మను సింఘ్వీ తెలంగాణ ప్రజల తరఫున పెద్దల సభలో రాష్ట్ర ప్రయోజనాల కోసం తన గళాన్ని వినిపించ నున్నారని అన్నారు. దేశంలోని అతి కొద్ది మంది నిష్ణాతులైన న్యాయవాదుల్లో అభిషేక్ మను సింఘ్వీ ఒకరని, తెలంగాణ ప్రయోజనాలకు ఉపయోగపడే గొప్ప వ్యక్తిని రాజ్యసభ సభ్యుడిగా గెలిపించుకోవడం కాంగ్రెస్ శాసనసభ పక్షానికి చాలా సంతోషంగా ఉందని అన్నారు. కాగా, తనను సన్మానించినందుకు ఈ సందర్భంగా అభిషేక్ సింఘ్వీ కృతజ్ఞతలు తెలిపారు.

విదేశీ విద్య దరఖాస్తులకు మోక్షమెప్పుడు?



రెండు సీజన్ల నుంచి ముందుకు సాగని పూలే బీసీ విదేశీ విద్యానిధి పథకం

- సుమారు 5 వేల దరఖాస్తులు స్వీకరించిన బీసీ సంక్షేమ శాఖ
- పథకానికి ఎంపికైన జాబితాలు ఇప్పటికీ విడుదల చేయని యంత్రాంగం
- విదేశీ విద్యను వాయిదా వేసుకున్న కొందరు.. పథకంపై ఆశలు వదులుకున్న మరికొందరు

సాక్షి, హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకం రెండు సీజన్ల నుంచి దరఖాస్తులకే పరిమితమవుతోంది. ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ... ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నప్పటికీ అర్హుల జాబితాలను మాత్రం విడుదల చేయట్లేదు. ఈ ఏడాది జనవరి, ఆగస్టులో దాదాపు 5 వేల మంది బీసీ, ఈబీసీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించిన యంత్రాంగం.. నెలలు గడుస్తున్నప్పటికీ అభ్యర్థుల అర్హతలను ఖరారు చేయడంలో తాత్సారం చేస్తోంది. దీంతో విదేశీ విద్యాభ్యాసంపై అభ్యర్థులు సందిగ్ధంలో పడ్డారు. కొందరు కోర్సును వాయిదా వేసుకోగా మరికొందరు పథకంపై ఆశలు వదులుకొని విదేశాల్లో చదువు కొనసాగించేందుకు వెళ్లిపోయారు.

పెండింగ్... పెండింగ్...

విదేశాల్లో ఉన్నత విద్య చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం విద్యానిధి పథకాన్ని అమలు చేస్తోంది. వివిధ సంక్షేమ శాఖల ద్వారా వేర్వేరు పేర్లతో ఈ పథకాన్ని అమలు చేస్తుండగా... ఎంపికైన అభ్యర్థికి గరిష్టంగా రూ. 20 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. పీజీ కోర్సు మొదటి సంవత్సరం పూర్తి కాగానే రూ. 10 లక్షలు, రెండో సంవత్సరం పూర్తి చేశాక మరో రూ. 10 లక్షల చొప్పున సాయాన్ని విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది. అలాగే ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ. 50 వేలు కూడా చెల్లిస్తోంది. ఈ క్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఏటా 300 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరిలో దరఖాస్తులను ఆహ్వానించగా 2,850 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. జనవరి నెలాఖరులో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించిన అధికారులు... విద్యార్థుల మార్కులు, పోటీ పరీక్షలకు సంబంధించిన స్కోరు వివరాలతో జాబితాలను తయారు చేసుకున్నారు. చివరగా పథకానికి అర్హత సాధించిన వారి జాబితాను విడుదల చేయాల్సి ఉండగా... వివిధ కారణాలతో జాబితా ప్రకటన వెలువడలేదు. ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికలు రావడం, బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఈ ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. ఇంతలో రెండో విడత దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆగస్టులో ప్రారంభించిన అధికారులు... అదే నెలాఖరులో ధ్రువపత్రాల పరిశీలన సైతం పూర్తి చేశారు. కానీ ఇప్పటివరకు అర్హుల జాబితాను విడుదల చేయలేదు. రెండు విడతల్లో 300 మంది అర్హులను గుర్తించకుండా ఈ ప్రక్రియను పెండింగ్‌లో పెట్టారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలు అర్హుల జాబితాలను విడుదల చేసినప్పటికీ బీసీ సంక్షేమ శాఖలో నిలిచిపోవడంతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది.

రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు మోస్తరు వర్షాలు

- మధ్య తెలంగాణ ప్రాంత జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు.. వచ్చేవారాంతంలోగా నైరుతి నిష్క్రమణ పూర్తి
- వాతావరణశాఖ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ గురువారం వెల్లడించింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ కొనసాగుతోందని, వచ్చే వారాంతంలోగా నైరుతి రుతుపవనాలు పూర్తిగా వెళ్లిపోతాయని తెలిపింది. ఈ క్రమంలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, దీంతో వర్షాలకు అనుకూల వాతావరణం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగుడెం, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, వరంగల్, వికారాబాద్, నారాయణపేట్, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. నైరుతి సీజన్‌లో సంతృప్తికర వర్షాలు కురవగా... ప్రస్తుత ఈశాన్య సీజన్‌లో వర్షాలు అడపాదడపా నమోదయ్యాయి. ఈశాన్య సీజన్‌లో ఇప్పటివరకు 4.27 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా...2.15 సెంటీ మీటర్లు మాత్రమే కురిసింది. రానున్న వారం రోజుల్లో వర్షాలు సాధారణం కంటే అధికంగా నమోదు కావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

రూ. 6 కోట్ల విలువైన నగలు మాయం

- ఆభరణాల సంస్థలో పనిచేసే ఉద్యోగులపైనే అనుమానం!
- పోలీసులకు ఫిర్యాదు చేసిన సంస్థ మేనేజర్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునంబర్–10లోని శ్రీకృష్ణా జ్యువెల్లరీ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.6 కోట్ల విలువైన నగలు మాయమయ్యాయి. ఈ మేరకు దుకాణం మేనేజర్ కె.విజయ్‌కుమార్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని కేసును గురువారం సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ ఘటనకు చెందిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకృష్ణా జ్యువెల్లరీలో ఇటీవల ఆభరణాల లెక్కింపు ఆడిట్ జరిగింది. ఇందులో పెద్ద ఎత్తున నగలు కనిపించకపోవడంతో ఇక్కడి ఉద్యోగులను ప్రశ్నించగా...వారి వద్దనుంచి సరైన సమాచారం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ పనిచేస్తోన్న బబ్బూరి శ్రీకాంత్ అనే వ్యక్తి శ్రీకృష్ణా జ్యువెల్లరీలో కలెక్ట్ చేసుకున్న ఆభరణాలను కస్టమర్లకు ఇచ్చి రావాలంటూ ఇక్కడే పనిచేస్తున్న మరో ఉద్యోగి ఉదయ్‌కుమార్‌శెట్టికి అప్పగించాడు. అయితే వీరిద్దరూ సంస్థ నమ్మకాన్ని వమ్ముచేస్తూ కస్టమర్లకు ఇవ్వాల్సిన నగలను బయట మార్కెట్లో విక్రయించారని, అకౌంట్స్‌లో తేడాలు వచ్చాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. బబ్బూరి శ్రీకాంత్, ఉదయ్‌కుమార్ శెట్టితో పాటు ఇక్కడే పనిచేస్తున్న చింటూ, సత్య, అజయ్, టింకూ, చంద్ర తదితరులు ఈ మోసానికి పాల్పడ్డారంటూ ఫిర్యాదులో తెలిపారు. ఈ మేరకు వీరందరిపై బీఎన్ఎస్ సెక్షన్ 316 (4), 318 (4)ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఉదయ్‌కుమార్‌శెట్టిని ఆఫీసులో హాజరుకావాల్సిందిగా చెప్పగా, స్విచ్ఛాఫ్ వచ్చిందని, బబ్బూరి శ్రీకాంత్ యాజమాన్యానికి సహకరించడం లేదని కూడా పేర్కొన్నారు.

సాక్షి
12
హైదరాబాద్, శుక్రవారం,
11, అక్టోబర్, 2024

సిటీ ప్లస్

నగరంలో దసరా సంబరాలకు ముందస్తుగా శ్రీకారం చుట్టేది దాండియా సందడే. సిటీలో ఉన్న లేడీస్ క్లబ్స్ మిగిలిన ఏ సందర్భాన్ని మిస్ అయినా, దాండియా వేడుకల్ని మాత్రం జోరుగా హుషారుగా నిర్వహిస్తాయి. ఈవెంట్స్ నిర్వహించడంలో లేడీస్ క్లబ్స్ పోటా పోటీగా సిద్ధమయ్యే క్రమంలో ఈ సంప్రదాయ నృత్య హేళ... ముున్ముందుకు జరుగుతూ.. దసరా పండుగకు నెల ముందుగానే సిటీలో సందడిని మొదలయేలా చేసింది.. దసరా సమీపిస్తున్న కొద్దీ దాండియా ఈవెంట్స్‌కు పేరొందిన పలు సంస్థలు ఆ సందడిని పీక్స్‌కి తీసుకెళ్లడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో



వారాహి సిల్క్స్ ప్రారంభం

కార్యక్రమంలో పాల్గొన్న సినీహీరో బాలకృష్ణ, హీరోయిన్ మీనాక్షి చౌదరి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లో నూతనంగా ఏర్పాటు చేసిన వారాహి సిల్క్స్‌ను గురువారం సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, హీరోయిన్ మీనాక్షి చౌదరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏచూరి మణిదీప్ మాట్లాడుతూ తమ వ్యాపార సంస్థకు హీరోయిన్ మీనాక్షి చౌదరి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. వారాహి సిల్క్స్ ప్రారంభోత్సవం సందర్భంగా విని యోగదారులకు పలు ఆఫర్లను ప్రకటించినట్లు రూ. 1 లక్ష కొనుగోలుపై 2 గ్రాముల బంగారు నాణెం, రూ. 50 వేల కొనుగోలుపై 1 గ్రాము బంగారు నాణెం అందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.





దాండియా కీ రాత్..

జోరుగా.. హుషారుగా.. పోటా పోటీగా లేడీస్ క్లబ్స్..

- పలుచోట్ల మహిళల నృత్య హేల..
- నెల రోజుల ముందు నుంచే సన్నాహాలు..
- పలు సంస్థల ఆధ్వర్యంలోనూ కార్యక్రమాలు..
- నగరం అంతటా సాంస్కృతిక సంబరాలు..

నగరానికి చెందిన కాకతీయ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బీనా మెహతాస్ గార్బా పార్టీ పేరుతో గత నెల 21న గండిపేట్‌లోని ఆదిత్యా క్లబ్ హౌజ్‌లో దాండియా వేడుకల్ని నిర్వహించారు. అదే విధంగా టామ్ జామ్, ఫంకార్ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో మాకో బ్రూ కేఫ్‌లో గత నెల 24నే దాండియా వేడుక ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నగరానికి చెందిన లేడీస్ క్లబ్స్ పోటాపోటీగా ఈ కలర్‌ఫుల్ ఈవెంట్స్‌ను నిర్వహిస్తూ సిటీలో దాండియా క్రేజ్‌ను మరింతగా పెంచేస్తున్నాయి.

కాదే వేదికా దాండియాకు అనర్హం..

నగరంలోని ఫంక్షన్ హాల్స్, క్లబ్ హౌజ్‌లు, ఓపెన్ గ్రౌండ్స్ సందడికి చిరునామాలా మారుతున్నాయి. అక్టోబరు నెల ప్రారంభం నుంచే దాండియా సౌండ్ దద్దరిల్లిపోతుంది. శంషాబాద్‌లో ఉన్న క్లాసిక్ కన్వెన్షన్ త్రీలో ఈ నెల 4 నుంచి ప్రతి రోజూ రాత్రి 7.30 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి వరకూ.. దాండియా హుషారెత్తిస్తోంది. ఈ నెల 12వ తేదీ వరకూ సాగుతున్న ఈ అదిపెద్ద దాండియా సంబరాలు.. రంగ్‌తాలి పేరుతో దుమ్మురేపుతున్నాయి. అలాగే సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో నవకార్ నవరాత్రి ఉత్సవ్.. అనేక మంది దాండియా ప్రియులకు ఏటేటా ఎదురు చూసే ఉత్సవంగా పేరొందింది. ఇక మల్లారెడ్డి గార్డెన్స్‌లో ఎస్కే నవ రాత్రి ఉత్సవ్, ఇంపీరియల్ గార్డెన్స్‌లో జరుగుతున్న ది పార్క్ హోటల్‌లో డిస్కో దాండియా నైట్స్, గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో నిర్వహించే వేడుకలూ.. వేటికవే స్పెషల్‌గా పేరొందాయి. ఇక శంషాబాద్‌లోని నామ్‌ధారి ఈవెంట్స్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవ్.. అనేక మంది సిటిజనులుకు మస్ట్ విజిట్ ఈవెంట్‌గా మారిందంటే అతిశయోక్తి కాదు.

విందు.. వినోదమే విశేషం..

దాండియా ఈవెంట్స్ రాను రాను విస్తరిస్తూ ఒక పూర్తి స్థాయి ఫన్ అండ్ క్రేజీ ఈవెంట్స్‌గా మారిపోయాయి. కేవలం కోలాటాల తరహా కోలాహలం మాత్రమే కాదు.. లైవ్ బ్యాండ్స్, డ్యాన్స్‌ఫ్లోర్స్, సంప్రదాయ గార్బా డ్యాన్స్, ఫుడ్ కోర్ట్స్.. వంటి విందు వినోదాలతో ఫుల్ క్రేజీగా సాగుతున్నాయి. లైవ్ ఆర్కెస్ట్రా, లక్కీ డ్రా, బాలీవుడ్, టాలీవుడ్ సెలబ్రిటీల హాజరు.. తదితర వీలున్నన్ని అదనపు ఆకర్షణలు జోరుస్తూ నిర్వాహకులు దాండియాకి వన్నెలద్దుతున్నారు.

ఆసక్తికరంగా.. రక్తికట్టిస్తున్నాం..



గత కొన్నేళ్లుగా క్రమం తప్పకుండా దాండియా ఈవెంట్స్ నిర్వహిస్తున్నాం. మా క్లబ్ నిర్వహించే ఈవెంట్‌కి సిటీలో మంచి క్రేజ్ ఉంది. విందు, వినోదాలతో పాటు మహిళలకు ఆసక్తికరమైన ఆటలు, పాటలు, క్విజ్‌లు.. వంటి ఆకర్షణలతో మా వేడుక అందర్నీ అలరిస్తోంది. - సుశీలా బొకాడియా, ఫంకార్ లేడీస్‌క్లబ్

ఏటా ఎదురు చూస్తాం..



ఏటా ఎప్పుడెప్పుడు దాండియా వస్తుందా అని ఎదురు చూస్తాం. ఆనందం, ఆహ్లాదం కలగలిపి అందించే వేడుక ఇది. గుజరాత్ నుంచి మనకి వచ్చినప్పటికీ కుల మతాలకు అతీతంగా అందర్నీ ఒక్కటి చేసే సందడి ఇది. - నేహాశర్మ, పేజ్ త్రీ సెలబ్రిటీ

ఎమోషన్.. ఎనర్జీ..



గత కొన్నేళ్లుగా చూస్తున్నా.. దాండియా క్రేజ్ అంతకంతకూ పెరుగుతోంది. యువత ఈ సారి మరింత సంప్రదాయబద్ధంగా తయారై ఈవెంట్స్‌కు హాజరవుతున్నారు. నేను 4 ఈవెంట్స్‌లో జడ్జ్‌గా అటెండ్ అయ్యాను. ప్రతి చోటా 300 మంది దాకా పోటీదారులు ఉంటున్నారు. నా వరకూ వస్తే.. దాండియా ఈవెంట్స్‌లో ఎప్పుడు పాల్గొన్నా కొత్త ఉత్సాహం కొత్త శక్తి వస్తాయి. అదొక ఆధ్యాత్మిక భావోద్వేగం అందించే వరంగా చెప్పొచ్చు. రెండు రోజుల క్రితం ఓ ఈవెంట్‌లో ఏకధాటిగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ ఆడినా అలసట రాలేదు. - సుధా జైన్, సోషలైట్



విదేశీ పూలతో బతుకమ్మ

కూకట్‌పల్లి: కాంక్రీట్ జంగిల్‌గా మారిన కూకట్‌పల్లిలో సిలికాన్ వ్యాలీ సిటీని తలపించే ఆకాశహార్మ్యల మధ్య అచ్చమైన పూలతో తెలంగాణ సాంప్రదాయం ఉట్టిపడేలా బతుకమ్మ వేడుకలు ఇక్కడ ఆనవాయితీ. హైదరాబాద్ నగరంలో పూలు లభించకపోవడంతో నగర శివారు ప్రాంతాలకు వెళ్లడమే. వేల రూపాయలు ఖర్చు చేసి పూలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. అలాంటిది ఇక్కడ 15 నుంచి 20 అడుగుల వరకూ పాతిక బతుకమ్మలను పేర్చి తెలంగాణలోని రికార్డు సాధించిన ఘనత కూకట్‌పల్లి ప్రాంతానికి దక్కింది. అంతేకాకుండా సముద్రాలను దాటి విదేశాల నుంచి కూడా వింతైన పూలతో బంగారు బతుకమ్మలను పేర్చటం ఇక్కడి మహిళలకు వెన్నతో పెట్టిన విద్య. కూకట్‌పల్లిలోని నాయినేని శ్రీ వైష్ణవి, అర్శనపల్లి శ్రేయ బంగారు బతుకమ్మలను తీర్చగా కూకట్‌పల్లిలోని మరో మహిళ గుండాల అర్చన నాగరాజు ఆధ్వర్యంలో ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా పూలను తెప్పించి దాదాపు వారం రోజుల పాటు బతుకమ్మను పేర్చటం జరిగింది. జమ్మూ, కాశ్మీర్ నుంచి ప్రత్యేకంగా పూలను తెప్పించడమే కాకుండా న్యూజిలాండ్, ఆర్మేనియా దేశాల నుంచి తమ బంధువుల ద్వారా పూలను తెప్పించి హంసలపై లోటస్ తామర పువ్వును ఏర్పాటు చేసిన విధంగా బతుకమ్మ మధ్య భాగంగా గౌరమ్మను అలంకరించి ప్రత్యేకంగా రూపొందించి సుమారు 18 అడుగుల వరకూ బతుకమ్మను పేర్చి అందరినీ ఆకట్టుకున్నాయి. అంతేకాకుండా అబ్బినేని అంజలి, అబ్బినేని శ్రీదేవితో పాటు వడ్డేపల్లి యామిని, కురమయ్య ధరణి, మాధవరం ఉమాదేవి, గుండాల మాధవి సుధాకర్ రావుతో పాటు అనేక మంది భారీ బతుకమ్మలను పేర్చారు.







నోవోటెల్‌లో బ్లూజోన్ డిన్నర్

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నోవోటెల్ హోటల్‌లో అక్టోబర్, నవంబర్ నెలల్లో ప్రతి శనివారం బ్లూజోన్ డిన్నర్ అందుబాటులో ఉంటుందని హోటల్ మేనేజర్ సుఖ్‌బీర్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో డైట్‌కు సంబంధించి మంచి పోషకాహారాలతో కూడిన వంటకాలు ఉంటాయన్నారు. ప్రధానంగా మొక్కల ఆధారిత ఆహారంతో పాటు వివిధ రకాలైన పండ్లతో కూడిన ప్రత్యేక ఆకర్షణీయమైన ఆహారాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

నగరంలో ఉషా ఉతుప్

లక్డీకాపూల్ : ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ ఉషా ఉతుప్ నగరంలో సంగీత ప్రియులను అలరించనున్నారు. దేవీ శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే సర్బోజనిన్ దుర్గోత్సవ్‌లో ఉతుప్ పాల్గొనున్నారు. న్యూ బోయినపల్లి ఓల్డ్ ఎయిర్ పోర్టు వెనుక ఉన్న తెలంగాణ గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి 7గంటలకు జరగనుంది. బంగియా శిక్ష నికేతన్ ఆధ్వర్యంలో ఉషా ఉతుప్ ప్రత్యేక ఈవెంట్ జరుగుతుంది.

షాపింగ్ హడావుడి..



మరోవైపు దసరా షాపింగ్‌తో పాటు పెళ్లిళ్ల కోసం బంగారు ఆభరణాలు, వస్త్రాలు, పెళ్లిసామాగ్రి కొనుగోళ్లతో మార్కెట్‌లు సందడిగా మారాయి. బ్యాండుమేళాలు, కేటరింగ్ నిర్వాహకులకు సైతం ఈ రెండు నెలల్లో గిరాకీ ఎక్కువగానే ఉంది. ఒక రోజే ఐదారు పెళ్లిళ్లు చేయాల్సి వస్తుందని, నవంబర్‌లో ఏ మాత్రం తీరిక లేకుండా ఉందని ఎస్ఆర్ నగర్‌కు చెందిన శ్రీనివాసాచారి అనే పురోహితుడు తెలిపారు. అన్నీ మంచి ముహూర్తాలే కావడంతో డిమాండ్ ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు.

నగరంలో పెళ్లి సందడి



నవంబర్, డిసెంబర్ నెలల్లో భారీగా పెళ్లిళ్లు.. శుభముహూర్తాలూ ఎక్కువే

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి పెళ్లి కళ వచ్చేసింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో పెద్ద ఎత్తున పెళ్లిళ్లు జరుగనున్నాయి. తిరిగి ఫిబ్రవరి వరకూ ఎలాంటి ముహూర్తాలు లేకపోవడంతో ఈ రెండు నెలల్లోనే వివాహాలు జరిపించేందుకు నగరవాసులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలకు డిమాండ్ ఏర్పడింది.

తేదీలు ఇలా..

నవంబర్ 12, 13, 17, 22, 23, 25, 26, 28 తేదీల్లో తిరిగి డిసెంబర్ నెలలో 3, 4, 5, 9, 10, 11, 14, 15 తేదీల్లో బలమైన ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు తెలిపారు. ప్రస్తుతం ఆశ్వయుజమాసంలో పెద్దగా ముహూర్తాలు లేవు. వచ్చే రెండు నెలలు అంటే కార్తీకం, మాఘమాసాల్లో ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. జనవరిలో మూఢాలు ఉంటాయి. దీంతో ఫిబ్రవరి వరకూ ఆగాల్సిందే. దీన్ని దృష్టిలో ఉంచుకొని వచ్చే రెండునెలల్లోనే ఎక్కువ పెళ్లిళ్లు జరుగుతున్నాయి.

ఫంక్షన్ హాళ్లు హౌస్‌ఫుల్..

ఇప్పటికే నవంబర్, డిసెంబర్ వరకూ బుక్ అయ్యినట్లు చంపాపేట్, మేడ్చల్, సికింద్రాబాద్, శంషాబాద్, తదితర ప్రాంతాల్లోని ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే హోటళ్లలో సైతం రిసెప్షన్ వేడుకల కోసం బుకింగ్‌లు పెరుగుతున్నాయి.





ఆకాశమే హద్దుగా..!

సికింద్రాబాద్ ఎన్‌సీసీ క్యాడెట్లు ఆకాశమే హద్దు అని నిరూపించారు. గురువారం సికింద్రాబాద్‌లో ఆర్మీకి చెందిన పారాసెయిలింగ్ విభాగం నిర్వహించిన పారాసెయిలింగ్ క్యాంపులో ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు క్యాడెట్లు చేసిన విన్యాసాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి.
- సాక్షి, సిటీబ్యూరో



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	144	81,611
నిఫ్టీ ▲	17	24,998

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	18,278	▼	14
డోజోన్స్	42,399	▼	113
ఎఫ్‌టీఎస్ఈ 100	8,238	▼	6
డాక్స్	19,211	▼	44
షాంఘై	3,302	▲	43
నికాయ్	39,381	▲	103

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	74,838 ▼	171
బంగారం (99.5 స్వచ్ఛత)	74,538 ▼	172
వెండి (కిలో)	88,353 ▼	308


ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.53	84.59
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	108.69	111.40
€	యూరో	ఎస్‌బీఐ	91.00	93.55
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.17	57.49
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.62	57.63
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.05	66.73
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.00	12.83

30 వేల కోట్ల నుంచి 30 లక్షల కోట్లకు!

ఉప్పు నుంచి ఉక్కు దాకా... సబ్బుల నుంచి సాఫ్ట్‌వేర్ అగ్రగామిగా... దేశ ప్రజల తలలో నాలుకగా మారిన టాటా గ్రూప్ ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోంది. నేడు రూ.30 లక్షల కోట్లకు పైగా మార్కెట్ విలువతో దేశ కార్పొరేట్ జగత్తులో అత్యంత విలువైన 'రతనం'లా వెలిగిపోతోంది. అలుపెరుగని ఈ పయనంలో టాటా బ్రాండ్‌కు ఖండాంతర ఖ్యాతిని తెచ్చిన ఘనత కార్పొరేట్ 'టైటాన్' రతన్ టాటా సొంతం! లాభార్జనే ధ్యేయంగా కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకూ తమ వ్యాపార ఫలాలను పంచిన వితరణశీలిగా కూడా చిరస్థాయిగా నిలిచిపోయారు.

టాటా మహా సామ్రాజ్య జైత్రయాత్ర ఇది...
- పరుగులు తీయించిన రతన్
- విదేశీ కంపెనీల కొనుగోళ్ల దన్ను
- రతన్ సాహసోపేత నిర్ణయాలతో ఆకాశమే హద్దుగా ఎదిగిన గ్రూప్



పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా తన హయాంలో టాటా గ్రూప్‌ను మహా సామ్రాజ్యంగా విస్తరించారు. ఇటు ప్రధానమైన వ్యాపార విభాగాలను పటిష్టం చేస్తూనే అటు పేరొందిన విదేశీ దిగ్గజ కంపెనీలను కూడా కొనేసి భారతీయ కార్పొరేట్ల సత్తాను ప్రపంచానికి చాటి చెప్పారు. మిగతా దేశీ కార్పొరేట్లకు స్ఫూర్తినిచ్చారు. విమర్శలు, హేళనలు ఎదురైనా వాటిన్నింటినీ అధిగమించి టాటా గ్రూప్‌ను అంతర్జాతీయ స్థాయిలో దిగ్గజంగా మల్చారు. రతన్ పగ్గాలు చేపట్టేనాటికి గ్రూప్ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.30 వేల కోట్లు మాత్రమే. ఇక ఆదాయం 6 బిలియన్ డాలర్ల (అప్పటి రూపాయి మారకం విలువ ప్రకారం రూ.18,000 కోట్లు) స్థాయిలో నిదానంగా పురోగమిస్తున్న టాటా గ్రూప్ ఆయన సాహసోపేత నిర్ణయాలు, దూకుడు దన్నుతో నేడు ఏకంగా 165 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.14 లక్షల కోట్లు) ఆదాయాల స్థాయికి విస్తరించింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టాటా స్టీల్, టాటా మోటార్స్ వంటి దిగ్గజాలు ఆయా రంగాల్లో అగ్రగాములుగా ఉన్నాయి. గ్రూప్ సంస్థల్లో ఏకంగా 10 లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. గ్రూప్‌లో పది విభాగాల్లో ప్రధానంగా 30 కంపెనీలు ఉండగా వీటిలో 26 లిస్టెడ్ కంపెనీలున్నాయి. వీటికి అనుబంధంగా పలు సంస్థలు కూడా ఉన్నాయి. 2024 మార్చి 31 నాటికి వాటి టాటా గ్రూప్ మార్కెట్ విలువ ఏకంగా 365 బిలియన్ డాలర్లను (దాదాపు రూ.30 లక్షల కోట్లు) అధిగమించడం విశేషం. టాటా సంస్థలు 6 ఖండాల్లో 100 పైగా దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. – సాక్షి, బిజినెస్ డెస్క్

6 బిలియన్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు..

రతన్ టాటా 1991 నుంచి 2012 వరకు టాటా సన్స్ చైర్మన్‌గా వ్యవహరించారు. వివిధ విభాగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న 95 కంపెనీలు గ్రూప్‌లో ఉండేవి. కెమికల్స్, హోటల్స్, ఉప్పు, ఉక్కు, సబ్బులు, వాచీలు మొదలైన విభాగాల్లో ఇవన్నీ స్వతంత్రంగా కార్యకలాపాలు సాగిస్తూ, ఒకదానితో మరొకదానికి పెద్దగా సంబంధం లేని విధంగా ఉండేవి. రతన్ టాటా వచ్చాక వాటన్నింటినీ పునర్వ్యవస్థీకరించడం, కార్యకలాపాలను క్రమబద్ధీకరించడాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. వివిధ అనుబంధ సంస్థలన్నింటికి కూడా ఒకే కార్పొరేట్ గుర్తింపు ఉండాలని నిర్దేశించారు. దేశీ మార్కెట్‌పైనే ప్రధానంగా దృష్టి పెట్టి, నిదానంగా నడుస్తున్న గ్రూప్‌ను అంతర్జాతీయ స్థాయి విస్తరించారు. ఐఐఎం బెంగళూరు పరిశోధన పత్రం ప్రకారం ఆయన హయాంలో గ్రూప్ ఆదాయాలు 6 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 18,000 కోట్ల నుంచి రూ. 5.5 లక్షల కోట్లకు) ఎగిశాయి. గ్రూప్ మార్కెట్ విలువ 9.5 బిలియన్ డాలర్ల నుంచి 91.2 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 30,000 కోట్ల నుంచి రూ. 5 లక్షల కోట్లకు) పెరిగింది.

టాటా వారసుడెవరు..

- రతన్ అస్తమయంతో సర్వత్రా ఆసక్తి
- నోయెల్ టాటాకు అవకాశం?
- రేసులో మెహ్లీ మిస్త్రీ పేరు కూడా

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా అస్తమించిన నేపథ్యంలో ఇక 365 బిలియన్ డాలర్ల టాటా మహాసామ్రాజ్యానికి వారసులెవరనే ప్రశ్న తెరపైకి వచ్చింది. ఈ సందర్భంగా పలు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీటిలో రతన్ టాటా సవతి సోదరుడు నోయెల్ టాటాతో పాటు ఆయనకు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన మెహ్లీ మిస్త్రీ పేర్లు కూడా ఉన్నాయి. వాస్తవానికి రతన్ టాటాకు తోడబుట్టిన సోదరుడైన జిమ్మీ టాటా పేరు కూడా పరిశీలించాల్సినప్పటికీ ఆయన వ్యాపార కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో, రతన్ టాటా తండ్రి నావల్ టాటా, మారుతల్లి సిమోన్ టాటా కుమారుడైన నోయెల్ పేరు ప్రముఖంగా తెరపైకి వచ్చింది. టాటా కుటుంబసభ్యుడు కావడంతో పాటు పలు గ్రూప్ కంపెనీలను నడిపించిన అనుభవం కూడా ఉండటమనేది నోయెల్‌కు కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. ఆయన ప్రస్తుతం ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్ సంస్థలకు చైర్మన్‌గా ఉన్నారు. అలాగే రతన్ టాటా ట్రస్టు బోర్డులో కూడా ఉన్నారు. టాటా సన్స్‌ను పర్యవేక్షించే టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా అయ్యేందుకు ఇది ఆయనకు కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. రతన్ టాటా వివాహం చేసుకోకపోవడం, ఆయనకు సంతానం లేకపోవడంతో నోయెల్ సంతానానికి భవిష్యత్తులో టాటా గ్రూప్‌లో మరింత ప్రాధాన్యం దక్కే అవకాశం ఉంది. నోయెల్‌కు మాయా, నెవిల్, లియా... ఈ ముగ్గురు సంతానం ఉన్నారు. టాటా మెడికల్ సెంటర్‌కి మాయా ట్రస్టీగా వ్యవహరిస్తుండగా, హైపర్‌మార్కెట్ స్టార్ బజార్‌కి నెవిల్ సారథ్య బాధ్యతలు వహిస్తున్నారు. జుడియో బ్రాండ్ విస్తరించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. టాటా గ్రూప్‌లో భాగమైన ఇండియన్ హోటల్ కంపెనీలో లియా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

సన్నిహితుడు మెహ్లీ..: మెహర్‌జీ పల్లోంజీ గ్రూప్ డైరెక్టర్ అయిన మెహ్లీ మిస్త్రీ, రతన్ టాటాకు అత్యంత సన్నిహితుడు. ఆయనకు టాటా గ్రూప్‌తో చాలాకాలంగా అనుబంధం ఉంది. 2022లో కారు ప్రమాదంలో మరణించిన టాటా సన్స్ మాజీ చైర్మన్ సైరస్ మిస్త్రీకి మెహ్లీ కజిన్ అవుతారు. వాస్తవానికి టాటా సన్స్‌లో పల్లోంజీ మిస్త్రీ గ్రూప్‌నకు 18.4 శాతం వాటా ఉన్నందున ఆ గ్రూప్ అధినేత షాపూర్ మిస్త్రీ పేరు కూడా పరిశీలనకు రావాలి. కానీ టాటాలతో మిస్త్రీలకు విభేదాలు నెలకొన్న నేపథ్యంలో ఆయనకు టాటా సామ్రాజ్యం బాధ్యతలు లభించకపోవచ్చనే అభిప్రాయం నెలకొంది. నోయెల్, మెహ్లీతో పాటు గ్రూప్‌లో ఉన్నవారే కాకుండా బైటి వ్యక్తుల పేర్లు కూడా అకస్మాత్తుగా తెరపైకి వచ్చే అవకాశాలున్నాయి.


మెహ్లీ మిస్త్రీ, మాయా, నెవిల్, నోయెల్, లియా

కీలక కొనుగోళ్లు..

కోరస్: ఆంగ్లో–డచ్ ఉక్కు దిగ్గజం కోరస్‌ను 2007లో టాటా స్టీల్ ఏకంగా 12 బిలియన్ డాలర్లు వెచ్చించింది. ఒక విదేశీ కంపెనీని ఇంత భారీ మొత్తం వెచ్చించి కొనుగోలు చేయడం అప్పటిదాకా కనీవినీ ఎరుగనిది. ఈ కొనుగోలుతో టాటా స్టీల్ ఒక్కసారిగా ప్రపంచంలోనే అతి పెద్ద ఉక్కు దిగ్గజాల జాబితాలోకి చేరిపోయింది. గ్రూప్ మార్కెట్ విలువను గణనీయంగా పెంచింది. అప్పటిదాకా ఎక్కువగా దేశీ మార్కెట్‌పైనే దృష్టి పెట్టిన టాటా స్టీల్, కోరస్ కొనుగోలుతో యూరప్ మార్కెట్లోకి కూడా అడుగుపెట్టింది.

జాగ్వార్ ల్యాండ్‌రోవర్: రతన్ టాటా 2008లో మరో సాహసోపేతమైన ముందడుగు వేశారు. ఈసారి దిగ్గజ బ్రిటీష్ కార్ల బ్రాండ్లు జాగ్వార్, ల్యాండ్‌రోవర్‌పై గురి పెట్టారు. 2.3 బిలియన్ డాలర్లు పెట్టి కొనేశారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తినప్పటికీ ఆ తర్వాత అదొక మాస్టర్‌స్ట్రోక్ అని రతన్ టాటా నిరూపించారు.

గ్లోబలైజేషన్ బాటలో గ్రూప్..


ప్రధానంగా భారత్‌పై దృష్టితో కార్యకలాపాలు సాగిస్తున్న గ్రూప్‌ను గ్లోబల్ ప్లేయర్‌గా రతన్ టాటా తీర్చిదిద్దారు. ఇందుకోసం దూకుడుగా విదేశీ కంపెనీలను కొన్నారు. 2008లో బ్రిటీష్ లగ్జరీ కార్ల బ్రాండ్లు జాగ్వార్ అండ్ ల్యాండ్ రోవర్‌ను కొనుగోలు చేయడం ద్వారా అంతర్జాతీయ ఆటోమోటివ్ మార్కెట్లో టాటా మోటార్స్‌ను ప్రముఖ సంస్థగా నిలిపారు. అంతకన్నా ముందుగా 2000లో టెట్లీని కొనుగోలు చేయడం ద్వారా గ్లోబల్ టీ మార్కెట్లో టాటా గ్రూప్ కూడా ప్రధాన ప్లేయర్‌గా ఎదిగింది.

టీసీఎస్.. ఐటీ కోహినూర్!

టాటా గ్రూప్ మార్కెట్ క్యాపిటలైజేషన్ వృద్ధిలో ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) పాత్ర చాలా కీలకం. 1968లోనే ఏర్పడినప్పటికీ రతన్ టాటా సారథ్యంలో టీసీఎస్‌కి రెక్కలొచ్చాయి. 2004లో టీసీఎస్ పబ్లిక్ ఇష్యూకి వచ్చింది. ఏకంగా రూ. 4,713 కోట్లు సమీకరించింది. అప్పటి నుండి అద్భుతమైన పనితీరుతో టీసీఎస్ దూసుకెళ్తోంది. టీసీఎస్‌తో పాటు టాటా మోటార్స్, టాటా స్టీల్, టాటా పవర్ దన్నుతో గ్రూప్ మార్కెట్ విలువ ఏకంగా రూ. 30 లక్షల కోట్లకు ఎగిసింది.

టాటా విజయ ప్రస్థానం ఇదీ..

- **30** గ్రూప్‌లో ప్రధాన కంపెనీలు
- **26** లిస్టెడ్ కంపెనీలు
- లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ **365** బి. డాలర్లు (రూ.30 లక్షల కోట్లు)
- 2023-24లో టాటా కంపెనీల ఆదాయం **165** బిలియన్ డాలర్లు (రూ.14 లక్షల కోట్లు)
- మొత్తం నికర లాభం దాదాపు **1** లక్ష కోట్లు
- గ్రూప్ కంపెనీల్లో మొత్తం ఉద్యోగులు **10** లక్షలకు పైగా
- **6** ఖండాలు
- **100** దేశాలు





భారత పురుషుల టీటీ జట్టుకు కాంస్యం

ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు వరుసగా మూడోసారి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. 2021, 2023 ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ భారత జట్టుకు కాంస్య పతకాలు లభించాయి. కజకిస్తాన్‌లో గురువారం జరిగిన సెమీఫైనల్లో భారత జట్టు 0–3తో చైనీస్ తైపీ జట్టు చేతిలో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో శరత్ కమల్ 7–11, 10–12, 9–11తో లిన్ యున్ జు చేతిలో... రెండో మ్యాచ్‌లో మానవ్ ఠక్కర్ 9–11, 11–8, 3–11, 11–13తో చెంగ్ జుయ్ చేతిలో... మూడో మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 6–11, 9–11, 7–11తో హువాంగ్ యాన్ చెంగ్ చేతిలో ఓటమి చవిచూశారు. నేటి నుంచి మొదలయ్యే వ్యక్తిగత విభాగంలో శరత్ కమల్, సత్యన్, హర్మీత్, మనుష్ షా, మానవ్ ఠక్కర్, ఆకుల శ్రీజ, మనిక బత్రా, ఐహిక ముఖర్జీ, సుతీర్థ ముఖర్జీ, దియా పరాగ్ పోటీపడతారు.

విండీస్ మహిళల ధనాధన్ విక్టరీ

- 104 పరుగుల లక్ష్యం 12.5 ఓవర్లలోనే ఉఫ్
- బంగ్లాదేశ్‌పై 8 వికెట్లతో జయభేరి

దుబాయ్: వెస్టిండీస్ మహిళల ఆల్‌రౌండ్ ప్రదర్శనకు బంగ్లాదేశ్ బెంబేలెత్తిపోయింది. దీంతో టి20 ప్రపంచకప్‌లో భాగంగా గురువారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో మాజీ చాంపియన్ వెస్టిండీస్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ నెగ్గిన కరీబియన్ జట్టు బౌలింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. కెప్టెన్ నిగర్ సుల్తానా (39; 4 ఫోర్లు) మాత్రమే రాణించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్పిన్నర్ కరిష్మా రమ్‌హరక్ (4–0–17–4) ఉచ్చులో బంగ్లా బ్యాటర్లంతా కుదేలయ్యారు. అఫీ ఫ్లెచర్ 2 వికెట్లు తీసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన వెస్టిండీస్ 12.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 104 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్, ఓపెనర్ హేలీ మాథ్యూస్ (22 బంతుల్లో 34; 6 ఫోర్లు), స్టెఫానీ టేలర్ (29 బంతుల్లో 27 రిటైర్డ్ హర్ట్; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 7.3 ఓవర్లలో 52 పరుగులు జోడించి శుభారంభమిచ్చారు. షెర్మయిన్ (16 బంతుల్లో 21; 2 ఫోర్లు), డియాండ్రా డాటిన్ (7 బంతుల్లో 19 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) మిగతా పనిని పూర్తి చేశారు. బంగ్లా బౌలర్లలో నహిదా అక్తర్, మారుఫా అక్తర్ చెరో వికెట్ తీశారు.


కరిష్మా రమ్‌హరక్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


బ్రూక్

ఇంగ్లండ్ 823

బ్రూక్ 317 రూట్ 262

- ముల్తాన్ టెస్టులో రికార్డుల దుమ్ము దులిపిన ఇంగ్లండ్
- తొలి ఇన్నింగ్స్‌లో 823/7 డిక్లేర్డ్
- బ్రూక్ ట్రిపుల్ సెంచరీ
- రూట్ డబుల్ సెంచరీ
- ఓటమి దిశగా పాకిస్తాన్

ముల్తాన్: టెస్టు ఫార్మాట్‌లో వన్డే తరహా ఆటతీరుతో విజృంభించిన ఇంగ్లండ్ జట్టు పలు రికార్డులను బద్దలు కొట్టింది. పాకిస్తాన్ బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ... హ్యారీ బ్రూక్ (322 బంతుల్లో 317; 29 ఫోర్లు, 3 సిక్సర్లు) ట్రిపుల్ సెంచరీ, జో రూట్ (375 బంతుల్లో 262; 17 ఫోర్లు) డబుల్ సెంచరీతో చెలరేగారు. ఫలితంగా ముల్తాన్ వేదికగా పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 823/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. టెస్టు క్రికెట్ చరిత్రలో నాలుగో అత్యధిక స్కోరును తమ పేరిట లిఖించుకున్న ఇంగ్లండ్ జట్టు... పలు రికార్డులు ఖాతాలో వేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 492/3తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ జట్టు... నాలుగో రోజు 49 ఓవర్లు మాత్రమే బ్యాటింగ్ చేసి 331 పరుగులు రాబట్టింది. ఈ క్రమంలో రూట్, బ్రూక్ నాలుగో వికెట్‌కు 454 పరుగులు జోడించి కొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. అంతేకాకుండా ఇంగ్లండ్ తరఫున ఏ వికెట్‌కైనా అత్యధిక భాగస్వామ్యం నమోదు చేశారు. మొదట రూట్ డబుల్ సెంచరీ పూర్తి చేసుకోగా... కాసేపటికే బ్రూక్ ద్విశతకం ఖాతాలో వేసుకున్నాడు. ఆ తర్వాత మరింత ధాటిగా ఆడిన బ్రూక్ వరుస బౌండరీలతో రెచ్చిపోయాడు. పాక్ బౌలర్లు ఎంత ప్రయత్నించినా ఈ జోడీని విడదీయలేకపోగా... బ్రూక్ 310 బంతుల్లో టెస్టు కెరీర్‌లో తొలి ట్రిపుల్ సెంచరీ అందుకున్నాడు. గ్రాహం గూచ్ తర్వాత (1990లో; భారత్‌పై) ట్రిపుల్ సెంచరీ బాదిన ఇంగ్లండ్ క్రికెటర్‌గా బ్రూక్ నిలిచాడు. ఓవరాల్‌గా టెస్టు క్రికెట్‌లో ఇది 20వ అత్యధిక వ్యక్తిగత స్కోరు. పాకిస్తాన్ బౌలర్లలో ఆరుగురు 100 కంటే ఎక్కువ పరుగులు సమర్పించుకోవడం గమనార్హం. నసీమ్ షా, ఆయూబ్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం 267 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ గురువారం ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసింది. సల్మాన్ (49 బంతుల్లో 41 బ్యాటింగ్; 5 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... షఫీక్ (0), షాన్ మసూద్ (11), బాబర్ ఆజమ్ (5), రిజ్వాన్ (10), ఆయూబ్ (25), షకీల్ (29) విఫలమయ్యారు. నేడు ఆటకు ఆఖరి రోజు. చేతిలో నాలుగు వికెట్లు ఉన్న పాకిస్తాన్... ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 115 పరుగులు వెనుకబడి ఉంది. సల్మాన్‌తో పాటు ఆమేర్ జమాల్ (27 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.


రూట్

ఇవీ రికార్డులు

4 టెస్టు క్రికెట్ చరిత్రలో ఇది (823/7 డిక్లేర్డ్) నాలుగో అత్యధిక టీమ్ స్కోరు. గతంలో శ్రీలంక (1997లో భారత్‌పై 952/6 డిక్లేర్డ్), ఇంగ్లండ్ (1938లో ఆస్ట్రేలియాపై 903/7 డిక్లేర్డ్; 1930లో వెస్టిండీస్‌పై 849) ఎనిమిది వందల పైచిలుకు పరుగులు చేశాయి.

1 పాకిస్తాన్‌పై ఒక జట్టు చేసిన అత్యధిక పరుగులు ఇవే (823/7 డిక్లేర్డ్). 1958లో వెస్టిండీస్ చేసిన 790/3 డిక్లేర్డ్ రెండో స్థానంలో ఉంది. పాకిస్తాన్ గడ్డపై నమోదైన అత్యధిక స్కోరు కూడా ఇదే.

454 టెస్టు క్రికెట్‌లో నాలుగో వికెట్‌కు నమోదైన అత్యధిక భాగస్వామ్యం. 449 పరుగులతో ఆడమ్ వోజెస్, షాన్ మార్ష్ (ఆస్ట్రేలియా; 2015లో వెస్టిండీస్‌పై) పేరిట ఉన్న రికార్డును రూట్, బ్రూక్ బద్దలు కొట్టారు.

2 టెస్టు క్రికెట్ చరిత్రలో బ్రూక్‌ది రెండో వేగవంతమైన ట్రిపుల్ సెంచరీ. 2008లో దక్షిణాఫ్రికాపై వీరేంద్ర సెహ్వాగ్ 278 బంతుల్లోనే ట్రిపుల్ సెంచరీ బాదగా... ఇప్పుడు బ్రూక్ 310 బంతుల్లో ట్రిపుల్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

రాఫెల్ నాదల్ వీడ్కోలు

వచ్చేనెలలో డేవిస్ కప్ టోర్నీ తర్వాత ఆటకు గుడ్‌బై

మాడ్రిడ్: టెన్నిస్ చరిత్రలో ఓ దిగ్గజ క్రీడాకారుడి శకం ముగియనుంది. స్పెయిన్ స్టార్ ప్లేయర్ రాఫెల్ నాదల్ వచ్చే నెలలో ఆటకు గుడ్‌బై చెప్పనున్నాడు. నవంబర్ 19 నుంచి 24వ తేదీ వరకు స్పెయిన్‌లో జరగనున్న డేవిస్‌కప్ టీమ్ టెన్నిస్ ఫైనల్స్ టోర్నమెంట్ తన కెరీర్‌లో చివరిది కానుందని నాదల్ గురువారం ప్రకటించాడు. ప్రపంచ మేటి ఆటగాళ్లతో సుదీర్ఘ కాలం పోటీ పడిన 38 ఏళ్ల నాదల్ కెరీర్‌లో 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించాడు. గత కొన్నాళ్లుగా గాయాలతో సహవాసం చేస్తున్న నాదల్... చివరిసారిగా పారిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో జొకోవిచ్ చేతిలో ఓడిన నాదల్... డబుల్స్‌లో అల్‌కరాజ్‌తో కలిసి క్వార్టర్ ఫైనల్ వరకు చేరాడు. గాయం కారణంగా గత నెల లో లేవర్ కప్ నుంచి తప్పుకున్న నాదల్... గురువారం రిటైర్మెంట్ ప్రకటన చేశాడు. 'కెరీర్‌లో సాధించిన దాంతో సంతృప్తిగా ఉన్నా. టెన్నిస్ ప్రాక్టీస్ ప్రారంభించిన తొలినాళ్లలో ఇంత దూరం ప్రయాణిస్తానని ఊహించలేదు. అన్నిటికీ కృతజ్ఞుడిని. బాగా ఆలోచించాకే ప్రొఫెషనల్ కెరీర్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నా. గత రెండేళ్లు చాలా కఠినంగా గడిచాయి. గాయాలతో బాగా ఇబ్బంది పడ్డా. ప్రతి దానికి ముగింపు ఉటుంది. ఎక్కడో ఒకచోట ఆగి పోవాల్సిందే. ఈ సందర్భంగా ఆటతో మమేకమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని నాదల్ పేర్కొన్నాడు. 'మట్టికోట మహరాజు'గా గుర్తింపు పొందిన నాదల్... ఫ్రెంచ్ ఓపెన్‌లో అత్యధికంగా 14సార్లు విజేతగా నిలిచి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. కెరీర్ చివరి మ్యాచ్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించనుండటం ఆనందంగా ఉందని తెలిపాడు. డేవిస్‌కప్ ఫైనల్స్ నాకౌట్ టోర్నీలో భాగంగా నవంబర్ 19న క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్ జట్టుతో స్పెయిన్ తలపడుతుంది.



12 ఈ ఏడాది నాదల్ మొత్తం 7 టోర్నీల్లో పోటీపడ్డాడు. 19 మ్యాచ్‌లు ఆడాడు. 12 మ్యాచ్‌ల్లో గెలిచి, 7 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు.

209 ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నాదల్ 209 వారాలు నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్నాడు.

1080 నాదల్ తన కెరీర్‌లో గెలిచిన మ్యాచ్‌లు

13,49,46,100 డాలర్లు (రూ. 1,133 కోట్లు) కెరీర్‌లో నాదల్ గెలిచిన ప్రైజ్‌మనీ

92 నాదల్ తన కెరీర్‌లో నెగ్గిన మొత్తం సింగిల్స్ టైటిల్స్

22 నాదల్ గెలిచిన గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్. (ఆస్ట్రేలియా ఓపెన్ 2 ; ఫ్రెంచ్ ఓపెన్ 14 ; వింబుల్డన్ 2 ; యూఎస్ ఓపెన్ 4).

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



'టాటా' చెప్పలేనంటూ..!

రతన్ టాటాకు నగరంతో విడదీయలేని అనుబంధం ఉంది. భాగ్యనగర అభివృద్ధిలో ఆయన తోడ్పాటు మరువలేనిది. ఎన్నోసార్లు నగరానికి వచ్చి ప్రత్యక్షంగా, పరోక్షంగా నగర అభివృద్ధికి దోహదపడ్డారు. -IIలో



దాండియా కీ రాత్..

నగరంలో దసరా సంబరాలకు ముందస్తుగా శ్రీకారం చుట్టేది దాండియా సందడే. సిటీలో ఉన్న లేడీస్ క్లబ్స్ మిగిలిన ఏ సందర్భాన్ని మిస్ అయినా, దాండియా వేడుకల్ని మాత్రం జోరుగా హుషారుగా నిర్వహిస్తాయి. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
30.0/23.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 30, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

సాకుతో చార్జీల షాక్

ఆర్టీసీ బస్సుల్లో 25 నుంచి 50 శాతం అదనం

- ప్రత్యేక రైళ్లలో 20 శాతం అదనపు బాదుడు
- ప్రైవేట్ బస్సుల్లో రెండింతల చార్జీలు
- సొంతూళ్లకు భారీగా తరలిన నగర వాసులు
- నాలుగు రోజుల్లో 25 లక్షల మంది పల్లెబాట



సాక్షి, సిటీబ్యూరో: పట్నం నుంచి పల్లెలకు దసరా రద్దీ పోటెత్తింది. నగరవాసులు పెద్ద ఎత్తున సొంత ఊళ్లకు తరలి వెళ్లారు. గత నాలుగు రోజులుగా వివిధ మార్గాల్లో లక్షలాది మంది పల్లెబాట పట్టారు. బస్సులు, రైళ్లు, ప్రైవేట్ వాహనాలు ప్రయాణికుల రద్దీతో కిక్కిరిశాయి. గురువారం సైతం రైళ్లు, బస్సుల్లో రద్దీ కనిపించింది. చాలామంది సొంత వాహనాల్లో బయలుదేరారు. గత నాలుగైదు రోజులుగా సుమారు 25 లక్షల మంది వరకు సొంత ఊళ్లకు వెళ్లినట్లు అంచనా.

- సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ప్రతి ఏటా ప్రకటించే ఆర్టీసీ ఈసారి దసరా ప్రత్యేక బస్సులపై మాత్రం గుట్టు చప్పుడు కాకుండా అదనపు బాదుడుకు పాల్పడింది. జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు ఖాళీ బస్సులను తరలించాల్సి వస్తుందనే సాకుతో ప్రత్యేక బస్సులపై 25 నుంచి 50 శాతం వరకు అదనపు చార్జీలు విధించింది. నిజామాబాద్, ఆదిలాబాద్, సత్తుపల్లి, విజయవాడ, విశాఖ, గుంటూరు తదితర ప్రాంతాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు వసూళ్లకు పాల్పడింది. తెలంగాణలోని మిగతా ప్రాంతాలకు నడిపిన ప్రత్యేక బస్సుల్లో 25 శాతం చొప్పున అదనంగా విధించారు.
- మరోవైపు మహిళా ప్రయాణికుల డిమాండ్ మేరకు ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో లేకపోవడంతో వారు సైతం చార్జీలు చెల్లించి ప్రయాణం చేయాల్సివచ్చింది. ఈ ఏడాది దసరా సందర్భంగా 6,304 ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందించింది. డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని వంటి బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్‌లను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. సిటీలో తిరిగే ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను 'ప్రత్యేకం' పేరిట జిల్లాలకు నడిపింది. దీంతో ప్రయాణికులు అన్ని ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు చెల్లించాల్సి వచ్చింది.

రైళ్లలోనూ అ'ధన'మే..

దసరా, దీపావళి రద్దీని దృష్టిలో ఉంచుకొని అక్టోబర్, నవంబర్ నెలల్లో రెగ్యులర్ రైళ్లతో పాటు ప్రత్యేక సర్వీసులను నడిపేందుకు దక్షిణమధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. కానీ.. ఈ ప్రత్యేక రైళ్లన్నింటిలో సాధారణ చార్జీలపై 20 శాతం అదనంగా విధించారు. వచ్చే జనవరి నెలాఖరు వరకు రెగ్యులర్ రైళ్లు అందుబాటులో లేవు. అన్నింటిలో వెయిటింగ్ లిస్ట్ వందల్లో ఉంది. కొన్ని రైళ్లలో బుకింగ్ సదుపాయం కూడా నిలిచిపోయింది. దీంతో ప్రత్యేక రైళ్లు అనివార్యంగా మారాయి. తెలంగాణలో అతి పెద్ద పండుగ అయిన దసరా సందర్భంగా వచ్చిన వరుస సెలవులను దృష్టిలో ఉంచుకొని ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వాళ్లు పెద్ద ఎత్తున సొంత ఊళ్లకు తరలివెళ్లారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రయాణికుల రద్దీ భారీగా ఉంది. రిజర్వేషన్‌లు లభించని వాళ్లు జనరల్ బోగీల్లో బయలుదేరారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్‌ల నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరిన అన్ని రైళ్లలో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు.

ప్రైవేట్ దోపిడీ రెండింతలు..

మరోవైపు హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు నడిచే ప్రైవేట్ బస్సులు దారి దోపిడీకి పాల్పడ్డాయి. సాధారణ రోజుల్లో విధించే చార్జీలను రెండింతలు చేశాయి. హైదరాబాద్ నుంచి విశాఖకు సాధారణం ఏసీ స్లీపర్ చార్జీ రూ.900. కొన్ని బస్సుల్లో రూ.1000 వసూలు చేస్తారు. కానీ పండగ రద్దీ దృష్ట్యా ఏకంగా రూ.2,500 వరకు పెంచినట్లు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడకు రూ.350 నుంచి రూ.600 వరకు పెంచారు. గుంటూరు, ఏలూరు, తిరుపతి, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లోనూ అడ్డగోలు చార్జీలు వసూలు చేశారు. బస్సులు, రైళ్లే కాకుండా ట్యాక్సీలు, కార్లు, టాటాఏస్‌లు వంటి ప్రైవేట్ వాహనాల్లో సైతం ఇష్టారాజ్యంగా చార్జీల వసూళ్లకు పాల్పడ్డారు. పండగ సందర్భంగా సొంత ఊరుకు వెళ్లాలని భావించే నగరవాసుల సెంటిమెంట్‌ను సొమ్ము చేసుకున్నారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల కిటకిట





ఉప్పల్ రింగ్‌రోడ్ వద్ద..

అయినసూ పోయి రావలే..!

సద్దుల బతుకమ్మ, దసర ఉత్సవాల నేపథ్యంలో నగర వాసులు గురువారం భారీ సంఖ్యలో సొంతూళ్లకు వెళ్లారు. బస్సులు, రైళ్లు, సొంత వాహనాల్లో స్వగ్రామాల బాటపట్టారు. ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్, ఎల్బీ నగర్ తదితర బస్టాప్‌లు, సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అదనపు బస్సులను ఏర్పాటు చేసింది. ఎలాగైనా ఊరికి వెళ్లాల్సిందేననే ఉత్సాహంతో భారీ సంఖ్యలో జనాలు పయనం కావడంతో రైళ్లు, బస్సులు కిటకిటలాడుతూ కనిపించాయి.

అత్యధిక కెమెరాలు అలంకారప్రాయమే

- విస్తృత సమీక్షలో గుర్తించిన కొత్వాల్ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: 'గ్రేటర్' పరిధిలోని మూడు కమిషనరేట్లలో ఉన్న సీసీ కెమెరాల పరిస్థితి పేరు గొప్ప, తీరు దిబ్బ అన్నట్లు తయారైంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో కలిపి ఆరు లక్షలకు పైగా సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ.. వీటిలో అత్యధికం పని చేయట్లేదు. మూడు కమిషనరేట్లకు చెందిన అధికారులతో సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్ గురువారం నిర్వహించిన సమీక్షలో ఈ విషయం గుర్తించారు. బంజారాహిల్స్‌లోని టీజీసీసీసీలోని హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. పోలీసు విభాగం 2014–15 నుంచి రాజధానిలో సీసీ కెమెరాల ఏర్పాటునకు ప్రాధాన్యం ఇస్తోంది. సేఫ్ సిటీ ప్రాజెక్ట్, కమ్యూనిటీ, సిటీ వైడ్ సర్వైలెన్స్, నేను సైతం ప్రాజెక్టుల కింద పోలీసు విభాగం ఈ కెమెరాలను ఏర్పాటు చేసింది. అనేక నేరాల నియంత్రణ, కేసుల్ని కొలిక్కి తీసుకురావడంతో పాటు సున్నిత, సమస్యాత్మక సమయాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ఈ కెమెరాలు, వాటిలో రికార్డు అయిన ఫీడ్ ఉపకరించింది. ఓ దశలో నగరంలో నమోదైన కేసుల్లో దాదాపు 90 శాతం ఈ కెమెరాల వల్లే కొలిక్కి వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. అయితే కనీసం వీటి నిర్వహణ బాధ్యతలనూ ప్రభుత్వం చేపట్టకపోవడంతో ప్రస్తుతం అనేకం పని చేయట్లేదు. పోలీసు అధికారులతో పాటు వాటిని సరఫరా చేసిన వారితోనే ఆనంద్ భేటీ అయ్యారు. ఆయా కెమెరాల మరమ్మతులకు భారీ మొత్తం అవసరం అవుతుందని గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నామని ఆనంద్ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు.



కూకట్‌పల్లిలో బతుకమ్మతో యువతి



కూకట్‌పల్లి విలేజీలో..



మన్సూరాబాద్ చెరువు సమీపంలో..







సనత్‌నగర్ జెక్ కాలనీలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



బీఆర్ఎస్ నేత గొట్టిముక్కల వెంగళరావు నివాసం వద్ద..

పుడమిపై పూలపుంత

సంబురంగా సద్దుల బతుకమ్మ

నగరం పుష్ప వర్ణమై శోభిల్లింది. సప్తరాగ రంజితమై భాసిల్లింది. సద్దుల బతుకమ్మకు పురవీధులు పూల సుగంధాలు అద్దాయి. బతుకమ్మలను సంబురంగా సాగనంపేందుకు వేలాది మంది మహిళలు తరలి వచ్చారు. 'పోయిరా గౌరమ్మ.. పోయిరావమ్మ.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడారు. ఇంటిల్లిపాది ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని గౌరమ్మను కొలిచారు. కాగా.. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు మంత్రులు, మహిళలు, అధికారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అమరులవీరుల స్తూపం వద్ద బతుకమ్మలతో మంత్రి సీతక్క, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ తొలి పూజ నిర్వహించారు. ఆ తర్వాత ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక వరకు ర్యాలీగా తరలివెళ్లారు.

– సాక్షి, సిటీబ్యూరో/కవాడిగూడ







కూకట్‌పల్లి ఐడీపీఎల్ చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ట్యాంక్‌బండ్ వద్ద బతుకమ్మలతో మంత్రి సీతక్క తదితరులు

ఏపీ కేడర్‌కు బల్దియా బాసులు



ఆమ్రపాలి



రోనాల్డ్ రాస్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ కేడర్ కోసం ఆమె చేసిన అభ్యర్థనను డీఓపీటీ తిరస్కరించిన నేపథ్యంలో 2010 బ్యాచ్ ఏపీ కేడర్‌కు చెందిన ఆమె ఏపీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ నివాసంగా పరిగణించాలని కోరినప్పటికీ ఖండేకర్ కమిటీ సిఫార్సుల మేరకు ఆమె వినతిని కేంద్రం తిరస్కరించింది. దీంతో ఆమె ఏపీకి వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. తెలంగాణలో పని చేస్తున్న ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారులు వెంటనే స్వరాష్ట్రం ఏపీలో రిపోర్ట్ చేయాలని కేంద్రం ఆదేశించిన నేపథ్యంలో ఆ కేటగిరీకి చెందిన మిగతా వారితో పాటు ఆమ్రపాలి కూడా ఏపీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బల్దియా బాసులుగా..

ఆమ్రపాలి ప్రస్తుతం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా కొనసాగుతుండగా.. గతంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పనిచేసిన రోనాల్డ్‌రాస్ సైతం ఏపీకి వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. వీరిద్దరి కంటే ముందు.. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా, స్పెషలాఫీసర్‌గా పని చేసిన సోమేశ్ కుమార్ సైతం దీర్ఘకాలం ఇక్కడే కొనసాగినప్పటికీ కడకు ఏపీకి వెళ్లక తప్పలేదు. ఆయన పదేళ్లకుపైగా తెలంగాణలో కొనసాగారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. తెలంగాణ ఏర్పాటు తర్వాత సైతం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా వ్యవహరించారు. జీహెచ్ఎంసీలో పని చేయడంతో లభించిన గుర్తింపుతోనే ఏకంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్ర సీఎస్‌గానూ నియమితులు కావడమే కాక, సుదీర్ఘకాలం ఆ పదవిలో కొనసాగారు. ఇలా బల్దియా బాసులుగా పని చేసిన ముగ్గురు అధికారులు తమ సొంత కేడర్ అయిన ఏపీకి వెళ్లక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి.

కేంద్రం నిర్ణయంతో సొంత కేడర్‌కు..

- గతంలో సోమేశ్‌కుమార్..
- తాజాగా రోనాల్డ్ రాస్, ఆమ్రపాలి
- ఎక్కువ కాలం కొనసాగిన సోమేశ్.. సీఎస్ కూడా అయిన వైనం

బల్దియాలోనూ ఎక్కువ కాలం..

ఏపీ కేడర్‌కు కేటాయించినప్పటికీ.. రాష్ట్రంలో ఎక్కువ కాలం పనిచేసిన సోమేశ్‌కుమార్.. ఆ కోవలో బల్దియా బాసులుగా పని చేసిన ముగ్గురిలోనూ ఎక్కువకాలం బల్దియా బాసుగానూ కొనసాగారు. ఆయన 2013 అక్టోబర్ నుంచి 2015 అక్టోబర్ 31 వరకు రెండేళ్లు పని చేశారు. రోనాల్డ్ రాస్ సంవత్సరం కంటే తక్కువే పనిచేశారు. 2023 జూలై 5 నుంచి 2024 జూన్26 వరకు ఆయన బల్దియా బాస్‌గా కొనసాగారు. ఇక ఆమ్రపాలి బల్దియా బాస్‌గా బాధ్యతలు స్వీకరించి రెండు నెలలు కూడా పూర్తికాలేదు. గత ఆగస్ట్ 21వ తేదీన ఆమె కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.



అవినీతి 'జల'గలు

నల్లా కనెక్షన్ల మంజూరులో చేతివాటం

- కొత్త వాటికి పాత రసీదులు జారీ
- వాణిజ్య కనెక్షన్లు సైతం డొమెస్టిక్‌గా మార్పు
- ఓఆర్ఆర్ యూఎల్‌జీ పరిధిలో నయా దందా
- గిమ్మిక్కులన్నీ అధికారుల కనుసన్నల్లోనే
- జలమండలి ఆదాయానికి గండి

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఖజానాకు గండి కొడుతున్నారు. ఓఆర్ఆర్ యూఎల్‌బీ పరిధిలో కంచే చేను మేస్తోంది. అక్రమార్కులకు క్షేత్రస్థాయి అధికారులు చేయూతనిస్తుండటంతో ఈ తతంగమంతా యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రభుత్వ ఉత్తర్వులను ఆసరాగా చేసుకొని తిమ్మిని బమ్మి చేస్తూ అవినీతికి తెరలేపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త భవన సముదాయాలకు నల్లా కనెక్షన్ల మంజూరులో సైతం 'క్రమబద్ధీకరణ' వర్తింపజేయడం విస్మయానికి గురిచేస్తోంది. చేతులు తడిపితే వాణిజ్యపరమైన నల్లా కనెక్షన్లను సైతం డొమెస్టిక్‌గా మారుస్తుండటం షరామామూలుగా మారింది. కొత్త కనెక్షన్ల మంజూరులో హెచ్ఎస్‌సీ జీఓ వర్తింపు సైతం అవినీతిమయంగా తయారైంది. ఓఆర్ఆర్ యూఎల్‌బీలో సరికొత్త దందా సాగుతున్నా.. ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరి విస్మయానికి గురి చేస్తోంది.

అంతా క్రమబద్ధీకరణే..

జలమండలి పరిధిలోకి ఓఆర్ఆర్ లోపలి మున్సిపాలిటీలు వచ్చిన తర్వాత పాత కనెక్షన్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కలిస్తూ ఉత్తర్వు జారీ చేసింది. జలమండలి ఓఆర్ఆర్ యూఎల్‌బీ పరిధిలోని అధికారులకు ఇది వరంగా మారి కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం 2021లోపు కనెక్షన్లకు మాత్రమే క్రమబద్ధీకరణ వర్తింపజేయాలి. క్షేత్రస్థాయి అధికారులు మాత్రం చట్టం లొసుగులను ఆసరాగా చేసుకొని అక్రమాలకు తెరలేపారు. పాత కనెక్షన్లతో పాటు కొత్తవాటికి సైతం క్రమబద్ధీకరణ వర్తింపజేయడం విస్మయానికి గురి చేస్తోంది. కొత్తగా నిర్మించిన భవన సముదాయాలకు లేని పాత కనెక్షన్లకు క్రమబద్ధీకరణ పేరుతో కొత్తవి మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏకంగా పాత మున్సిపాలిటీ, పంచాయితీల రసీదు బిల్లుల ఆధారంగా అక్రమ దందా కొనసాగిస్తున్నారు. సంబంధిత అధికారులే దరఖాస్తుదారులకు అన్ని విధాలా సహకరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఓఆర్ఆర్ యూఎల్‌బీ పరిధిలో విస్తుపోయే ఉదంతాలు అనేకం చోటుచేసుకున్నాయి.

ఒక్క బోడుప్పల్ పరిధిలోనే..

- నగర శివారులోని బోడుప్పల్ లక్ష్మీనగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ కొనసాగుతున్న భవన సముదాయానికి (ప్లాట్ నంబర్ 113) 2021 ఏప్రిల్ ఒకటి నల్లా కనెక్షన్ (క్యాన్ నంబర్ 623481317) మంజూరైనట్లు జలమండలి అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సదరు వినియోగదారు పేరిట 2014 డిసెంబర్‌లోనే నీటి కనెక్షన్ ఉన్నట్లు పాత స్థానిక సంస్థల రసీదు ఆధారంగా ఎలాంటి కొత్త కనెక్షన్ చార్జీలు లేకుండా నల్లా కనెక్షన్‌ను క్రమబద్ధీకరించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. వాస్తవానికి బోడుప్పల్ లక్ష్మీనగర్‌లోని ప్లాట్ నంబర్ 113లోని ఖాళీ స్థలాలన్నీ 2021 నవంబర్ 18న తల్లి తన కొడుకు పేరిట గిఫ్ట్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసింది.
- దస్తావేజులో సైతం ఖాళీ స్థలంగా చూపిస్తూ ఫొటో కూడా జత చేయడంతో పాటు కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయితీలో ఎలాంటి ఆస్తిపన్ను, ఇతరత్రా లేవని డిక్లరేషన్ సైతం ఇచ్చారు. సదరు కుమారుడి పేరిట స్థిరాస్తి మారి ఒడి జరిగిన తర్వాత అదే ఏడాది ఫిబ్రవరిలో కరెంట్ కనెక్షన్ మంజూరైంది. ఆ తర్వాత ప్రాపర్టీ ట్యాక్స్ విధించినట్లు అధికారిక రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ తతంగానికంటే ముందే నల్లా కనెక్షన్ మంజూరు కావడం అనుమానాలకు తావిస్తోంది. ఈ ఏడాది జూన్‌లో నల్లా కనెక్షన్ మంజూరులో చేతివాటంపై ఆరోపణలు రావడంతో విచారణ జరిపి ఉన్నతాధికారులు కనెక్షన్‌ను తొలగించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు మళ్లీ చేతివాటం ప్రదర్శించి ఈ ఏడాది జూలై 16న డిస్ కనెక్షన్ చేసినట్లు రికార్డులో నమోదు చేశారే తప్ప వాస్తవానికి అలా చేయలేదు. ప్రస్తుతం నల్లా కనెక్షన్‌కు నీటి సరఫరా కొనసాగడం విస్మయానికి గురి చేస్తోంది.

- బోడుప్పల్‌లోని గ్రీన్ సిటీ కాలనీకి చెందిన ఓ గృహ యజమాని డొమెస్టిక్ (హెచ్ఎస్‌సీ) కేటగిరీ వాటర్ అండ్ సీవరేజీ కనెక్షన్ కోసం 2023 డిసెంబర్ 26న దరఖాస్తు (ఫైల్ నంబర్ 2023-12- 3058) చేసుకున్నారు. స్థానిక అధికారులు 2024 మార్చి 13న ఫిజిబిలిటీ పరిశీలించి అదేరోజు జనరల్ కేటగిరీ కింద కనెక్షన్ మంజూరు చేస్తూ రూ.7,288 రుసుంను 2024 మార్చి 31 లోగా చెల్లించాలని గడువు విధిస్తూ పేమెంట్ సమాచారం నోటీసులు పంపించారు. సదరు వినియోగదారు అధికారులను వచ్చి కలవడంతో తిరిగి మరో దరఖాస్తు చేయించి ఫైల్ నెంబర్ 2024-3-3356 ద్వారా హెచ్ఎస్‌సీ కింద కొత్త కనెక్షన్ మంజూరు చేశారు.
- బోడుప్పల్ వెస్ట్ బాలాజీ హిల్స్‌లో ఒక వినియోగదారు డొమెస్టిక్ (హెచ్‌సీఆర్) కేటగిరీ వాటర్, సీవరేజీ కనెక్షన్ కోసం 2023 ఫిబ్రవరి 14 దరఖాస్తు చేసుకున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి అదే నెల 28 ఫిజిబిలిటీ పరిశీలించి నల్లా కనెక్షన్‌ను ఇస్తూ ఫైల్ నంబర్ 2023-2-2626 ద్వారా రూ.11,217 చెల్లించాలని పేమెంట్ నోటీసు పంపించారు. సంబంధిత వినియోగదారు సైతం అధికారులను వచ్చి కలవడంతో మరోసారి 2023 మార్చి 6న దరఖాస్తు చేయించి ఫైల్ నంబర్ 2023-1137 ద్వారా మార్చి 21న ఫిజిబిలిటీ పరిశీలించి అదే నెల 25న ఎలాంటి చార్జీలు లేకుండా కనెక్షన్ మంజూరు చేశారు.
- ఇదే ప్రాంతంలోని క్రాంతినగర్ కాలనీలో ఓ గృహ సముదాయం యజమానురాలు 2022 సెప్టెంబర్‌లో వాటర్, సీవరేజీ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంది. సాక్షాత్తూ సెక్షన్ మేనేజర్ అక్టోబర్ 12న, అక్టోబర్ 31న డీజీఎంలు ఫిజిబిలిటీ పరిశీలించి ఫైల్ నంబర్ 2022-9-823 ద్వారా కనెక్షన్ మంజూరు చేశారు. మొదటి 15 రోజుల బిల్లు కమర్షియల్ కేటగిరీ కింద జారీ అయినా ఆ తర్వాత డొమెస్టిక్ కింద మారిపోయింది.

టి-20 క్రికెట్ మ్యాచ్ సందర్భంగా
ఉప్పల్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

ఉప్పల్: ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 12న భారత్-బంగ్లాదేశ్‌ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగనున్న నేపథ్యంలో ఉప్పల్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

- మ్యాచ్ జరిగే సమయాల్లో ఉప్పల్ స్టేడియంవైపు భారీ వాహనాలను అనుమతించరు.
- వరంగల్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలు చెంగిచర్ల ఎక్స్‌రోడ్డు, చర్లపల్లి ఐఓసీ కేంద్రం, ఎన్ఎఫ్‌సీ మీదుగా తమ గమ్యాలను చేరుకోవాలి.
- వరంగల్ వైపు నుంచి ఎల్‌బీనగర్ వెళ్లాల్సిన వారు ఉప్పల్ ఏషియన్ థియేటర్ ఎదురుగా భగాయత్ రోడ్డు నుంచి నాగోల్ బ్రిడ్జి మీదుగా వెళ్లాలి.
- ఎల్‌బీనగర్ నుంచి ఉప్పల్ వచ్చే వాహనాలు నాగోల్ మెట్రోస్టేషన్, ఉప్పల్ భగాయత్ నుంచి ఏషియన్ థియేటర్ మీదుగా బోడుప్పల్ చేరుకోవాలి.
- సికింద్రాబాద్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలు హబ్సిగూడ చౌరస్తా నుంచి నాచారం పారిశ్రామిక వాడ ద్వార చెంగిచర్ల మీదుగా వరంగల్ వైపు వెళ్లాల్సి ఉంటుంది.
- రామంపూర్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలు హబ్సిగూడ వీధి నంబర్-8 మీదుగా హబ్సిగూడ మెట్రో పిల్లర్ 972 వద్ద యూ టర్న్ తీసుకుని ఉప్పల్ ఎక్స్ రోడ్డుకు చేరుకోవాలి.

అనుమానాస్పదస్థితిలో
అసోసియేట్ డైరెక్టర్ అదృశ్యం

ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ స్నేహితుడికి ఈ-మెయిల్..


వైకే చరణ్..

బంజారాహిల్స్: ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో అనుమానాస్పదస్థితిలో ఓ అసోసియేట్ డైరెక్టర్ అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..చెన్నైకి చెందిన వైకే చరణ్ (29) కొంతకాలంగా సినిమాల్లో అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-13లోని శ్రీసాయి మాన్షన్ అపార్ట్‌మెంట్‌లో సినిమాల్లోనే పనిచేస్తున్న తన స్నేహితుడు గొట్టిపాటి అశ్విన్‌తో కలిసి ఉంటున్నాడు. గత నెల 30న తన తల్లి చెన్నై నుంచి హైదరాబాద్ వస్తోందని, ఆమెను మెహిదీపట్నంలో ఉంటున్న తన బంధువుల ఇంట్లో దించి వస్తానని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నట్లుగా చెప్పి వెళ్లిపోయాడు. ఆ తర్వాత గదికి తిరిగి రాకపోగా ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. ఈ నెల 4న అశ్విన్‌కు మెయిల్ చేసి తాను కుటుంబ సమస్యలతో పాటు ఆర్థిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, ఆత్మహత్య చేసుకుంటున్నాననంటూ మెసేజ్ పెట్టాడు. దీంతో ఆందోళన చెందిన అశ్విన్ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్ పోలీసులు మిస్సింగ్‌కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చరణ్ కోసం గాలింపు చేపట్టారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

తామరపూలు కోసేందుకు వెళ్లి..

నీట మునిగి వ్యక్తి మృతి


సోమయ్య మృతదేహం

శామీర్‌పేట్: తామరపూలు కోసేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... శామీర్‌పేటకు చెందిన రంగు సోమయ్య (65), గురువారం సాయంత్రం తామరపూలు కోసేందుకు శామీర్‌పేట పెద్దచెరువు సాగు కాలువలోకి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. దీనిని గుర్తించిన స్థానికులు శామీర్‌పేట పోలీసులకు సమాచారం అందించడంతో గాలింపు చేపట్టిన పోలీసులు సోమయ్య మృతదేహాన్ని బయటికి తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

‘టాటా’ చెప్పలేనంటూ..!

నగరంతో రతన్‌టాటాకు విడదీయలేని బంధం

- నగరం రూపురేఖలు మార్చిన టాటా ఆలోచనలు
- రూ. వేల కోట్లతో అంతర్జాతీయ స్థాయి సంస్థల స్థాపన
- టీహబ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు
- యువతకు అద్భుతమైన సందేశం ఇచ్చిన రతన్‌టాటా


టీహబ్ ప్రారంభోత్సవంలో అప్పటి ఐటీ శాఖమంత్రి కేటీఆర్ తదితరులతో రతన్‌టాటా (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో/ఇబ్రహీంపట్నం రూరల్/రాయదుర్గం: 2008లో హైదరాబాద్‌కు రావాల్సిన టాటా నానో కార్ల తయారీ సంస్థ గుజరాత్‌కు తరలిపోవడంతో.. దీనిపై అప్పటి సీఎం దివంగత రాజశేఖర్‌రెడ్డి రతన్‌టాటాకు రాసిన లేఖలో తన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే హైదరాబాద్ విషయంలో తన వద్ద చాలా పెద్ద ఆలోచనే ఉందని రతన్ టాటా ప్రత్యుత్తరంలో సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత ఆదిబట్లలో పురుడుపోసుకున్నదే సికోర్‌స్కై హెలికాప్టర్ ప్రాజెక్టు.

రూపురేఖలు మార్చిన టాటా..

రతన్ టాటాకు నగరంతో విడదీయలేని అనుబంధం ఉంది. భాగ్యనగర అభివృద్ధిలో రతన్ టాటా తోడ్పాటు మరువలేనిది. ఎన్నోసార్లు నగరానికి వచ్చి ప్రత్యక్షంగా, పరోక్షంగా నగర అభివృద్ధికి దోహదపడ్డారు. హైదరాబాద్‌లో వినూత్న ఆవిష్కరణలకు ఊతమిచ్చేవారు. రూ.వేల కోట్ల పెట్టుబడులు, అంతర్జాతీయ స్థాయి కంపెనీలు నెలకొల్పి నగరంపై చెరగని ముద్రవేశారు. ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్లలో ఆసియా ఖండంలోనే అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ టీసీఎస్.. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ‘కోహ్లి సెంటర్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ (కెసీఐఎస్)’ను ఏర్పాటు చేశారు. సాఫ్ట్‌వేర్ రంగంలోనే కాదు ఏరోస్పేస్ రంగంలోనూ హైదరాబాద్ నగరం తలెత్తుకుని సగర్వంగా నిలబడేలా చేయడంతో పాటు వేలాది మందికి ఉపాధి కల్పించారు. టాటా పెట్టుబడులతో ఆయా ప్రాంతాల్లో రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. భూముల ధరలు ఆకాశాన్నంటాయి.

భారత్‌కు కొత్త ముఖం..

‘టీహబ్ అనేది భారత్‌కు ఒకకొత్త ముఖం లాంటిది. ఒకప్పుడు కొంత ఎక్స్‌పీరియెన్స్ ఉంటేనే మాట్లాడాలనే వారు. ఇప్పటి యువతలో అద్భుతమైన ప్రతిభ ఉంది. యువత మంచి ఐడియా ఉండి.. వ్యాపారం చేయాలనుకుంటే ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించుకోవాలి. టీహబ్ లాంటి వ్యవస్థలు అలాంటి వారి కోసం ఎంతో దోహదపడుతున్నాయి. మనమంతా కలిసి కొత్త భారత్‌ను నిర్మిద్దాం’ ఇవీ దిగ్గజ వ్యాపారవేత్త, గొప్ప మానవతావాది రతన్ నావల్ టాటా హైదరాబాద్‌లో మాట్లాడిన చివరి మాటలు. టీ-హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాటలు ఎల్లప్పుడూ యువతలో స్ఫూర్తి నింపుతూనే ఉంటాయి.. ఈ మాటలను ఎప్పటికీ భాగ్య నగరం గుర్తుంచుకుంటుంది.

టీహబ్‌తో అనుబంధం


టీ హబ్ సమావేశ మందిరంలోని తన ఫొటోపై సంతకం చేస్తున్న రతన్‌టాటా (ఫైల్)

గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో 2015లో టీహబ్ ఫేజ్-1 ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పుడే ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద ఇంక్యుబేషన్ సెంటర్‌గా అభివర్ణించారు. భారత్ అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిందని, అయితే ఎంట్రప్రెన్యూర్‌షిప్ పరంగా భారత్‌ను ప్రపంచం గుర్తించలేదన్నారు. అందరమూ కలిసి నయా భారత్‌ను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టీ-హబ్ సమావేశ మందిరంలో ఆయన చిత్రంతో ఏర్పాటు చేసిన ఫలకంపై స్వయంగా సంతకం చేసి మురిసిపోయారు.

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ సందర్శన..


రతన్‌టాటాకు స్వాగతం పలుకుతున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజేనారాయణన్(ఫైల్)

టీహబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అదే సమయంలో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజేనారాయణన్‌తో మాట్లాడారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. టాటా చొరవతోనే ట్రిపుల్‌ఐటీ ప్రాంగణంలో కోహ్లి సెంటర్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ రూపంలో ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 2015లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) సీఎస్ఆర్ ఫండింగ్‌తో కోహ్లి సెంటర్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ (కెసీఐఎస్)ను గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి గాయాలు


ధనుంజయ్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: వేగంగా వచ్చి డీసీఎం ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లికి చెందిన మీసాల ధనుంజయ్ (19) వృత్తిరీత్యా డ్రైవర్. కాగా ఈనెల 9న రాత్రి 10.30 గంటల సమయంలో తాను పనిచేస్తున్న రిలయన్స్ గోదాంకు ధనుంజయ్ (ఏపీ09 ఏడబ్ల్యూ0877) బైక్‌పై తోటి డ్రైవర్ శ్రీరాములును కూర్చోబెట్టుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుండ్లపోచంపల్లి శ్మశానవాటిక సమీపానికి రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం (ఏపీ28టీఏ 8389) బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ధనుంజయ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న శ్రీరాములు కూడి చేయి విరగడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు కాగా డీసీఎం డ్రైవర్ పరారయ్యాడు. మృతుడి తల్లి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల ఆరోగ్యానికి భరోసా డోజీ శ్రవణ్

సాక్షి, సిటీబ్యూరో: ఆరోగ్య రంగంలో అత్యాధునిక ఏఐ ఆధారిత ఉత్పత్తులకు పేరొందిన డోజీ.. తాజాగా ఏఐ ఆధారిత పేరెంట్ మానిటరింగ్ సర్వీస్(ఆర్‌పీఎమ్)ను అందుబాటులోకి తెచ్చింది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు డోజీ శ్రవణ్ పేరుతో అందిస్తున్న ఈ రిమోట్ మానిటరింగ్ టెక్నాలజీ ఉపయోగించడం ద్వారా తమ తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు వీలు కలుగుతుందని, సమయానికి వారి ఆరోగ్య సమస్యల్ని గుర్తించేందుకు తగిన వైద్యసేవలను అందించవచ్చని వివరించారు.

ఢిల్లీ విమానంలో సాంకేతిక లోపం..

శంషాబాద్: హైదరాబాద్ నుంచి ఢిల్లీ బయలుదేరిన విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో తిరిగి శంషాబాద్‌కు చేరుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం రాత్రి బయలుదేరిన ఓ ఎయిర్‌లైన్స్ విమానం టేకాఫ్ తీసుకున్న 20 నిమిషాలకు సాంకేతిక సమస్య తలెత్తడంతో పైలెట్ ఏటీసీని సంప్రదించాడు. ఏటీసీ అధికారుల సూచన మేరకు తిరిగి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండైంది. విమానంలో సుమారు 180 మంది ప్రయాణికులున్నారు. వీరిని ప్రత్యామ్నాయ విమానాల్లో సర్దుబాటు చేసి పంపినట్లు సమాచారం. ఎయిర్‌పోర్టు వర్గాలు అధికారికంగా వివరాలు వెల్లడించలేదు.

వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకే..

యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ


సాజిద్(ఫైల్)

చాంద్రాయణగుట్ట: వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకే యువకుడి హత్యకు కారణంగా పోలీసులు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫలక్‌నుమా ఫాతిమానగర్‌కు చెందిన సాజిద్(37) స్క్రాప్ వ్యాపారం చేసే వారు. గత కొంత కాలంగా సాజిద్ భార్యతో అదే ప్రాంతానికి చెందిన సిద్ధిఖ్ అనే యువకుడు ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఈ విష యమై ఇద్దరి మధ్య గొడవలు జరగడంతో పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లారు. అయినా సిద్దిక్ తన వైఖరి మార్చుకోకుండా సదరు మహిళతో సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మాట్లాడుదాం రమ్మని సాజిద్ పిలవడంతో అక్కడికి సిద్దిఖ్ వచ్చాడు. ఈ సందర్భంగా మాట మాట పెరగడంతో ఆగ్రహానికి లోనైన సిద్దిఖ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో సాజిద్‌పై దాడి చేసి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన సాజిద్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫలక్‌నుమా ఏసీపీ రాజు, ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బల్దియా పనితీరు భేష్

ఏపీ మున్సిపల్ అధికారుల కితాబు



లక్డీకాపూల్: జీహెచ్‌ఎంసీలో అమలవుతున్న పథకాలపై ఏపీ మున్సిపల్ అధికారులు అధ్యయనం చేశారు. గురువారం జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి వచ్చిన ఏపీ అధికారుల బృందం బల్దియా విధానాలు, అభివృద్ధి పథకాలను సమీక్షించారు. ముఖ్యంగా ట్యాక్స్, ఫైనాన్స్, సీఆర్ఎంపీ (కస్టమర్ రిలేషన్ మేనేజ్‌మెంట్ పోర్టల్), సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి కీలక విభాగాల్లో జీహెచ్‌ఎంసీ తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్ (ట్యాక్స్), గీత రాధిక (ఫైనాన్స్), సీఆర్ఎంపీ విభాగంలో సీఈ భాస్కర్ రెడ్డి, ఫైనాన్స్ అడ్వయిజర్ శరత్ చంద్ర, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఎస్ఈ కోటేశ్వర రావు, చీఫ్ వాల్యుయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణి తదితరులు ప్రజల సమస్యలను పరిష్కరించే విధానాలను ఏపీ మున్సిపల్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆ అధికారులు జీహెచ్‌ఎంసీ అమలు చేస్తున్న పథకాలను ప్రశంసించారు.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య


అరూప్ రాజ్(ఫైల్)

ఉప్పల్: ఓ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ విజయపురి కాలనికి చెందిన పిల్లి దేవరాజ్ చిన్న కుమారుడు అరూప్ రాజ్(18) ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్నాడు. బుధవారం కోచింగ్‌కు వెళ్లి వచ్చిన అతను సాయంత్రం స్నేహితులతో కలిసి ఫుట్‌బాల్ ఆడేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి గదిలోకి వెళ్లాడు. గురువారం ఉదయం తల్లి నయోమి అతడిని నిద్రలేపేందుకు గదిలోకి వెళ్లగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. కుటుంబసభ్యులు అతడిని కిందకు దింపి ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గత కొంతకాలంగా చదువు విషయంలో ఆందోళన చెందుతున్నాడని ఈ నేపథ్యంలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని మృతుడి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



సీపీ ఆయుధ పూజ

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం పాతబస్తీ, పేట్లబుర్జులోని సీఏఆర్ హెడ్-క్వార్టర్స్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సబ్సిడీ క్యాంటీన్ మన బజార్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీపీలు రక్షిత మూర్తి, స్నేహ మెహ్రా, అదనపు డీసీపీలు మద్దిపాటి శ్రీనివాసరావు, గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలతో ప్రజల్లో ఐక్యతాభావం

బంజారాహిల్స్: బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ బంజారా ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్న దుర్గా పూజా వేడుకల్లో గురువారం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి హారతి ఇచ్చారు. పువ్వుతో ప్రత్యేక పూజ చేసి భోగ్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుర్గా పూజ ప్రజలలో ఐక్యతా భావాన్ని పెంపొందిస్తుందన్నారు.


దుర్గా మాతకు హారతి ఇస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

పండుగ పూట వంట గ్యాస్ కటకట

- డెలివరీ మెసేజ్ వచ్చినా... సరఫరా కాని సిలిండర్
- గ్యాస్ బాయ్స్ చేతి వాటం
- పట్టించుకోని గ్యాస్ ఏజెన్సీలు

నగరంలోని సరూర్ నగర్‌కు చెందిన ఒక వినియోగదారుడు ఈ నెల 1న గ్యాస్ బుక్ చేశారు. నాలుగు రోజుల తర్వాత డెలివరీ సమాచారం అందింది. కానీ సిలిండర్ మాత్రం డోర్ డెలివరీ జరగలేదు. ఏజెన్సీ సిబ్బందికి ఫోన్ చేసినా స్పష్టత కరువైంది. పండుగ పూట గ్యాస్ కటకట వంటింట్లో దుమారం రేపుతోంది.



సాక్షి,సిటీబ్యూరో: దసరా పండుగ పూట వంట గ్యాస్ కటకట ఏర్పడింది. సాధారణంగా ఎలాంటి గ్యాస్ కొరత లేనప్పటికీ గ్యాస్ డెలివరీ బాయ్స్ చేతివాటం ప్రదర్శిస్తున్నారు.. ఫలితంగా గ్యాస్ బుక్ చేసిన వినియోగదారుల ఫోన్లకు మెసేజ్ వస్తున్నా, సిలిండర్ మాత్రం అందడం లేదు. గృహ వినియోగ సిలిండర్లు బాహాటంగా వాణిజ్య అవసరాలను తీర్చుతున్నాయి. వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీలపై తీవ్ర ఒత్తిడి తెస్తేకాని సకాలంలో సిలిండర్లు డోర్ డెలివరీ చేయని పరిస్థితి నెలకొంది.

జోరుగా అక్రమ దందా..

నగరంలో గృహోపయోగ వంట గ్యాస్ అక్రమ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. డీలర్ల అండదండలతో గృహపయోగ వంట గ్యాస్ వాణిజ్య అవసరాలకు మళ్లుతోంది. నగరంలో పెద్ద హోటల్స్ ఐదువేలకు పైగా ఉండగా, చిన్న హోటల్స్, టీ, టిఫిన్, గరం మర్చి సెంటర్లు, బండీలు సుమారు లక్షల వరకు ఉండవచ్చునని అంచనా. పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లలో వాణిజ్య పరమైన సిలిండర్లు వినియోగిస్తుండగా, మిగిలిన చిన్న హోటల్స్, బండ్లలో డొమెస్టిక్ సిలిండర్లు దర్శనమిస్తున్నాయి. మరోవైపు నగరంలోని సుమారు ఐదువందల వరకు గల ప్రైవేటు హాస్టళ్లు సైతం వంటవార్పు కోసం డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్నాయి. మొత్తం మీద ప్రతిరోజు లక్షకు పైగా డొమెస్టిక్ వంట గ్యాస్ సిలిండర్లు దారి మళ్లుతున్నట్లు తెలుస్తోంది.

వాణిజ్య కనెక్షన్లు అంతంతే..

మహా నగరంలోని హైదరాబాద్ -రంగారెడ్డి-మేడ్చల్ జిల్లాలో కలిపి మూడు చమురు సంస్థలకు చెందిన వాణిజ్య కనెక్షన్లు 70 వేలకు మించి లేనట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. డొమెస్టిక్ కనెక్షన్లు మాత్రం సుమారు 30 లక్షలపైనే ఉన్నాయి. నగరంలో మొత్తం 135 ఎల్పీజీ ఏజెన్సీలుండగా ప్రతిరోజు 1.20 లక్షవరకు డొమెస్టిక్ సిలిండర్ల డిమాండ్ ఉంటోంది. ప్రస్తుతం 60 వేల వరకు డోర్ డెలివరీ అవుతున్నాయి.


కొండల్‌రావు, తిలోత్తమ, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ధరణి, ఆశ్రిత్‌రావు, అక్షిత్‌రావు


బతుకమ్మతో నాయినేని శ్రీవృందా


అతి పెద్ద బతుకమ్మతో మాధవరం ఉమాదేవి కుటుంబ సభ్యులు


కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు


బతుకమ్మతో చిన్నారి

సద్దుల బతుకమ్మ సంబురం


హెచ్‌ఏఎల్‌లో ఆకర్షణీయంగా పేర్చిన బతుకమ్మ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద బతుకమ్మలను తీర్చడంలో కూకట్‌పల్లికి ఓ ప్రత్యేకత ఉంది. ఈసారి కూడా కూకట్‌పల్లిలో దాదాపు 25 బతుకమ్మలు 15 అడుగుల పైగా తీర్చడం విశేషం. సాయంత్రం హనుమాన్ జంక్షన్‌లో మహిళలు భారీ ఎత్తున చేరి గౌరమ్మకు పూజలు చేశారు. బతుకమ్మలను ఒక చోట పేర్చి ఆటా పాటలతో హోరెత్తించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు ఆభరణాలతో కూకట్‌పల్లి చౌరస్తా కలకలలాడింది. పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. కూకట్‌పల్లి రంగధాముని చెరువుపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలు జరిగాయి. వేడుకల్లో గ్రామపెద్దలు కుర్మయ్యగారి కొండల్‌రావు, అర్శనపల్లి దామోదర్‌రావు, మాధవరం యాదగిరిరావు, వడ్డేపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, రాగిడి లక్ష్మారెడ్డి, వడ్డేపల్లి రాజేశ్వరరావు, బతుకమ్మ ఉత్సవ కమిటి సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


కూకట్‌పల్లి వెంకట్రావ్‌నగర్‌లో


అతి పెద్ద బతుకమ్మ వద్ద ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు


ఎమ్మెల్యే నివాసం వద్ద కుటుంబ సభ్యులు, మహిళలు


ఇందూ ఫార్చ్యూన్ అపార్టుమెంట్ విల్లాలో..


హెచ్‌ఏఎల్‌లో బతుకమ్మ వేడుకల్లో ఉద్యోగులు


శిల్పా బృందావనంలో..


ఎమ్మెల్సీ నవీన్‌రావు నివాసం వద్ద ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు


ఐడీఎల్ చెరువు వద్ద బతుకమ్మ వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శన


ఆల్విన్‌కాలనీ డివిజన్ అంబీర్ చెరువు కట్టపై బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే గాంధీ


బతుకమ్మతో వడ్డేపల్లి రాజేశ్వరరావు కుటుంబ సభ్యులు


బతుకమ్మతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుటుంబ సభ్యులు


బతుకమ్మతో వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి


బతుకమ్మ వేడుకలో నీలిమ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

అమ్మవారికి వెండి తొడుగులు విరాళం



ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లోని మానస సరోవర్ హైట్స్ దగ్గర ఉన్న నల్లపోచమ్మ ఆలయంలో మధసూదన్ గౌడ్ కుటుంబ సభ్యులు అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి చేయించిన వెండి చేతులను అమ్మవారికి అలంకరింపజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్, పట్నం వెంకటేశ్‌గౌడ్, పట్నం వినయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీడం పార్కు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఫ్రీడం ఆయిల్ సంస్థ డైరెక్టర్ చంద్ర శేఖర్‌రెడ్డి

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని న్యూ బాలాజీ నగర్‌లో ఫ్రీడం ఆయిల్ సంస్థ వారిచే అభివృద్ధి చేయబడిన ఫ్రీడం పార్కు పనులను గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఫ్రీడం ఆయిల్ సంస్థ డైరెక్టర్ చంద్ర శేఖర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు డీఈ శ్రీదేవి, ఏఈ శ్రీనివాస్, ఎస్ఎస్ కార్తిక్, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ బాబూరావు, డా. వెంకట్‌రావు, అంజిరెడ్డి, బండి ప్రభు, సుభాష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, ఆరోగ్య రెడ్డి, రమణ, తిమ్మారెడ్డి, బొట్టు విష్ణు, ఉదయ్ పాల్గొన్నారు.

రతన్ టాటాకు ఘన నివాళి


చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అంజిరెడ్డి

మోతీనగర్: ప్రముఖ వ్యాపారవేత్త, దివంగత రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అని ఎంసీహెచ్ఎస్ మాజీ అధ్యక్షుడు నల్లమాల్పు అంజిరెడ్డి అన్నారు. గురువారం మోతీనగర్ కమిటీ హాల్‌లో రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారంలో సంపాదించిన దానిలో 50 శాతం ప్రజా సేవకే ఖర్చు చేశారని గుర్తు చేశారు. పేదవారు నాలుగు చక్రాల కారులో తిరగాలని నానో కారును లక్ష రూపాయలకే అందించిన ఘనత రతన్ టాటాకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో భుజముల నాగేశ్వరరావు, శేషగిరిరావు, వెంకట్‌స్వామి, వెంకట్ నారాయణ, హేమంత్‌రామ్ పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి


రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న సీఐ నరసింహారాజు

బాలానగర్: వివాదాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని సీఐ నరసింహారావు అన్నారు. బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు తన కార్యాలయంలో గురువారం అవగాహన కల్పించారు. నేర ప్రవృత్తి జీవితానికి దూరంగా జీవించాలని అన్నారు. గొడవలకు, అల్లర్లకు పాల్పడ్డా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామ్‌నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

భాగ్యనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, నాయకులు అరుణ్‌కుమార్, రవికుమార్ యాదవ్, కొరదాల నరేష్, సుభి రవీందర్, రాఘవేందర్, మణిభూషణ్, రామరాజు, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుకోవడానికి వెళ్లి.. బాలుడి అదృశ్యం


నూతన్(ఫైల్)

బాలానగర్: ఆడుకోవటానికి బయటకు వెళ్లిన ఓ బాలుడు తిరిగి ఇంటికి రాలేదు. ఈ ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. సీఐ నరసింహారాజు వివరాల ప్రకారం.. జడల శ్రీలక్ష్మి తన కుమారుడు నూతన్ (10)తో కలిసి గిరినగర్‌లో నివాసం ఉంటున్నది. గురువారం ఉదయం 9 గంటల సమయంలో సమీపంలోని దుర్గామాత గుడి దగ్గర ఆడుకోవడానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతడి మానసిక స్థితి బాగలేదు. తెలుగు, హిందీ మాట్లాడతాడని ఆమె తెలిపింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో జీరో వేస్ట్ బతుకమ్మ వేడుకలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రంగధాముని చెరువు వద్ద గురువారం బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. అదేవిధంగా జీహెచ్ఎంసీ జీరో వేస్ట్ బతుకమ్మ వేడుకలను నిర్వహించింది. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు స్వచ్ఛ భారత్ మిషన్ చొరవతో జీరో వేస్ట్ పద్ధతులను అవలింబించేలా చర్యలు తీసుకున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, సంచులు, ప్లాస్టిక్ బాటిల్స్ వాడకుండా అవగాహన కల్పించారు.


సెవెన్‌హిల్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు


కేపీహెచ్‌బీకాలనీ ఆలయంలో దుర్గాదేవి పూజలో ఆలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మహిళా భక్తులు


రిటైల్ మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు


వల్లబ్‌నగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవరం కార్పొరేటర్ నర్సింహాయాదవ్

శరన్నవరాత్రోత్సవం.. భక్తుల పరవశం


మూసాపేట చిత్తారమ్మ తల్లి ఆలయ ఆవరణలో 1.41 లక్షల నోట్లతో అమ్మవారి అలంకరణ

నియోజకవర్గ జంట సర్కిళ్ల పరిధిలో దసరా నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం పలు దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి.

– కూకట్‌పల్లి జోన్ బృందం


అంజయ్యనగర్ కట్ట మైసమ్మ ఆలయంలో దుర్గాదేవిగా అమ్మవారు


మూసాపేట హెచ్‌పీ రోడ్డులో .. ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్ గౌడ్


సేవాలాల్ నగర్‌లో మహిళా భక్తులు


వివేకానందనగర్ చిత్తారమ్మ ఆలయంలో దుర్గమ్మగా దర్శనమిచ్చిన అమ్మవారు


పర్వతవర్ధిని శివాలయంలో సరస్వతీ దేవి అలంకరణలో..


విజయదుర్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారి పూజలో బండి రమేష్ తదితరులు


ఆల్విన్‌కాలనీ లాస్ట్ బస్టాప్‌లో అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

మెట్రో భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



సాక్షి, సిటీబ్యూరో: బేగంపేట్‌లోని హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ కార్యాలయం మెట్రోభవన్‌లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. రంగు రంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతికి నివాళులర్పించి మహిళలను గౌరవించే పండుగ బతుకమ్మ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రానికి ఈ పండుగ గర్వకారణమన్నారు. ఈ సంప్రదాయ వేడుక అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిందన్నారు.

వినూత్న మార్పులకు శ్రీకారం

టీ కన్సల్ట్ – రాయల్ అలయన్స్ ఒప్పందం



ఒప్పందంలో ఫిలిప్పిన్స్ రాణి మారియ లియోనారా టోరెస్, టీకన్సల్ట్ చైర్మన్ సందీప్‌మక్తాల

రాయదుర్గం: గ్లోబల్ ఇన్నోవేషన్, ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాల కోసం టీ కన్సల్ట్ ద్వారా రాయల్ అలయన్స్ సమష్టి కృషి చేయాలని నిర్ణయించారు. టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్‌కుమార్‌మక్తాల, ఫిలిప్పిన్స్ రాణి మారియ లియోనారా టోరెస్ ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో కుదిరిన చారిత్రక ఒప్పందంతో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టినట్లు గురువారం ప్రకటించారు. అనంతరం టీకన్సల్ట్ చైర్మన్ సందీప్‌కుమార్‌మక్తాల, ఫిలిప్పిన్స్ రాణి మారియ లియోనారా టోరెస్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఔత్సాహికులకు మేలు చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న రాచరిక కుటుంబాలచే సుస్థిర అభివృద్ధి కోసం ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు వినూత్న అవకాశాలను ఆవిష్కరించడం ఈ రాయల్ అలయన్స్ ప్రధాన ఉద్దేశ్యంగా వివరించారు. ఈ ఒప్పందం ద్వారా పెద్ద ఎత్తున అవకాశం ఉన్న పెట్టుబడులను సమీకరించి సృజనాత్మకత ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రకటించారు.

కళాకారులను ప్రోత్సహించాలి

టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



పురస్కారాలను ప్రదానం చేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, వేణుగోపాలచారి తదితరులు

చిక్కడపల్లి: కళాకారులను ప్రోత్సహించాలని టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శిఖరం ఆర్ట్ థియేటర్స్, ఉప్పల ఫౌండేషన్ల సంయుక్తాధ్వర్యంలో నమోస్తుతే దుర్గే విజయ నంది పురస్కారాల ప్రదానోత్సవం త్యాగరాయ గానసభలో గురువారం జరిగింది. ఎంపిక చేసిన కళాకారులకు కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారితో కలిసి ఓయూ సివిల్ సర్వీసెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, పండితులు ధృవ రామారావు, సామాజికవేత్త బొల్లి ఐలయ్య, గాయకులు సేలం తేజ గనిశెట్టి, కృష్ణ ఆయన పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. ఓయూ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ విద్యాపరమైన, సామాజిక విషయాల్లో కృషి చేశారని, ఆయనకు ఈ అవార్డు ఇవ్వడం సంతోషకరం అన్నారు. కళాకారులకు పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖులు, నాట్యగురువు కె.రమాదేవి, లంకా లక్ష్మీనారాయణ, భానుప్రకాష్, రఘు ఆరికపూడి, డాక్టర్ వీరభోగవసంతరాయలు, భానుప్రకాష్, మాగంటి ప్రసాద్‌బాబు, వెంకటనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడతాం

బీజేపీ కార్పొరేటర్ల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, అంతకంటే ముందస్తుగా చేపట్టాల్సిన ఎస్టీపీలు, సీవరేజి మళ్లింపు, రిటైనింగ్ వాల్స్ తదితర పనులు పూర్తి చేయకుండా పేదలపై ప్రతాపం చూపడం తగదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అలా చేయడం వల్ల రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసినా ప్రయోజనం ఉండదని అభిప్రాయపడ్డారు. మూసీ సుందరీకరణకు వ్యతిరేకం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలను మాత్రమే తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ తగిన విధాన నిర్ణయాలు తీసుకోలేకపోతోందని ఆరోపించారు. హైడ్రా సైతం పెద్దలను వదిలేసి పేదలపై ప్రతాపం చూపితే ఊరుకోబోమని స్పష్టం చేశారు. బీజేపీ పేదల పక్షాన పోరాడుతుందని అన్నారు. బీజేపీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, పార్టీ బలోపేతం, ఆర్ఆర్ఆర్ రింగ్‌రోడ్, ఎంఎంటీఎస్‌లకు కేంద్రం నిధులు తదితర అంశాలపై గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ కార్పొరేటర్లు, నగరంలోని జిల్లాల అధ్యక్షులు తదితర నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై మాట్లాడారు. జీహెచ్ఎంసీలోని పరిస్థితులు, సమస్యలపై కార్పొరేటర్లను అడిగి తెలుసుకున్నారు. మెట్రో మొదటి దశ పనులు పూర్తి చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం రెండో దశకు నిధులు అడగడం సమంజసం కాదన్నారు. దేశంలోని ఇతర నగరాల మాదిరిగానే హైదరాబాద్‌కూ మెట్రో రైలుకు నిధులు కేటాయించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ, ఫలక్‌నుమా వరకు మొదటిదశనే పూర్తి చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ఎంఎంటీఎస్ తదుపరి ప్రతిపాదనల్లో ఆదాయం వచ్చే ప్రాంతాలు లేకపోవడాన్ని ప్రస్తావించారు. మూసీ నిర్వాసితులకు డబుల్ ఇళ్ల పేరిట ఒక వర్గానికి చెందిన వారిని నగరంలోని వివిధ నియోజకవర్గాలకు తరలిస్తున్నారని కొందరు కార్పొరేటర్లు మంత్రి దృష్టికి తెచ్చారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించిన వారికి ఇప్పటికీ తాళాలివ్వనప్పటికీ, మూసీ పరిసరాల్లోని వారిని వారికి దూరంగా ఉన్న నియోజకవర్గాల్లోని ఇళ్లలోకి తరలిస్తుండటాన్ని తప్పుబట్టారు.

పా'పాల పొడి'!

- కర్ణాటకలో గడువు మీరితే నగరానికి రవాణా
- చిన్న హోటళ్లతో పాటు శివారు జిల్లాలకు సరఫరా
- టీ, కాఫీలు, పన్నీర్ తయారు చేసి విక్రయం
- ఇటీవల కేసు దర్యాప్తులో గుర్తించిన టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఆహార కల్తీ ఊహకు అందని స్థాయిలో, తీరులో జరుగుతోంది. తమ లాభాల కోసం ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్న వ్యాపారులు కాలం చెల్లిన వస్తువుల్ని యథేచ్ఛగా అమ్మేయడం, వినియోగించడం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రం నుంచి కొన్ని కాలం చెల్లిన ఉత్పత్తులు నగరానికి అక్రమ రవాణా అవుతున్నాయి. సౌత్–ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇటీవల గుట్టురట్టు చేసిన పాలపొడి విక్రయం గ్యాంగ్ ఈ విషయాన్ని స్పష్టం చేసింది.

అక్కడ కాలం చెల్లితే ఇక్కడకు సప్లై..

కర్ణాటక ప్రభుత్వం అక్కడి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాహారం ఇవ్వడానికి కొన్ని పథకాలు చేపట్టింది. వీటిలో భాగంగా పాలు అందిచడం కోసం 'క్షీర భాగ్య స్కీమ్ ఆఫ్ కర్ణాటక గవర్నమెంట్' అనే పథకాన్ని కొనసాగిస్తోంది. సాధారణంగా ఇలాంటి పథకాల అమలు కోసం స్థానికంగా పాలు సేకరించే ఏర్పాట్లు చేస్తుంటారు. అయితే కర్ణాటక ప్రభుత్వం మాత్రం నందిని బ్రాండ్‌కు చెందిన పాల పొడిని అన్ని పాఠశాలలకు సరఫరా



చేస్తోంది. ఈ ప్యాకెట్లపై 'నాట్ ఫర్ సేల్' అనే ముద్ర కూడా ఉంటోంది. ఈ ప్యాకెట్ల సరఫరా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టర్ల వద్ద కొన్ని ఉండిపోయి ఎక్స్‌పైర్ అవుతున్నాయి. ఇలా కాలం చెల్లిన వాటిని సేకరించి, వివిధ ప్రాంతాలకు సరఫరా చేయడానికి కొన్ని గ్యాంగులు సైతం పుట్టుకువచ్చాయి.

తార్నాక నుంచి వివిధ ప్రాంతాలకు..

ఇలా సప్లై చేసే వారిలో అక్కడి సోలాపూర్‌కు చెందిన రవి కిరణ్ ఒకడు. ఇతగాడితో సంబంధాలు ఏర్పాటు చేసుకున్న భోలక్‌పూర్‌వాసి సీహెచ్ దామోదర్ కాలం చెల్లిన పాలపొడిని సిటీకి తెప్పించుకుంటున్నాడు. రవి నుంచి ఒక్కో ప్యాకెట్ రూ.180కి ఖరీదు చేస్తున్న దామోదర్.. ఇక్కడ రూ.210 నుంచి రూ.250



వరకు విక్రయిస్తున్నాడు. తార్నాకలోని విజయపురికాలనీలో ఉన్న తన దుకాణం కేంద్రంగా ఈ పాలపొడిని నగరంలోని పలువురితో పాటు శివారు జిల్లాలకు చెందిన వారికి సరఫరా చేస్తున్నాడు. ఆయా ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌పై ఉన్న టీ స్టాల్స్, స్వీట్స్, పన్నీర్ వ్యాపారులకు ఈ పాలపొడి చేరుతోంది. దీన్ని వినియోగించి టీ, కాఫీలతో పాటు పన్నీర్, స్వీట్లు తయారు చేస్తున్న వీళ్లు ప్రజలకు అమ్ముతున్నారు. ఇలాంటి వాటితో తయారైన ఉత్పత్తులు తింటే భవిష్యత్తులో తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఇటీవల దాడి చేసిన సౌత్–ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దామోదర్‌ను పట్టుకుని దాదాపు ఐదు టన్నుల పాలపొడి స్వాధీనం చేసుకున్నారు.

సరైన చట్టం లేక ఇబ్బందులెన్నో..

ఇలాంటి దందాలు చేసే వారికి చెక్ చెప్పడంలో పోలీసులకూ అనేక తలనొప్పులు వస్తున్నాయి. కల్తీ, కాలం చెల్లిన ఉత్పత్తులను కట్టడి చేయడానికి, విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవడానికి పోలీసులు వినియోగించేందుకు అవసరమైన చట్టాలు లేవు. పోలీసులు దాడి చేసి బీఎన్ఎస్ ప్రకారం కేసులు నమోదు చేస్తే.. నిందితులు కేవలం జరిమానాతో బయటపడిపోతారు. దీనికి తోడు ఆ కల్తీ ఉత్పత్తులను భద్రపరచడం, కోర్టు అనుమతితో ధ్వంసం చేయడం.. ఇలా అనేక అంశాలు ఇందులో ఉంటాయి. దీంతో పోలీసు అధికారులు ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి దాడులు చేస్తూ, వారితో కేసులు నమోదు చేయిస్తున్నారు. కల్తీ నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటే కొంత వరకు జరిమానాలు, శిక్షలు ఉంటడంతో ఈ కోణంలో ముందుకు వెళ్తున్నారు. నగరంలో ఇలాంటి గ్యాంగ్స్ మరి కొన్ని ఉన్నట్లు అనుమానిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ముమ్మరం చేశారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదిబజార్, శారీస్ ఆఫ్ ఇండియా ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. దసరా ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం 5.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.
- బంగియ శ్రీ నికేతన్ ఆధ్వర్యంలో న్యూ బోయిన్‌పల్లిలోని తెలంగాణ గార్డెన్స్‌లో రాత్రి 7 గంటల నుంచి దుర్గోత్సవ్ జరుగుతుంది. ప్రముఖ సింగర్ ఉషా ఉతప్ అలరిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

సమీకృత గురుకులాల ఏకపక్ష నిర్ణయానికి తాము వ్యతిరేకం

పంజగుట్ట: ఉమ్మడి రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు పోరాడి సాధించుకున్నామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాటిస్థానంలో సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తామని ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలపై సమగ్ర చర్చా కార్యక్రమం గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఫ్రంట్ చైర్మన్ గౌరిగే మల్లేష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి హాజరై మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల ఏర్పాటుపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలనేది మంచి నిర్ణయమని, ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి లేఖ రాయాలని సూచించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సమీకృత గురుకులాల ఏర్పాటుపై సీఎం ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. రేవంత్‌రెడ్డి వల్ల గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్ రాలేదని ఎన్నో పోరాటాలు, అరెస్టులు, లాఠీదెబ్బల తర్వాత వచ్చిన విషయాన్ని గ్రహించాలని సూచించారు. తాను చదువుకునేందుకు డబ్బులు లేకపోతే అమ్మ బంగారం అమ్మి చదివించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇప్పటికే 662 గురుకులాలకు పక్కా భవనాలు లేవని, కనీస మౌలిక వసతులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికార ప్రతినిధి విజయ్ ఆర్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, డాక్టర్ మధుసూదన్, నీల వెంకటేశ్, లక్ష్మణ్ యాదవ్, రవికుమార్, శ్రీనివాస్‌రావు, అనంతయ్య, సైదులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రీమెచ్యూర్ బేబీస్‌కు సాయమే లక్ష్యం



బ్రోచర్స్, టీషర్టులను ఆవిష్కరిస్తున్న నిర్వాహక ప్రతినిధులు

'ప్రీమిథాన్–2024' నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం: ప్రీమెచ్యూర్ బేబీస్‌కు సహాయం లక్ష్యంగా మారథాన్ నిర్వహించాలని తలపెట్టారు. అందులో భాగంగా 'ప్రీమిథాన్–2024' పేరిట ది హోప్ రన్ 3 ఆర్‌డి ఎడిషన్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లను, తేదీలను హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీవర్క్స్ ప్రాంగణంలో నిర్వాహకులు గురువారం సాయంత్రం ప్రకటించారు. కార్యక్రమంలో ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ డాక్టర్ నిటాషాబగ్గా, టీవర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల, నీరూస్ మేనేజింగ్ డైరెక్టర్ అవినాష్, ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ ప్రియ తదితరులతో పాటు ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొని పలు అంశాలను వివరించారు. 17 నవంబర్ 2024 నుంచి ఈ హోప్ రన్‌ను హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ వర్క్స్ కార్యాలయం నుంచి ప్రారంభించాలని నిర్ణయించినట్లు వారు ప్రకటించారు. ప్రీమెచ్యూర్ బేబీస్‌కు సహాయం చేయాలనే లక్ష్యంగా మారథాన్ నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. నవజాత శిశువులు ప్రతి శ్వాస కోసం కష్టపడుతున్నారని, అలాంటి వారికి చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు. 3కె, 5కె, 10కె రన్ ఉంటుందని వారు పేర్కొన్నారు. ఎక్స్‌ట్రామైల్ ఫౌండేషన్, టీవర్క్స్, నీరూస్ సమష్టిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయన్నారు. 'సేవ్ ప్రీమెచ్యూర్ కిడ్స్' అనే నినాదంతో కార్యక్రమం సాగుతుందని, ఇందులో ఔత్సాహికులంతా పాల్గొనాలని వారు కోరారు.

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అవసరం లేదు



మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ తెలంగాణలో అవసరం లేదని, ఎస్సీల్లో ఎక్కువ మంది లబ్ధి పొందింది మాదిగ కులస్తులేనని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కో చైర్మన్లు గోపోజు రమేష్‌బాబు, బత్తుల రాంప్రసాద్, బూర్గుల వెంకటేశ్వర్లు, బేల బాలకిషన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అత్యుత్సాహం తగ్గించుకోవాలని, అసలు వర్గీకరణ అంశం తెలంగాణకు వర్తించదనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సాలు అయినా దళితుల స్థితిగతుల అధ్యయనానికి ఉమ్మడి ఏపీ జనాభా లెక్కలు తీసుకుంటామని సీఎం చెప్పడాన్ని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి తీవ్రంగా ఖండిస్తోందని ఆయన పేర్కొన్నారు. 2014 నుంచి రాష్ట్రంలో దళితుల స్థితిగతులను అధ్యయనం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు గడుస్తున్నా ఎస్సీల అభివృద్ధికి ఎలాంటి పథకాలు ప్రవేశ పెట్టలేదన్నారు. ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాల మంత్రిలేని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కమిటీని రద్దు చేయాలని కోరారు. వర్గీకరణ కాంగ్రెస్ పార్టీ జాతీయ విధానమా? సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయమా అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో నోరు విప్పని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన పదవికి రాజీనామా చేయాలన్నారు. గురుకుల కార్యదర్శిగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పనిచేసిన కాలంలో జరిగిన విద్యా, ఉద్యోగ పదోన్నతులు, కాంట్రాక్టులపై సీబీఐ విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంచాల లింగస్వామి, జంగా శ్రీనివాస్, కరణం కిషన్, గుడిమల్ల వినోద్ కుమార్, మన్నె శ్రీరంగా, తాలుకా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగం కోసం వెళ్లేవారు

మోసపోకుండా టాంకాం చేయూత



ఇంటర్వ్యూలకు వచ్చిన అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న టాంకాం జనరల్ మేనేజర్ కె.నాగభారతి

విజయనగర్‌కాలనీ: ఉద్యోగాల నిమిత్తం విదేశాలకు వెళ్లే నిరుద్యోగులు మోసపోకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ(టాంకాం) జనరల్ మేనేజర్ కె.నాగ భారతి అన్నారు. యూఏఈ దుబాయిలోని బైక్ ట్రేడర్స్, డెలివరి బాయ్స్ ఉద్యోగాలకు గురువారం విజయనగర్‌కాలనీలోని టాంకాం కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విదేశాల్లో ఉద్యోగాల నిమిత్తం వెళ్లే అభ్యర్థులు అక్కడి చట్టాలు, ఆచార వ్యవహారాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే టాంకాం ద్వారా అభ్యర్థులు విదేశాలకు వెళ్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. అభ్యర్థులకు విదేశీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి తమకు అవసరమైన వారిని ఎంచుకున్నారు. కార్యక్రమంలో టాంకాం మేనేజర్ షబ్నా, రిక్రూట్‌మెంట్ ఇన్‌చార్జి రితేష్, అకౌంటెంట్ శారద తదితరులు పాల్గొన్నారు.

లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియాతో హైడ్రా వీడియో కాన్ఫరెన్స్

- పలు సూచనలు చేసిన ఆనంద్ మల్లిగవాడ్
- చెరువుల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చ
- బెంగళూరులో అమలవుతున్న విధానాలపై అధ్యయనం
- త్వరలో అక్కడ క్షేత్రస్థాయి పర్యటనకు రంగనాథ్ యోచన

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని చెరువుల పునరుద్ధరణ, పునరుజ్జీవం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) దీని కోసం నిపుణుల సాయాన్ని తీసుకోనుంది. ఇందులో భాగంగా లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన ఆనంద్ మల్లిగవాడ్‌తో కమిషనర్ ఏవీ రంగనాథ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైడ్రా కార్యాలయం నుంచి బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ జరిగిన తీరును పరిశీలించారు. సమావేశంలో భాగంగా ఆనంద్.. మురుగుతో నిండిన, నీళ్లు లేకున్న చెరువులను ఏ విధంగా తీర్చిదిద్దారో వివరించారు. బెంగళూరు నగరంలోని మొత్తం 35 చెరువులను పునరుద్ధరించిన విధానాన్ని ఆయన రంగనాథ్‌కు వివరించారు. అతి తక్కువ ఖర్చుతో చెరువులకు పునరుజ్జీవనం కల్పించడానికి ఉన్న అవకాశాలను హైడ్రా అధికారులు



పరిశీలించారు. చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, స్వచ్ఛమైన నీరు చేరేందుకు తీసుకోవాల్సిన చర్యల్ని పరిశీలించారు. మురుగు నీటి శుద్ధి చేసే ప్రక్రియను ప్రారంభించి.. చెరువులోకి చేరే ముందే మూడు నాలుగు దశల్లో ఫిల్టర్ చేసే తీరును హైడ్రా యోచిస్తోంది. మురుగు నీటి కాలువలకు రెండు వైపులా మొక్కలు నాటడం ద్వారా చెరువుకు చేరేలోపే ఆ నీరు కొంతమేర శుద్ధి అయ్యేలా బెంగళూరులో ఏర్పాటు చేసిన విధానంపై హైడ్రా అధ్యయనం చేస్తోంది. త్వరలోనే బెంగళూరు వెళ్లి అక్కడ చెరువులను పునరుద్ధరించిన తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని హైడ్రా అధికారులు యోచిస్తున్నారు. అలాగే ఆనంద్ మల్లిగవాడ్‌ను హైదరాబాద్‌కు పిలిపించి ఇక్కడ చెరువుల పునరుద్ధరణపై సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. కూల్చివేతల వ్యర్థాలను తొలగించి తొలిదశలో సున్నం చెరువు, అప్పా చెరువు, ప్రగతినగర్ వద్ద ఉన్న ఎర్రకుంట, కూకట్‌పల్లి చెరువులకు పునరుజ్జీవనం కల్పించాలని హైడ్రా నిర్ణయించింది.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ పేస్కేల్ అమలు చేయాలి



యూజీసీ చైర్మన్ జగదీష్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

సుల్తాన్‌బజార్: రాష్ట్రవ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో బోధిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ పేస్కేల్ అమలు చేస్తూ వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరుతూ యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్‌కుమార్‌కు కాంట్రాక్ట్ లెక్చరర్లు వినతి పత్రం సమర్పించారు. 15 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయాన్ని నమ్ముకొని బోధన, పరిశోధనలపై ఉన్న ఆసక్తి మేరకు విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగా 1445 మందిమి కొనసాగుతున్నామని కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ ఉపేందర్, డాక్టర్ సనత్ తెలిపారు. ఈ మేరకు యూజీసీ చైర్మన్ జగదీష్‌కుమార్ పేస్కేల్‌ను అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ యాదయ్య, డాక్టర్ కృష్ణ, డాక్టర్ కృష్ణవేణి, అనురాధ, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధ్యాపకులకు నైపుణ్యంపై శిక్షణ

- అధునాతన నైపుణ్యంపై శిక్షణకు హైసియా ప్రాజెక్ట్ ద్రోణ
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఇన్ఫోసిస్ వేదికగా ప్రత్యేక కార్యక్రమం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో బోధించే అధ్యాపకులకు నైపుణ్యాలను మెరుగుదిద్దే ప్రాజెక్ట్ ద్రోణ మొదటి కోహర్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు హైసియా ప్రకటించింది. ప్రాజెక్ట్ ద్రోణకు సంబంధించిన కార్యక్రమాన్ని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఇన్ఫోసిస్ క్యాంపస్ వేదికగా నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో అధ్యాపకులను అత్యాధునిక నైపుణ్యాలతో సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఇండస్ట్రీ థాట్ లీడర్స్ ప్రాజెక్ట్ ద్రోణను రూపొందించారు. మొత్తం 71 మంది ఏఐ, ఎంఎల్, ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 23 విద్యా సంస్థలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు. ఒక సర్వే ప్రకారం, కోర్సులో పాల్గొన్న వారిలో 50శాతం మంది కొత్త ఉద్యోగాలు, ఇంక్రిమెంట్లు లేదా పదోన్నతులు పొందడానికి ఈ కార్యక్రమం సహాయపడిందని తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ఐఐటీ హైదరాబాద్ గౌరవ ప్రొఫెసర్, హైసియా టాలెంట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫోరం సలహాదారు డాక్టర్ ఉదయ్ దేశాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నందేల మాట్లాడుతూ.. హైసియా చేపట్టిన ఈ టాలెంట్ మార్పు కార్యక్రమం భవిష్యత్తు నిపుణులను మరింతగా తీర్చిదిద్దేందుకు, పరిశ్రమలో అత్యంత డిమాండ్ ఉన్న కోర్సులను అధ్యాపకులకు నేర్పించి వారి నైపుణ్యాలను పెంచేందుకు ఉద్దేశించింది. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులకు నిపుణ, అధ్యాపకులకు ప్రాజెక్ట్ ద్రోణ, అప్‌స్కిల్, రీస్కిల్ టాలెంట్ కోసం ప్రాజెక్ట్ క్రియ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సపోర్ట్, స్టార్టప్ ఎనేబుల్‌మెంట్ కోసం ప్రాజెక్ట్ వృద్ధి ఉన్నాయి. సిగ్నిటీ టెక్నాలజీస్ (కోఫోర్జ్ కంపెనీ) సీఎంఓ, ప్రాజెక్ట్ ద్రోణ ప్రోగ్రాం చీఫ్, హైసియా మేనేజింగ్ కమిటీ సభ్యుడు సాయిరామ్ వేదం, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా, టెక్ మహీంద్రా లిమిటెడ్ గ్లోబల్ హెడ్–బిజినెస్ హెచ్ఆర్, హైసియా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు, హైసియా ఫ్యూచర్ రెడీనెస్ కౌన్సిల్ లీడర్ వినయ్ అగర్వాల్, తెలంగాణ ప్రభుత్వ ఐటీఈ అండ్ సీసీఆర్వో అమర్నాథ్‌రెడ్డి, ఇన్ఫోసిస్ రీజియన్ హెడ్ వెంకటేశ్ సంగం తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ఇచ్చే గౌరవమే బతుకమ్మ



జవహర్‌నగర్‌లో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న విమలక్క



బతుకమ్మలతో విమలక్క, కార్పొరేటర్ నిహారికగౌడ్, మహిళలు

అరుణోదయ సాంస్కృతిక కళాకారిణి విమలక్క

జవహర్‌నగర్: బహుజన బతుకమ్మ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సంస్కృతి, బతుకమ్మ పోరాట తత్వాన్ని తెలియజేస్తున్నామని అరుణోదయ సాంస్కృతిక కళాకారిణి విమలక్క పిలుపునిచ్చారు. బహుజన బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని అరుణోదయ సాంస్కృతిక కళాకారిణి విమలక్క ఆధ్వర్యంలో గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్ వికలాంగుల కాలనీలో బూడిద వెంకటేష్ నివాసంలో బతుకమ్మను తయారు చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ఇచ్చే గౌరవంలోనే బతుకమ్మ కనిపిస్తుందన్నారు. అనంతరం బతుకమ్మ ఆడారు. కార్పొరేటర్ నిహారికగౌడ్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, రమేష్‌చారి, వెంకటేష్, కాలనీ వాసులు, అరుణోదయ కళాకారులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి.. తరిగిపోయి..



సింగరేణిలో శరవేగంగా తగ్గిపోతున్న బొగ్గు నిక్షేపాలు

- వచ్చే రెండేళ్లలోనే మూతపడనున్న 8 గనులు.. 2031–32 నాటికి 19 గనుల్లో ఉత్పత్తి బంద్
- మొత్తం 42కు గాను 2042–43 నాటికి 19కి తగ్గనున్న గనులు
- 72.01 మిలియన్ టన్నుల నుంచి 39.03 మిలియన్ టన్నులకు తగ్గిపోనున్న సగటు ఉత్పత్తి
- 35,665కి తగ్గిపోనున్న ఉద్యోగుల సంఖ్య..జీతాలు, బోనస్‌ల చెల్లింపుపై ప్రభావం
- కొత్త గనులు తీసుకోకున్నా, విస్తరణ చేపట్టకున్నా భవిష్యత్తు కష్టమేనన్న అభిప్రాయం
- ఇతర రంగాల్లో సంస్థ విస్తరణకు మూలధనం కొరత
- ప్రభుత్వం విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో రూ.32,325 కోట్లకు చేరిన బకాయిలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కొంగు బంగారం కరిగిపోతోంది. సింగరేణి బొగ్గు గనుల్లో నిక్షేపాలు శరవేగంగా తరిగిపోతున్నాయి. ఉత్తర తెలంగాణ జీయుల కొలువుల ఆశలు ఆవిరైపోతున్నాయి. సింగరేణి బొగ్గు బాయి అంటేనే ఉద్యోగాల పంట. ఇప్పుడు సింగరేణిలో కొత్త ఉద్యోగాల భర్తీ దేవుడెరుగు.. ఉన్న ఉద్యోగాలను కాపాడుకోవడం కష్టంగా మారనుంది. వచ్చే కొన్నేళ్లలో సింగరేణి బొగ్గు గనులు సగానికిపైగా మూతబడిపోనుండగా, బొగ్గు ఉత్పత్తి సగం కానుంది. అదే జరిగితే తెలంగాణలోని ప్లాంట్లతో పాటు ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు తీవ్రమైన బొగ్గు కొరత ఏర్పడుతుంది. ఇతర ప్రాంతాల నుంచి కానీ, విదేశాల నుంచి కానీ అధిక ధరలు వెచ్చించి బొగ్గు దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. అప్పుడు విద్యుత్ చార్జీలు కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఉద్యోగులకు జీతాలు, బోనస్‌ల చెల్లింపులు కూడా కష్టంగా మారతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాది నుంచే గనుల మూత ప్రారంభం కానుండగా, ప్రత్యామ్నాయంగా కొత్త గనులను ప్రారంభించి సంస్థ భవిష్యత్తును సుస్థిర చేసుకోవడం కష్టసాధ్యమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సంస్థ విస్తరణకు మూలధనం కొరత కూడా సమస్యగా మారింది. మరోవైపు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రూ.వేల కోట్లలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు నేరుగా గనులను కేటాయించేందుకు ససేమిరా అంటుండగా, వేలంలో పాల్గొని కొత్త గనులు దక్కించుకునే విషయంలో సింగరేణి సంస్థ పెద్ద ఆసక్తి చూపడం లేదు. గనులను నేరుగా కేటాయించాలని డిమాండ్ చేస్తూ గత ప్రభుత్వం వేలానికి దూరంగా ఉంది. కేంద్రం ఇప్పటికే కోయగూడెం, సత్తుపల్లి గనులను వేలం ద్వారా ప్రైవేటు సంస్థలకు కేటాయించగా, శ్రావణపల్లి ఓసీ గనికి సైతం వేలం నిర్వహించడం గమనార్హం.

వచ్చే ఏడేళ్లలో 19 గనుల మూత

సింగరేణి ఏరియాలో 11,257 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలున్నట్టు శాస్త్రీయ అధ్యయనాల్లో తేలగా, 2,997 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలున్న గనుల్లో మాత్రమే తవ్వకాలు జరిపేందుకు సింగరేణి బొగ్గు గనుల సంస్థ లీజులను కలిగి ఉంది. కాగా ఇప్పటికే 1,565 మిలియన్ టన్నుల బొగ్గును వెలికి తీయగా, ఇక 1,432 మిలియన్ టన్నుల నిక్షేపాలే మిగిలిఉన్నాయి. సింగరేణి సంస్థ ప్రస్తుతం 22 భూగర్భ, 20 భూఉపరితల గనులు కలిపి మొత్తం 42 గనులను కలిగి ఉండగా..బొగ్గు నిక్షేపాలు నిండుకుంటుండటంతో వచ్చే రెండేళ్లలో 8 గనులను మూసివేయాలని సంస్థ నిర్ణయం తీసుకుంది. అలాగే 2031–32 నాటికి ఏకంగా 19 గనులను మూసివేయనుంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన ఓ నివేదిక ప్రకారం..ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో సింగరేణి సంస్థ 42 గనులు, 40,994 మంది కార్మికులతో ఏటా సగటున 72.01 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తోంది. అయితే 2042–43 నాటికి కేవలం 19 గనులే ఉండనుండగా, కార్మికుల సంఖ్య సైతం 35,665కి తగ్గిపోనుంది. ఇక బొగ్గు ఉత్పత్తి కూడా 39.03 మిలియన్ టన్నులకు పడిపోనుంది.

విస్తరణకు మూలధనం చిక్కులు

సంస్థను కాపాడుకునే క్రమంలో కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా థర్మల్, పంప్డ్ స్టోరేజీ, సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులను చేపట్టి ఇతర రంగాల్లో సంస్థ విస్తరణకు బాటలు వేయాలని ప్రయత్నాలు జరుగుతుండగా, మూలధన పెట్టుబడులు లేక ఒక్క అడుగు కూడా ముందుకు కదలడం లేదు. జైపూర్‌లోని 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఒడిశాలోని నైనీ గని నుంచి బొగ్గు కేటాయింపులుండగా, ఆ గనిని సింగరేణి సంస్థ గతంలోనే చేజిక్కించుకుంది. అక్కడ ఉత్పత్తి చేసే విద్యుత్ రాష్ట్రానికి తరలించడానికి రవాణా ఖర్చులు తడిసిమోపెడు కానున్నాయి. ఈ నేపథ్యంలో నైనీ బ్లాకుకు సమీపంలో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని సంస్థ నిర్ణయం తీసుకుంది. మరోవైపు జైపూర్‌లోనే కొత్తగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని ఇప్పటికే ప్రారంభించింది. అలాగే కాలం చెల్లిన రామగుండం థర్మల్–బీ స్టేషన్ స్థానంలో మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కో, సింగరేణి సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఈ మూడు విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి అవసరమైన పెట్టుబడి వ్యయంలో 80 శాతాన్ని బ్యాంకుల నుంచి రుణం రూపంలో పొందడానికి వీలుండగా, మిగిలిన 20 శాతం వాటాను సింగరేణి స్వయంగా భరించాల్సి ఉంటుంది. మెగావాట్‌కు రూ.10 కోట్లు చొప్పున ఈ మూడు విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి రూ.32 వేల కోట్ల వ్యయం కానుండగా, అందులో 20 శాతం అంటే రూ.6,400 కోట్లను సింగరేణి భరించాల్సి ఉంటుంది. ఇలావుండగా రామగుండం రీజియన్‌లోని మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనిలో రూ.3 వేల కోట్ల వ్యయంతో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మాణానికి సైతం ఇటీవల శ్రీకారం చుట్టింది. ఇల్లందు జీకే గనిలో మరో 100 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్ కేంద్రం నిర్మించాలని యోచిస్తోంది. రూ.1,640 కోట్లతో లోయర్ మానేరు డ్యామ్‌పై 300 మెగావాట్లు, మల్లన్నసాగర్‌పై 500 మెగావాట్లు కలిపి మొత్తం 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకుంది. మరో 100 మెగావాట్ల పవన విద్యుత్ కేంద్రం ఏర్పాటును పరిశీలిస్తోంది. శ్రావణ్‌పల్లి, మాదారం, గోలేటీ ఓపెన్ మైన్స్‌ను ప్రారంభించాల్సి ఉంది. అనుకున్న విధంగా ఈ ప్రాజెక్టులన్నింటినీ చేపట్టి, సకాలంలో పూర్తి చేయాలంటే సింగరేణి రూ.వేల కోట్లను వెచ్చించాల్సి ఉండగా మూలధనం కొరత సమస్యగా మారనుంది.

ఉత్తర-దక్షిణ కారిడార్‌తో పొంచి ఉన్న ముప్పు

ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య కోల్ కారిడార్ పేరుతో కొత్త రైల్వే లైన్ వేయాలని ఇటీవల కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ కారిడార్ వస్తే సింగరేణి బొగ్గుకు డిమాండ్ గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం సింగరేణి టన్ను బొగ్గును రూ.3,500కు విక్రయిస్తుండగా, ఒడిశాతో పాటు ఉత్తరభారత దేశంలోని రాష్ట్రాలు రూ.1,100కే విక్రయిస్తున్నాయి. పైగా సింగరేణి బొగ్గుతో పోల్చితే అక్కడి బొగ్గులో నాణ్యత ఎక్కువ. కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే ఆయా రాష్ట్రాల నుంచి బొగ్గును సులభంగా దిగుమతి చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

వచ్చే ఎనిమిదేళ్లలో తగ్గిపోయే సింగరేణి భూగర్భ, ఉపరితల గనులు, బొగ్గు ఉత్పత్తి, కార్మికుల సంఖ్య (బొగ్గు ఉత్పత్తి మిలియన్ టన్నుల్లో)

సంవత్సరం	భూగర్భ	ఉపరితల	మొత్తం	బొగ్గు ఉత్పత్తి	కార్మికులు
2024-25	22	20	42	72.01	40,994
2025-26	18	19	37	74.97	40,136
2026-27	17	21	38	79.68	39,473
2027-28	18	21	39	85.35	39,132
2032-33	13	17	30	58.59	37,519
2037-38	10	13	23	48.94	36,342
2042-43	9	10	19	39.03	35,665

వచ్చే ఎనిమిదేళ్లలో మూతబడనున్న 19 గనుల వివరాలు

2024-25
1. జేకే-5 ఓసీ
2. ఆర్జీ ఓసీ-1
3. ఎస్ఆర్‌పీ-1
4. ఆర్‌కేపీ ఓసీపీ (ఫేజ్-1)

2025-26
5. కేటీకే 6అండ్ 6ఏ
6. ఆర్‌కే-5 ఇన్‌క్లైన్
7. ఆర్‌కే-6 ఇన్‌క్లైన్
8. ఆర్‌కే ఎన్‌టీ

2027-28 నుంచి 2031-32
9. కేకే-5 ఇన్‌క్లైన్
10. కిస్టారం ఓసీ
11. కేహెచ్‌జీ ఓసీ
12. ఆర్‌కే-7 ఇన్‌క్లైన్
13. పీకేఓసీ
14. ఆర్జీఓసీ-3 ఎక్స్‌టెన్షన్
15. జీడీకే-11 ఇన్‌క్లైన్
16. ఐకే-1ఏ ఇన్‌క్లైన్
17. కేఓసీ-2
18. వాకీల్‌పల్లి మైన్
19. పీవీకే-5 ఇన్‌క్లైన్

ముందస్తు ప్రణాళిక లేకుంటే ఇబ్బందే..

ముందస్తు ప్రణాళిక లేకపోతే సింగరేణి పరిస్థితి భవిష్యత్తులో కష్టమే. గతంలో బొగ్గు ఉత్పత్తిపై దృష్టి పెట్టడం తప్ప, విస్తరణను పట్టించుకోలేదు. దీనికితోడు కేవలం వేలంలోనే గనులు దక్కించుకోవాలన్న కేంద్ర నిబంధన కూడా ఇబ్బందికరంగా మారింది. తాడిచర్ల బ్లాక్‌కు అనుమతులు తీసుకోవడం, అలాగే మరో మూడు గనులు ఇల్లందు, కోయగూడెం, సత్తుపల్లిని కూడా ప్రభుత్వం తీసుకుంటే మరో 10 నుంచి 15 సంవత్సరాల వరకు ఢోకా ఉండదు.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)

సర్కారు బకాయిలు రూ.31 వేల కోట్లు

గనుల మూత, విస్తరణకు మూలధనం కొరతతో పాటు ప్రభుత్వం నుంచి వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉండటంతో సింగరేణి పరిస్థితి అయోమయంగా మారింది. విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్న రాష్ట్రం చెల్లింపులు జరపకపోవడం సంస్థ విస్తరణపై ప్రభావం చూపుతోంది. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడానికి సింగరేణి సంస్థ నుంచి పెద్ద మొత్తంలో బొగ్గు, విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్న రాష్ట్రం..అందుకు సంబంధించిన చెల్లింపులు మాత్రం జరపడం లేదు. గడిచిన ఏప్రిల్ నాటికి సంస్థకు రావాల్సిన మొత్తం బకాయిలు రూ.32,325.29 కోట్లు ఉండగా, అందులో ఒక్క తెలంగాణ చెల్లించాల్సిన బకాయిలే రూ.31,000.5 కోట్లు ఉన్నాయి. ఇందులో విద్యుత్ విక్రయాలకు సంబంధించిన రూ.22,405.76 కోట్లు తెలంగాణ స్టేట్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ(టీఎస్‌పీసీసీ) చెల్లించాల్సి ఉండగా, బొగ్గు విక్రయాలకు సంబంధించి రూ.8,594.74 కోట్లను తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) నుంచి రావాల్సి ఉంది. సింగరేణికి మరో రూ.1,324.79 కోట్లను ఏపీ, తమిళనాడు, మహారాష్ట్ర బకాయిపడ్డాయి. ఏటేటా రావాల్సిన బకాయిలు పేరుకుపోయి రూ.32,325 కోట్లకు చేరినా సింగరేణి సంస్థ లాభాల్లో నడుస్తోందని యాజమాన్యం పేర్కొంటోంది. గత ఆర్థిక సంవత్సరం 2023–24 చివరి నాటికి రూ.57,448 కోట్ల నష్టాల్లో కూరుకుపోయిన తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంల) నుంచి సింగరేణి సంస్థ బకాయిలను రాబట్టుకోవడం కష్టమేనని విద్యుత్ రంగ నిపుణులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బకాయిల చెల్లింపులకు చర్యలు తీసుకోని పక్షంలో భవిష్యత్తులో సింగరేణి ఉద్యోగులకు జీతాలు చెల్లించడం కూడా కష్టంగా మారుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది.

పండుగ తర్వాత పాఠాల్లేవు

నిరవధిక బంద్‌కే మొగ్గు చూపిన యాజమాన్యాలు

- నిర్వహణ భారమై నీరసించిన ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు
- ఉన్నత విద్యకు ఆర్టీఎఫ్ గ్రహణం...మూడేళ్లుగా ఫీజు బకాయిల కోసం నిరీక్షణ

సిరిసిల్ల కల్చరల్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఫీజులు వసూలు చేసే అవకాశం లేక, సర్కార్ నుంచి నిధులు రాక నిర్వహణ కష్టమైన ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాలు తెగింపు నిర్ణయానికి వచ్చేశాయి. రూ.6వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. అన్ని రకాల శాంతియుత నిరసనల అనంతరం నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయించాయి. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల ఉన్నతాధికారులకు ఈ మేరకు బంద్ నిర్ణయంపై లేఖలు అందజేశాయి. దీంతో పండగ సెలవుల తర్వాత కూడా డిగ్రీ, పీజీ కళాశాలలన్నీ మూతబడే పరిస్థితి కనిపిస్తోంది. ఇదే జరిగితే త్వరలో జరిగే సెమిస్టర్ పరీక్షల ఫలితాలపై ప్రభావం పడనుంది. డిగ్రీ, పీజీ విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడనుంది.

నిర్వహణ కష్టాలు.. పండుగ పూట పస్తులు

ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువుకుంటున్న విద్యార్థులు మూడేళ్లుగా స్కాలర్‌షిప్‌ల కోసం, యాజమాన్యాలు ఆర్టీఎఫ్ నిధుల కోసం నిరీక్షిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో పలు జిల్లాలోని పలు జూనియర్, డిగ్రీ కళాశాలల నిర్వాహకులు అల్లాడుతున్నారు. వరుసగా రెండు విద్యా సంవత్సరాలు ముగిసినా, బిల్లులు పెండింగ్‌లోనే ఉండిపోవడంతో ఆదాయ మార్గం లేక..ఆర్టీఎఫ్ రాక ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కాలేజీల నిర్వహణ కష్టతరంగా మారింది. భవనాల అద్దెలు, నిర్వహణ ఖర్చులు, అధ్యాపకుల వేతనాలు, కరెంట్ బిల్లులు, వర్సిటీల ఫీజులు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. నెలల తరబడి వేతనాలు అందక ఆయా కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల కుటుంబాలు అల్లాడుతున్నాయి. పండుగ వేళలో పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించింది.

అయా యూనివర్సిటీ పరిధిలో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలు ఇలా....

వర్సిటీ	కాలేజీల సంఖ్య
ఉస్మానియా	307
కాకతీయ	220
శాతవాహన	68
తెలంగాణ	67
మహాత్మాగాంధీ	66
పాలమూరు	58

ఎన్ని వినతి పత్రాలిచ్చినా సరే...

పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో పలు రకాల శాంతి దీక్షలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. హైదరాబాద్ ఇందిరా పార్క్ దగ్గర వేలాదిమంది విద్యార్థులతో నిరసనలు, దీక్షలు చేపట్టినా యంత్రాంగానికి చీమ కుట్టినట్టు కూడా లేదు. ఇటీవల బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో సైతం భారీ నిరసన చేపట్టారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులందరినీ కలిసి తమ గోడు వెల్లబోసుకున్నా ప్రయోజనం లేదని వాపోతున్నారు. కేంద్ర మంత్రులు, బండి సంజయ్, కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ సహా అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు సైతం వినతిపత్రాలు అందజేశారు. అసెంబ్లీలో నినదించేలా ప్రయత్నించారు. అయినా ఫలితం లేకుండా పోయింది.



ఇందిరా పార్క్ దగ్గర ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో నిరసన

బంద్ పాటించేందుకే తీర్మానం

పెండింగ్ ఫీజు బకాయిల విడుదల విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో తాడోపేడో తేల్చుకునేందుకు యాజమాన్యాలు సిద్ధమయ్యాయి. దసరా సెలవుల తర్వాత అన్ని కళాశాలలు నిరవధికంగా బంద్ పాటించేందుకు నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు అన్ని యూనివర్సిటీల పరిధిలో ఉన్న యాజమాన్యాలు అయా వర్సిటీల ఉన్నతాధికారులకు లేఖలు అందజేశాయి. తాజాగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రికి కూడా తమ బంద్ నిర్ణయాన్ని లేఖ ద్వారా అందజేశాయి. ఫలితంగా సంప్రదాయ డిగ్రీ, పీజీ కళాశాలలన్నీ పండుగ తర్వాత మూత బడనున్నాయి. పాఠాలు చెప్పే ప్రొఫెసర్లకు సైతం నెలల తరబడి వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

ఎక్కని గడప లేదు. మొక్కని నాయకుడు లేడు



మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు లేక అల్లాడుతున్నాం. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన పది నెలల వరకు ఓపికగా నిరీక్షించాం. నిధుల విడుదలకు ఎక్కని గడప లేదు. మొక్కని నాయకుడు లేడు. ముఖ్యమంత్రి సహా అందరు నేతలనూ కలిశాం. అయినా యంత్రాంగంలో చలనం లేదు. మరింత ఒత్తిడి పెంచి అయినా సరే మా పోరాటాన్ని కొనసాగిస్తాం. కళాశాలల మనుగడ ప్రశ్నార్థకమైన సమయంలో ఇంతకుమించి గత్యంతరం లేదు.

– బొజ్జా సూర్యనారాయణరెడ్డి, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

డబ్బులు వచ్చే వరకు తగ్గేదే లేదు.



పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల అయ్యే వరకు ఈ పోరాటం ఆపేది లేదు. అన్ని రకాల ప్రయత్నాలు చేసినా, ప్రభుత్వ యంత్రాంగంలో చలనం కనిపించడం లేదు. ఆరు నెలలుగా సాగిస్తున్న శాంతియుత నిరసనల వల్ల ప్రయోజనం లేదని భావించి నిరవధికంగా బంద్ పాటిస్తే తప్ప కదలిక రాదని భావించాం. అందుకే దసరా తర్వాత అన్ని కళాశాలలు బంద్ పాటించాలని పిలుపునిచ్చాం.

– యాద రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి

పాత అప్పులు తీరవు..కొత్తవి పుట్టవు

మూడేళ్ల నిధులు పెండింగ్‌లో ఉండటంతో అన్ని కళాశాలలు అప్పుల్లో కూరుకుపోయాయి. కనీసం డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఆర్టీఎఫ్ నిధుల పెండింగ్ పేరుతో సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తే ఆయా విద్యాసంస్థలను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని యూనివర్సిటీల యంత్రాంగం హెచ్చరించడంతో చేసేదేం లేక యాజమాన్యాలు నీరసించిపోయాయి. దీంతో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక, కొత్త అప్పులు పుట్టే దారి లేక, వేతనాలు ఇవ్వలేక, నిర్వహణ సాధ్యం కాక యాజమాన్యాలు కుదేలయ్యాయి. గ్రామీణ ప్రాంత కళాశాలల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ఇక మనుగడ కష్టమని భావించిన పలు విద్యాసంస్థలు ఇప్పటికే బోర్డులు తిప్పేశాయి. ఐదేళ్ల క్రితంతో పోల్చితే సగానికి పైగా కళాశాలలు మూత బడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.





మంచు దుప్పట్లో ఆదిలాబాద్ జాతీయ రహదారి, పరిసర ప్రాంతాలు

క్లుప్తంగా...

ఆర్థిక సమస్యల పరిష్కారానికి సీపీఎస్ ఉద్యోగుల డిమాండ్

సాక్షి, అమరావతి: సీపీఎస్ ఉద్యోగుల ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్థిక శాఖ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. సీపీఎస్‌లో పదవీ విరమణ అనంతరం మెడికల్ ఇన్‌వేలిడేషన్ పొందే పెన్షనర్ మరణిస్తే కుటుంబ సభ్యులకు వచ్చే పెన్షన్‌పై తగిన విధివిధానాలు ప్రకటించాలన్నారు. సీపీఎస్ ఉద్యోగుల డీఏ ఎరియర్స్, 2023-24 లోని మ్యాచింగ్ గ్రాంట్‌ను ఉద్యోగి ప్రాన్ ఖాతాలో తక్షణం జమ చేయాలని కోరారు. రిటైరైన సీపీఎస్ ఉద్యోగుల గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. గత ప్రభుత్వ కాలంలో సెంట్రలమ్ మెమో 57ను అనుసరించి కొందరు ఉన్నత స్థాయి అధికారులకు మాత్రమే ఓపీఎస్ పునరుద్ధరించారన్నారు. అదే మెమో ప్రకారం అర్హులైన అందరు ఉద్యోగ, ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని కోరారు.

పంచాయతీల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టండి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న గ్రామ కార్యదర్శి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్, క్లర్క్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు కోరారు. సచివాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు .రాష్ట్రంలోని పంచాయతీల్లో పలువురు ఉద్యోగులు పదోన్నతులు లేకుండా పదవీ విరమణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 400 పైగా గ్రామ కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పలువురు ఈఓలు మూడు, నాలుగు పంచాయతీలకు బాధ్యులుగా అదనపు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

పట్టణ స్థానిక సంస్థలకు రూ.299 కోట్లు మంజూరు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.299 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ మొత్తానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం మూడు పద్దులుగా నిధులను మంజూరు చేసిన ప్రభుత్వం.. ఆ నగదును సీడీఎంఏ అకౌంట్‌లో జమ చేయనున్నట్లు తెలిపారు. అలాగే నవంబర్ వరకు ఏపీ సీఆర్డీఏ రుణాల చెల్లింపుల కోసం రూ.281.53 కోట్లు మంజూరు చేశారు.

సీబీఐ పేరుతో సైబర్ కేటుగాళ్ల మోసం

డాక్టర్‌ను బెదిరించి రూ. 38 లక్షలు స్వాహా



బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆసుపత్రి యజమానిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించి రూ. 38 లక్షలు దోపిడీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. పద్మావతి నగర్‌లో రాహుల్ ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ రామయ్య ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్. గత నెల 25న సైబర్ నేరగాళ్లు డాక్టర్ రామయ్య వాడుతున్న మొబైల్ నంబర్‌కు వాట్సాప్ కాల్ చేశారు. సీబీఐ అధికారులమంటూ తను వాడుతున్న సిమ్ ఆధారంగా మనీలాండరింగ్ జరిగిందని బెదిరించారు. దీనికి సంబంధించి ఢిల్లీ పీఎస్‌లో డాక్టర్‌పై హ్యూమన్ ట్రేడింగ్, మనీ లాండరింగ్, చీటింగ్ కేసులు నమోదయ్యాయని హెచ్చరించారు. ఇందుకోసం ఆన్‌లైన్ విచారణ జరుపుతున్నామని డిజిటల్ అరెస్ట్ చేశామని బెదిరించారు. అరగంట సేపు డాక్టర్‌ను లైన్‌లో ఉంచి ఆయన బ్యాంక్ అకౌంట్‌ను హ్యాక్ చేసి రూ. 38 లక్షలు దోపిడీ చేశారు. కొంత సేపటి తర్వాత తేరుకున్న డాక్టర్ రామయ్య వెంటనే టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గజలక్ష్మిగా సిరుల తల్లి



విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారు గురువారం గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు లక్ష గాజులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మ జాతరకు సర్వం సిద్ధం



ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి జాతరకు సర్వం సిద్ధమైంది. విజయనగరంలోని ప్రధాన కూడళ్లన్నీ సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారి వనంగుడి విద్యుత్ దీప కాంతుల్లో మెరిసిపోతున్న దృశ్యం

నృత్యార్చన



తిరుమల వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఏడోరోజు గురువారం దివ్యతోజోమూర్తి సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వాహనసేవలో కళాబృందాలు నృత్య ప్రదర్శన చేస్తున్న దృశ్యం

యుద్ధ విద్యల జమానా..

కోనసీమ చెడీ తాలింఖానా

కోనసీమ దసరా ఉత్సవాల్లో ఇదే హైలైట్.. గగుర్పాటుకు గురిచేసే యుద్ధ విన్యాసాలు

సంస్థానాల నుంచి స్వాతంత్ర్య పోరాటం వరకు 170 ఏళ్ల ప్రస్థానం.. నాలుగు తరాలుగా ప్రదర్శిస్తున్న అబ్బిరెడ్డి కుటుంబీకులు



అమలాపురంలో చెడీ తాలింఖానా ప్రదర్శన



కోనసీమ.. మైమరపించే ప్రకృతి అందాలకే కాదు.. ఆధ్యాత్మిక సౌరభాలకు.. సంస్థానాల పాలనకు.. స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలకు ఆలవాలంగా నిలుస్తోంది. ఇక్కడ జరిగే సంక్రాంతి.. దసరా పండగలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. సంక్రాంతి సందర్భంగా నిర్వహించే ప్రభల తీర్థాలతోపాటు దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించే చెడీ తాలింఖానా ప్రదర్శన సైతం జాతీయ స్థాయిలో గుర్తింపు సంతరించుకుంది.





బ్రిటిష్ కాలంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని సంస్థానాల్లో యువకులకు యుద్ధ విద్యలు నేర్పించేందుకు చెడీ తాలింఖానా మొదలైంది. తరువాత కాలంలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తికి.. సమరయోధుల మధ్య ఐక్యతకు ప్రతీకగా మారింది. నాటినుంచి నేటి వరకు దశాబ్దాల కాలంగా ఈ వీరుల విద్య కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలలో భాగమైంది. ఏటా దసరా ఉత్సవాలలో కత్తులు, బల్లేలు, బాణా కర్రలతో సాగే ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ నెల 12న దసరా రోజున రాత్రి చెడీ తాలింఖానా ప్రదర్శనలు అమలాపురంలో వీధుల్లో రోమాంచితం కానున్నాయి.

- సాక్షి, అమలాపురం

బర్మాలో శిక్షణ పొంది..

చెడీ తాలింఖానా బర్మా (మయన్మార్)కు చెందిన విద్య. ఉమ్మడి గోదావరి జిల్లాలోని సంస్థానాల్లో పనిచేసే సైనికులకు, యువతకు యుద్ధ నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు అమలాపురం పట్టణానికి చెందిన అబ్బిరెడ్డి రామదాసు (తొలి తరం వ్యక్తి) బర్మా వెళ్లి శిక్షణ పొంది వచ్చారు. పిఠాపురం, పెద్దాపురం, మొగల్తూరు తదితర సంస్థానాల నుంచి, స్థానిక యువకులు ఆయన దగ్గర ఈ విద్య నేర్చుకునేవారు. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ సేనలతో పోరాడే భారతీయులలో ఐక్యత కోసం బాలగంగాధర్ తిలక్ దసరా, వినాయక చవితి ఉత్సవాలను ప్రోత్సహించారు. ఊరేగింపులలో జాతీయ సమైక్యత చాటాలని ఆయన ఇచ్చిన పిలుపుతో దసరా ఉత్సవాలలో చెడీ తాలింఖానా ప్రదర్శన ఒక భాగమైంది. దసరా ఉత్సవాల్లో ఇది ప్రారంభమై 168 ఏళ్లు అయ్యింది. అమలాపురం పట్టణంలో దసరా రోజు సాయంత్రం నుంచి ఏడు వీధులకు చెందినవారు దసరా వాహనాలను ఊరేగిస్తారు. ఈ ప్రదర్శనలో చెడీ తాలింఖానా, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి.

కత్తులు దూస్తూ.. బల్లేలు తిప్పుతూ..

దసరా వస్తుందంటే చాలు అమలాపురంలో సంప్రదాయ చెడీ తాలింఖానా ప్రదర్శనకు సిద్ధమయ్యే యువతీ యువకులు ఎందరో. దసరా సందర్భంగా వీధుల్లో అమ్మవారు వివిధ రకాల రథాలపై కొలువై ఊరేగింపుగా వెళతారు. దీనికి ముందే ఏడు వీధులకు చెందిన యువకులు పట్టా కత్తులకు పదును పెడతారు. బల్లేలు, బాణా కర్రలు, కత్తులతో విన్యాసాలు చేస్తారు. రాచరిక యుద్ధాన్ని తలపించే ఈ సాహసోపేత విన్యాసాలను తిలకించేందుకు దసరా రోజు రాత్రి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున జనం తరలివస్తారు. కళ్లకు గంతలు కట్టుకుని మనిషి శరీరంపైన, కంఠం, నుదురు, పొత్తికడుపుపై కొబ్బరికాయలు, కాయగూరలు పెట్టి నరకడం వంటి విన్యాసాలు తాలింఖానాలో ముఖ్య ఘట్టాలు. అగ్గి బరాటాలు, లేడి కొమ్ములు, పట్టా కత్తులను చురుగ్గా కదిలిస్తూ యువకులు చేసే విన్యాసాలు యుద్ధ సన్నివేశాలను తలపిస్తాయి. ప్రదర్శన ఆసాంతం ఒళ్లు గగుర్పాటుకు గురి చేస్తుంది. పట్టణానికి చెందిన ఏడు వీధులలో కొలువు తీరిన వాహనాలను సాయంత్రం ఆరు గంటల నుంచి తెల్లవారు జాము వరకు ఊరేగిస్తారు.



ప్రదర్శన చేస్తున్న యువకులు



వాహనాల ఊరేగింపు



ప్రదర్శన చేస్తున్న యువతులు

నాలుగు తరాలుగా..

అమలాపురానికి చెందిన అబ్బిరెడ్డి రామదాసు చెడీ తాలింఖానాకు అంకురార్పణ చేశారు. తరువాత ఆయన కుమారుడు అబ్బిరెడ్డి నరసింహారావు (రెండవ తరం వ్యక్తి) ఈ వీర విద్యను ప్రోత్సహించారు. అబ్బిరెడ్డి రామదాసు (మూడవ తరం) తాత బాటలో ఈ విద్యకు రాష్ట్రస్థాయి గుర్తింపును తీసుకువచ్చారు. అబ్బిరెడ్డి మల్లేశ్వరస్వామి (మల్లేష్-నాల్గవ తరం) తాత, తండ్రుల వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. మల్లేష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా యూఎస్‌లోని టెక్సాస్‌లో పనిచేస్తున్నారు. దసరా సమయంలో ముందుగానే ఇక్కడకు వచ్చి స్థానికులకు శిక్షణ ఇస్తుంటారు.

త్వరలో వెబ్‌సైట్



చెడీ తాలింఖానాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్నదే నా ధ్యేయం. ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా దీనికి విస్తృత స్థాయిలో ప్రచారం తీసుకువస్తున్నాం. త్వరలోనే తాలింఖానాకు ప్రత్యేక వెబ్‌సైట్ డిజైన్ చేస్తాం.

- అబ్బిరెడ్డి మల్లేష్, అమలాపురం

సర్వమంగళాదేవికి వజ్రాల హారం



తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని ఏలూరు రోడ్డు శంకరమఠంలో కొలువై ఉన్న సర్వమంగళాదేవికి భక్తులు వజ్రాలహారం సమర్పించారు. తిరుపతికి చెందిన అజ్ఞాత భక్తులు దీన్ని అందజేశారు. ఈ హారం విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. దసరా ఉత్సవాల్లో అమ్మవారికి ఈ వజ్రాల హారాన్ని అలంకరించనున్నట్టు చెప్పారు.

■ తెలంగాణ



బాసర శ్రీజ్ఞాన సరస్వతిదేవి క్షేత్రంలో మహాగౌరి దేవి అలంకారంలో అమ్మవారు



అలంపూర్ శ్రీ జోగులాంబ ఆలయంలో మహాగౌరిదేవిగా అమ్మవారు



వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయంలో మహాదుర్గాలంకారంలో అమ్మవారు

వలంటీర్లకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు నెలకు రూ.10వేల గౌరవ వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో రాజీనామా చేసిన వలంటీర్లను కొనసాగించడంతో పాటు, అందరికీ నాలుగు నెలల గౌరవ వేతన బకాయిలు చెల్లించాలన్నారు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు



తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 79,753 మంది స్వామివారిని దర్శించుకోగా 29,623 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.48 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

దుర్గాదేవిగా చెంగాళమ్మ పరమేశ్వరి


సూళ్లూరుపేట: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం ఆవరణలోని యాగశాలలో మహా చండీ యాగం చేపట్టారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నెల్లూరుకు చెందిన కళాంజలి సాంస్కృతిక సంస్థ కళాకారులు జానపద, నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.

అప్పన్నకు స్వర్ణపుష్పార్చన




సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 7 గంటల నుంచి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. ఉభయ దాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. అర్చకులు చిన్నా తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ద్వారకా తిరుమల బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



ద్వారకాతిరుమల: ఈ నెల 13 నుంచి 20 వరకు నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల దివ్య క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే ఆలయ ధ్వజస్తంభం వద్ద, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో చలువ పందిళ్లను నిర్మించారు. ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరిస్తున్నారు. గుడి సెంటర్‌లో 40 అడుగుల స్వామివారి భారీ విద్యుత్ కటౌట్ నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

భక్త జన సంద్రం శ్రీపీఠం



కాకినాడ రూరల్: మహాశక్తి యాగం నిర్వహిస్తున్న కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠం భక్త జన సంద్రంగా మారింది. మహాశక్తి యాగం లలితా సహస్ర నామార్చన కుంకుమ పూజలో పాల్గొనేందుకు గురువారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. జిల్లా నలుమూలలు నుంచి, ఇతర ప్రాంతాల నుంచి మహిళలు తరలి రావడంతో రమణయ్యపేట శ్రీపీఠం ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఒకేరోజు 70 వేల మంది భక్తుల రాకతో ప్రాంగణమంతా కిక్కిరిసింది.

ఏపీఆర్‌సెట్ మొదటి విడత సీట్ల కేటాయింపు


తిరుపతి సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఎస్వీయూ నిర్వహించిన ఏపీఆర్ సెట్ 2023-24 లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు గురువారం మొదటి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశామని కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌సెట్ చైర్మన్ ఆచార్య కె రామ్మోహన్‌రావు సూచనల మేరకు రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్, ఫార్మసీ తదితర కోర్సుల్లో పీహెచ్‌డీ (పార్ట్ టైం, ఫుల్ టైం) 2,566 సీట్లకు వెబ్ వెరిఫికేషన్ జరిపి సీట్ల కేటాయించామన్నారు. తొలిదశలో ఫుల్ టైం కోర్సుల్లో 771 మంది, పార్ట్ టైం కోర్సుల్లో 1,237 మంది, మొత్తం 2,008 మందికి సీట్లు కేటాయించినట్లు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిపోర్టు చేసి, సంబంధిత విశ్వవిద్యాలయాల్లో నేరుగా ఈనెల 14 నుంచి 19వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై అడ్మిషన్లు పొందాలని సూచించారు.

విశ్రాంత శాస్త్రవేత్త యాళ్లకు సన్మానం



కాకినాడ రూరల్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో గురువారం ప్రపంచ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శివప్రసాద్ మాట్లాడుతూ, ఏటా అక్టోబర్ 4 నుంచి 10 వరకు అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తారన్నారు. సోవియట్ యూనియన్ 1957 అక్టోబరు 4న తొలి సారిగా మానవ రహిత ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపిందని, ఆ తర్వాత పదేళ్లకు 1967 అక్టోబరు 10న మరో ఉప గ్రహం పంపిందన్నారు. అప్పటి నుంచి అంతరిక్ష వారోత్సవాలు జరుపుతున్నట్టు వివరించారు. అంతరిక్షాన్ని శాంతి ప్రయోజనాలకు మాత్రమే వినియోగించాలని, దానిని దుర్వినియోగం చేయరాదని ఐక్యరాజ్య సమితి తీర్మానించిందని చెప్పారు.

నర్సరీ రైతుల నైపుణ్యం అద్భుతం



కడియం: మొక్కల పెంపకంలో కడియం ప్రాంత నర్సరీ రైతుల నైపుణ్యం అద్భుతమని, సరికొత్త రకాల మొక్కల ఉత్పత్తిలో వారికి వారే సాటి అని గుంటూరు రేంజ్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ మంజుశ్రీ అన్నారు. మూడు వందల మంది ఎన్‌సీసీ కేడెట్లతో కలిసి గురువారం కడియపులంకలోని సత్యదేవ, శివాంజనేయ నర్సరీలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా నర్సరీల అధినేతలు పుల్లా పెద సత్యనారాయణ, మల్లు పోలరాజు ఘన స్వాగతం పలికారు. నర్సరీలలో మొక్కల ఉత్పత్తి విధానాలు, సంరక్షణ రీతులను ఎన్‌సీసీ కేడెట్లకు తెలిపారు.



● వెంకటేశ్

యాక్షన్ మోడ్

యాక్షన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు వెంకటేశ్. ఆయన హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో మాజీ పోలీసాఫీసర్ పాత్రలో వెంకటేశ్ నటిస్తుండగా, ఆయన భార్య పాత్రలో ఐశ్వర్యా రాజేశ్, ఆయన మాజీ ప్రేయసిగా మీనాక్షీ చౌదరి నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో జరుగుతోందని తెలిసింది. వెంకటేశ్ పాల్గొనగా ఓ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారట. ఉపేంద్ర లిమాయే, రాజేంద్ర ప్రసాద్, సాయి కుమార్, నరేష్, వీటీ గణేశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



● అనుష్క



● సమంత



● తమన్నా

లీడ్ లేడీ

సినిమాని జనరల్‌గా మేల్ లీడ్ చేస్తుంటారు. ఫిమేల్ లీడ్ చేయడం తక్కువ. అయితే ఈ మధ్య కాలంలో లేడీస్ లీడ్ చేసే సినిమాలు ఎక్కువయ్యాయి. ఒకవైపు హీరోల సరసన రెగ్యులర్ చిత్రాల్లో నటించడంతో పాటు హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తున్నారు కొందరు కథానాయికలు. స్టోరీని లీడ్ చేస్తున్న ఆ లీడ్ లేడీస్ గురించి తెలుసుకుందాం.

ప్రతీకారం

'అరుంధతి, రుద్రమ దేవి, భాగమతి, నిశ్శబ్దం' వంటి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ చేసిన అనుష్క నటిస్తున్న తాజా చిత్రం 'ఘాటీ'. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' సినిమా తర్వాత అనుష్క తెలుగులో కమిటైన చిత్రమిది. ఈ మూవీకి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'వేదం' (2010) మంచి హిట్‌గా నిలిచింది. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న 'ఘాటీ' షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో జరిగిన వాస్తవ ఘటన నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారట క్రిష్. బిజినెస్ ఉమన్‌గా ఎదుగుతున్న ఓ మహిళను కొందరు కావాలని టార్గెట్ చేస్తారు. వ్యాపారంలో నష్టాలపాలైన ఆ మహిళ అందుకు కారకులైన వారిపై ప్రతీకారం తీర్చుకోవాలనుకునే కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారట. ఆంధ్రా-ఒడిశా బోర్డర్‌లో తొలి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

శివశక్తిగా...

తమన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'ఓదెల 2'. 2021లో విడుదలై, హిట్‌గా నిలిచిన 'ఓదెల రైల్వే స్టేషన్' సినిమాకి సీక్వెల్‌గా 'ఓదెల 2' రూపొందుతోంది. తొలి భాగాన్ని తెరకెక్కించిన అశోక్ తేజయే రెండో భాగానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి. మధు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో తన కెరీర్‌లో తొలిసారిగా శివశక్తి (నాగ సాధు) పాత్రలో నటిస్తున్నారు తమన్నా. ఇప్పటికే విడుదలైన ఆమె ఫస్ట్ లుక్, పోస్టర్‌కి అనూహ్యమైన స్పందన వచ్చింది. సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న 'ఓదెల 2' ఫైనల్ షెడ్యూల్ ఓదెల గ్రామంలోని ఓదెల మల్లన్న క్షేత్రంలో జరుగుతోంది. తన దర్శకత్వంలో వచ్చిన 'రచ్చ' సినిమాలో హీరోయిన్‌గా తమన్నాకి అవకాశం ఇచ్చిన డైరెక్టర్ సంపత్ నంది 'ఓదెల 2'లో లీడ్ రోల్ చేసే చాన్స్ ఇచ్చారు. ఈ మూవీలో హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా, మురళీ శర్మ, నాగమహేశ్, గగన్ విహారి వంటివారు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

బంగారు బొమ్మ

'యశోద, శాకుంతలం' వంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాల తర్వాత సమంత నటించనున్న తాజా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'మా ఇంటి బంగారం'. తన బర్త్ డే (ఏప్రిల్ 28న) సందర్భంగా ఈ సినిమాని ప్రకటించారు సమంత. తన సొంత ప్రొడక్షన్ బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమాని నిర్మించనున్నట్లు ఆమె ప్రకటించడం విశేషం. తెలుగులో 'ఖుషి' సినిమా తర్వాత ఆమె అంగీకరించిన చిత్రం ఇదే. అయితే ఈ సినిమాకి దర్శకుడు ఎవరు? అనే విషయాన్ని ప్రకటించలేదు. ఇప్పటిదాకా నటిగా మంచి విజయాలను అందుకున్న సమంత ఇప్పుడు నిర్మాతగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ సినిమా డైరెక్టర్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు తెలియాల్సి ఉంది.

డబుల్ ధమాకా

హీరోయిన్ రష్మికా మందన్నా ఒకేసారి రెండు లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఓ వైపు 'పుష్ప 2: ది రూల్', 'కుబేర', 'సికందర్', 'ఛావా', వంటి క్రేజీ ప్రాజెక్టుల్లో అల్లు అర్జున్, ధనుష్, సల్మాన్ ఖాన్, విక్కీ కౌశల్ వంటి హీరోలకి జోడీగా నటిస్తూ దూసుకెళుతున్న ఈ



● అనుపమా పరమేశ్వరన్

బ్యూటీ మరోవైపు 'రెయిన్‌బో', 'ది గాళ్ ఫ్రెండ్' వంటి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లోనూ యాక్ట్ చేస్తున్నారు. శాంతరూబన్ దర్శకునిగా పరిచయమవుతున్న 'రెయిన్‌బో'లో రష్మికా మందన్నా లీడ్ రోల్ చేస్తున్నారు. రొమాంటిక్ ఫ్యాంటసీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై ఎస్ఆర్. ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్. ప్రభు నిర్మిస్తున్నారు. అదేవిధంగా 'చిలసౌ' (2018) సినిమాతో దర్శకుడిగా మారిన నటుడు రాహుల్ రవీంద్రన్ కొంచెం గ్యాప్ తర్వాత తెరకెక్కిస్తున్న సినిమా 'ది గాళ్ ఫ్రెండ్'. ఈ మూవీలో రష్మికా మందన్నా లీడ్ రోల్ చేస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్న ఈ సినిమాలో రష్మిక కళాశాల విద్యార్థి పాత్ర చేస్తున్నారని సమాచారం. ఓ కాలేజ్ స్టూడెంట్ ప్రేమ, సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్. ఈ మూవీలో కన్నడ నటుడు దీక్షిత్ శెట్టి, అనూ ఇమ్మాన్యుయేల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.



● సంయుక్తా మీనన్

మహిళల పరదా

పక్కింటి అమ్మాయి, హోమ్లీ గర్ల్ ఇమేజ్ ఉన్న అనుపమ పరమేశ్వరన్ 'రౌడీ బాయ్స్, టిల్లు స్క్వేర్' సినిమాలతో రూట్ మార్చారు. గ్లామరస్‌గా కనిపించడంతో పాటు ముద్దు సీన్స్‌లోనూ నటించి ఆశ్చర్యపరిచారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా తెలుగు చిత్రం 'పరదా'. 'ఇన్ ద నేమ్ ఆఫ్ లవ్' అనేది ఉపశీర్షిక. 'సినిమా బండి' మూవీ ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సంగీత, దర్శనా రాజేంద్రన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాకి 'పరదా' అనే టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్, కాన్సెప్ట్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. మహిళల చుట్టూ సాగే కథతో రూపొందుతోన్న ఈ సినిమా ప్రేక్షకుల్ని మరో ప్రపంచంలోకి తీసుకెళుతుందని యూనిట్ పేర్కొంది.

ఓ భక్తురాలి కథ

మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. సంజీవ్ కుమార్ మేగోటి దర్శకత్వం వహించారు.



● రష్మిక

రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో ఎమ్ ఎస్‌కే నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ''ఆదిపర్వం' ఓ అమ్మవారి కథ. అమ్మవారిని నమ్ముకున్న ఓ భక్తురాలి కథ. ఆ భక్తురాలిని దుష్ట శక్తుల నుండి కాపాడే ఓ క్షేత్ర పాలకుడి కథ. ఎర్రగుడి నేపథ్యంలో దైవానికి, దుష్టశక్తికి మధ్య జరిగే యుద్ధమే ఈ సినిమా. 1974 నుంచి 1992 మధ్యకాలంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాం. పీరియాడిక్ డ్రామాగా రూపొందిన ఈ మూవీలో గ్రాఫిక్స్ ప్రధానాకర్షణగా నిలుస్తాయి. మంచు లక్ష్మి నటన సరికొత్తగా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

సరికొత్త థ్రిల్లర్

మలయాళ, తెలుగు, తమిళ, కన్నడ సినిమాల్లో నటించి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు హీరోయిన్ సంయుక్తా మీనన్. తెలుగులో 'భీమ్లా నాయక్, బింబిసార, సార్, విరూపాక్ష' వంటి వరుస హిట్‌లను తన ఖాతాలో వేసుకున్న ఈ బ్యూటీ తొలిసారి ఓ లేడీ ఓరియంటెడ్ సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి హిట్ చిత్రాలు తీసిన నిర్మాత రాజేష్ దండా ఈ సినిమా నిర్మిస్తున్నారు. మాగంటి పిక్చర్స్, హాస్య మూవీస్ బ్యానర్స్‌పై రూపొందుతున్న ఈ సినిమాకి యోగేష్ కేఎంసీ దర్శకుడు. ఈ సినిమా బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభం అయింది. ''సరికొత్త యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ మూవీ రూపొందుతోంది. ఇది బలమైన మహిళా ప్రధాన పాత్రతో ఆకట్టుకునే కథ. స్క్రిప్ట్‌లో చాలా సామాజిక, రాజకీయ అంశాలు కూడా ఉన్నాయి. ఒక స్త్రీ తనదైన రీతిలో మొత్తం నెగిటివిటీని తగ్గించే మార్గం ఉంది. ఆమె ఎలా చేస్తుంది అనేది ఈ చిత్రకథ'' అని సంయుక్తా మీనన్ తెలిపారు.



● మంచు లక్ష్మి

కుమారి ఖండం నేపథ్యంలో..

హీరోయిన్‌గా గ్లామర్ పాత్రలు చేస్తూనే మరోవైపు క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటిస్తున్నారు శ్రద్ధా దాస్. ఆమె లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'త్రికాల'. 'స్క్రిప్ట్ ఆఫ్ గాడ్' అనేది ట్యాగ్‌లైన్. మణి తెల్లగూటి దర్శకత్వం వహించారు. రిత్విక్ సిద్ధార్థ్ సమర్పణలో మినర్వా పిక్చర్స్ బ్యానర్‌పై రాధికా శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ''భారీ బడ్జెట్‌తో ఫ్యాంటసీ, హారర్ మూవీగా 'త్రికాల' రూపొందింది. కుమారి ఖండం నేపథ్యాన్ని ఆధారంగా చేసుకుని నేటి కాలానికి తగ్గట్టుగా మార్పులు చేర్పులు చేశాం. పురాణ నేపథ్యంతో సాగే ఈ మూవీలో విజువల్ గ్రాఫిక్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది'' అని పేర్కొన్నారు మేకర్స్. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోన్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.



● శ్రద్ధా దాస్

హత్యలు చేసిందెవరు?

ప్రియమణి లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'క్యూజీ: కొటేషన్ గ్యాంగ్'. ఎస్టీఆర్ శ్రీను సమర్పణలో వివేక్ కుమార్ కన్నన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. జాకీ ష్రాఫ్, సన్నీ లియోన్, సారా అర్జున్ ఇతర పాత్రల్లో నటించారు. ఈ చిత్రం తెలుగు వరల్డ్ వైడ్ రిలీజ్ హక్కులను రుషికేశ్వర్ ఫిలింస్ అధినేత ఎం.వేణు గోపాల్ సొంతం చేసుకున్నారు. ''మంచి మాస్ మసాలా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా 'క్యూజీ: కొటేషన్' గ్యాంగ్' రూపొందింది. ముంబై, కశ్మీర్, చెన్నై ప్రాంతాల మధ్య కిరాయి హత్యలు చేసే గ్యాంగ్‌లకు సంబంధించిన కథ ఇది. ఒక హత్య కేసు ఈ మూడు ప్రాంతాలకు కనెక్ట్ అవుతుంది. అది ఏంటి అనేది సస్పెన్స్. నాలుగు స్టోరీలు, మూడు ప్రాంతాల్లో సాగుతాయి. స్క్రీన్‌ప్లే అద్భుతంగా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది.



● ప్రియమణి, సన్నీ లియోన్

ఇదిలా ఉంటే... హీరోయిన్లు నయనతార, కీర్తీ సురేష్, శ్రుతీహాసన్, హన్సిక, వరలక్ష్మీ శరత్‌కుమార్ వంటి వారు తమిళ భాషల్లో ప్రస్తుతం లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు.

– దేరంగుల జగన్

ఒక రోజు ముందుగానే..?



● అల్లు అర్జున్

హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో 'పుష్ప' ఫ్రాంచైజీలో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప: ది రూల్'. పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ టైటిల్ రోల్ చేస్తున్న ఈ చిత్రంలో శ్రీవల్లిగా రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 6న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. అయితే ఒకరోజు ముందుగానే... అంటే డిసెంబరు 5న రిలీజ్ చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలో ఉందట యూనిట్. ఇక ఈ చిత్రం టాకీ పార్టు చిత్రీకరణ దాదాపు తుది దశకు చేరుకుంది. రెండు పాటల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందట. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయి. 'పుష్ప: ది రూల్' సినిమా ఫస్టాఫ్‌ను పూర్తి చేసినట్లుగా కూడా చిత్రయూనిట్ స్పష్టం చేసింది. అనసూయ, ఫాహద్ ఫాజిల్, సునీల్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్త. ఈ సంగతి ఇలా ఉంచితే.. 'పుష్ప: ది రూల్' చిత్రాన్ని తొలుత ఆగస్టు 15న రిలీజ్ చేయాలనుకున్నారు. ఆ తర్వాత డిసెంబరు 6కి వాయిదా వేశారు. మరి.. వార్తల్లో ఉన్నట్లు ఒక రోజు ముందే థియేటర్లకు వస్తుందా? వేచి చూడాల్సిందే.

గుంగురు గుంగురు...



● గోపీచంద్, కావ్యా థాపర్

'చూపుల్లో చిలిపోడే... చేతల్లో మొండోడే.. మాటల్లో మంచోడే.. పెళ్లైన.. లొల్లైనా... తనతోనే ఫిక్సయ్యాలే...' అంటూ మొదలవుతుంది 'విశ్వం' సినిమాలోని 'గుంగుర గుంగుర' సాంగ్. గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపొందిన ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించారు. దోనేపూడి చక్రపాణి సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్ పతాకాలపై వేణు దోనేపూడి, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'మల్లారెడ్డి కాడా... తెచ్చానే... మల్లెమూర... నీళ్ల బాయికాడా జళ్లోనా పెడతారా... ఎల్లారెడ్డి గూడ... రాసిస్తాలే నీ పేర' అంటూ సాగే 'గుంగురు గుంగురు గుంగురు గుంగురు పార్టీ..' పాట లిరికల్ వీడియోను గురువారం రిలీజ్ చేశారు. సురేష్ గంగుల ఈ పాటను రాయగా, మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో, రోహిణీ సోరట్ పాడారు. 'విశ్వం' సినిమాకు చేతన్ భరద్వాజ్ సంగీతం అందించారు. ఈ సినిమాకు కెమెరా: కేవీ గుహన్.

మీరు భయపడ్డారు!

కార్తీక్ ఆర్యన్, త్రిప్తీ దిమ్రీ హీరో హీరోయిన్లుగా, మాధురీ దీక్షిత్, విద్యా బాలన్ కీలక పాత్రల్లో నటించిన హిందీ చిత్రం 'భూల్ భులయ్యా 3'. అనీస్ బాజ్మీ దర్శకత్వంలో ఈ హారర్ చిత్రాన్ని భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, మురాద్ ఖేతనీ నిర్మించారు. ఈ చిత్రం నవంబరు 1న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను జైపూర్‌లో రిలీజ్ చేశారు. 'ఐ యామ్ మంజులిక (ఈ సినిమాలోని దెయ్యం పాత్ర)', 'మీరు భయపడ్డారు', 'మంజూ... నీ కోసం నేను వస్తున్నాను', 'మా ఇద్దరిలో ఎవరు నిజమైన మంజులిక అని



● 'భూల్ భులయ్యా 3' పోస్టర్

ఆలోచిస్తున్నావ్ కదా' అన్న డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఇక ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విద్యా బాలన్ మాట్లాడుతూ- ''17 ఏళ్ల తర్వాత 'భూల్ భులయ్యా' ఫ్రాంచైజీలో భాగం కావడం సంతోషంగా ఉంది. 'భూల్ భులయ్యా 3'ను థియేటర్స్‌లో చూడండి. లేకపోతే మంజులిక మిమ్మల్ని వెంబడిస్తుంది (సరదాగా..)'' అని తెలిపారు. ''ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు కార్తీక్ ఆర్యన్.

మేం పాస్ అయ్యాం

- నిర్మాత 'దిల్' రాజు




● సందీప్ రెడ్డి, సంగీర్తన, సుహాస్, 'దిల్'రాజు, హర్షిత్

''నా 21 ఏళ్ల సినీ కెరీర్‌లో ఎంతో మంది దర్శకుల్ని పరిచయం చేశాను. దిల్ రాజు ప్రొడక్షన్స్ ద్వారా చిన్న చిత్రాలను, కొత్త టాలెంట్‌ను తీసుకు రావాలనుకున్నాం. అలా 'బలగం' సినిమా వచ్చింది. చిన్న చిత్రాన్ని ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లడం చాలా కష్టం. అందుకే 'బలగం'లా రిలీజ్‌కు ముందే మా 'జనక అయితే గనక'ని చాలా మందికి చూపించాం. మంచి స్పందన వచ్చింది.. మేం పాస్ అయ్యాం'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. సుహాస్, సంగీర్తన జంటగా సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహించిన చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ మూవీ రేపు (శనివారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి డైరెక్టర్స్ 'బలగం' వేణు, వశిష్ఠ అతిథులుగా విచ్చేశారు. 'బలగం' వేణు మాట్లాడుతూ- ''జనక అయితే గనక' నాకు చాలా నచ్చింది. ఫ్యామిలీ అందరూ నవ్వుతూ ఎంజాయ్ చేసేలా మంచి సందేశాత్మక చిత్రం అవుతుంది'' అన్నారు. ''స్కూల్ ఫీజులు, హాస్పిటల్ ఖర్చులు... ఇలా అందరికీ ఈ మూవీ కనెక్ట్ అవుతుంది. 'దిల్' రాజుగారి బ్యానర్‌లో వచ్చిన 'బొమ్మరిల్లు' సినిమా రేంజ్‌లో 'జనక అయితే గనక' బ్లాక్ బస్టర్ అవుతుంది'' అని వశిష్ఠ చెప్పారు. ''మా సినిమా దసరా సందర్భంగా 12న వస్తోంది.. అందరూ చూడండి'' అని సందీప్ రెడ్డి బండ్ల, సుహాస్, సంగీర్తన కోరారు. ఈ వేడుకలో ఎడిటర్ పీకే, సింగర్, నటుడు రోల్ రైడా మాట్లాడారు.

మరో అతిథి పాత్రలో...

అతిథి పాత్రలపై సల్మాన్ ఖాన్ ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నట్లున్నారు. ఆల్రెడీ వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్న హిందీ చిత్రం 'బేబీ జాన్'లో సల్మాన్ ఖాన్ ఓ అతిథి పాత్ర చేస్తున్నారు. అజయ్ దేవగన్ హీరోగా చేస్తున్న 'సింగమ్ ఎగైన్' సినిమాలోనూ సల్మాన్ ఓ గెస్ట్ రోల్ చేశారనే టాక్ బాలీవుడ్‌లో వినిపించింది. తాజాగా హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌లు హీరోలుగా నటిస్తున్న హిందీ మూవీ 'వార్ 2'లో కూడా సల్మాన్ ఖాన్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారనే టాక్ బాలీవుడ్‌లో తెరపైకి వచ్చింది. వైఆర్ఎఫ్ (యశ్ రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా 'వార్ 2' చిత్రం తెరకెక్కుతోంది. ఆల్రెడీ ఈ స్పై యూనివర్స్‌లోని 'టైగర్' ఫ్రాంచైజీ చిత్రాల్లో సల్మాన్ ఖాన్ నటించారు. దీంతో 'వార్ 2'లో సల్మాన్ ఖాన్ స్పైగా ఓ అతిథి పాత్రను పోషించేలా ఈ చిత్రదర్శకుడు అయాన్ ముఖర్జీ కథలో చిన్న మార్పు చేశారట. మరి... 'వార్ 2'లో సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ఒకే సీన్‌లో కనిపిస్తే సినిమా ఫ్యాన్స్‌కు పండగే అని చెప్పవచ్చు. ఇది నిజం అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.

● సల్మాన్ ఖాన్



సామాన్యుడు నుంచి సంపన్నుడు వరకూ


చరిత్ర మరువదు... నీ ఘనత





గుడ్‌బై మై లైట్‌హౌస్

రతన్ టాటా యువ సహచరుడు శంతను నాయుడు



ముంబై: ''ఈ స్నేహంలో అగాధం ఇప్పుడు నాతో ఉండిపోయింది. నా మిగిలిన జీవిత కాలంలో దీన్ని పూరించేందుకు కృషి చేస్తాను''అంటూ శంతను నాయుడు తన స్పందనను వ్యక్తం చేశారు. 31ఏళ్ల ఈ యువకుడు రతన్‌టాటాకు అత్యంత విశ్వసనీయ సహచరుడు. వృద్ధాప్యంలో ఆయన బాగోగులు చూసుకున్న ఆప్త మిత్రుడు. రతన్‌టాటా అంతిమయాత్ర వాహనం ముందు యెజ్డీ మోటారుసైకిల్ నడుపుతున్న శంతనునాయుడిని చూసే ఉంటారు. ''దుఃఖం అనేది ప్రేమకు చెల్లించాల్సిన మూల్యం. గుడ్‌బై, నా ప్రియమైన దీపస్తంభం''అంటూ చిన్న పోస్ట్ పెట్టాడు. టాటా గ్రూప్‌లో ఐదవ తరం ఉద్యోగి శంతనునాయుడు. 2014లో రతన్‌టాటా, శంతను కలుసుకున్నారు. వీధి శునకాల పట్ల ప్రేమ వీరిద్దరినీ కలిపిందని చెప్పుకోవాలి. వీధి శునకాలు రాత్రి వేళల్లో వాహన ప్రమాదాలకు గురి కాకుండా, వాటి కోసం మెరిసే కాలర్లను శంతను డిజైన్ చేశాడు. కుక్కల మెడలో ఈ కాలర్‌ను ఉంచితే, రాత్రివేళ వాహన వెలుగులకు మెరవడంతో డ్రైవర్లు వాటిని గుర్తిస్తారన్నది అతడి యోచన. ఇందుకు నిధుల సాయం కావాలంటూ రతన్‌టాటాకు లేఖ రాశాడు. ముంబైలోని తన కార్యాలయానికి రావాలని, తనతో కలసి పనిచేయాలంటూ రతన్ టాటా నుంచి శంతనుకు పిలుపు వచ్చింది. రతన్‌టాటా సహకారంతో మోటోపాస్ అనే కంపెనీని శంతను స్థాపించాడు. వృద్ధులకు తోడుగా యువ సహచరులను కలిపే స్టార్టప్ 'గుడ్ ఫెలోస్'ను సైతం స్థాపించాడు. ఆ తర్వాత ఎంబీఏ కోసం యూఎస్ వెళుతూ. తిరిగి వచ్చిన తర్వాత కలసి పనిచేస్తానని రతన్‌టాటాకు శంతను హామీఇచ్చాడు. తిరిగొచ్చిన తర్వాత రతన్‌టాటా అసిస్టెంట్‌గా, టాటా ట్రస్ట్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించాడు. రతన్‌టాటా తుదిశ్వాస విడిచే వరకు ఆయన వెన్నంటి ఉన్నాడు.

రతన్‌టాటాకు మోదీ ఎస్‌ఎంఎస్

బెంగాల్ నుంచి గుజరాత్‌కు నానో ప్లాంట్



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో 'వెల్‌కమ్' అంటూ రతన్ టాటాకు పంపించిన ఒక ఎస్‌ఎంఎస్.. సామాన్యుల కారు 'నానో' ప్లాంట్‌ను పశ్చిమబెంగాల్‌లోని సింగూర్ నుంచి గుజరాత్‌లోని సనంద్‌కు తరలేలా చేసింది. పశ్చిమబెంగాల్‌లోని సింగూర్‌లో టాటా నానో ప్లాంట్ కోసం భూసమీకరణకు వ్యతిరేకంగా ప్రస్తుత సీఎం, నాటి ప్రతిపక్ష నేత మమతా బెనర్జీ రైతులతో కలసి 2006లో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అది ఎంతకీ పరిష్కారమయ్యేలా కనిపించకపోవడంతో రాష్ట్రంలో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంటున్నట్టు రతన్ టాటా ప్రకటించారు. ఆ సమయంలో తాను పంపిన ఎస్‌ఎంఎస్ ఎలాంటి ఫలితాన్నిచ్చిందన్నది నాటి సీఎం మోదీ తర్వాత స్వయంగా ప్రకటించారు. ''తాము పశ్చిమబెంగాల్‌ను వీడుతున్నట్టు కోల్‌కతాలో రతన్‌టాటా మీడియా సమావేశంలో ప్రకటిస్తున్న వేళ, 'వెల్‌కమ్' అంటూ నేను ఒక చిన్న ఎస్‌ఎంఎస్ పంపాను. రూపాయి ఖర్చుతో పంపించిన ఎస్‌ఎంఎస్ ఏమి చేయగలదో మీరు ఇప్పుడు చూస్తున్నారు''అంటూ గుజరాత్‌లోని సనంద్‌లో రూ.2,000 కోట్లతో టాటా ఏర్పాటు చేసిన నానో ప్లాంట్‌ను 2010లో ప్రారంభిస్తున్న వేళ నాటి సీఎం మోదీ ప్రకటించారు. దేశ పారిశ్రామిక చరిత్రలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోతుంది.



టీసీఎస్ భేష్



- క్యూ2 నికర లాభం రూ. 11,909 కోట్లు
- మొత్తం ఆదాయం రూ. 64,988 కోట్లు
- 2025–26కు క్యాంపస్ హైరింగ్ షురూ

ముంబై: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) మరోసారి పటిష్ట ఫలితాలు సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో నికర లాభం 5 శాతం బలపడి రూ. 11,909 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలం(క్యూ2)లో రూ. 11,342 కోట్లు ఆర్జించింది. అయితే ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్–జూన్)లో ఆర్జించిన రూ. 12,040 కోట్లుతో పోలిస్తే లాభాలు నామమాత్రంగా తగ్గాయి. పన్నుకుముందు లాభం రూ. 15,330 కోట్ల నుంచి రూ. 16,032 కోట్లకు మెరుగుపడింది. ఇక మొత్తం ఆదాయం 7% పుంజుకుని రూ. 64,988 కోట్లకు చేరింది. గతేడాది క్యూ2లో రూ. 60,698 కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ ఏడాది క్యూ1లో రూ. 63,575 కోట్లు అందుకున్న సంగతి తెలిసిందే.

అనిశ్చితుల ఎఫెక్ట్




గత కొన్ని త్రైమాసికాలుగా కనిపిస్తున్న అప్రమత్తత తాజా క్వార్టర్‌లోనూ కొనసాగింది. ప్రపంచ భౌగోళిక, రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లోనూ మా అతిపెద్ద విభాగం బీఎఫ్‌ఎస్‌ఐ రికవరీ బాటలో సాగుతోంది. వృద్ధి మార్కెట్లలో పటిష్ట పనితీరు చూపాం. క్లయింట్లు, ఉద్యోగులు, వాటాదారుల విలువ పెంపుపై ప్రత్యేక దృష్టిని కొనసాగిస్తున్నాం.

– కె.కృతివాసన్, సీఈవో, ఎండీ

ఇతర విశేషాలు

- ఆర్డర్ బుక్ విలువ (టీసీవీ) 8.6 బి. డాల ర్లకు చేరింది. దీనిలో ఉత్తర అమెరికా నుంచి 4.2 బిలియన్ డాలర్లు లభించింది.
- మొత్తం సిబ్బంది సంఖ్య 6,12,724కు చేరింది.
- షేరుకి రూ. 10 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో టీసీఎస్ షేరు బీఎస్‌ఈలో 0.6% నీరసించి రూ. 4,228 వద్ద ముగిసింది.



టాటా ఎలక్సీ లాభం జూమ్

క్యూ2లో రూ. 229 కోట్లు

న్యూఢిల్లీ: ఇంజినీరింగ్ టెక్నాలజీ సర్వీసుల టాటా గ్రూప్ కంపెనీ టాటా ఎలక్సీ ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 15 శాతం ఎగసి రూ. 229 కోట్లను తాకింది. త్రైమాసికవారీగా(క్యూ1తో చూస్తే) 25 శాతం వృద్ధి ఇది. మొత్తం ఆదాయం 8 శాతం పుంజుకుని రూ. 955 కోట్లకు చేరింది. ట్రాన్స్‌పోర్టేషన్ విభాగం సేవలకు డిమాండ్ పెరగడం ఇందుకు తోడ్పాటునిచ్చింది. తాజా ఆర్డర్ల బుక్‌లో యూరోపియన్ దిగ్గజం నుంచి లభించిన 5 కోట్ల డాలర్ల విలువైన కాంట్రాక్ట్ సైతం ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 0.7 శాతం మెరుగుపడి 27.9 శాతాన్ని తాకాయి. ఫలితాల నేపథ్యంలో టాటా ఎలక్సీ షేరు బీఎస్‌ఈలో 2 శాతం బలపడి రూ. 7,762 వద్ద ముగిసింది.



టాటా షేర్ల ర్యాలీ!

ముంబై: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతికి నివాళిగా టాటా గ్రూప్ షేర్లు పరుగులు తీశాయి. దీంతో ఆరంభంలో భారీ లాభాల్లో నిలిచిన సూచీలు చివర్లో సంతాప సూచికగా కాస్త వెనుకంజ వేశాయి. దీంతో సెన్సెక్స్ 144 పాయింట్ల స్వల్ప లాభంతో 81,611 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17 పాయింట్లు పెరిగి 24,998 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ప్రథమార్థంలో 536 పాయింట్లు పెరిగి 82,003 వద్ద, నిఫ్టీ 152 పాయింట్లు బలపడి 25,134 వద్ద గరిష్టాన్ని తాకాయి. మిడ్ సెషన్ తర్వాత ఐటీ, ఫార్మా షేర్లలో లాభాల స్వీకరణతో లాభాలు తగ్గాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.36% నష్టపోగా, స్మాల్‌క్యాప్ అరశాతం పెరిగింది. అమెరికా ఫెడరల్



రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాల నేపథ్యంలో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

టాటా గ్రూప్ షేర్ల నివాళి...

రతన్ టాటా మృతికి ఘనమైన నివాళి అర్పిస్తూ టాటా గ్రూప్ కంపెనీల షేర్లు ట్రేడింగ్‌లో భారీ లాభాలు ఆర్జించాయి. ఇంట్రాడేలో టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ షేరు 10.50% ర్యాలీ చేసి చివరికి 6% లాభంతో ముగిసింది. టాటా కెమికల్స్ 6% పెరిగి ఆఖరికి 4% వద్ద స్థిరపడింది. అలాగే ఇదే గ్రూప్ చెందిన టాటా ఎలాక్సీ, ఇండియన్ హోటల్స్ 2%, టాటా టెక్నాలజీస్ 1.50% చొప్పున లాభపడ్డాయి. టాటా నెల్కో 1%, టాటా స్టీల్ 0.50%, టాటా కమ్యూనికేషన్ 0.17 శాతం పెరిగాయి.

టాటా షేర్ల హవా

చైర్మన్ ఎమిరిటస్ రతన్ టాటా అధ్యక్షతన గత ఐదేళ్ల కాలంలో టాటా గ్రూప్ ఆదాయాలు, కంపెనీల విలువలరీత్యా పోల్‌వాల్ట్ చేసింది. గత ఐదేళ్లలో టాటా గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీల పరుగు..

కంపెనీ పేరు	షేరు ర్యాలీ(%)
టాటా టెలీసర్వీసెస్	3002
ఆటోమోటివ్ స్టాంపింగ్స్	2211
ట్రెంట్	1499
టాటా ఎలక్సీ	1109
టాటా ఇన్వెస్ట్‌మెంట్	820
టాటా పవర్	686
టాటా మోటార్స్	628
టీఆర్‌ఎఫ్	489
టాటా కమ్యూనికేషన్స్	453
ఓరియంటల్ హోటల్స్	391
ఇండియన్ హోటల్స్	376
టాటా స్టీల్	362
టాటా కెమికల్స్	347
నెల్కో	333
టాటా కన్స్యూమర్	304
టైటన్ కంపెనీ	176
వోల్టాస్	165
టీసీఎస్	111
ర్యాలీస్ ఇండియా	81

మరో 85 విమానాలకు ఎయిర్ ఇండియా ఆర్డర్!

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా తాజాగా 85 విమానాలకు ఎయిర్‌బస్‌కు ఆర్డర్ ఇచ్చి నట్టు సమాచారం. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి మొత్తం 667 ఎయిర్‌క్రాఫ్ట్‌కు ఆర్డర్లు పొందామని ఎయిర్‌బస్ తెలిపింది. ఎయిర్‌బస్, బోయింగ్‌కు 2023 ఫిబ్రవరిలో 470 విమానాలకు ఎయిర్ ఇండియా ఆర్డర్ ఇచ్చింది.

భారత 'రత్న'మా... నీకిక 'టాటా'..

పారిశ్రామిక దిగ్గజానికి ప్రముఖుల నివాళి

చెరగని ముద్ర



శ్రీ రతన్‌టాటా మరణం బాధాకరం. అత్యుత్తమ నాయకత్వం, దార్శనికత కలిగిన వ్యాపారవేత్త, దాతృత్వవాదిగా ఆయన సేవలు మన సమాజంపై చెరగని ముద్ర వేశాయి. ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆయన ప్రభావితం చేసిన వ్యక్తులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను

– నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి

ఆయన సేవలు అజరామరం



రతన్‌టాటాజీ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను. గొప్ప జాతీయవాది, దార్శనిక వ్యాపారవేత్త, టాటా గ్రూప్ చైర్‌పర్సన్‌గా తన అసాధారణ విజయాలతో భారత్‌కు గొప్ప పేరు తీసుకొచ్చారు. చివరి శ్వాస వరకు సమాజానికి అందించిన సేవలకు గుర్తుగా ప్రతిష్టాత్మక పద్మ భూషణ్, పద్మ విభూషణ్ అవార్డులు ఆయన్ను వరించాయి

– పీయూష్ గోయల్, కేంద్ర వాణిజ్య మంత్రి

శతాబ్దానికి ఒక్కరు..



టాటా ఓ గొప్ప వ్యాపార నాయకుడు. దేశాలు ఇలాంటి నేతలను శతాబ్దానికి ఒక్కరినే పొందుతాయి. టాటా గ్రూపు వృద్ధికి మించి ఆయన అభిరుచి కొనసాగింది. దాతృత్వ కార్యక్రమాల ద్వారా లక్షలాది భారతీయులకు సేవలు అందించారు''

– వేణు శ్రీనివాసన్, టీవీఎస్ మోటార్స్ గౌరవ చైర్మన్

ఆయన సేవలు అసమానం..



ప్రపంచం అచ్చమైన దార్శనికుడు, మానవతావాదిని కోల్పోయింది. వ్యాపారం, సమాజానికి ఆయన అందించిన అసమానమైన సేవలు ఆయన వారసత్వంగా ఎప్పటికీ నిలిచి ఉంటాయి

– సంజీవ్ గోయెంకా, ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ చైర్మన్

పరిశ్రమలు, ప్రజా జీవితాలపై ముద్ర



వ్యాపారాలన్నవి ఆర్థికాభివృద్ధికే కాదు, సామాజిక పురోగతికి ఉత్ప్రేరకాలూ అని నిరూపించారు. ఆయన నిర్ణయాలు ఆర్థిక అంశాలకు మించి పరిశ్రమలు, ప్రజా జీవితాలను ప్రభావితం చేశాయి. ఆయన వారసత్వం భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుంది

– కుమారమంగళం బిర్లా, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్


ఒక వ్యక్తి కాదు సంస్థ



రతన్ టాటా భారత్‌కు చెందిన ప్రముఖ, గొప్ప వ్యాపారవేత్తే కాదు, ఆయనొక సంస్థ. టాటాను అంతర్జాతీయంగా విస్తరించడం ద్వారా టాటా వారసత్వంలో ఎన్నో శాశ్వత అధ్యాయాలు లిఖించారు. భారతీయుల్లో ఆయన ఎప్పుడూ జీవించే ఉంటారు

– జీపీ హిందుజా, హిందుజా గ్రూప్ చైర్మన్

ఎయిర్‌ఇండియాతో కలసి నడుస్తాం



మిస్టర్ టాటాకు విమానయానం పట్ల ఉన్న ప్రేమ, భారత విమానయాన భవిష్యత్తు పట్ల ఆయన దూరదృష్టికి నివాళిగా, అంతర్జాతీయ విమానయాన రంగంలో భారత్‌కు సముచిత స్థానం కోసం ఎయిర్ ఇండియాతో కలసి నడుస్తాం

– రాహుల్ భాటియా, ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ (ఇండిగో) ఎండీ

ఆయన వారసత్వం శాశ్వతం



రతన్ టాటా మరణం పట్ల మేము ఎంతో విచారం వ్యక్తం చేస్తున్నాం. ఆయన దార్శనిక నాయకత్వం, భారత పరిశ్రమలకు అందించిన సేవలతో ఆయన వారసత్వం చిరస్థాయిగా నిలిచిపోతుంది

– ఉన్సూకిమ్, హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ

ప్రపంచ శక్తిగా టాటా గ్రూప్‌ను నిలబెట్టారు



రతన్ టాటా అందించిన నాయకత్వం కార్పొరేట్ బాధ్యత, ఆవిష్కరణలను పునర్‌నిర్వచించింది. నైతిక విలువలే పునాదిగా టాటా గ్రూప్‌ను ప్రపంచశక్తిగా నిలిపింది. ఆయన మరణం పట్ల చింతిస్తున్న ఈ వేళ.. భారత్ నిర్మాణానికి గణనీయంగా దోహదపడిన ఆయన వారసత్వం, విలువలను గౌరవిస్తున్నాం

– సీఎస్ శెట్టి, ఎస్‌బీఐ చైర్మన్

భారత ప్రగతిలో గొప్ప పాత్ర



భారత ఆర్థిక వ్యవస్థ చరిత్రాత్మకంగా ముందుకు దూసుకుపోతున్న స్థితిలో ఉంది. టాటా జీవితం, పని ఈ రోజు మనం ఈ స్థితిలో ఉండడంలో గొప్ప పాత్ర పోషించాయి

– ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూప్ చైర్మన్

ఆధునిక వ్యాపార మార్గదర్శి



అసాధారణమైన వ్యాపార, దాతృత్వ వారసత్వాన్ని ఆయన వదిలి వెళ్లారు. భారత్‌లో ఆధునిక వ్యాపారాలకు మార్గదర్శకత్వం, అభివృద్ధిలో ఆయన పాత్ర కీలకం''

– సుందర్ పిచాయ్, గూగుల్ సీఈవో

భారత స్ఫూర్తి ప్రదాత



రతన్ టాటా కేవలం వ్యాపార నాయకుడే కాదు. భారత స్ఫూర్తి, సమగ్రత, కరుణ, గొప్ప మేలు కోసం తిరుగులేని నిబద్ధత మూర్తీ భవించిన నేత

– గౌతమ్ అదానీ, అదానీ గ్రూప్ అధినేత

రోల్ మోడల్



ప్రియమైన స్నేహితుడిని కోల్పోవడం ఎంతో బాధిస్తోంది. విలువలతో కూడిన నాయకత్వం విషయంలో రతన్‌టాటా నాకు రోల్ మోడల్. నైతిక సమస్యల విషయంలో సందిగ్ధత ఎదుర్కొన్నప్పుడు ఆయన నాకు దిక్సూచిగా నిలిచారు.

– నారాయణ మూర్తి, ఇన్ఫోసిస్ కో ఫౌండర్

ప్రతీ భారతీయుడికి చిహ్నం



రతన్‌టాటా మరణంతో భారత పరిశ్రమ తన కిరీటంలో ఆభరణాన్ని మాత్రమే కోల్పోలేదు, ఆయన దార్శనికత మరియు అత్యుత్తమ వ్యక్తిగత లక్షణాలు ప్రతి భారతీయుడికి చిహ్నంగా మారాయి. విలువను సృష్టించడం ఒకరి కోసం కాదు, దేశ పురోగతికి, గొప్ప ప్రయోజనం కోసం అన్న ఆయన ఆచరణ నాకు స్ఫూర్తినిచ్చింది

– అనిల్ అగర్వాల్, వేదాంత చైర్మన్

సమాజానికి తిరిగిచ్చారు..



గౌరవనీయ వ్యాపారవేత్త. సమాజానికి తిరిగిస్తానన్న హామీకి అనుగుణంగా జీవించారు. యువతరానికి ఆయన స్ఫూర్తి

– ప్రియా అగర్వాల్ హెబ్బర్, హిందుస్థాన్ జింక్ చైర్‌పర్సన్

చిరకాల ముద్ర..



మిస్టర్ టాటా మరణం ఒక శకానికి ముగింపు. టాటా గ్రూప్ ప్రస్థానంపై చిరకాల ముద్ర వేసిన నాయకుడిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారు. టాటా గ్రూప్, రతన్‌టాటాతో మిస్త్రీ కుటుంబానికి దీర్ఘకాల అనుబంధం ఉంది

– షాపూర్జీ మిస్త్రీ, ఎస్పీ గ్రూప్ చైర్మన్

క్రీడల్లోనూ రతన్ ముద్ర



జంషెడ్‌పూర్‌లో టాటా హాకీ అకాడమీ ప్రారంభోత్సవ వేళ... (ఫైల్)

న్యూఢిల్లీ/ముంబై: భారత పారిశ్రామిక రంగంలోనే కాదు... క్రీడారంగంలోనూ 'టాటా' చెరగని ముద్ర వేసింది. స్వాతంత్య్రానికి పూర్వంలో భారత్ 1920లో అంట్‌వర్ప్ ఒలింపిక్స్‌కు టాటా గ్రూపే స్పాన్సర్‌గా వ్యవహరించింది. అప్పటి నుంచి క్రీడలపై కూడా తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తూనే వచ్చింది. రతన్ టాటా వచ్చాక ఇది మరింతగా పెరిగింది. జీవనశైలిలో క్రీడలు భాగమేనని రతన్ అనే వారు. 'టాటా' ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్), టాటా స్టీల్ చెస్ ఇలా ఒకటేమిటి ఆర్చరీ, ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్ ఫుట్‌బాల్), అథ్లెటిక్స్‌లలో రతన్ ఉదారత, దార్శనీయత, నిబద్ధత నిరుపమానమని పలువురు క్రీడా విశ్లేషకులు అభివర్ణించారు.

- 1991లో జేఆర్‌డీ టాటా స్పోర్ట్స్ అకాడమీ నెలకొల్పిన నాటి నుంచి ఫుట్‌బాల్, హాకీ, ఆర్చరీ, ఈక్వెస్ట్రియన్, బాక్సింగ్, కరాటే, రాకెట్ స్పోర్ట్స్ ఇలా 19 క్రీడాంశాలకు ప్రసిద్ధ శిక్షణ సంస్థగా టాటా స్పోర్ట్స్ అకాడమీ ఎదిగిందని ఇందులో రతన్ పాత్ర చాలా కీలకమని అకాడమీకి చెందిన ఉన్నతాధికారి ఒకరు అన్నారు.
- 1924లో ఏర్పాటైన భారత ఒలింపిక్ సంఘానికి తొలి అధ్యక్షుడు సర్ దోరబ్జి టాటా కావడం విశేషం. నెదర్లాండ్స్‌లో జరిగే టాటా స్టీల్ చెస్‌ను కొందరు చెస్ దిగ్గజాలు 'వింబుల్డన్ ఆఫ్ చెస్'గా అభివర్ణిస్తారు. 2007 నుంచి టాటా స్టీల్ సంస్థ స్పాన్సర్‌షిప్‌లోనే ఈ టోర్నీ జరుగుతోంది.

"స్వాతంత్య్రానంతరం పది మంది గొప్ప వాళ్ల జాబితాను తయారు చేస్తే అందులో రతన్ అగ్రస్థానంలో ఉంటారు. తన కోసం కాకుండా దేశం కోసం ఒక వ్యక్తి ఓ వ్యవస్థను ఎలా మార్చగలడో, ఓ పరిశ్రమను ఎలా సృష్టించగలడో నిరూపించిన దిగ్గజం రతన్ టాటా. గొప్ప మానవతావాది. మూగజీవాల పట్ల కారుణ్యం, సమాజం పట్ల బాధ్యత ఉన్న మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. నేను ఆయన్ని చాలాసార్లు కలిశాను. ఆయన చాతుర్యం అపారం. ఆయనెప్పుడు మన మనస్సుల్లో చిరస్థాయిగా గుర్తుండిపోతారు. దేశం కోసం ఆయనేం చేశాడో, భారత పారిశ్రామిక రంగాన్ని దశదిశలా వ్యాప్తిచేసిన ఆయన గురించి ఎంత చెప్పినా... వర్ణించినా తక్కువే -కపిల్‌దేవ్, భారత క్రికెట్ దిగ్గజం

పారిశ్రామిక దిగ్గజం, దాతృత్వానికి నిలువెత్తు రూపం రతన్ టాటా ఇక లేరనే వార్త అత్యంత విచారకరం. చెస్ టోర్నీ ఆయన ఎంతో చేశారు. టాటా స్టీల్ చెస్‌లో ఆడటమే గొప్ప గౌరవంగా భావించేలా ఆ టోర్నీని మార్చేశారు. -చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్

శ్రీ రతన్ టాటా మరణవార్త నన్ను దుఖంలో ముంచేసింది. ఆయన దూరదృష్టి అద్భుతం. ఆయనతో నేను గడిపిన క్షణాలు, సంభాషణ జీవితంలో మరచిపోలేను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. -ఒలింపిక్ చాంపియన్ నీరజ్ చోప్రా

రతన్ టాటా చూపిన మార్గం, చేసిన దిశానిర్దేశం దేశం ఎప్పటికి మరచిపోదు. మేమంతా మిమ్మల్ని అనుసరిస్తాం. -బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్

రతన్ ఒక్క పారిశ్రామిక రంగానికే కాదు... భారత సమాజానికి ఎనలేని సేవలందించారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచారు. -దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే

గంభీర్ సూచించాడు నేను పాటించాను

బంగ్లాదేశ్‌తో రెండో టి20లో మెరుపు ఇన్నింగ్స్‌పై నితీశ్ కుమార్ రెడ్డి వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి బంగ్లాదేశ్‌పై రెండో టి20లో చెలరేగేందుకు కోచ్ గౌతమ్ గంభీర్ కిటుకులు దోహదం చేశాయని చెప్పాడు. తన ఆల్‌రౌండ్ ప్రదర్శన క్రెడిట్ అంతా కోచ్‌కే దక్కుతుందన్నాడు. పవర్‌ప్లేలోనే టాపార్డర్‌ను కోల్పోయిన దశలో నితీశ్, హిట్టర్ రింకూ సింగ్‌లు మెరుపు అర్ధశతకాలతో బంగ్లా బౌలర్లను చితగ్గొట్టారు. నాలుగో వికెట్‌కు వీరిద్దరు కేవలం 49 బంతుల్లోనే 108 పరుగులు జోడించడం మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. ఆంధ్ర హిట్టర్ ఏకంగా ఏడు సిక్సర్లు బాదడం విశేషం. 34 బంతుల్లోనే 74 పరుగులు చేయడంతో పాటు రెండు వికెట్లు తీసిన అతనికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కిన సంగతి తెలిసిందే! భాగస్వామ్యంపై అతను మాట్లాడుతూ 'మా ఇద్దరి మధ్య సానుకూల సంభాషణ జరిగింది. ఎలాంటి ఒత్తిడికి గురవొద్దని నిర్ణయించుకున్నాం. మా దృష్టి ఎదుర్కొనే స్పిన్నర్లపైనే ఉంది. స్కోరుపై కాదు! ఈ ఓవర్ మనకు కీలకమని అనుకున్నాం. అదే అదనుగా దంచేశాం. నిజం చెప్పాలంటే ఈ మెరుపు ప్రదర్శనకు కారణం కోచ్ గంభీరే. అతను నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాడు. ముఖ్యంగా బౌలింగ్‌పై బెంగ పెట్టుకోవద్దని చెప్పాడు. బౌలింగ్ చేసేటపుడు బౌలర్‌గానే ఆలోచించాలని బ్యాటర్‌గా కాదని చెప్పాడు. ఇది నాకు బాగా పనిచేసింది. యథేచ్ఛగా ఆడేలా, స్వేచ్ఛగా బౌలింగ్ చేసేలా ఉపకరించింది' అని బీసీసీఐ వీడియోలో నితీశ్ వెల్లడించాడు. భారత్ తరఫున ఆడుతూ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అందుకున్నందుకు చాలా గర్వంగా ఫీలవుతున్నానని తెలిపాడు. రింకూ సింగ్ మాట్లాడుతూ... 'నితీశ్, నేను బ్యాటింగ్‌లో చెలరేగడాన్ని ఆస్వాదించాను' అని చెప్పాడు. ఇలా బాదడం బహుశా భగవంతుడి ప్రణాళిక కావొచ్చని నితీశ్‌కు చెప్పినట్లు రింకూ పేర్కొన్నాడు. టాపార్డర్ కూలినపుడు, ఒత్తిడిలోనే ఇలాంటి భాగస్వామ్యాలు సాధ్యమైనట్లు చెప్పాడు. తాను భారత్‌కు ఎంపికైన ప్రతీసారి సిరీస్ గెలుపొందడం చెప్పుకోదగ్గ విశేషమన్నాడు. కెప్టెన్ సూర్యకుమార్ తమదైన శైలిలోనే ఆడేందుకు స్వేచ్ఛ ఇచ్చినట్లు చెప్పాడు.


డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు

'రంజీ' సమరానికి వేళాయె!

- నేటి నుంచి దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నమెంట్
- టైటిల్ బరిలో 32 జట్లు
- ఈసారీ దూరంగా ఉండనున్న పలువురు భారత స్టార్స్
- గ్రూప్ 'బి'లో ఆంధ్ర, హైదరాబాద్

న్యూఢిల్లీ: దేశవాళీ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీకి వేళైంది. నేటి నుంచి మొదలయ్యే ఈ టోర్నీలో 32 జట్లు నాలుగు గ్రూప్‌లుగా విడిపోయి పోటీ పడుతున్నాయి. టెస్టు సీజన్ కారణంగా భారత జట్టు ప్రధాన ఆటగాళ్లు రంజీ ట్రోఫీకి అందుబాటులో లేకపోగా... వర్ధమాన ఆటగాళ్లు కూడా వివిధ సిరీస్‌ల వల్ల సీజన్‌లో అన్నీ మ్యాచ్‌లు ఆడే పరిస్థితి లేదు. దీంతో సెలెక్టర్ల దృష్టిలో పడేందుకు కొత్తవాళ్లకు ఇదే సరైన అవకాశం. జాతీయ జట్టుకు ఎంపిక కావాలంటే దేశవాళీల్లో ఆడాల్సిందే అని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో... స్టార్ ప్లేయర్లు తప్ప మిగిలిన వాళ్లంతా వీలున్న సమయంలో ఈ టోర్నీలో పాల్గొననున్నారు. దేశవాళీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదనే కారణంతో శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌పై బోర్డు క్రమశిక్షణ చర్యలు తీసుకున్న నేపథ్యంలో... యువ ఆటగాళ్లు అందరూ రంజీ ట్రోఫీ ఆడేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. హైదరాబాద్, ఆంధ్ర జట్లు గ్రూప్ 'బి' నుంచి బరిలోకి దిగుతున్నాయి. ఐపీఎల్‌లో మెరుపులు మెరిపిస్తే చాలు జాతీయ జట్టుకు ఎంపిక వొచ్చు అనే ఆలోచన ఆటగాళ్లకు రాకుండా... దేశవాళీల్లో రాణిస్తేనే టీమిండియా తలుపులు తెరుచుకుంటాయి అని బోర్డు సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో ప్లేయర్లు తమ శక్తియుక్తులను వాడేందుకు సిద్ధమయ్యారు. రంజీ సీజన్‌లోనే భారత జట్టు న్యూజిలాండ్‌తో స్వదేశంలో మూడు టెస్టులు, ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఐదు టెస్టులు ఆడనున్న నేపథ్యంలో అసాధారణ ప్రదర్శన కనబరిస్తే టీమిండియా గడప తొక్కొచ్చు అనే ఆలోచన కూడా ప్లేయర్ల మదిలో ఉంది.

హైదరాబాద్ ఆకట్టుకునేనా?

గత ఏడాది బలహీన జట్లున్న ప్లేట్ గ్రూప్‌లో అదరగొట్టి ఎలైట్ డివిజన్‌కు అర్హత సాధించిన హైదరాబాద్ జట్టు పటిష్ట జట్లతో పోటీపడనుంది. టీమిండియా ఆటగాడు ఠాకూర్ తిలక్ వర్మ సారథిగా వ్యవహరించనున్నాడు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో నేడు ప్రారంభం కానున్న మ్యాచ్‌లో గుజరాత్‌తో హైదరాబాద్ తలపడనుంది. మరోవైపు నాగ్‌పూర్ వేదికగా విదర్భతో ఆంధ్ర జట్టు ఆడుతుంది. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరగనున్న ఈ టోర్నీలో ప్రతి గ్రూప్‌లోని ఎనిమిది జట్లు... తక్కిన జట్లతో ఆడనున్నాయి. లీగ్ దశ ముగిశాక నాలుగు గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన ఎనిమిది జట్లు నాకౌట్ దశ (క్వార్టర్ ఫైనల్స్)కు అర్హత పొందుతాయి. నేడు ప్రారంభం కానున్న లీగ్‌దశలో తొలి ఐదు లీగ్ మ్యాచ్‌లు నవంబర్ 16తో ముగుస్తాయి. ఆ తర్వాత రెండు నెలల విరామం తర్వాత చివరి రెండు లీగ్ మ్యాచ్‌లు జనవరి 23 నుంచి జరుగుతాయి. ఫిబ్రవరి 8 నుంచి 12 వరకు నాలుగు క్వార్టర్ ఫైనల్స్‌ను నిర్వహిస్తారు. ఫిబ్రవరి 17 నుంచి 21 వరకు రెండు సెమీఫైనల్స్ జరుగుతాయి. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 2 వరకు జరిగే ఫైనల్‌తో రంజీ ట్రోఫీ సీజన్‌కు తెర పడుతుంది.

డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు మరోసారి భారీ బలగంతో బరిలోకి దిగుతోంది. దేశవాళీ దిగ్గజంగా గుర్తింపు సాధించిన ముంబై జట్టుకు అజింక్య రహానే సారథ్యం వహించనుండగా... శ్రేయస్ అయ్యర్, పృథ్వీ షా కీలకం కానున్నారు. ఖాన్ బ్రదర్స్‌లో... ముషీర్ ఖాన్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా... సర్ఫరాజ్ ఖాన్ జాతీయ జట్టుకు ఎంపికవడం ఖాయమే. ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌కు ముందు భారత 'ఎ' జట్టు అక్కడ పర్యటించనున్న నేపథ్యంలో ద్వితీయ శ్రేణి ఆటగాళ్లు కూడా పలు మ్యాచ్‌లకు దూరం కానున్నారు. ఈ నేపథ్యంలో నయా హీరోలు సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించే అవకాశం ఉంది. జాతీయ జట్టుకు దూరమైన అజింక్యా రహానే, చతేశ్వర్ పుజారాతో పాటు... అడపా దడపా జట్టులోకి వచ్చి పోతున్న శ్రేయస్ అయ్యర్, గతంలో మెరుగైన ప్రదర్శన చేయలేక చోటు కోల్పోయిన ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ భరత్ వంటి వాళ్లు తిరిగి సత్తా చాటాలని చూస్తున్నారు. ఇక యశ్ ధుల్, సారాంశ్ జైన్, విద్వత్ కావేరప్ప, వైశాఖ్ విజయ్ కుమార్ వంటి వాళ్లు సెలెక్టర్ల దృష్టిలో పడేందుకు సమాయత్తమయ్యారు.

జట్ల వివరాలు

గ్రూప్ 'ఎ': ముంబై, బరోడా, మహారాష్ట్ర, ఒడిశా, జమ్మూ కశ్మీర్, సర్వీసెస్, మేఘాలయ, త్రిపుర.
గ్రూప్ 'బి': ఆంధ్ర, హైదరాబాద్, గుజరాత్, విదర్భ, రాజస్తాన్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పుదుచ్చేరి.
గ్రూప్ 'సి': బెంగాల్, కర్ణాటక, పంజాబ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కేరళ, హరియాణా, బిహార్.
గ్రూప్ 'డి': తమిళనాడు, ఢిల్లీ, సౌరాష్ట్ర, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, చండీగఢ్, రైల్వేస్, అస్సాం.

ప్రైజ్‌మనీ ఎంతంటే...
విజేత: రూ. 5 కోట్లు
రన్నరప్: రూ. 3 కోట్లు
సెమీఫైనల్లో ఓడిన జట్లకు: రూ. 1 కోటి చొప్పున

మ్యాచ్ ఫీజు ఎంతంటే (తుది జట్టులో ఉన్న వారికి)

40 లేదా అంతకంటే ఎక్కువ రంజీ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్లకు: రోజుకు రూ. 60 వేలు చొప్పున (రిజర్వ్ ప్లేయర్లకు: రూ. 30 వేలు చొప్పున)
21 నుంచి 40 రంజీ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్లకు: రోజుకు రూ. 50 వేలు చొప్పున (రిజర్వ్ ప్లేయర్లకు: రూ. 25 వేలు చొప్పున)
1 నుంచి 20 రంజీ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్లకు: రూ. 40 వేలు చొప్పున (రిజర్వ్ ప్లేయర్లకు: రూ. 20 వేలు చొప్పున).



తన్వీ శర్మ ముందంజ

నాన్‌చాంగ్ (చైనా): ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్-19 మహిళల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ తన్వీ శర్మ, ఆలీషా నాయక్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో తన్వీ శర్మ 21-18, 21-13తో నినా మత్సుతా (జపాన్)పై, ఆలీషా 21-17, 21-17తో లిమ్ జి షిన్ (మలేసియా)పై గెలుపొందారు. అండర్-19 పురుషుల సింగిల్స్‌లో భారత ప్లేయర్ ప్రణయ్ షెట్టిగర్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 21-14, 21-17తో కిత్కావిన్‌రోజ్ (థాయ్‌లాండ్)ను ఓడించాడు. అండర్-19 మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో కలగొట్ల వెన్నెల-అరిగెల భార్గవ రామ్ (భారత్) ద్వయం 13-21, 16-21తో లీ హోంగ్ యి-జాంగ్ జియా హాన్ (చైనా) జంట చేతిలో ఓడిపోయింది.


రష్మిక

క్వార్టర్ ఫైనల్లో రష్మిక

మైసూర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణులు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, స్మృతి భాసిన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో రష్మిక 6-1, 6-3తో తనీషా కశ్యప్ (భారత్)పై, స్మృతి భాసిన్ 3-6, 6-4, 7-6 (9/7)తో హర్షిణి (భారత్)పై విజయం సాధించారు. తనీషాతో 66 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో రష్మిక ఆరు ఏస్‌లు సంధించడంతోపాటు ఐదుసార్లు బ్రేక్ పాయింట్లు సాధించింది. హర్షిణితో 2 గంటల 57 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో స్మృతి ఎనిమిదిసార్లు సర్వీస్‌ను కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేసింది. నిర్ణాయక టైబ్రేక్‌లో మాత్రం స్మృతి పైచేయి సాధించింది. తెలంగాణకే చెందిన హుమేరా బహార్మస్ పోరాటం ముగిసింది. 3 గంటల 2 నిమిషాలపాటు జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో హుమేరా 5-7, 6-3, 6-7 (6/8)తో పూజా ఇంగాలె (భారత్) చేతిలో పోరాడి ఓడిపోయింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో హుమేరా-పూజా ఇంగాలె (భారత్) ద్వయం 7-5, 3-6, 7-10తో 'సూపర్ టైబ్రేక్'లో పోలీనా-రలీనా (రష్యా) జోడీ చేతిలో... చిలుకలపూడి శ్రావ్య శివాని (భారత్)-కరోలాన్ (ఫ్రాన్స్) జంట 6-7 (5/7), 6-3, 6-10తో 'సూపర్ టైబ్రేక్'లో దివా భాటియా-సాయి సంహిత (భారత్) జోడీ చేతిలో ఓడిపోయాయి.

పోరాడి ఓడిన లక్ష్య సేన్

- కిరణ్ జార్జి, మాళవిక, ఆకర్షి కూడా అవుట్
- ఆర్కిటిక్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

వాంటా (ఫిన్‌లాండ్): పారిస్ ఒలింపిక్స్ తర్వాత బరిలోకి దిగిన తొలి టోర్నమెంట్‌లో భారత బ్యాడ్మింటన్ స్టార్ లక్ష్య సేన్‌కు నిరాశ ఎదురైంది. ఆర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో లక్ష్య సేన్ ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. తొలి రౌండ్‌లో ప్రత్యర్థి రసమస్ గెమ్కే (డెన్మార్క్) నుంచి 'వాకోవర్' దొరకడంతోపాటు లక్ష్య సేన్ నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్లో బరిలోకి దిగాడు. ఏడో సీడ్ చౌ టియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 21-19, 18-21, 15-21తో ఓడిపోయాడు. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్‌ను దక్కించుకున్నా... ఆ తర్వాత ప్రత్యర్థి దూకుడుకు జవాబివ్వలేకపోయాడు. మరో భారత ప్లేయర్ కిరణ్ జార్జి కథ కూడా ముగిసింది. ఐదో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)తో జరిగిన మ్యాచ్‌లో కిరణ్ జార్జి 17-21, 8-21తో ఓటమి చవిచూశాడు.



మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మాళవిక బన్సోడ్ 15-21, 8-21తో ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ ఇంతనోన్ (థాయ్‌లాండ్) చేతిలో... ఉన్నతి హుడా 10-21, 19-21తో మిచెల్లి లీ (కెనడా) చేతిలో... ఆకర్షి 9-21, 8-21తో హాన్ యువె (చైనా) చేతిలో పరాజయం పాలయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆద్యా-సతీశ్ కుమార్ (భారత్) ద్వయం 12-21, 15-21తో చెంగ్ జింగ్-జాంగ్ చి (చైనా) జోడీ చేతిలో.. రుతూపర్ణ-శ్వేతాపర్ణ (భారత్) జంట 8-21, 10-21తో టాప్ సీడ్ లియు షెంగ్ షు-టాన్ నింగ్ (చైనా) ద్వయం చేతిలో ఓడిపోయాయి.


కజకిస్తాన్‌లో జరుగుతున్న ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో మహిళల టీమ్ విభాగంలో తాము గెల్చుకున్న కాంస్య పతకాలతో భారత జట్టు క్రీడాకారిణులు మనిక బత్రా, ఐహిక ముఖర్జీ, ఆకుల శ్రీజ, సుతీర్థ ముఖర్జీ, దియా (ఎడమ వైపు నుంచి)


ఫ్లోరిడాలోని మైయర్స్‌లో వరదతో పోటెత్తిన ఓ వీధి


సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ధ్వంసమైన ట్రాపికానా ఫీల్డ్ స్టేడియం పైకప్పు


ఫ్లోరిడాలోని బ్రాండన్‌లో వరదలో చిక్కుకున్న కారు

మిల్టన్ ధాటికి

ఫ్లోరిడా అతలాకుతలం

మిల్టన్ తుఫాను ఫ్లోరిడాలో బీభత్సం సృష్టించింది. భయంకర మైన గాలులు, వర్షంతో నగరాలను అతలాకుతలం చేసింది. సెయింట్ లూసీ కౌంటీలో టోర్నడోల ధాటికి ఐదుగురు మరణించారు. విద్యుత్ లేక 30 లక్షల మంది అంధకారంలో ఉండిపోయారు. బుధవారం రాత్రి 3కేటగిరీగా తీరం దాటిన తుఫాను తరువాత ఒకటో కేటగిరీకి బలహీనపడింది. అయినా ముప్పు ఇంకా పొంచి ఉందని అధికారులు పునరుద్ఘాటించారు.

విద్యుత్ అంతరాయంతో అంధకారంలో 30 లక్షల మంది

టోర్నడోల ధాటికి ఐదుగురు మృతి • ఇంకా ముప్పు పొంచి ఉందన్న అధికారులు

టంపా: మిల్టన్ ప్రభావంతో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు ఫ్లోరిడా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. గంటకు 205 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. బుధవారం ఉదయం దక్షిణ ఫ్లోరిడాలోని కొన్ని ప్రాంతాల్లో టోర్నడోలు సంభవించాయి. సెయింట్ లూసీ కౌంటీలో టోర్నడోల ధాటికి ఐదుగురు మృతి చెందారు. ఫ్లోరిడా అట్లాంటిక్ తీరంలోని ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఫోర్ట్ మైయర్స్‌లో మరో టోర్నడో ధాటికి చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో రాష్ట్రవ్యాప్తంగా 33 లక్షల మంది అంధకారంలో ఉండిపోయారు. హార్డీ కౌంటీ, హైలాండ్స్ కౌంటీతో సహా పలు ప్రదేశాల్లో 90% మందికి విద్యుత్ అంతరాయం కలిగింది. సానిబెల్ నగరంలో రోడ్లన్నీ వరదతో ముంచెత్తాయి. రహదారులపై 3 అడుగుల మేర నీరు చేరింది. వరదలతో టంపా చుట్టుపక్కల ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. నేపుల్స్‌లో రికార్డు స్థాయిలో నీరు నిలిచింది. తుఫాను ధాటికి తీవ్ర ప్రాణ నష్టం జరిగి ఉంటుందని, అయితే ఎంత మంది చనిపోయారనేది చెప్పలేమని అధికారులు వెల్లడించారు.

అత్యధిక వర్షపాతం...

సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో 41 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వెయ్యేళ్లలో ఇదే అత్యధిక వర్షపాతం. ఈదురు గాలులు ట్రోపికానా ఫీల్డ్ పైకప్పును చీల్చాయి. తుపాను ధాటికి పలు క్రేన్లు కూడా కూలిపోయాయి. మంచి నీటి సరఫరాను సైతం నిలిపేశారు. సుదీర్ఘ విద్యుత్ అంతరాయాలు, మురుగునీటి పారుదల వ్యవస్థ సైతం మూతపడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఓర్లాండోలో వాల్ డిస్నీ వరల్డ్, యూనివర్సల్ ఓర్లాండో, సీ వరల్డ్ సంస్థలు గురువారం మూతపడ్డాయి. పలు ఫ్లోరిడా విమానాశ్రయాలను నిరవధికంగా మూసివేశారు. హరికేన్ కలిగించిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

పొంచి ఉన్న ముప్పు..

హెలెన్ హరికేన్‌తో ఇప్పటికే దెబ్బతిన్న ఫ్లోరిడాను మిల్టన్ మరింత దుస్థితిలోకి తీసుకెళ్లింది. ఈ ఏడాది అమెరికాను తాకిన ఐదో హరికేన్ ఇది. ఫ్లోరిడాలోని అట్లాంటిక్ తీరానికి 75 మైళ్ల దూరంలో మిల్టన్ కేంద్రీకృతమై ఉందని నేషనల్ హరికేన్ సెంటర్ (ఎన్‌హెచ్‌సీ)తెలిపింది. దీని ప్రభావంతో తూర్పు మధ్య, ఈశాన్య ఫ్లోరిడాలో ఈదురుగాలులు వీస్తాయని, ఫ్లోరిడా, జార్జియా, దక్షిణ కరోలినా తూర్పు తీరం వెంబడి తుఫాను ముప్పు ఇంకా ఉందని వెల్లడించింది. అధికారులు ఫ్లోరిడా, ఇతర రాష్ట్రాలకు చెందిన 9,000 మంది నేషనల్ గార్డ్ సభ్యులతో సహాయక చర్యలు చేపట్టారు. కాలిఫోర్నియా వరకు 50,000 మందికి పైగా యుటిలిటీ కార్మికులను అందుబాటులో ఉంచారు. టంపా, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని 60 శాతానికి పైగా గ్యాస్ స్టేషన్లలో బుధవారం రాత్రే గ్యాస్ నిండుకోవడంతో గ్యాసోలిన్ ట్యాంకర్లను తరలించడానికి సైరన్లతో హైవే పెట్రోలింగ్ కార్లు పనిచేస్తున్నాయి.

న్యాయ వ్యవస్థకు ప్రజా విశ్వాసమే కీలకం

- ప్రజల నమ్మకం చూరగొనేలా జడ్జిలు పనిచేయాలి
- సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సూచన



న్యూఢిల్లీ: న్యాయ వ్యవస్థకు, న్యాయమూర్తులకు ప్రజా విశ్వాసమే అత్యంత కీలకమని భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పారు. ప్రజల నమ్మకం చూరగొనేలా పని చేయాలని న్యాయమూర్తులకు సూచించారు. ప్రజలు నేరుగా ఎన్నుకోనప్పటికీ, ప్రజా తీర్పునకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం లేకపోయినప్పటికీ న్యాయమూర్తులపై గురుతర బాధ్యత ఉందని చెప్పారు. జడ్జిగా విశ్వసనీయత, తగిన గుర్తింపు పొందాలంటే ప్రజల ఆమోదం, నమ్మకం చాలా ముఖ్యమని అన్నారు. భూటాన్‌లోని 'జేఎస్‌డబ్ల్యూ స్కూల్ ఆఫ్ లా'లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగించారు. ప్రజలకు నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను కూడా కోర్టులు పరిష్కరిస్తుంటాయని పేర్కొన్నారు. అందుకే వారి విశ్వాసం పొందడం చాలా ముఖ్యమని స్పష్టంచేశారు. ఏ దేశంలోనైనా ప్రజల మద్దతుతో న్యాయ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తే అక్కడ రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన పాలన సజావుగా సాగుతుందని వివరించారు. ప్రజాభిప్రాయం అనేది న్యాయ వ్యవస్థలో అంతర్గత తనిఖీగా తోడ్పడుతుందని సూచించారు. న్యాయ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేవలం న్యాయం చేయడమే కాదు, న్యాయం చేసినట్లు ప్రజలకు కనిపించాలని స్పష్టంచేరు. భారత్‌లోని కోర్టుల్లో ప్రవేశపెట్టిన సాంకేతిక విధానాలను జస్టిస్ చంద్రచూడ్ ప్రస్తావించారు. వర్చువల్ విచారణ, కోర్టు కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారం, కేసుల ఈ–ఫైలింగ్, ఆన్‌లైన్ కేసు సమాచార వ్యవస్థ, కృత్రిమ మేధ(ఏఐ)తో కోర్టు తీర్పులను ప్రాంతీయ భాషల్లోకి అనువదించడం వంటి విధానాలు తీసుకొచ్చామని వెల్లడించారు. ఇవి సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. సామాన్య ప్రజల కోసం సుప్రీంకోర్టు ప్రక్రియలను మరింత సులభతరం చేశామని చెప్పారు.

కాంగ్రెస్‌తో మైత్రి కొనసాగుతుంది: అఖిలేశ్

ఇటావా(యూపీ): ఉత్తరప్రదేశ్‌లో మరికొద్ది రోజుల్లో ఉప ఎన్నికలు జరిగే 10 స్థానాలకుగాను ఆరింటికి ఏకపక్షంగా టికెట్లు ఖరారు చేసిన సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఈ పరిణామంపై గురువారం స్పందించారు. కాంగ్రెస్‌తో తమ పార్టీ పొత్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉప ఎన్నికలకు అభ్యర్థుల ఖరారుపై ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. 'ఇండియా కూటమి ఉంటుంది. కాంగ్రెస్‌తో మా మైత్రి కూడా కొనసాగుతుంది అని మాత్రం చెప్పదలుచుకున్నా'అని తెలిపారు. రాజకీయాలపై చర్చించేందుకు సమయం కాదంటూ సీట్ల ప్రకటన వ్యవహారాన్ని దాటవేశారు. హరియాణా, కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఫలితాల విషయం ప్రస్తావించగా మరోసారి మాట్లాడతానన్నారు. యూపీలో ఉప ఎన్నికలు జరిగే 10 స్థానాలకు గాను కాంగ్రెస్ ఐదింటిని డిమాండ్ చేస్తోంది. ఈ పది చోట్ల ఎమ్మెల్యేలు లోక్‌సభ ఎన్నికల్లో గెలవడంతో ఖాళీ అయ్యాయి.

జాక్‌పాట్ కొట్టిన మెకానిక్

మాండ్య: కర్ణాటకకు చెందిన స్కూటర్ మెకానిక్ ఒకరు జాక్‌పాట్ కొట్టేశారు. మాండ్య జిల్లా పాండవపురకు చెందిన అల్తాఫ్ పాషాకు కేరళ ప్రభుత్వం నిర్వహించే తిరుఓనమ్ లాటరీలో ఏకంగా రూ.25 కోట్లు దక్కాయి. కేరళలోని స్నేహితుడికి అప్పుడప్పుడు వెళ్లే అల్తాఫ్ ప్రతిసారీ అక్కడ లాటరీ టిక్కెట్ కొనడం అలవాటు. ఇటీవల అక్కడికి వెళ్లిన అల్తాఫ్ వయనాడ్ జిల్లా సుల్తాన్ బాతెరీలో రూ.500 పెట్టి టిక్కెట్ కొనుగోలు చేశారు. ఈ లాటరీ ఈ నెల 9న తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి డ్రా తీశారు. అల్తాఫ్‌ను మొదటి బహుమతి వరించింది. అల్తాఫ్ కొన్న టీజీ 43422 నంబర్ టిక్కెట్ ఒకటీ రెండూ కాదు ఏకంగా రూ.25 కోట్లు గెలుచుకున్న విషయాన్ని వయనాడ్ జిల్లా పనమారమ్‌లోని లాటరీ నిర్వాహకులు ఫోన్ చేసి చెప్పారు. మొదట్లో నమ్మలేదు. కానీ, ఆ తర్వాత నిజమేనని బంధువులు చెప్పడంతో ఎగిరి గంతేశారు. లాటరీ సొమ్ము కోసం కుటుంబంతో కలిసి తిరువనంతపురం వెళ్లారు. చేతిలో డబ్బులు లేకపోవడంతో ఇటీవలే ఆ టిక్కెట్‌ను తన పక్క దుకాణదారుకు అమ్మజూపగా, కొనేందుకు నిరాకరించాడని అల్తాఫ్ తెలిపారు. గంటలోనే లాటరీ విజేతగా నిలిచినట్లు తనకు సమాచారం అందిందన్నారు.'బెంగళూరులో సెటిలవుతా.నా కూతురి పెళ్లి ఘనంగా చేద్దామనుకుంటున్నా. అప్పులన్నీ తీర్చేస్తా'అని అల్తాఫ్ ఆనందంతో చెప్పారు. రూ.25 కోట్ల మొత్తంలో అన్ని రకాల పన్నులు పోను అల్తాఫ్ చేతికి రూ.13 కోట్లు వస్తాయని చెబుతున్నారు.

లండన్, పారిస్, రోమ్, బెర్లిన్..!

- 48 గంటల్లో నాలుగు దేశాలు
- సైనిక, ఆర్థిక సాయం కోసం జెలెన్‌స్కీ సుడిగాలి పర్యటన
- ట్రంప్ అమెరికా అధ్యక్షుడైతే మద్దతు దూరమవుతుందని భయం

లండన్: ఒక వైపు రష్యా సేనల ఆక్రమణ పర్వం కొనసాగుతుండటం, మరో వైపు వచ్చే నెలలో అమెరికాలో జరిగే ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైతే మద్దతు దూరమవుతుందనే భయాల నడుమ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ యూరప్ దేశాల్లో సుడిగాలి పర్యటన చేపట్టారు. 48 గంటల వ్యవధిలోనే లండన్, పారిస్, రోమ్, బెర్లిన్‌లను చుట్టేశారు. తన వద్ద ఉన్న 'విక్టరీ ప్లాన్'పై బ్రిటన్ ప్రధాని స్టార్మర్ సహా ఆయా దేశాధినేతలకు వివరించారు. మిత్ర దేశాల నుంచి అందే దీర్ఘ శ్రేణి క్షిపణులతో రష్యాలోని సుదూరంలో ఉండే మిలటరీ లక్ష్యాలకు నష్టం కలిగించడం.. తద్వారా యుద్ధానికి ముగింపు పలికేలా రష్యాను ఇరుకునపెట్టడం జెలెన్‌స్కీ 'విక్టరీ ప్లాన్'లక్ష్యం. అయితే, బ్రిటన్ మాత్రమే తన వద్ద ఉన్న స్టార్మ్ షాడో దీర్ఘ శ్రేణి క్షిపణులను అందజేయడానికి సంసిద్ధత తెలిపింది. అమెరికా, జర్మనీ సహా ఇతర మిత్ర దేశాలు మాత్రం లాంగ్ రేంజ్ మిస్సైళ్లను ఉక్రెయిన్‌కు ఇవ్వడమంటే రష్యాతో ముఖాముఖి యుద్ధానికి దిగడమనే అభిప్రాయంతో వెనుకంజ వేస్తున్నాయి. కేవలం ఒకే ఒక్క ఆయుధంతో యుద్ధంలో గెలుపును సొంతం చేసుకోవడం ఇప్పటివరకు జరగలేదని కూడా బ్రిటన్ అధికారులు అంటున్నారు. దీర్ఘ శ్రేణి క్షిపణులను ఉక్రెయిన్‌కు సమకూర్చడంపై చర్చించామని నాటో చీఫ్ మార్క్ రుట్ వెల్లడించారు. అయితే, అంతిమ నిర్ణయాన్ని ఆయా సభ్యదేశాలకే వదిలివేశామన్నారు. దీంతోపాటు, శనివారం బెర్లిన్‌లో జరగాల్సిన ఉక్రెయిన్ మిత్రదేశాల సమావేశం వాయిదా పడింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్వదేశంలో మిల్టన్ తుపాను ప్రభావం తీవ్రంగా ఉండటంతో ఈ సమావేశాన్ని రద్దు చేసుకున్నారు.

విమానం నడుపుతూ పైలట్ మృతి

న్యూయార్క్: సియాటెల్ నుంచి ఇస్తాంబుల్ వెళ్తున్న టర్కిష్ ఎయిర్‌లైన్స్ విమానంలో విషాదం చోటు చేసుకుంది. మార్గమధ్యంలోనే పైలట్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. న్యూయార్క్‌లో అత్యవసర ల్యాండింగ్ చేసేలోపే మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. టర్కిష్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఫ్లైట్ 204 సియాటెల్‌లో మంగళవారం రాత్రి టేకాఫ్ అయ్యింది. కెప్టెన్‌గా 59 ఏళ్ల ఇల్సిన్ పెహ్లివాన్ విధుల్లో ఉన్నారు. బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో ఆయన తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కోపైలట్ విమానాన్ని తన అదుపులోకి తీసుకున్నారు. న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్ కెనడీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. అప్పటికే పెహ్లివాన్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పైలట్ మృతికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియలేదు. ఈ మేరకు టర్కిష్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధి యాహ్యా ఉస్తున్ ఒక ప్రకటనలో వెల్లడించారు. తమ కెప్టెన్‌ను కోల్పోయినందుకు తీవ్రంగా చింతిస్తున్నామన్నారు. కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రయాణికులు న్యూయార్క్ నుంచి తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

కాగా, పెహ్లివాన్ 2007 నుంచి టర్కిష్ ఎయిర్‌లైన్స్‌లో పనిచేస్తున్నారు. సాధారణంగా పైలట్లు ప్రతి 12 నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. 40 ఏళ్లు పైబడిన వారు ప్రతి ఆరు నెలలకోసారి మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. పెహ్లివాన్ మార్చి 8నే అన్ని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయనకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు.


పైలట్ పెహ్లివాన్ ఆకస్మికంగా మృతి చెందిన విమానమిదే(ఇన్‌సెట్‌లో)పెహ్లివాన్

మైనర్ నిందితునికి బెయిలు.. జడ్జిల తొలగింపు

పుణే: పోర్షే కారు దుర్ఘటనలో మైనర్ నిందితుడికి బెయిల్ మంజూరు చేసిన కేసులో జువెనైల్ జస్టిస్ బోర్డు (జేజేబీ)కి చెందిన ఇద్దరు జడ్జిలను మహారాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. విధానపరమైన లోపాలు, దుష్ప్రవర్తన, నిబంధనలు పాటించకపోవడంవంటి ఆరోపణలపై ఎల్.ఎన్.దన్వాడే, కవితా థోరట్‌లపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ (డబ్ల్యూసీడీ) దర్యాప్తు కమిటీ సిఫారసు చేసింది. ఈ మేరకు జువెనైల్ జస్టిస్ యాక్ట్ కింద కల్పించిన అధికారాలను దుర్వినియోగం చేసినట్లు తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరి నియామకాన్ని రద్దు చేసింది. పుణేలోని కళ్యాణీ నగర్ ప్రాంతంలో ఓ బిల్డర్ కుమారుడైన 17 ఏళ్ల బాలుడు మద్యం మత్తులో పోర్షే కారు నడిపి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ దుర్ఘటనలో ఇద్దరు ఐటీ నిపుణులు మృతి చెందారు. అప్పటి జేజేబీ జడ్జిలు నిందితుడికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఆ షరతులలో రోడ్డు భద్రతపై 300 పదాల వ్యాసం రాయాలని ఉంది. ఇది జాతీయ స్థాయిలో దుమారం రేపిన సంగతి తెలిసిందే.

ఢిల్లీలో రూ.2,080 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి భారీగా మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. పశ్చిమ ఢిల్లీలోని రమేశ్ నగర్ ప్రాంతంలో ఓ దుకాణంలో రూ.2,080 కోట్ల విలువైన 208 కిలోల కొకైన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. టేస్టీ ట్రీట్, చట్‌పటా మిక్సర్ పేరుతో విక్రయిస్తున్న తినుబండారాల ప్యాకెట్లలో ఈ కొకైన్‌ను భద్రపర్చినట్లు తెలిపారు. పెట్టెల్లో భద్రపర్చిన దాదాపు 25 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. భారత సంతతికి చెందిన బ్రిటిష్ పౌరుడు ఈ కొకైన్‌ను దుకాణంలో నిల్వ చేసినట్లు గుర్తించారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడు. వారం రోజుల క్రితం ఢిల్లీలోని మహిపాల్‌పూర్ ప్రాంతంలో రూ.5,000 కోట్లకుపైగా విలువైన 563 కిలోల డ్రగ్స్‌ను పోలీసుల స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే.


ఆపరేషన్‌కు ముందు అతుక్కుని ఉన్న అమరీ, జవార్


ఫిలడెల్ఫియా ఆస్పత్రిలో ఆపరేషన్ తర్వాత వేర్వేరుగా..

అవిభక్త కవలల

సర్జరీ సక్సెస్

- ఫస్ట్ బర్త్‌డే జరుపుకొన్న చిన్నారులు
- అమెరికాలోని ఫిలడెల్ఫియాలో అరుదైన ఘటన

అవిభక్త కవలలుగా పుట్టిన ఇద్దరు అబ్బాయిలను విజయవంతంగా వేరుచేసి వారికి పునర్జన్మనిచ్చింది అమెరికాలోని ఓ పిల్లల ఆసుపత్రి. వేరుచేశాక గత నెల 29న ఈ చిన్నారులు తొలి పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. అమెరికాలోని ఫిలడెల్ఫియా నగరంలో నివసిస్తున్న షనేకా రూఫిన్, టిమ్ దంపతులకు అవిభక్త కవల పిల్లలు జన్మించారు. ఆ అబ్బాయిలకు అమరీ, జవార్ రూఫిన్ అని పేర్లు పెట్టుకున్నారు. కౌగిలించుకున్నట్లుగా ఎదురెదురుగా పొట్ట ప్రాంతమంతా అతుక్కుని పుట్టారు. పుట్టినప్పుడు ఇద్దరి బరువు కలిపి కేవలం 2.7 కేజీలు మాత్రమే. వాస్తవానికి అవిభక్తవ కవలల తల్లి షనేకా రూఫిన్ 12 వారాల గర్భంతో ఉన్నప్పుడే అల్ట్రాసౌండ్ స్కాన్ చేయించుకున్నప్పుడు గర్భస్థ శిశువులు అతుక్కున్నట్లు కనిపించింది. పుట్టే చిన్నారులకు శారీరక సమస్యలు వస్తాయని, ఆనాడే తల్లిని వైద్యులు హెచ్చరించారు. తల్లి మనసు ఊరుకోదుగా. గర్భస్రావం చేయించుకోనని తెగేసి చెప్పింది. ఎలాగైనా నవమాసాలు మోసి పిల్లలకు జన్మనిస్తానని కరాఖండీగా చెప్పేసింది. భర్త టిమ్ సైతం ఆమె నిర్ణయానికి అడ్డుచెప్పలేదు. పిల్లలు అతుక్కుని పుడితే వచ్చే సమస్యలను పరిష్కారం కనుగొనేందుకు మరో ఆస్పత్రిని వెతికారు. అప్పుడే వాళ్లకు 'చాప్' చిల్డ్రెన్స్ ఆసుపత్రి ఆశాదీపంగా కనిపించింది. సిజేరియన్ ఆపరేషన్ ద్వారా చిన్నారులను అతుక్కుని పుట్టినాసరే వేరుచేయవచ్చని అక్కడి వైద్యులు భరోసా ఇచ్చారు. పిల్లల ఉమ్మడి శరీరంలో పొట్టతోపాటు కాలేయంలో కొంత భాగం కలిసే ఉంది. పిల్లలకు 11 నెలల వయసు వచ్చాక ఆపరేషన్‌కు రంగం సిద్ధమైంది. ఆగస్ట్ 21వ తేదీన 24 మందికిపైగా నిష్ణాతులైన వైద్యులు, మత్తుమందు డాక్టర్లు, రేడియాలజిస్టులు, నర్సులు ఇలా భారీ వైద్యబృందం ఏకధాటిగా ఎనిమిది గంటలపాటు శ్రమించి చిన్నారులను విజయవంతంగా వేరుచేసింది. పొట్టను వేరుచేసేటపుడు ఎలాంటి ఇన్ఫెక్షన్ కలగకుండా మెష్, ప్లాస్టిక్ సర్జరీ వంటి అధునాతన పద్ధతులను ఉపయోగించి వారిని వేరుచేశాక ఇద్దరి పొత్తి కడుపులను జాగ్రత్తగా బయటి నుంచి కుట్టేశారు. కొద్దిరోజులపాటు ప్రత్యేక పర్యవేక్షణ తర్వాత చిన్నారులను డిశ్చార్జ్ చేశారు. డిశ్చార్జ్‌కు ముందు ఆస్పత్రి యాజమాన్యం గత నెల 29వ తేదీన ఘనంగా వీళ్ల పుట్టినరోజు వేడుక జరిపింది. ''ఇద్దరినీ ఇలా వేరువేరుగా చూడటం వర్ణనాతీతమైన అనుభూతినిస్తోంది'' అని తల్లి రూఫిన్ ఆనందం వ్యక్తంచేశారు. టిమ్ దంపతులకు అంతకుముందే కై లమ్, అనోరా అనే ఇద్దరు పిల్లలున్నారు. ''ఆపరేషన్ తర్వాత మా కుటుంబసభ్యుల సంఖ్య ఆరుకు పెరిగింది. ఆనందమయ జీవన ప్రయాణాన్ని ఇక ఆరంభిస్తాం. దీనిని సుసాధ్యం చేసిన నిపుణుల బృందానికి మా కృతజ్ఞతలు'' అని తల్లి చెప్పారు. ప్రతి 35వేల నుంచి 80వేల కవలల జననాల్లో ఇలా అవిభక్త కవలలు పుడతారని వైద్యశాస్త్రం చెబుతోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

అవినీతిరహితుడు నరేంద్ర మోదీ

పదేళ్లలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదు: అమిత్ షా

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై గత పదేళ్లలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని, ఆయన అవినీతిరహితుడు అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. మోదీ విధానాలతో దేశ ఆర్థికాభివృద్ధి వేగం పుంజుకుందని అన్నారు. భారత్‌ను ప్రపంచంలోని అత్యున్నత ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిపారని ప్రశంసించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) భారత్‌ను 'వెలుగుతున్న తార' అని కొనియాడిందని గుర్తుచేశారు. గురువారం ఢిల్లీలో పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ వార్షిక సదస్సులో అమిత్ షా మాట్లాడారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన ప్రగతిశీల చర్యలతో మనదేశం ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. కేంద్రంలో 2014లో మోదీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత వేర్వేరు రంగాల్లో సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని, వాటి ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయని, అనుసంధానం పెరిగిందని, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని, రైల్వే నెట్‌వర్క్ భారీగా విస్తరించిందని, విద్యుత్ వాహనాలు, సెమి–కండక్టర్ల తయారీ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని వివరించారు.

జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తూ కేరళ అసెంబ్లీలో తీర్మానం ఆమోదం

తిరువనంతపురం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానాన్ని వ్యతిరేకిస్తూ కేరళ శాసనసభలో గురువారం ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. జమిలి ఎన్నికలపై రామ్‌నాథ్ కోవింద్ కమిటీ చేసిన ప్రతిపాదనను ఆమోదిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధమని కేరళ అసెంబ్లీ తేల్చిచెప్పింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ తరఫున ఈ తీర్మానాన్ని మంత్రి ఎం.బి.రాజేశ్ సభలో ప్రవేశపెట్టారు. తీర్మానానికి యూడీఎఫ్ ఎమ్మెల్యేలు కొన్ని సవరణలు సూచించగా, ప్రభుత్వం అంగీకారం తెలిపింది. సవరణల అనంతరం తీర్మానాన్ని సభలో ఏకగ్రీవంగా ఆమోదించారు.

హిజ్బ్-ఉత్-తహ్రీర్‌పై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ: జిహాద్, ఉగ్ర కార్యకలాపాలతో ఇస్లామిక్ రాజ్య స్థాపనే లక్ష్యంగా పనిచేస్తున్న హిజ్బ్–ఉత్–తహ్రీర్(హెచ్‌యూటీ)పై నిషేధం విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. 1953లో జెరుసలేంలో ప్రారంభమైన ఈ సంస్థ, దేశంలో దారితప్పిన యువతను చేరదీసి వారిలో ఉగ్ర భావజాలాన్ని నూరిపోస్తోందని కేంద్ర హోం శాఖ గురువారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. వివిధ సామాజిక మాధ్యమ వేదికలు, రహస్య యాప్‌లు, ప్రత్యేక సమావేశాల ద్వారా యువతను ఇది గ్రూపులో చేర్చుకుంటోందని తెలిపింది. వారిని జిహాద్, ఉగ్రవాద కార్యకలాపాలవైపు మళ్లించి ప్రజాస్వామ్యయుతంగా నడుస్తున్న ప్రభుత్వాలను కూలదోయడమే లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో హింసాత్మక చర్యలకు పాల్పడిన హిజ్బ్–ఉత్– తహ్రీర్ భద్రతకు ముప్పుగా పరిణమించిందని హోం శాఖ వెల్లడించింది. అందుకే చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం–1967 కింద ఈ సంస్థపై నిషేధం విధిస్తున్నట్లు ఆ నోటిఫికేషన్‌లో ప్రకటించింది.

బెంగాల్‌లో కొనసాగుతున్న వైద్యుల రాజీనామాలు

తాజాగా 'ఎస్ఎస్‌కేఎం'లో 40 మంది వైద్యుల రాజీనామా

కోల్‌కతా: ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య కేసులో న్యాయం చేయాలని, ఆస్పత్రుల్లో భద్రత, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌తో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ డాక్టర్లకు మద్దతు పెరుగుతోంది. వారికి సంఘీభావంగా గురువారం ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రిలోని 40 మంది డాక్టర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. కోల్‌కతాలోని ఆర్.జి.కర్ ఆస్పత్రిలో ఏడుగురు, ఉత్తర బెంగాల్లో ఇద్దరు జూనియర్ డాక్టర్లు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆందోళన చేస్తున్న వైద్యుల ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తోందని ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రి డాక్టర్ గౌతమ్ దాస్ తెలిపారు. ప్రతిష్టంభనను తొలగించడానికి ప్రభుత్వం ఏమాత్రం చొరవ చూపడం లేదని ఆయన విమర్శించారు. పరిష్కరించడంలో పురోగతి లేదని ఆయన ఎత్తిచూపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి వల్లే రాజీనామాల నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. ఆమరణ దీక్ష చేస్తున్న జూనియర్లకు మద్దతుగా గురువారం సీనియర్ డాక్టర్లు కూడా నిరసనలో పాల్గొన్నారు. వారికి సంఘీభావంగా ఆర్.జి.కర్ మెడికల్ కాలేజ్, హాస్పిటల్‌కు చెందిన 54 మంది సీనియర్ డాక్టర్లు మంగళవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత సిలిగురిలోని నార్త్ బెంగాల్ మెడికల్ కాలేజ్, హాస్పిటల్‌కు చెందిన సుమారు 35 మంది వైద్యులు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. కాగా, జూనియర్ డాక్టర్లు చేస్తున్న దీక్ష గురువారం ఐదో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా నిరాహార దీక్షా స్థలాన్ని సందర్శించిన పోలీసు బృందం... జూనియర్ డాక్టర్ల ఆరోగ్యం క్షీణించడంపై ఆందోళన వ్యక్తం చేసింది. దీక్షను విరమించాలని కోరింది.

'మురసోలి' సెల్వమ్ కన్నుమూత

సాక్షి, చెన్నై: కేంద్ర మాజీ మంత్రి దివంగత మురసోలి మారన్ సోదరుడు, డీఎంకే అధికార పత్రిక మురసోలి మాజీ ఎడిటర్ మురసోలి సెల్వమ్(84) గురువారం ఉదయం బెంగళూరులో గుండెపోటుతో కన్నుమూశారు. డీఎంకే వ్యవస్థాపకుడు ఎం.కరుణానిధి సోదరి కుమారుడే సెల్వమ్. మురసోలి పత్రికకు సిలంది పేరిట 50 ఏళ్లపాటు సంపాదకుడిగా పనిచేశారు. పలు తమిళ సినిమాలకు ప్రొడ్యూసర్‌గాను ఉన్నారు. కరుణానిధి కుమార్తె సెల్విని ఆయన వివాహమాడారు. సీఎం ఎంకే స్టాలిన్‌కు బావ అవుతారు. 'మంచి రచయిత, జర్నలిస్ట్ కూడా అయిన సెల్వమ్ డీఎంకే భావజాలాన్ని వ్యాప్తి చేయడంతోపాటు హిందీ వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొన్నారు'అని డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ ఒక సందేశంలో పేర్కొన్నారు. మురసోలి సెల్వమ్ మృతితో తమిళనాడు ప్రభుత్వం 10వ తేదీ నుంచి మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది.

సాక్షి ప్లస్
శుక్రవారం। 11-10-2024

వెట్టిచాకిరీని నిషేధించే ఆర్టికల్ ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

ప్రకరణ 21

విస్తృత పరిధి, అభ్యుదయ వ్యాఖ్యానాలు

మేనకా గాంధీ కేసు, ఇంద్రజిత్, వెల్లూరు సిటిజన్స్ వెల్ఫేర్ కేసు, ప్రేమశంకర్ శుక్లా కేసు, నరేంద్రకుమార్ కేసు, మోహిని జైన్ కేసు, ఆటోశంకర్ కేసు, శ్రీమతి ఖుష్బు కేసు మొదలైన వాటిల్లో సుప్రీంకోర్టు జీవించే స్వేచ్ఛపై విస్తృత అర్థాన్ని చెప్పింది. ఈ తీర్పుల సారాంశం ప్రకారం ప్రకరణ 21లో కింద పేర్కొన్న హక్కులు కూడా అంతర్భాగమే.

- గౌరవప్రదంగా జీవించే హక్కు
- కాలుష్య రహిత వాతావరణ హక్కు
- రహస్యాలను, ఆరోగ్యాన్ని కాపాడుకునే హక్కు
- ఉచిత న్యాయ సలహా హక్కు
- విదేశాల పర్యటన హక్కు
- లాకప్ మరణాల వ్యతిరేక హక్కు
- సమాచార హక్కు
- సహజీవన హక్కు
- ఏకాంతంగా జీవించే హక్కు
- సత్వర విచారణ పొందే హక్కు
- మరణ శిక్ష అమలును ఆలస్యం చేయడంపై అడిగే హక్కు
- ఆహార హక్కు
- నిద్ర హక్కు

ఆత్మహత్యా ప్రయత్నం - జీవించే హక్కు- తాజా వివాదం

ప్రకరణ 21 జీవించే హక్కును కల్పించింది. ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 309 ప్రకారం ఆత్మహత్యాయత్నం శిక్షార్హమైన నేరం. ఈ సెక్షన్ అమానుషమైందని, దాన్ని ఇండియన్ పీనల్ కోడ్ నుంచి తొలగించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆ సెక్షన్‌ను తొలగిస్తున్నట్లు ఇటీవలే కేంద్రం ప్రకటించింది. 'ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం అసహజమైన కోరిక. కాబట్టి ఆ కోరికకు కారణమైన పరిస్థితులను పరిశీలించాలి. అలాంటి వ్యక్తులకు సరైన కౌన్సెలింగ్ నిర్వహించాలి. పోలీసు కేసులతో వేధించరాదు' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

కారుణ్య మరణం (Euthanasia): 2011లో పింకీ విరానీ అనే జర్నలిస్టు అరుణా షాన్‌బాగ్ తరఫున సుప్రీంకోర్టులో కేసు వేసింది. వృత్తి రీత్యా నర్సు అయిన అరుణ షాన్‌బాగ్ బొంబాయి ఎడ్వర్డ్ ఆసుపత్రిలో లైంగిక దాడికి గురైంది. ఆమె సుమారు 37 సంవత్సరాలు కోమాలోనే ఉంది. ఆమె పరిస్థితి దృష్ట్యా కారుణ్య మరణానికి అనుమతివ్వాలని సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసింది. న్యాయస్థానం కారుణ్య మరణాన్ని నిరాకరించింది. ప్రత్యేక పరిస్థితుల్లోనే పాసివ్ కారుణ్య మరణాన్ని అనుమతిస్తామని పేర్కొంది.

విద్యాహక్కు (ప్రకరణ 21-ఎ) (Right to education): విద్యాహక్కును 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్-21ఎలో చేర్చారు. 6 - 14 ఏళ్ల మధ్య వయసున్న బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని పేర్కొన్నారు. వాస్తవానికి 2002కు ముందు ఆదేశ సూత్రాల్లోని ఆర్టికల్ 45లో ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను పొందుపరిచారు. కానీ 86వ రాజ్యాంగ సవరణ ద్వారా దీన్ని ఆర్టికల్ 21-ఎకి బదలాయించి ప్రాథమిక హక్కుగా గుర్తించారు.

విద్యాహక్కు - సుప్రీంకోర్టు తీర్పులు

1992లో మోహిని జైన్ v/s కర్ణాటక, ఉన్నికృష్ణన్ v/s ఆంధ్రప్రదేశ్ కేసుల్లో జీవించే హక్కు, వ్యక్తి గౌరవాన్ని పొందే హక్కుల్లో విద్యా హక్కు అంతర్భాగం. దాన్ని ప్రాథమిక హక్కుగా పరిగణించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నేపథ్యంతో సంబంధం లేకుండా బాలలకు ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని తమిళనాడు ప్రభుత్వం v/s శ్యామ్ సుందర్ కేసు (2011)లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.



ప్రాథమిక విధి: ఇదే సవరణ ద్వారా నిబంధన 51-ఎలో ప్రతి తల్లిదండ్రులు, సంరక్షకులు 6 నుంచి 14 ఏళ్లలోపు వయసున్న తమ పిల్లలకు విద్యా సౌకర్యాలు కల్పించాలనే విధిని నూతన ప్రాథమిక విధిగా పేర్కొన్నారు.

ప్రస్తుతం నిబంధన 45లో ఉచిత ప్రాథమిక విద్యను (ఆరేళ్ల లోపు వారికి) అందించాలనే కొత్త అంశాన్ని చేర్చారు. 2009లో విద్యా హక్కు చట్టాన్ని చేశారు. ఈ చట్టం 2010 ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది.

విద్యా హక్కుచట్టం ముఖ్యాంశాలు

- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వారి నివాస ప్రదేశానికి ఒక కి.మీ. పరిధిలో పాఠశాల ఉండాలి.
- ప్రైవేట్ పాఠశాలల్లోని మొత్తం విద్యార్థుల సంఖ్యలో 25 శాతం సీట్లను బలహీన వర్గాలకు కేటాయించాలి.
- ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:30గా ఉండాలి.
- ఈ చట్టం అమలుకయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 65:35 నిష్పత్తిలో భరిస్తాయి. ప్రైవేట్ పాఠశాలల్లో ఈ కోటాలో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండరాదు.

ప్రకరణ-22

అక్రమ నిగ్రహణ (Arrest), నిర్బంధం (Detention) నుంచి రక్షణ

అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు వ్యతిరేకంగా ఆర్టికల్ 22 రక్షణ కల్పిస్తుంది. ఈ ప్రకరణ ప్రకారం చట్టబద్ధంగా అరెస్ట్ చేయడానికి కొన్ని ప్రాతిపదికలు పాటించాలి. అవి..

ప్రకరణ 22 (1):

ఎ) ప్రతి అరెస్టుకు కారణం ఉండాలి లేదా కారణాన్ని తెలియజేయాలి. న్యాయవాదిని సంప్రదించే అవకాశం ఇవ్వాలి.

బి) నిందితుణ్ని 24 గంటల్లోగా సమీప న్యాయస్థానంలో హాజరుపరచాలి.

24 గంటలను లెక్కించేటప్పుడు ప్రయాణ సమయాన్ని మినహాయిస్తారు. సెలవు దినాలను మినహాయించరు. అరెస్టయిన వ్యక్తిని సమీప మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చాలి. పై రక్షణలకు కొన్ని మినహాయింపులున్నాయి. ప్రకరణ 22(3) ప్రకారం శత్రు దేశ పౌరులకు, ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద అరెస్టయిన వారికి ఈ రక్షణలు వర్తించవు.

ప్రకరణ 22(4) ప్రకారం ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద అరెస్టయిన వారిని మూడు నెలలకు మించి నిర్బంధంలో ఉంచరాదు. కానీ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద ఏర్పాటైన ఎడ్వైజరీ బోర్డు సూచన మేరకు మూడు నెలల కంటే ఎక్కువ కాలం నిర్బంధంలో ఉంచవచ్చు. ఈ బోర్డులో హైకోర్టు న్యాయమూర్తులు లేదా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యే అర్హతలున్న వ్యక్తులు సభ్యులుగా ఉంటారు.

ప్రకరణ 22(5) ప్రకారం ప్రివెంటివ్ డిటెన్షన్ కింద అరెస్టయిన వారికి తమను ఎందుకు అరెస్టు చేశారో వీలైనంత త్వరగా తెలపాలి. తద్వారా బాధితులకు పిటీషన్ వేసుకునే అవకాశం ఉంటుంది.

ప్రకరణ 22(6) ప్రకారం ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రివెంటివ్ అరెస్టుకు కారణాలను వెల్లడించకుండా ఉండే అధికారం ప్రభుత్వానికి ఉంది.

ప్రకరణ 22(7) ప్రకారం పైన పేర్కొన్న క్లాజులతో సంబంధం లేకుండా మూడు నెలల కంటే ఎక్కువ కాలం నిర్బంధించే విధంగా పార్లమెంట్ శాసనాలు రూపొందించవచ్చు.

ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాలు, వివరణ: సాధారణంగా నిర్బంధాలు రెండు రకాలు:

1. శిక్షించే చట్టాలు 2. నివారక చట్టాలు.

శిక్షించే చట్టాల్లో ముద్దాయి నేరం రుజువయ్యాక కోర్టు విధించిన శిక్షను అమలు చేయడానికి నిర్బంధిస్తారు. నివారక నిర్బంధంలో విచారణ లేకుండా నేరం చేస్తారేమో అనే అనుమానంతో నిందితుణ్ని లేదా అనుమానితుణ్ని ముందుగానే నిర్బంధిస్తారు. దేశ రక్షణ, శాంతి భద్రతల దృష్ట్యా ఇలా చేస్తారు.

సుప్రీంకోర్టు తీర్పులు

- **ఎ.కె.గోపాలన్ v/s స్టేట్ ఆఫ్ మద్రాస్ (1950):** ఒక వ్యక్తిని అరెస్టు చేస్తున్నప్పుడు అతడికి కారణాలను తెలపడం సంబంధిత పోలీస్ అధికారి బాధ్యత. అలాగే అరెస్టయిన వ్యక్తికి తన వాదనను వినిపించేందుకు అవకాశం ఇవ్వాలి. దీన్ని లాటిన్ పరిభాషలో 'ఆడీ ఆల్టిరమ్ పార్టెమ్' అంటారు. అంటే హియర్ ది అదర్ సౌండ్ టూ అని అర్థం. అభియోగం ఎదుర్కొంటున్న వ్యక్తికి తన నిర్దోషిత్వాన్ని వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని దీని అర్థం.
- **అబ్దుల్ సమద్ v/s స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ (1962)** అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప కోర్టులో హాజరు పరచకపోతే 24 గంటల తర్వాత ఆ వ్యక్తికి విడుదలయ్యే హక్కు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.
- **జోగిందర్ కుమార్ v/s స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్** ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు ఆ సమాచారాన్ని కుటుంబ సభ్యులకు/స్నేహితుడికి/సంబంధిత వ్యక్తులకు తెలియజేయాలి.

ప్రకరణలు 23, 24

పీడన నిరోధ హక్కులు

మానవులతో వ్యాపారం, బలవంతపు వెట్టిచాకిరీని ప్రకరణ 23(1) నిషేధిస్తుంది. వ్యక్తుల ఇష్టానికి వ్యతిరేకంగా, బలవంతంగా ఏ పని చేయించరాదు. పై చర్యలకు పాల్పడితే పార్లమెంటు చట్టాల ప్రకారం శిక్షార్హులు అవుతారు.

నిబంధన 23లో బేగార్ అనే పదాన్ని ప్రయోగించారు. బేగార్ అంటే వెట్టిచాకిరీ. ఉత్తర భారతదేశంలో హాలీ అంటే.. ఎలాంటి పారితోషకం లేకుండా వ్యక్తులతో పని చేయించుకోవడం. దీన్ని 1976లో వెట్టిచాకిరీ చట్టం ద్వారా నిషేధించారు.



ఈ నిబంధన స్వయంగా అమల్లోకి రాదు. అందుకే 1956లో పార్లమెంటు అశ్లీల, అసభ్య వ్యాపార నిరోధక చట్టాన్ని రూపొందించింది.

ప్రకరణ 23(2) ప్రకారం ప్రజా ప్రయోజనం కోసం పౌరులు, ప్రభుత్వ ఉద్యోగులపై నిర్బంధ సేవలను విధించవచ్చు. దీన్ని దోపిడీగా పరిగణించరు.

ప్రకరణ-24

బాల కార్మిక వ్యవస్థ రద్దు

ఈ ఆర్టికల్ ప్రకారం 14 ఏళ్ల లోపు వయసు ఉన్న బాలలను ప్రమాదకర, ఇతర పనుల్లో వినియోగించరాదు. ఒకవేళ వినియోగిస్తే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారు. ఈ నిబంధన కూడా స్వయంగా అమల్లోకి రాదు. దీనికి సంబంధించి పార్లమెంటు చట్టం చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు తదనుగుణంగా చట్టాలు చేశారు.

సుప్రీంకోర్టు తీర్పులు

- ఎం.సి.మెహతా v/s తమిళనాడు(1997) కేసులో 14 ఏళ్ల లోపు వయసున్న బాలలను ఏ రకమైన ప్రమాదకర పరిశ్రమల్లో లేదా ఇతర పనుల్లో వినియోగించరాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.
- **బందువా ముక్తిమోర్చా v/s యూనియన్ ఆఫ్ ఇండియా**, 1997 కేసులో కూడా సుప్రీంకోర్టు ఇదే తీర్పు వెలువరించింది. బాలల సంరక్షణకు ప్రత్యేక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని, బాలకార్మికులను పనిలో వినియోగించే యజమానిపై రూ.20,000 వరకు జరిమానా విధించాలని పేర్కొంది.

ప్రకరణలు 25-28

మత స్వాతంత్ర్యపు హక్కులు

ప్రకరణ 25(1) ప్రకారం ప్రతి వ్యక్తి తన అంతరాత్మ ప్రబోధానుసారం ఏ మతాన్నైనా అవలంబించి, ఆచరించి, ప్రచారం చేసే స్వేచ్ఛ ఉంది.

ప్రకరణ 25(2) ప్రకారం మత స్వేచ్ఛ ప్రజా శాంతికి, నైతికతకు, ప్రజారోగ్యానికి భంగం కలిగించరాదు. అలాంటి సమయాల్లో ప్రభుత్వం పరిమితులు విధించవచ్చు. మత విషయాలను నియంత్రించవచ్చు. హిందూ మతంలో కొన్ని సామాజిక సంస్కరణలు చేపట్టవచ్చు.

ప్రకరణ-25లో రెండు వివరణలు ఉన్నాయి. అవి

- సిక్కులు తలపాగా, కత్తి ధరించడం వారి సంప్రదాయంలో భాగం.
- ప్రకరణ-25(2)(బి)లో హిందువులు అనే పదం ఉంది. ఇక్కడ హిందువులంటే సిక్కులు, జైనులు, బౌద్ధులు కూడా.

ప్రకరణ-26

మత సంస్థలు - మతపరమైన వ్యవహార నిర్వహణలో స్వేచ్ఛ

ప్రజా శాంతికి, నైతికతకు, ఆరోగ్యానికి భంగం కలిగించకుండా వ్యక్తులు మత సంస్థలను ఏర్పాటు చేసి నిర్వహించుకోవచ్చు.

- మత సంస్థలను, ధర్మాదాయ సంస్థలను స్థాపించవచ్చు.
- సంస్థలను నిర్వహించుకోవచ్చు.
- స్థిర, చరాస్తులను సంపాదించుకోవచ్చు.
- అమల్లో ఉన్న చట్టాలకు లోబడి వాటిని నిర్వహించుకోవచ్చు.

ప్రకరణ-27

మతవ్యాప్తి లేదా మత పోషణ కోసం పన్నులు వసూలు చేయరాదు

మత ప్రాతిపదికన ప్రజలపై పన్నులు విధించరాదు, వసూలు చేయరాదు. ఈ నిబంధన పన్నులు వసూలు చేయడాన్ని మాత్రమే నిషేధిస్తుంది. అయితే మత ప్రాతిపదికన ప్రత్యేక సేవలు అందించినందుకు ప్రజల నుంచి ప్రభుత్వం రుసుం వసూలు చేయవచ్చు.

ఉదా: దేవాలయంలో ప్రత్యేక దర్శనాల కోసం , సేవల కోసం రుసుం వసూలు చేయడం రాజ్యాంగబద్ధమే.

VOCABULARY

Life is in language...

When somebody asked 'what is a language?', the other man replied 'words, words, words and words'. This is actually from William Shakespeare's immortal work 'Hamlet'.

It goes like this..

Polonius: What do you read, my Lord?

Hamlet: Words, words, words.

Polonius: What is the matter, my Lord?

Hamlet: Between whom? (In the original text, it is 'Between who?')

Polonius: I mean the matter that you read, my Lord.

In the above dialogue, one can see how important one's use of vocabulary is. Keeping a side the significance of the dialogue a while, there is a grammar mistake in it. 'Between' is a preposition. There is a rule that there must be an objective case pronoun after a preposition. Now this rule is violated. But we often say that they are exceptions. It may be true. Somebody wanted to know and asked "Did Shakespeare write in English?" Then the other man retorted "Shakespeare didn't write in English rather whatever he wrote is English".

Yes it is true. Hundred percent true. Emily Dickinson rightly opines;

"A word is dead
When it is said,
Some say. I say it just
Begins to live
That day"

Yes. Language is lively. Life is in language. Life without language is just unimaginable, a mere cipher. In vocabulary building, the problem is not so much finding new words or even finding out what they mean. The problem is to remember them, to fix them permanently in your mind. The simple way is to 'see the word, utter it thrice, use it once and it is yours'. Your being introduced to a number of words is of no use as you will forget them as quickly as you forget the names of people you are casually introduced to at a crowded party. Unless you meet them again or unless you spend some time with them, you can't say "I know them or they know me". Try to meet some of the more difficult words, see them in their contexts, look at them from other angles and spend some time with them. Your meeting them should not be a casual one. Some association should be established between you and the words. Try to bring into sharp and permanent focus those words that are now on the blurred fringe of your mind. Imagine a context and you will fall in the need of words.

Let's taste a spoon of words from the ocean of language...

Celibacy: Unmarried state, usually a religious vow of chastity.
Censorious: Being inclined to find faults.
Clinophobia: Morbid fear of lying in bed.
Confiscate: Seize (private property) by authority.
Connoisseur: One who appreciates, understands and enjoys arts.
Conscription: Compulsory enrollment, especially for the armed forces; draft.
Convalescence: Gradual return to health and strength after illness.
Claustrophobia: An abnormal fear of being in narrow or enclosed spaces.
Cynic: A person who believes all people are motivated by selfishness or one whose outlook is scor-nfully and often habitually n-egat-ive. (Cynic is a member of a sect of ancient Greek philosophers who believed virtue to be the only good and self-control to be the only means of achieving virtue).
Cynophobia: Morbid fear of dogs.
Cynosure: Centre of attention. An object that serves as a focal point of attention and admiration. Somebody or something that is the centre of admiration, attention or attraction.
Discophile: One who studies and collects phonographs.
Dissenter: Person who is hard to be pleased. (Often Dissenter One who refuses to accept the doctrines or usages of an established or a national church, especially a Protestant who dissents from the Church of England)
Dipsomania: Morbid craving or desire for alcohol.
Ditheism: Belief in independent principles of good and evil.
Diurnal: Relating to or occurring in a 24-hour period; daily or occurring or active during the daytime rather than at night: as in diurnal animals.

SYNONYMS AND ANTONYMS

S: = Synonyms A: = Antonym

Capricious
S: Unpredictable, impulsive, fickle, changeable, inconstant, whimsical
A: Constant, firm, steadfast, unswerving

Cheek
S: **Impertinent boldness:** (As in 'he shows the cheek to insult his hosts'). To speak impudently to or impudence, effrontery, gall, temerity, audacity, insolence, sauce, sass (=Impertinent, disrespectful speech; back talk)
A: Politeness, courtesy, humility, gentleness, respect.
(Cheek also means 'either side of the face below the eye. Eg. They are dancing cheek to cheek)

Dainty
S: Pretty, neat, delicate, refined, tasty, delicious, fastidious, elegant, toothsome, exquisite, cute, palatable.
A: Inelegant, coarse, vulgar, rough, crude, rude, nasty, dirty.

Detrimental
S: Harmful, injurious, hurtful, pernicious, damaging, noxious
A: Good, beneficial, valuable, useful, profitable, harmless, inoffensive, unobnoxious

Diligent
S: Industrious, laborious, hard-working, attentive, assiduous, observant, mindful, vigilant, watchful, wakeful, careful
A: Careless, heedless, inattentive, indifferent, unobservant, unmindful

Docile
S: Pliant, tractable, amenable, teachable, yielding, compliant, tame, submissive, gentle, unresisting, dutiful, passive, acquiescent, unassertive, manageable, governable, obsequious.
A: Obstinate, stubborn, intractable, self-willed, dogged, defiant, insolent, resistant, resisting, obdurate, disobedient, willful, uncompromising, unyielding, refractory, recalcitrant



Droll
S: Amusing, laughable, funny, comic, sarcastic, whimsical, comical, odd, queer, farcical, ludicrous, ridiculous, absurd, diverting, romp
A: Sad, lamentable, lugubrious, tragic, painful, dolorous, hurtful, distressing, grievous, woeful, rueful, mournful, deplorable, touching

Ephemeral
S: Short lived, transitory, transient, fleeting, momentary, fugitive, evanescent, fugacious, temporary
A: Eternal, perpetual, perennial, permanent, intransient, lifelong, everlasting, long-lived, prolonged, protracted

Enormous
S: Immense, gigantic, colossal, huge, vast, gargantuan, monstrous, prodigious, stupendous, plentiful, plenteous, copious
A: Trivial, insignificant, ordinary, average, small, little, tiny, diminutive.

MODEL QUESTIONS

Directions (Q. No. 1 - 5): Out of the four choices, select the one which can be substituted for the given words or sentences.

1. Relating to the science of sounds
   a) Acoustics b) Ultrasonic
   c) Phonetic d) Sonics
2. A word formed from the initial letter or letters of each of the successive parts or major parts of a compound term:
   a) Abbreviation b) Palindrome
   c) Acronym d) Contraction
3. A substance which alleviates pain:
   a) Narcotic b) Anodyne
   c) Chloroform d) Intoxicant
4. A person who can speak several languages:
   a) Linguist b) Lexicographer
   c) Polyglot d) Multilingual
5. Deserving blame of an offence or crime:
   a) Criminal b) Culpable
   c) Punishable d) Culprit

Directions (Q. No. 6 - 14): From the given options, choose the one that is nearest in meaning to the underlined word:

6. Gandhi is an ardent abolitionist.
   a) Amnesty activist
   b) One opposed to violence
   c) War activist
   d) One opposed to slavery
7. Only barren lands must be utilized for building the capital of AP
   a) Unproductive b) Vacant
   c) Fertile d) Assigned lands
8. With its good bandwidth, the company made good profits in its dish sales.
   a) Measurement of handwritten data
   b) Measurement of transferable data
   c) Measurement of burned data
   d) Measurement of shredded data
9. I felt it a little brackish.
   a) Polluted b) Boring
   c) Slightly salty d) Hot
10. Finally the hero gets catharsis.
    a) Applaud
    b) Gets relief from tension
    c) Romantic reply d) Victory
11. The party's policies are deleterious to the state.
    a) Beneficial b) Harmful
    c) Retrospective d) Degrading
12. The invading force had no artillery and was completely annihilated.
    a) Defeated b) Destroyed
    c) Demolished d) Dismembered
13. The party can no longer win the admiration with its evanescent glory.
    a) Vanishing b) Susceptive
    c) Melting d) Evaporating
14. She looked at her friend's bristly chin.
    a) Soft and shining
    b) Rough c) Pricking d) Cadent

KEY

1) a	2) c	3) b	4) c	5) b
6) d	7) a	8) b	9) c	10) b
11) b	12) b	13) a	14) b	

అడ్మిషన్స్

ఐఐఎస్ఈఆర్ తిరుపతిలో పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్).. జనవరి 2025లో ప్రారంభమయ్యే పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమేటిక్స్, ఎర్త్ అండ్ క్లైమేట్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్.
- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీతో పాటు జేజీఈఈబీఐఎల్ఎస్/డీబీటీ-జేఆర్ఎఫ్-ఎ/ఐసీఎంఆర్-జేఆర్ఎఫ్/డీబీటీ-బీఐఎన్‌సీ/యూజీసీ-సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/గేట్/ఇన్‌స్పైర్ పీహెచ్‌డీ/జెస్ట్/నెట్ తదితరాల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం:

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.11.2024.
- **వెబ్‌సైట్:** www.iisertirupati.ac.in/

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
శుక్రవారం । 11-10-2024

విశ్వం మొత్తంలో అత్యంత శక్తిమంత కిరణాలు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఆధునిక భౌతికశాస్త్రం

ఐసోటోపులు

- ఒకే పరమాణు సంఖ్య, భిన్నమైన పరమాణు ద్రవ్యరాశులను కలిగిన పరమాణువులను ఐసోటోపులు అంటారు. వీటిని ఆస్టన్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.
- పరమాణు కేంద్రకంలో న్యూట్రాన్‌లు అదనంగా వచ్చి చేరినపుడు ఈ ఐసో టోపులు ఏర్పడతాయి.
- పరమాణువు భౌతిక, రసాయనిక ధర్మాలు మార్పుచెందకుండా దాని పరమాణు కేంద్రకంలో న్యూట్రాన్‌ను కలపొచ్చు.

ఉదాహరణ: హైడ్రోజన్ ఐసోటోపులు
ప్రోటియం (లేదా) హైడ్రోజన్: $_1H^1 = 1P^+ + 0_0^{n^1}$
డ్యూటిరియం: $_1H^2 = 1P^+ + 1_0^{n^1}$
ట్రిటియం: $_1H^3 = 1P^+ + 2_0^{n^1}$

ఐసోటోపులు సహజసిద్ధంగా భూమిలో లభిస్తాయి. అదేవిధంగా మానవుడు తన అవసరాల కోసం ఐసోటోపులను న్యూక్లియర్ రియాక్టర్ ద్వారా ఉత్పత్తి చేస్తున్నాడు. ఐతే ఇలా ఉత్పత్తి చేసిన ఐసోటోపులు రేడియోధార్మికతను ప్రదర్శించడం వల్ల వీటిని రేడియో ఐసోటోపులు అంటారు.

రేడియో అయోడిన్: అయోడిన్ లోపం వల్ల ఏర్పడిన గాయిటర్ అనే వ్యాధిని నయం చేయడానికి ఈ ఐసోటోపులను ఉపయోగిస్తారు.

రేడియో సోడియం: మన శరీరంలోని రక్త సరఫరాలో లోపాలను తెలుసుకోవడానికి, హృదయ స్పందనను నియంత్రించడానికి ఈ ఐసోటోపులను ఉపయోగిస్తారు.

రేడియో ఫాస్ఫరస్: మెదడులో ఏర్పడిన కణతి స్థానాలను గుర్తించడానికి, యంత్రభాగాల అరుగుదలను అంచనా వేయడానికి, ఒక మొక్క లేదా చెట్టు నిర్ణీత కాలంలో పీల్చుకొన్న నీటి శాతాన్ని లెక్కించడానికి ఈ ఐసోటోపులను ఉపయోగిస్తారు.

కోబాల్ట్ 60[CO^{60}]: వీటి నుంచి γ కిరణాలు విడుదలవుతాయి. ఈ కిరణాలకు ఆవేశం, ద్రవ్యరాశులు ఉండవు. అందువల్ల ఈ γ కిరణాలు పదార్థంలో ఎక్కువ లోతునకు చొచ్చుకొని వెళ్తాయి. ఈ కారణం వల్ల క్యాన్సర్ గడ్డలను కరిగించడానికి γ కిరణాలను ఉపయోగిస్తారు. ఈ పద్ధతిని కోబాల్ట్ థెరపీ అంటారు.

కార్బన్ డేటింగ్: దీన్ని లిబ్బి అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఈ పద్ధతిని ఉపయోగించి శిలాజాల వయసును నిర్ధారించొచ్చు.

$$\text{శిలాజాల వయస్సు} = \frac{_6C^{14}\text{ఐసోటోపుల సంఖ్య}}{_6C^{12}\text{మిగిలిపోయిన పరమాణువుల సంఖ్య}}$$

కార్బన్ మూలకాన్ని King of the elements అని కూడా అంటారు. ప్రతి జీవిలో ఈ మూలకం ఉంటుంది.

యురేనియం డేటింగ్: భూమి వయసును అంచనా వేయడానికి యురేనియం ఐసోటోపులను ఉపయోగిస్తారు.

- మనదేశంలో రేడియో ఐసోటోపులను ఆయా రియాక్టర్లలో ఉత్పత్తి చేసి వాటిని కావాల్సిన ప్రాంతానికి సరఫరా చేయడానికి ముంబైలోని భారత అణుశక్తి సంఘంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ విభాగం పేరు Board of Radiation and Isotope Technology (BRIT)



- ఐసోటోపుల ఉత్పత్తి, వినియోగంలో మనదేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది.

x-కిరణాలు: x-కిరణాలను 1895లో రాంట్‌జెన్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఆయనకు భౌతికశాస్త్రంలో తొలి నోబెల్ బహుమతి లభించింది.

X- కిరణాల ధర్మాలు- ఉపయోగాలు

x-కిరణాల తరంగధైర్ఘ్య అవధి 0.01Å-100Å వరకు ఉంటుంది. కాబట్టి క్వాంటం సిద్ధాంతం ప్రకారం x-కిరణాలు చాలా శక్తిమంతమైనవి.

- ఈ కిరణాలకు ఎటువంటి ఆవేశం, ద్రవ్యరాశులు ఉండవు. కాబట్టి ఈ కిరణాలు ఒక రకమైన విద్యుత్ అయస్కాంత తరంగాలు మాత్రమే.
- x–కిరణాలకు ఎలాంటి ఆవేశం లేకపోవడం వల్ల విద్యుత్ క్షేత్రం, అయస్కాంత క్షేత్రాల్లో ఎటువైపు ఆవర్తనం చెందకుండా రుజుమార్గంలో ప్రయాణిస్తాయి.
- శూన్యంలో లేదా గాలిలో ఈ కిరణాల వేగం కాంతివేగానికి సమానంగా ఉంటుంది.
- ఈ కిరణాలు ఫొటోగ్రాఫిక్ ప్లేట్లను ప్రభావితం చేస్తాయి.
- x–కిరణాలకు ఆవేశం లేకపోవడం వల్ల వీటి అయనీకరణ సామర్థ్యం దాదాపు శూన్యం.

x–కిరణాలను 2 రకాలుగా వర్గీకరించొచ్చు.

1. **కఠిన x–కిరణాలు:** వీటి తరంగధైర్ఘ్య అవధి 0.01Å - 4Å లుగా ఉంటుంది. అందువల్ల ఈ కిరణాలకు ఎక్కువ శక్తి ఉండి మెత్తగా ఉన్న రక్తం, మాంసం, కఠినమైనటువంటి ఎముకల, లోహాలు, లోహ మిశ్రమాల్లో చొచ్చుకొని వెళ్తాయి. అందువల్ల పెద్ద బాయిలర్‌లు, పైపులు, డ్యాంలు మొదలైన వాటిలోని పగుళ్లు లేదా రంధ్రాల స్థానాన్ని గుర్తించడానికి ఈ కిరణాలను ఉపయోగిస్తారు. అదేవిధంగా విమానాశ్రయాలు, నౌకా కేంద్రాలు, దేశ సరిహద్దుల్లో ప్రయాణికుల లగేజీని తనిఖీ చేయడానికి ఈ కిరణాలను వాడుతారు.
2. **మృదు x–కిరణాలు:** వీటి తరంగధైర్ఘ్య అవధి 4Å - 100Å వరకు ఉంటుంది. అందువల్ల వీటి శక్తి తక్కువగా ఉండి మెత్తగా ఉన్న రక్తం, మాంసం ద్వారా మాత్రమే చొచ్చుకొని వెళ్లగలుగుతాయి. కఠిన ఎముకలు, ఇతర పదార్థాల ద్వారా ఇవి చొచ్చుకొని వెళ్లలేవు. అందువల్ల ఈ మృదు కిరణాలను వైద్య రంగంలో ఉపయోగిస్తారు.

- C.T.స్కాన్‌లో x-కిరణాలను ఉప యోగిస్తారు.
- జీర్ణాశయం... x-కిరణాల Photoను తీయడానికంటే ముందు రోగికి బేరియం మీల్స్ అనే రసాయన ద్రావణాన్ని (బేరి యం సల్ఫేట్) తాగిస్తారు.
- కాబట్టి ఈ రసాయన పదార్థం x-కిరణాలను కావాల్సిన చోట కేంద్రీకృతం చేస్తుంది.
- x-కిరణాలను ఉపయోగించి రోగ నిర్ధారణ చేయడాన్ని రేడియోగ్రఫీ, రోగ నివారణ చేయడాన్ని రేడియో థెరపీ అని అంటారు. అందువల్ల x-కిరణాలతో పనిచేసే డాక్టర్‌ను రేడియాలజిస్ట్ అని పిలుస్తారు.
- x-కిరణాలను ఉత్పత్తి చేయడానికి కూలిడ్జ్ నాళాన్ని ఉపయోగిస్తారు. ఈ పరికరాన్ని సీసపు పెట్టెలో అమర్చుతారు. ఎందుకంటే సీసం సహజ రేడియోధార్మిక పదార్థాల్లో స్థిరమైన, దృఢమైన పదార్థం. అందువల్ల x-కిరణాలు సీసం ద్వారా చొచ్చుకొని వెళ్లలేవు.

విశ్వ కిరణాలు (లేదా) కాస్మిక్ కిరణాలు: వీటిని సీటీఆర్ విల్సన్ అనే శాస్త్రవేత్త తొలిసారి గుర్తించాడు. ఈ కిరణాలను ప్రయోగాత్మకంగా కనుగొన్న శాస్త్రవేత్త మిల్లికాన్.

- కాస్మిక్ కిరణాల్లోని కణాల్లో ఎలక్ట్రాన్‌లు, ప్రోటాన్‌లు, పాజిట్రాన్‌లు, న్యూట్రాన్‌లు, అయాన్‌లు ముఖ్యమైనవి. ఐతే ఈ కణాల్లో సుమారు 80శాతం వరకు ప్రోటాన్‌లు ఉంటాయి.
- కాస్మిక్ కిరణాల ఉనికిని, దిశను తెలుసుకునేందుకు ఉపయోగించే సాధనం.. కాస్మిక్ రే టెలిస్కోప్.



- కాస్మిక్ కిరణాల తీవ్రత ధృవాల వద్ద, భూమధ్యరేఖ వద్ద కనిష్టంగా ఉంటుంది.
- ఈ కిరణాల శక్తి సుమారు 10^8 ఎలక్ట్రాన్ వోల్ట్‌ల నుంచి 10^{20} ఎలక్ట్రాన్ వోల్ట్‌ల వరకు ఉంటుంది. కాబట్టి ఈ విశ్వం మొత్తంలో అత్యంత శక్తిమంత కిరణాలుగా కాస్మిక్ కిరణాలను పరిగణిస్తారు.

క్వాంటం సిద్ధాంతం ($E = hc/\lambda$) ప్రకారం పరిశీలించినప్పుడు ఈ కిరణాల తరంగ ధైర్ఘ్యం తక్కువగా ఉంటుంది.

ఈ విశ్వ కిరణాలను తిరిగి 2 రకాలుగా వర్గీకరిస్తారు.

1. **కఠిన కాస్మిక్ కిరణాలు:** ఇవి పది సెంటీమీటర్ల మందం ఉన్న సీసపు దిమ్మ ద్వారా చొచ్చుకొని వెళ్తాయి. ఈ కిరణాలు సూపర్‌నోవా నుంచి వెలువడుతాయని శాస్త్రవేత్తలు భావిస్తారు.
2. **మృదు కాస్మిక్ కిరణాలు:** ఈ కిరణాలు 10 సెం.మీ మందం ఉన్న సీసపు దిమ్మ ద్వారా చొచ్చుకొని వెళ్లలేక ఆగిపోతాయి. ఈ రకానికి చెందిన కాస్మిక్ కిరణాలు నోవా నుంచి లేదా సూర్యుని ఉపరితలం నుంచి వెలువడతాయని శాస్త్రవేత్తలు భావిం చారు.

- ఒక నక్షత్రం బ్లాక్ హోల్(కృష్ణబిలం) వరకు చేరుకోవాలంటే దాని ద్రవ్యరాశి సూర్యుడి ద్రవ్యరాశికి కనీసం 1.4 రెట్లు ఉండాలి. దీన్ని చంద్రశేఖర్ లిమిట్ అని అంటారు.

ఒక చంద్రశేఖర్ లిమిట్
$= 1.4\times$సూర్యుని ద్రవ్యరాశి
$= 1.4\times2\times10^{30}$kg
$= 2.8\times10^{30}$kg

- బ్లాక్ హోల్ (కృష్ణబిలం) అని పేరుపెట్టిన శాస్త్రవేత్త జాన్ వీలర్.
- నక్షత్రం ద్రవ్యరాశి చంద్రశేఖర్ లిమిట్ కంటే తక్కువగా ఉంటే అది మరుగుజ్జు నక్షత్రంగా అంతరించిపోతుంది.
- ద్రవ్యరాశిని కొలవడానికి ఉపయోగించే అతిపెద్ద ప్రమాణం చంద్రశేఖర్ లిమిట్ ఐతే అతి చిన్న ప్రమాణం పరమాణు ద్రవ్యరాశి ప్రమాణం.
- ఈ విశ్వంలో ఉన్న నక్షత్రాలను పరి మాణం దృష్ట్యా 3 రకాలుగా వర్గీకరిస్తారు.

1. **భారీ నక్షత్రాలు:** వీటి ద్రవ్యరాశి, పరిమాణం చాలా ఎక్కువగా ఉంటుంది.
   ఉదాహరణ.. ఎప్సిలాన్ అరిగా
2. **మధ్య తరహా నక్షత్రం:** వీటి ద్రవ్యరాశి, పరిమాణం భారీ నక్షత్రాల కంటే చాలా తక్కువగా ఉంటుంది.
   ఉదాహరణ.. సూర్యుడు.
3. **మరుగుజ్జు నక్షత్రాలు:**

- వీటి ద్రవ్యరాశి, పరిమాణాలు చాలా తక్కువగా ఉంటాయి.
- భారతదేశంలో కాస్మిక్ కిరణాల గురించి అధ్యయనం చేసిన శాస్త్రవేత్తల్లో డాక్టర్ హోమీ జహంగీర్ బాబా, మేఘనాథ్ సాహా, డాక్టర్ విక్రమ్ సారాభాయ్ ముఖ్యమైనవారు.
- కాస్మిక్ కిరణాల గురించి అధ్యయనం చేయడానికి అనురాధ అనే ఒక ఉపగ్రహాన్ని భారత శాస్త్రవేత్తలు, నాసా శాస్త్రవేత్తలు అంతరిక్షంలోకి అనేక ఏళ్ల క్రితం ప్రయోగించారు.
- అంతరిక్షంలో వ్యోమగాములు చేసే ఏ చర్యనైనా(స్పేస్ వాక్) Extra vehicular activity (EVA)అంటారు.
- విశ్వాంతరాళంలో వ్యోమగాములు ధరించే Space suitను Extra Terristial mobile unit (ETMU) అని అంటారు. దీన్ని Fibre nylonతో తయారు చేస్తారు. ప్రతి space suitలో కనీసం 7 పొర లుంటాయి. దీన్ని ధరించడం వల్ల విశ్వాంతరాళంలో నుంచి వస్తున్న కాస్మిక్ కిరణాలు, x-కిరణాలు, రేడియోధార్మిక కిరణాలు మొదలైన వాటి నుంచి వ్యోమ గాములకు రక్షణ కల్పించడమే కాకుండా కావాల్సిన పీడనాన్ని కూడా అందిస్తాయి.

సహజ రేడియో ధార్మికత

సహజ రేడియో ధార్మికతను 1896 లో హెన్రీ బెకరల్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. పరమాణు కేంద్రకంలో గల ప్రోటాన్‌లు, న్యూట్రాన్లను బంధించే బలాలను కేంద్రక బలాలు అంటారు. ఈ విశ్వం మొత్తంలో పరిశీలించినప్పుడు అత్యంత బలమైనవి కేంద్రక బలాలు(గురుత్వాకర్షణ బలాలు, అయస్కాంత బలాలు, విద్యుత్ బలాలు మొదలైన వాటితో పోల్చినపుడు). ఈ బలాలను కూలుంబ్ అనే శాస్త్రవేత్త అధ్యయనం చేసి వీటిని కూలుంబ్ ఆకర్షణ బలాలు, వికర్షణ బలాలు అని రెండు రకాలుగా వర్గీకరించారు. ఈ రెండు బలాల పరిమాణాన్ని ఆధారంగా చేసుకొని పరమాణువుల స్థిరత్వాన్ని, సహజ రేడియోధార్మికతలను వివరించొచ్చు.

- పరమాణు సంఖ్య 1 నుంచి 30 వరకు గల పరమాణు కేంద్రకంలో కూలుంబ్ ఆకర్షణ బలాలు గరిష్ఠంగా, వికర్షణ బలాలు కనిష్ఠంగా ఉంటాయి. దీంతో వీటి పర మాణు కేంద్రకాలకు ఎక్కువ స్థిరత్వం కలు గుతుంది. కాబట్టి ఇలాంటి పరమాణు వులు రేడియోధార్మికతను ప్రదర్శించవు.
- పరమాణు సంఖ్య 31 నుంచి 82 వరకు గల పరమాణు కేంద్రకంలో కూలుంబ్ ఆకర్షణ బలాలు క్రమంగా తగ్గిపోయి, వికర్షణ బలాల పరిమాణం పెరగడం వల్ల అస్థిరత్వం ఏర్పడుతుంది.
- పరమాణు సంఖ్య 82 కంటే ఎక్కువగా ఉన్న పరమాణు కేంద్రకంలో కూలుంబ్ వికర్షణ బలాలు గరిష్ఠంగా మారడం వల్ల అస్థిరత్వం కూడా గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. కాబట్టి ఇలాంటి మూల కాలు స్థిరత్వం పొందడానికి తమంతట తాముగా α, β, γ కిరణాలను విరజిమ్ముతాయి. ఈ ధర్మాన్ని సహజ రేడియోధార్మికత అని అం టారు.

ఉదా॥ యురేనియం, థోరియం.

- ప్రకృతిలో లభించే మూలకాల్లో యురేనియం ఎక్కువ భారాన్ని కలిగి ఉంటుంది.
- సహజ రేడియోధార్మికత పదార్థ స్వభావంపై మాత్రమే ఆధారపడి ఉం టుంది. బాహ్య కారకాలైన ఉష్ణోగ్రత, పీడనాలపై ఆధారపడి ఉండదు.

α, β, γ కిరణాలను రేడియోధార్మిక కిర ణాలు లేదా బెకరల్ కిరణాలు అని కూడా అంటారు.

Series increases gradually, it might be..

Number series questions are based on arithmetic operations such as addition, subtraction, multiplication and division.

i. If the series increases gradually, it might be a case of addition.
ii. If the series decreases gradually, it might be a case of subtraction.
iii. If there is a sharp increase in the terms at one or two places in the series, it might be multiplication or combination (i.e. multiplication along with addition or subtraction).
iv. If there is a sharp decrease in the terms at one or two places in the series, it might be division or combination (i.e. division along with addition or subtraction).
v. If the case is pure multiplication or division, there will be an exact ratio between the successive terms but it will not be same in case of combination.

In present exams, two models of number series are given.

I. Missing term: In this series one term will be missing. Based on the logic of the other terms we have to find out the missing term.

II. Wrong number: In this series, one term will be given wrong. We have to find out that wrong number.

PRACTICE QUESTIONS

Directions (1-15): What should come in place of the question mark (?) in the following number series?

1. 987 587 331 187 123 ?
1) 104 2) 113 3) 107 4) 114
5) None of these
A: 3
−400 −256 −144 −64
987 587 331 187 123 ?
$400 \rightarrow (20)^2$, $256 \rightarrow (16)^2$,
$144 \rightarrow (12)^2$, $64 \rightarrow (8)^2$
The next value to be subtracted is 4^2.
The next term in the series is
$123 - 4^2 = 123 - 16 = 107$
$\therefore ? = 107$

2. 365 728 2160 8532 42340 ?
1) 253275 2)253280
3) 253285 4) 253290
5) 253295
A: 4
−1 −8 −27 −64
365 728 2160 8532 42340 ?
×2 ×3 ×4 ×5
$1 \rightarrow (1)^3$, $8 \rightarrow (2)^3$, $27 \rightarrow (3)^3$, $64 \rightarrow (4)^3$
$\therefore$The value to be subtracted from 42340 is $(5)^3$ i.e.
$42340 - 125 = 42215$
$? = 42215 \times 6 = 253290$

3. 62 177 512 1507 4482 ?
1) 13396 2)13397 3) 13398
4) 13399 5) 13400
A: 2
×3 ×3 ×3 ×3
62 177 512 1507 4482 ?
−9 −19 −29 −39
$? = 4482 \times 3 - 49 =$
$13446 - 49 = 13397$

4. 21 12342 22543 30824 37385 ?
1) 42422 2) 42424 3) 42426
4) 42428 5) 42430
A: 3
21 12342 22543 30824 37385 ?
+12321 +10201 +8281 + 6561
$= (111)^2 = (101)^2 = (91)^2 = (81)^2$
The perfect square to be added to the next term is $(71)^2 = 5041$
$? = 37385 + 5041 = 42426$

5. 800 160 48 19.2 9.6 ?
1) 6.48 2) 5.76 3) 5.12
4) 4.84 5) 4.56
A: 2
The sharp decrease from 800 to 160 indicates that, it might be division. But in series like this don't come to conclusion from the highest value. Take the lowest terms. They are decimal numbers. So it might be multiplication with decimal numbers.
×0.2 ×0.3 ×0.4 ×0.5
800 160 48 19.2 9.6 ?
$\therefore ? = 9.6 \times 0.6 = 5.76$

6. 63 95 119 135 143 ?
1) 151 2) 157 3)162
4) 168 5) None of these
A: 5
The values are increasing gradually. It indicates addition.
+32 +24 +16 +8



63 95 119 135 143 ?
The next value to be added is 0 (8 − 8).
$\therefore ? = 143 + 0 = 143$

7. 4 20 101 357 982 ?
1) 1632 2) 1848 3)2040
4) 2278 5) 2412
A: 4
4 20 101 357 982 ?
+16 +81 +256 +625
$16 \rightarrow (2)^4$, $81 \rightarrow (3)^4$,
$256 \rightarrow (4)^4$, $625 \rightarrow (5)^4$
$\therefore ? = 982 + (6)^4 = 982 + 1296 = 2278$

8. 14 50 166 522 1598 ?
1) 4832 2) 4834 3)4836
4) 4838 5) 4840
A: 2
×3 ×3 ×3 ×3
14 50 166 522 1598 ?
+8 +16 +24 +32
$\therefore ? = 1598 \times 3 + 40 = 4794 + 40 = 4834$

9. 4830 4556 4290 4032 3782 ?
1) 3510 2) 3520 3)3530
4) 3540 5) 3550
A: 4; The gradual decrease in the terms indicates subtraction.
−274 −266 −258 −250
4830 4556 4290 4032 3782 ?
$\therefore ? = 3782 - 242 = 3540$

10. 1320 1313 1288 1227 1106 ?
1) 875 2) 880 3)885
4) 890 5) 895
A: 5
−7 −25 −61 −121
1320 1313 1288 1227 1106 ?
$7 = (2)^3 - 1$, $25 = (3)^3 - 2$,
$61 = (4)^3 - 3$, $121 = (5)^3 - 4$.
$\therefore ? = 1106 - (6^3 - 5)$
$= 1106 - 211 = 895$

11. 150 152 149 153 148 154 ?
1) 155 2) 152 3) 147
4) 149 5) None of these
A: 3
The series is increasing and decreasing alternately. So the operators used might be addition and subtraction.
+2 −3 +4 − 5 +6
150 152 149 153 148 154 ?
$\therefore ? = 154 - 7 = 147$

12. 17 52 158 477 ? 4310
1) 1433 2) 1432 3)1435
4)1434 5) None of these
A: 3
×3 ×3 ×3
17 52 158 477 ? 4310
+1 +2 +3
$\therefore ? = 477\times3+4=1431+4=1435$

13. 3 22 ? 673 2696 8093
1) 133 2) 155 3) 156 4) 134
5) None of these
A: 4
×7 ×4 ×3
3 22 ? 673 2696 8093
+1 +4 +5
$\therefore ? = 22 \times 6 + 2 = 132 + 2 = 134$
$134\times5+3=670+3=673$

14. 6 13 38 ? 532 2675
1) 129 2) 123 3)172
4) 164 5) None of these
A: 1
+7 +6 +5
6 13 38 ? 532 2675
×1 ×2 ×5
$\therefore ? = (38 + 5)\times3 = 43\times3 = 129$
$(129+4)\times4+133\times4=532$

15. 286 142 ? 34 16 7
1) 66 2) 72 3) 64
4) 74 5) None of these
A: 5
÷2 ÷2 ÷2
286 142 ? 34 16 7
−1 −1 −1
$\therefore ? = 142\div2-1=71-1=70$
$70\div2-1=35-1=34$

Directions (16-30): In each question below, a number series is given in which one number is **wrong.** Find out the **wrong** number.

16. 3601 3602 1803 604 154 36 12
1) 3602 2)1803 3)604
4) 154 5) 36
A: 4
÷1 ÷2 ÷3 ÷4 ÷6
3601 3602 1803 604 154 36 12
+1 +2 +3 +3 +6
$\therefore$? The wrong number is 154.
The actual series should be
÷1 ÷2 ÷3 ÷4 ÷5 ÷6
3601 3602 1803 604 155 36 12
+1 +2 +3 +4 +5 +6

17. 4 12 42 196 1005 6066 42511
1) 12 2) 42 3)1005
4) 196 5) 6066
A: 2
×2 ×3 ×4 ×5 ×6 ×7
4 12 42 196 1005 6066 42511
+4 +6 +28 +25 +36 +49
$\therefore$? Wrong number is 42
The actual series should be
×2 ×3 ×4 ×5 ×6 ×7
4 12 45 196 1005 6066 42511

+4 +9 +16 +25 +36 +49
18. 2 8 12 20 30 42 56
1) 8 2) 42 3) 30
4) 20 5) 12
A: 1
+6 +4 +8 +10 +12 +14
2 8 12 20 30 42 56
Wrong number is 8. It should be 6 in place of 8

19. 32 16 24 65 210 945 5197.5
1) 946 2) 16 3) 24 4) 210 5) 65
A: 5
×0.5 ×1.5 ×2.7 ×3.2 ×4.5 ×5.5
32 16 24 65 210 945 5197.5
The wrong number is 65.
The original series should be
×0.5 ×1.5 ×2.5 ×3.5 ×4.5 ×5.5
32 16 24 60 210 945 5197.5

20. 7 13 25 49 97 194 385
1) 13 2) 49 3) 97
4) 194 5) 25
A: 4
×2 ×2 ×2 ×2 ×2 ×2
7 13 25 49 97 194 385
−1 −1 −1 −1 −0 −3
$\therefore$? The wrong number is 194.
The actual series should be
×2 ×2 ×2 ×2 ×2 ×2
7 13 25 49 97 193 385
−1 −1 −1 −1 −1 −1

21. 13 25 40 57 79 103 130
1) 25 2) 40 3)57 4) 79 5) None
A: 3
+12 +15 +17 +22 +24 +27
13 25 40 57 79 103 130
The values are Added should be 3 more than the value added previously.
$\therefore$ 57 is the wrong number
The actual series should be
+12 +15 +18 +21 + 24 +27
13 25 40 58 79 103 130

22. 2 10 18 54 162 486 1458
1) 18 2) 54 3) 162 4) 10 5) None
A: 4
×5 +8 ×3 ×3 ×3 ×3
2 10 18 54 162 486 1458
The wrong number is 10.
The actual series should be
×3 ×3 ×3 ×3 ×3 ×3
2 6 18 54 162 486 1458